

దేశంలో అత్యధికంగా కొని చదువబడుతున్న
తెలుగు మాసపత్రిక



జూన్-87
రూ-5/-

వసంతరావు రామకృష్ణారావు





స్థాపకుడు: వి.వి.రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్: లీలావతి రాఘవయ్య

సంపుటి 24 జూన్-87 సంచిక 5

గౌరవ సంపాదకులు-యర్రంశెట్టి శాయి.

"ఇదండీ వరస"

ఈ నెల ముఖచిత్రం: రాధ

జ్యోతి పి. బి. నెం. 1824. హైదరాబాదు-20. ఫోన్-61160

తొలిమాట

ప్రజాస్వామ్య దేశాల్లో కూడా చాలా దారుణమయిన సంఘటనలు అడపా దడపా జరుగుతూనే ఉంటాయ్!

మన దేశంలో ప్రభుత్వం ఎలాగూ తిండీ, బట్టా, నీరు లాంటి ప్రాథమిక విషయాల గురించి పట్టించుకోదు.

నిరుద్యోగ సమస్య విషయంలో ఏనాడో చేతులెత్తేసింది. ఎక్స్‌ప్లాయిటేషన్ అనేది మూడు పూలూ ఆరు కాయలుగా వెలిగిపోతూంటే ప్రభుత్వం మొఖం పక్కకు తిప్పేసుకుంటోంది.

అయినా మన ప్రజలూ, పత్రికలూ ప్రభుత్వాన్ని 'పోనీలేస్తూ' అని నిరవధికంగా క్షమించేస్తూనే ఉన్నారు. అయితే వాళ్ళలా క్షమించేయటానికి ఓ ముఖ్య కారణం వుంది. అదేమిటంటే కొంచెంగా మన దేశంలో మిగిలివున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు. అయితే ప్రభుత్వం వాటినికూడా హరించే ప్రయత్నం చేస్తేమాత్రం ప్రజలకు వళ్ళుమండి పోతుంది.

ఈమధ్య తమిళనాడు అసెంబ్లీ సభ్యులు 'ఆనంద వికటన్ పత్రిక ఎడిటర్ శ్రీ బాలసుబ్రమణియన్‌ను అరెస్ట్' చేయించి జైలు శిక్ష విధించేసరికి దేశం యావత్తూ స్పందించి పెద్దఎత్తున తమ నిరసనను తెలియజేశారు.

చివరకు పత్రికా స్వేచ్ఛను అణగద్రొక్కరాదనే ప్రజాభిప్రాయానికి తలఒగ్గి తమిళనాడు అసెంబ్లీ సభ్యులు శ్రీ బాలసుబ్రమణియన్‌ని విడుదల చేయక తప్పలేదు. దేశ ప్రజలందరిలోనూ ఇంతటి సంచలనానికి కారణమయిన శ్రీ బాలసుబ్రమణియన్‌తో జ్యోతి జరిపిన ప్రత్యేక ఇంటర్వ్యూను ఈ సంచికలో మీ కందిస్తున్నాం.

-ఎడిటర్

ఒక మనిషిలో ఇద్దరు మనుష్యులుంటారు. సుఖసంతోషాల్లో ఒకడే బయటకు కనపడతాడు. కష్టాల్లో రెండోవాడు బయటకు వస్తాడు. వీడు మళ్ళీ రెండు రకాలు. కష్టానికి రియాక్టయి దాన్ని ఎదుర్కొనేవాడు లేదా బెంబేలెత్తిపోయి నిరాశ పడేవాడు. ఈ నిరాశ పడేవాడిలో మళ్ళీ రెండురకాలు. సమస్య పదిమందికీ చెప్పుకుని సానుభూతి కోసం అర్రులు చాచేవాడు, తనలో తనే కుమిలిపోయి ఆత్మహత్య చేసుకునేవాడు.


అందుకే ఈ ప్రపంచంలో నలుగురూ నాలుగు రకాలన్నారు. కాని నిజానికి నలుగురులేరు. ఒకరే. ఆ ఒకరిపేరు.— "మనిషి"

యండమూరి వీరేంద్రనాథ్

సీరియల్

మంచుపర్వతం

- 16వ పేజీనుండి ప్రారంభం -



ఉత్తరాలు

ఈ మధ్య 'జ్యోతి' లో చాలమార్పులు వచ్చాయి. కొత్త శీర్షికలు బాగున్నాయి. మరివసుంధరగారు కూడా 'జ్యోతి' కోసం ప్రతినెల తప్పకుండా కథలను వ్రాస్తున్నారు. వారికీ మరియు హ్యూమరాలజీ, ఒక సీరియల్ అందిస్తూ గౌరవ సంపాదకులుగా వ్యవహరిస్తున్న ఎర్రం శెట్టిశాయి గారికి ధన్యవాదాలు.

అరు నెలలుగా వస్తున్న శ్రీ వీరేంద్రనాథ్ గారి "ముగింపులేని సీరియల్" అలా అడ్వర్టైజ్‌మెంటుగానే వుండిపోదుకదా!

తోటపల్లి రఘునాథ్
బెంగళూరు

మే 87 జ్యోతి మాస పత్రిక ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥ డా॥ నందమూరి తారక రామా రావు గారి ముఖచిత్రంతో వెలువడిన పత్రికలో శ్రీ సింహ ప్రసాద్ గారికథ 'సహస్రనామార్చన' చిన్నదైనా భావం చాలా పెద్దది. స్త్రీత్వ అంటూనే పొగడ్తకు పొంగిపోయి దూబ్బుసు అతిక్రమించి భూపతి రావుగారు చెప్పిన పని చేయటం. ఎదుటివారి మానస్తత్వాన్ని ఇట్టే గ్రహించే శక్తి ఉన్న శ్రీరావుగారు అభినందనీయులు. రచయితకు నా థాంక్స్.

ఈ నెల నవలానుబంధం శ్రీ కొర్రపాటి గంగాధరరావుగారి 'పరకాయప్రవేశం' చాలా ఆసక్తికరంగా ఉంది. నిర్మల(2) శ్యామలరావు (2) మనోరమ (2) అనిఇలా ఒకరి శరీరంలో ఇంకొకరు పరకాయ ప్రవేశం చేసి కొద్దిగా తికమక పెట్టినా శ్రద్ధగా చదివితే ఎంతో ఆసక్తికరంగా ఉండి రక్తి కట్టింది. ఇంత మంచి-మంచి నవలలు అందిస్తున్న ఎడిటర్‌గార్కి-ధన్యవాదాలతో

పోలోజు వెంకటాచారి
హైదరాబాదు

మీరు ప్రవేశపెడుతున్న క్రొత్తక్రొత్త శీర్షికలు జ్యోతికి ఎనలేని అందాన్ని సంతరింపజేస్తున్నాయి. అబద్ధాలపోటీ బాగుంది.

ఈ నెల ఉత్తమ ఛాయచిత్రం చాలా గొప్పగా వుంది. ఈ నెల కథల్లో 'మాధవి' 'గ్రోసప్ చైల్డ్' మరియు 'నాట్యం' బాగున్నాయి. ఈ నెల ప్రారంభమయిన క్రొత్త సీరియల్ ఆకట్టుకునేలా లేదు. యండమూరి సీరియల్ ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తున్నాం మూకు మా సొంత నిరీక్షణ వల్ల నిరాశ కల్గించి. వచ్చే నెల ప్రారంభిస్తారు కదూ!

వేదాంతం సురేష్‌బాబు
మహారాష్ట్ర

ప్రియమైన సాహితీ మిత్రులు, నవ్వుల విశ్వామిత్రులు "నిత్యం పాఠకులకు హాయ్‌హాయ్" జాయ్‌జాయ్ కలిగిస్తున్న (గుర్రు పెట్టి, నిద్ర పోయే వారికి సైతం) యర్రం శెట్టిశాయ్ గారికి-

ప్రభవ ఉగాదిశుభాకాంక్షలు-గతంలోలాగే మీ హ్యూమరిజం పాఠకుల్ని మరింత మెస్మరిజం చేయగలదని ఆశిస్తున్నాను. ప్రభవలో మీ ప్రభావం, సిన్మాలపైనను, ప్రభవం తేగలదని భావిస్తున్నాను. శతసహస్ర శుభాభి వందనములతో

వి. సాంబశివరావు
గుంటూరు

డెత్‌ట్రాప్ నెలనెల సస్పెన్స్‌తో ఉగిసలాడుతున్నది. ఈ నెల కథల్లో సుబ్బారావుకు తల తిరిగింది. ప్రేమగీతం అను కథలు ఆణిముత్యాల్లా ఉన్నవి ప్రతినెల జ్యోతి ఇలాగే మా ముందురావాలని కోరుతున్నాము.

ఖాజా హుసేన్
ఆదోని

కీ॥శే॥ శ్రీ కొర్రపాటి గంగాధరరావుగారి నవల "పరకాయ ప్రవేశం" ఎంతో హాస్యంగా ఉంది. కనీసం ఆరు నెలలకి ఒకసారైనా హాస్యనవల ప్రచురించాలని మా కోరిక.

వి. రాము, టి. కామేష్
గుంటూరు

రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి.ఆర్ ముఖచిత్రం "జ్యోతి" ఆకర్షణీయంగా వున్నది. ఈ సంచికలోని కార్టూన్లు మంచి హ్యూమరస్‌గా వున్నాయి. పోల్కంపల్లి శాంతాదేవిగారి "నవత - యువత" సీరియల్ 'మిత్రవైరం' కథ బాగున్నాయి. నవలానుబంధం "పరకాయ ప్రవేశం" నచ్చింది. "కంప్యూటర్ డేటింగ్" లో ఇస్తున్న జవాబులు మార్చాలి. 'ప్యావరేజ్ జం-మన మోడలిజం' ప్రశంసనీయంగా రాసారు సి. యస్సీ. మురళిగారు.

కాజ.హనితో
ఏలూరు

తోటకూర ఆశాలత



అంతా చీకటి....

ఆ చీకట్ని పారద్రోలడానికి గుడ్డి దీపం తన ప్రయత్నం తాను చేస్తోంది-

ఎస్. పి. బంగ్లా ముందు డ్యూటీలోవున్న సెంట్రీ ఇంకా తనకెంత సర్వీసువుందీ లెక్కపెట్టుకుంటున్నాడు. ఎస్. పి. రంజిత్ పెంపుడు కుక్క కుర్చీలో పడుకుని ఓరకంటితో సెంట్రీని కనిపెడ్తోంది.

గోడ గడియారం మూడు గంటలు కొట్టింది. అప్పటికి ఇంకా నిద్రబోని ఎస్. పి. రంజిత్ సిగరెట్ ప్యాకెట్‌లోని సిగరెట్ బయటకు తీశాడు. కొసకంటా కాలిన చేతిలోని సిగరెట్‌ని ఆ సిగరెట్‌కి అంటించాడు.

పట్టపగలు అందరూ చూస్తుండగా కాలేజీ విద్యార్థినిని అపహరించుకుపోయి మానభంగం చేసి హత్య -

హోంమంత్రి పాత్రికేయుల సమక్షంలో తనను ప్రత్యేకంగా అభినందించడం-

కాలేజీ విద్యార్థినిని హత్యచేసిన వ్యక్తిని ఉరికంబ మెక్కిస్తానని తాను ప్రతిన బూనడం -

ఆర్, టి. సి. బస్సు ఆపి అందరూ చూస్తుండగా ఆమెను బస్సు దింపి చెట్టుకి వేలాడ దీయడం -

జరిగినకథ:-

కాంగ్రెసేతర ప్రభుత్వం అధికారంలోనున్న రాష్ట్రంలో ఓ పట్టణమది. ఆ పట్టణంలో శాంతిభద్రతల్ని పునరుద్ధరించడానికి స్పెషల్ మెజిస్టీరియల్ పవర్స్‌తో అక్కడ ఎస్.పి.గా రంజిత్‌ని నియమిస్తుంది రాష్ట్ర ప్రభుత్వం. ఎవరో గుర్తు తెలియని వ్యక్తి పట్టపగలు కాలేజి విద్యార్థినిని అపహరించుకుపోయి మానభంగం చేసి హత్య చేస్తాడు. యు. ఎస్. ఆర్గనైజర్ వెంకట్ బంద్‌కి, నిరసన ప్రదర్శనకి పిలుపు ఇస్తాడు. వెంకట్ శత్రువు అయిన కుమార్ ప్రశాంతంగా సాగే ఊరేగింపులో అరాచకం సృష్టిస్తాడు. "మహానాడు" దినపత్రిక రిపోర్టర్ కపిల ఆ ఘోరాన్ని ఫోటోలతోసహా తన పేపరుకి రిపోర్టు అందిస్తుంది. 'మహానాడు' దినపత్రిక మేనేజింగ్ డైరెక్టర్ మధు ఆమెను అభినందించి రిటైర్డ్ డి.ఎస్.పి. రామచంద్రుడు ఇంట్లో అత్యాచారం జరిగిందని తెలియజేస్తాడు. కపిల రామచంద్రుడు ఇంటికి వెళ్లింది. రామచంద్రుడు కుమార్తెను వివస్త్రనుచేసి ఇంట్లోనే మానభంగం చేసి హత్యచేశారు. ఆ పని చేసింది వెంకట్ అని అభిప్రాయ పడతాడు రంజిత్. పేపర్లో తనపై వచ్చిన ఆరోపణ చూసిన వెంకట్ రంజిత్‌ని హతమార్చడానికి నిశ్చయించుకుంటాడు.

ఆ తర్వాత—

పట్టణంలో తాను నిషేధాజ్ఞలు విధించడం -

ఆ నిషేధాజ్ఞల్ని ధిక్కరించి వెంకట్ నిరసన ప్రదర్శనలు నిర్వహించడం-

రామాపురంలో అత్యాచారానికి దుండగుల యత్నం -

తాను రామాపురం వెళ్ళిన సమయంలో రింగురోడ్డు దగ్గర అవాంఛనీయ సంఘటనలు -

ఆవేశంతో తాను వెంకట్ క్యాంపుపై దాడి చేయడం -

సరిగ్గా అదేసమయంలో డి. ఎస్. పి. రామచంద్రుడి ఇంట్లో రామచంద్రుడి కూతుర్ని మానభంగం చేసి హత్యచేయడం -

ఆ పక్షం రోజులలో జరిగిన సంఘటనలన్నీ ఎస్. పి. రంజిత్ కళ్ళముందు మెదిలాయి.

ఎంతో ప్రజ్ఞావంతుడిగా తనకున్న పేరు ప్రఖ్యాతులన్నీ నాశనమయ్యాయి - ఈ ఆలోచనలతో రంజిత్ పిడికిలి అప్రయత్నంగా బిగిసింది.

డెత్ ట్రాప్

"వెంకట్ నిన్ను బయటవుంచితే ప్రమాదం. నీవు మేన్ ఈటర్‌వి. నీవంటి మేన్ ఈటర్స్‌ని వదిలేస్తే ఇంతకు ఇంత భయోత్పాతాన్ని సృష్టిస్తారు. తప్పదు, నిన్ను వేటాడవలసిందే" అనుకొంటూ లేచాడు. యూనిఫారమ్ వేసుకున్నాడు. రివాల్వర్ చెక్ చేసుకున్నాడు. తనకు నిర్దేశింపబడిన అంబాసిడర్ కారుని గ్యారేజినుంచి బయటకు తీశాడు. ఎప్పుడయితే రంజిత్ తన కారుని గ్యారేజీనించి బయటకు తీశాడో అప్పుడే రంజిత్ పెంపుడు కుక్క కుర్చీలోనుంచి తటాలున క్రిందకు దూకింది. తన యజమానితో పాటు కారు ముందు సీట్లో కూర్చుంది.

అంబాసిడర్ ముందుకు దూకింది. గేటుదగ్గరవున్న సెంట్రీ మెయిన్ గేటు తెరచి పట్టుకున్నాడు. అతడి ముఖంలో వినయంకన్నా ఆశ్చర్యం ఎక్కువగా తొంగి చూస్తోంది. సెంట్రీ ముఖంలోని ఆశ్చర్యాన్నిగాని, రంజిత్ ముఖంలోని కాఠిన్యాన్ని గాని రంజిత్ ప్రక్కన సీటులో కూర్చునున్న ఆ పెంపుడుకుక్క గమనించే స్థితిలో లేదు. దాని ముక్కుపుటాలకు ఏదో వాసన తగుల్తోంది. ఏదో ప్రమాదాన్ని శంకించిందది. అందుకే అప్రమత్తంగా కూర్చుంది. రంజిత్ పసిగట్టలేని విషయాన్ని ఆ కుక్క పసిగట్ట గలిగింది. రిటైర్డ్ డి. ఎస్. పి. రామచంద్రుడు కుమార్తె మరణంలో వెంకట్ హస్తం వుందని తాను అనుమానిస్తున్నట్టు రంజిత్ ఇచ్చిన పత్రికా ప్రకటన చూసిన వెంకట్ అగ్నిహోత్రుడయ్యాడు. రాష్ట్ర ప్రభుత్వం తనను కాలరాచివేయడానికే రంజిత్‌ని ఎస్. పి. హోదాలో నియమించిందని అతడు అభిప్రాయ పడ్డాడు. ఖాకీ దుస్తుల వెనుక పట్టణంలో పోలీసులే అరాజకాన్ని సృష్టిస్తున్నారని వెంకట్ నమ్మాడు. ఒక పథకం ప్రకారం తనచుట్టూ ఉచ్చులు బిగిస్తున్నారనుకున్నాడు. తాను చేయని నేరాలకు, ఘోరాలకు తననే బాధ్యుణ్ణి చేసిన ఎస్.పి. రంజిత్‌ని హత్య చేయాలనుకున్నాడు. అందుకే ముగ్గురు అనుచరులతో ఎస్. పి. బంగ్లా దగ్గరకు వచ్చాడు. తాను వచ్చిన కారుని ఒక ప్రక్కగా నిలిపి ఎవరూ చూడకుండా బంగ్లాలోకి ప్రవేశించారు. డ్యూటీలోవున్న సెంట్రీలపై చావుదెబ్బ తీశారు. టెలిఫోను తీగలు తెంచి రంజిత్‌ని మర్డర్ చేయడానికి రంజిత్ పడక గదివైపు నడిచారు. అయితే పులి గుహలో లేదని, వేటకు బయటకు వెళ్ళిందని వారికి తెలియదు. అందుకే పులి గుహలోకి అడుగు పెట్టారు. వెంకట్ చేతిలో రివాల్వర్ ఉంది. అతడి అనుచరుల చేతుల్లో మారణాయుధాలున్నాయి. ఏ నిమిషాన అయినా వారు రంజిత్ పడకమీదకు దూకి మంచంతోసహా రంజిత్‌ని ముక్కలు ముక్కలుగా నరకడానికి సిద్ధంగా వున్నారు. వారిలో విచక్షణాజ్ఞానం నశించింది. ఏ విషయాన్ని లక్ష్యపెట్టే స్థితిలో లేరు. వెంకట్ కుడిచేతి చూపుడువ్రేలు ట్రిగ్గర్‌పై వుంది. గదిలోపల బెడ్‌లైట్ కాంతిలో అంత అపరాత్రివేళ భగవద్గీత పారాయణం చేస్తోంది రంజిత్ భార్య కరుణ. షాంపూతో తలారా స్నానం చేసినట్లుంది మెత్తటి జుత్తు ఆమె భుజాలమీదగా వ్రేలాడుతోంది. నుదుట కుంకుమబొట్టు, తెల్లనిచీర రవికెలో కడిగిన ముత్యంలా వుంది. ఆమె కట్టుబొట్టుకన్నా ఆమె ముఖంలో అంతకు మించిన ప్రశాంతత, తేజస్సు, నిర్మలత

తొంగి చూస్తున్నాయి.

ఏదో శబ్దం వినిపించినట్లయి చదువుతున్న భగవద్గీతనుంచి తలెత్తి చూసిన ఆమె అనుమానంతో కూర్చున్న కుర్చీలోనుంచి లేచివచ్చింది. ఆమెకు తెలియదు ఆ గది తలుపు దగ్గర మృత్యుకింకరులు ఆమె కోసం ఎదురు చూస్తున్నారని. నెమ్మదిగా తలుపు దగ్గరకు ఆమె రావడం గమనించిన ద్వారం దగ్గరున్న ఆగంతకులలో ఒకరు చేతిలోని గొడ్డలి వేగంగా గాల్లిలోకి ఎత్తాడు. రెప్పపాటు కాలంలో ఆ గొడ్డలి వ్రేటు ఆమె తలపై పడేదే, కాని అంతకన్నా మెరుపు వేగంతో వెంకట్ చేయి లేచి గాలి లోకి లేచిన చేతిని అలాగే పట్టుకుంది.

ఎదురుగా ఒకరుకాదు ఇద్దరుకాదు నలుగురు మారణాయుధాలతో నిలబడివున్నా. కరుణ కంగారుపడలేదు. ఒక్కగానొక్క కొడుకుని నక్సలైట్లకు బలిదానం చేసిన మాతృమూర్తి ఆమె. వారు తన భర్తను ఏం చేశారోనని బెంబేలు పడలేదు. ఎందు కంటే తన భర్త అహర్నిశలు మృత్యువుతో పోరాడుతున్నాడని ఆమెకు తెలుసు.

"వెంకట్‌గారూ! పోలీసు ఫైళ్ళు మీగురించి ఏవేవో చెబుతుంటే నమ్మలేదు. కాని..." అంటూ ఆమె ఇంకా ఏదో చెప్పబోయేంతలో ఆమె మాటల్ని మధ్యలోనే త్రుంచి, "ఇప్పుడు నమ్మక తప్పటం లేదంటారు, అంతేనా?" అనడిగాడు.

"అదే నిజమయితే ఈపాటికి నా శరీరంలో వంద కత్తిపోట్లు కనిపించేవి. నా అభిప్రాయమే నిజమయింది"

"పొరపాటు పడ్తున్నారు,.... ఇహనేను ప్రారంభించబోయే మారణహోమాన్ని ఏనాడో ప్రారంభించినట్టుగా పోలీసు రికార్డులు చెబుతున్నాయి. ఇప్పుడు నా వేట ప్రారంభమవుతుంది. అదీ నీ భర్త - రంజిత్ హత్యతో. వారం రోజులలోపు వాడి తల నరికి నాలుగు రోడ్ల కూడలిలో పెడ్తాను. ఇదినా సవాల్‌గా చెప్పండి" అంటూ ఎలా వచ్చాడో అలాగే అనుచరుల్తో వెళ్ళి పోయాడు వెంకట్.


(సశేషం)

జ్యోతి పాఠకులకు రెండు కానుకలు!

మీరెంతో కాలంనుంచి 'ఎప్పుడా' అని ఎదురుచూస్తూ, 'ఇంకెప్పుడు?' అని ఉత్తరాల వర్షం కురిపిస్తున్న మీ అరాధ్య రచయిత శ్రీ యండమూరి వీరేంద్రనాథ్ సీరియల్ 'మంచు పర్వతం' ఈ సంచికనుంచీ ప్రారంభిస్తున్నాం. ఎన్నో ప్రయోగాలు చేస్తూ లక్షలాది అభిమానులను తన ప్రత్యేక రచనా ఒరవడితో సమ్మోహితులనుజేస్తూ, తెలుగు సాహితీ రంగంలో చరిత్ర సృష్టి స్తూన్న శ్రీ యండమూరి 'మంచుపర్వతం' మరో సంచలనం కలి గిస్తుందనటంలో మాకెలాంటి సందేహం లేదు.

యువరచయిత సూర్యదేవర రామ్మోహన్‌రావ్ కొత్త సీరి యల్ 'డిక్టేటర్' కూడా ఈ సంచికనుంచే ప్రారంభమవుతోంది.

పద వ్యూహం 6



చిరునామా: ______________________________

____

ఆధారాలు

అడ్డం:


2. ఇది ఎప్పుడూ పులుపే. 5. కోపం ఎక్కువైనా మంచి మనిషే! 7. తుమ్మెద గ్రోలేది. 9. తిరిగి వస్తే అక్కడ నది దాట వచ్చు. 10. మధ్యమ పురుష 11. కన్నవారికే తెలుసు కడుపు. 12. ఎద్దుమెడకు కట్టుకు తిరిగే డోలు. 13. మొదటి శత్రువు. 15. పాటకు ముందు ఇది కూడా ఉంటే మంచిది. 17. పిసిని గొట్టా? పొదుపరా? 18. ఎంతో మంగళ మైనది. 20. ఇతరుల శరీరంలో చేరే విద్య.

నిలువు:

1. హీరో హీరోయిన్లు చేరుదామని పాడే ప్రదేశాలు, 2. నత్త గుల్ల 3. చాల సుఖమా? 4. తుమ్ము. 6. శీర్షాసనం వేసిన రాజు. 7. మేక్స్ మెనీ థింగ్స్. 8. కలభాషిణి వలన జరిగినది. 13. వేయ వలసినది గద్దలకా లేక –? 14. మందుడు స్వభావ విరుద్ధం. 15. ఉప్పు లేనిదే రుచా? 16. మబ్బు లేనిది. 19. తల క్రిందులుగా అడక్కు.

పదవ్యూహం 5 విజేతలు:

1) కె. ఆర్. ప్రసాద్, కర్నూలు. 2) డి. సీతారామారావు, మదక్కతర (కేరళ) 3) ఐ. వి. రఘురామ మూర్తి, కోవూరు. 4) సి. హెచ్. అశోక్ రెడ్డి, పొన్నూరి. 5) కె. రంగారెడ్డి, కూరె. 6) డి. సుధాకరశర్మ, నెల్లూరు,



నిబంధనలు:

1. ప్రతినెలా పూరించిన పదవ్యూహం మా కార్యాలయానికి 20వ తేదీలోగా చేరాలి.
2. పంచికలో గడినే పంపాలి. విడి కాగితముపై గళ్ళుగీసి పంపరాదు.
3. గళ్ళమడిపై చిరునామా తప్పక వ్రాయాలి.
4. మడికట్టు పంపే కవరుపై 'పదవ్యూహం పంక్తి' అని తప్పక వ్రాయాలి.
5. బహుమతి మొత్తం రూ. 100/- విజేతలు ఒకరికంటే ఎక్కువైతే బహుమతి మొత్తాన్ని పంచి పంపుతాము.





మంచుపర్వతం

కొత్త సీరియల్ ప్రారంభం!

ఉమెన్స్ కాలేజీ ఆవరణలో పొగడ చెట్టు కింద జరిగింది ఆ నలుగురి సమావేశం.

ఆ రోజు కాలేజీ అంతా చాలా హడావిడిగా ఉంది. పరీక్షలకు చివరిరోజది. అందరూ గుంపులు గుంపులుగా కూర్చుని వెళ్లాల్సిన సినిమా గురించో, చేసుకోబోయే పార్టీ గురించో, మాట్లాడుకుంటున్నారు.

వాళ్ళు నలుగురూ మాత్రం పొగడ చెట్టుకింద కూర్చున్నారు ఎప్పటిలాగానే. వాళ్ళ మొహాల్లో ఎక్కడా సంతోషపు ఛాయలు కనుపించడంలేదు.

పరీక్షలు బాగా రాయలేదనే బాధ కాదది. ఫెయిలవుతానన్న భయం ఎవరికీ లేదందులో. రెండేళ్ళు ఒక ప్రాణంలా మెలిగిన వాళ్ళలో ఒకరు దూరంగా వెళ్ళిపోతున్నారనే దిగులు అదంతా.

ఆ నలుగురూ ఇంటర్ సెకండియర్ పరీక్షలు రాశారు. యవ్వనపు పొందులు వికసిస్తున్న వయసు, మానసికంగా ఎదిగీ ఎదగని స్థాయి వాళ్ళది. అందుకే ఒకరు దూరమయి పోతున్నారని తెలియగానే ప్రపంచం తల్లక్రిందులైనట్టుగా బాధ పడిపోతున్నారు. ఎవరికీ నోట మాట రావడంలేదు. కంట నీరుతప్ప. ప్రపంచంలో సెంటిమెంటు తప్ప మరేమీ లేదనుకునేటంత చిన్న వయసు వాళ్ళది.

అందులో—



వైజయంతి క్లాసులో ఫస్టు ఎప్పుడూ, సెకండ్ వచ్చిందంటే నిద్రాహారాలు మాని ఫస్టురాంక్‌కోసం ప్రయత్నిస్తుంది. ఆమె తల్లీ, తండ్రీ యిద్దరూ డాక్టర్లే. ఒక్కతే కూతురు అయినా గారాబం, తల్లితండ్రుల పర్యవేక్షణలో ఏలోటూ లేదు. తమలాగే ఆమే డాక్టరవుతుందన్న వాళ్ళ ఆశమాత్రం ఫలించలేదు. ఓసారి హాస్పిటల్‌లో యాక్సిడెంటుకి గురయిన వ్యక్తిని తండ్రి ట్రీట్‌చేయడం చూసింది. అంతే. రక్తాన్ని చూస్తే తగని భయం ఆమె కప్పటనుంచి. స్వతహాగా బిడియస్థురాలు కూడా.

విశాల తల్లితండ్రుల ఆరుగురి సంతానంలో మొదటిది. మధ్య తరగతి కుటుంబం. సాధారణమైన తెలివితేటలు. అయితే వాళ్ళ కుటుంబ సన్నిహితుల్లో ఆ మాత్రం చదువూ, తెలివితేటలు గల అమ్మాయిలు అప్పట్లో లేకపోవడంతో ఆమెను పొగిడేవాళ్ళే ఎక్కువ. అంచేత తను చాలా యింటలిజెంట్ అనుకుంటుంది. ఇంటర్ పూర్తవగానే వాళ్ళ బావకిచ్చి పెళ్ళి చేయాలన్నది వాళ్ళ పెద్దల కోరిక. కాని తను డిగ్రీ పూర్తి చేస్తానని అంతవరకు పెళ్ళే చేసుకోనని అంటుంది. ఇంట్లో పెద్దపిల్ల కావడంతో తల్లికి చేదోడుగా ఉంటూ కాస్త చాదస్తాలనీ, ఆచారాలనీ వంట పట్టించుకుంది తనకు తెలియకుండానే. ఆ మాట ఎవరైనా అంటే మాత్రం ఒప్పుకోదు. మాట తొందర మనిషి.


అనూరాధ పుస్తకాల పురుగు. అంటే కేవలం క్లాసు పుస్తకాలే కాదు చేతికందిన ప్రతి పుస్తకాన్నీ, చివరకు చిత్తుకాగితాన్నికూడా చదవకుండా వదిలిపెట్టదు. సంగీతంలో అభిరుచి ఉంది. కర్ణాటక సంగీతం నేర్చుకుంటోంది. పుస్తకాలు, లేదా టేప్ రికార్డర్ ఆమెకు సదా పక్కనుండే స్నేహితులు. ఒక్కతే సంతానం తల్లితండ్రులకి అందుకని బాగా గారాబం. ఈ ముగ్గురు స్నేహితులు తప్ప ఆమెకు వేరే స్నేహితులు ఎవరూ లేరు. ఒంటరి తనాన్ని ఎక్కువగా యిష్టపడుతుంది.

ఇక మిగిలింది భార్గవి. బాగా చదువుతుంది. లిటరేచర్ అంటే యిష్టం ఆమెకు. తెలుగు లిటరేచర్‌లో పి.హెచ్‌డి. చేయాలన్నది ఆమె ఆశయం. అందరికన్నా ధైర్యస్థురాలు. స్నేహపూరితమైన నవ్వు, చక్కటి స్వరం ఆమెకు పెట్టని ఆభరణాలు. ప్రతి విషయాన్ని తరచి తరచి ఆలోచిస్తుంది. విశ్లేషించి వాదిస్తుంటుంది. భావుకత పాళ్ళు ఎక్కువ. 'నువ్వు పుస్తకాలు చదివి పాడయిపోతున్నావే' అంటుంది వాళ్ళమ్మ. ఆమె పుస్తకాలు చదివి పాడయిందో, బాగుపడిందో భవిష్యత్తే నిర్ణయించాలి. ప్రస్తుతం హాస్టల్లో ఉంటోంది తండ్రికి ట్రాన్స్‌ఫరవడంతో.

కాలేజీలో చేరిన మొదటిరోజున అనుకోకుండా నలుగురూ ఆ పొగడ చెట్టుకిందే కలుసుకున్నారు. నలుగురిదీ ఒకటే గ్రూపనీ, ఒకటే సెక్షననీ తెలిసింది. నలుగురికీ ఒకటే భయం. సీనియర్స్ చేసే రాగింగ్ గురించి.

అనుకుంటుండగానే వచ్చిందో గ్రూపు.

"ఎవరుమీరు ? దుష్ట చతుష్టయమా ?" అడిగిందో అమ్మాయి.



ఎవరూ నోరు తెరవలేదు.

"మౌనం అర్ధాంగీకారం. మీలో దుశ్శాసని ఎవరు ? ఇటురమ్మ" పిలిచిందో గడుగ్గాయి.

అప్పటికి ఎవరూ కదలలేదు, మాట్లాడలేదు. భయంగ చూస్తూ నిలబడ్డారు.

"ద్రౌపది కనుపించడం లేదని కాబోలు రావడం లేదు. ద్రౌపదిని పిలవండి" అన్నారు ఒకరు.

"అదిగో వస్తోంది" లంగా ఓణీ వేసుకుని బెరుగ్గా నడచి వస్తున్న అమ్మాయిని చూస్తూ అంది.

"ఏయ్ ద్రౌపదీ యిలారా" పిలిచాడు గట్టిగా.

భయం భయంగా వచ్చిందా అమ్మాయి.

"నీ పేరు ?"

"మాలిని" అంది మెల్లిగా

"మాలిని అంటే మాలికి స్త్రీ లింగమా తోట పని చేస్తావా ?"

"లేదండి" ఆమె కళ్ళలో నీళ్ళు తిరగడం మొదలు పెట్టాయి.

"ఈ కాలేజీలో నీళ్ళు పుష్కలంగా ఉన్నాయి. కన్నీళ్ళతో చెట్లకు నీళ్ళెట్టక్కర్లేదు"

"మాలిని అంటే మాలి కాదు. ద్రౌపదే. అజ్ఞాత వాసంలో పెట్టుకున్నా పేరు" గబుక్కున అందుకుంది విశాల. వారిస్తున్న భార్గవిని పట్టించుకోలేదామె.

"చూశారా దుశ్శాసని బయటపడింది. రా. దుశ్శాసనీ వచ్చి వస్త్రాపహరణం కానియ్యి" ఆజ్ఞాపించింది గ్యాంగు లీడరు.

"నాపేరు దుశ్శాసని కాదు, విశాల"

"ఈ రోజుకి నీ పేరు మార్చేశాం చెప్పిన పని చెయ్యి లేదా నిన్నే ద్రౌపదిని చేయాల్సొస్తుంది" బెదిరించారు.

విశాల లంగా జాకెట్టులో ఉందారోజు. అవతలమ్మాయి కనీసం ఓణీ అయినా వేసుకునుంది.

ఆ అమ్మాయిఓణీ పట్టుకుని లాగక తప్పలేదు.

అంతటితో వదిలి వెళ్ళిపోయారా గుంపు వాళ్ళ స్నేహం మాత్రం అలాగే నిలిచి పోయింది. సరదాగా అప్పుడప్పుడు, దుర్యోధనీ, కర్ణీ, శకునీ అని పిలుచుకుంటుంటారు వాళ్ళలో వాళ్ళు.

రెండేళ్ళు అతి వేగంగా గడిచిపోయాయి. వాళ్ళ స్నేహం మరింత బలపడింది ముగ్గురు ఒకే కాలేజీలో డిగ్రీలో చేరాలనుకున్నారు.

కాని అనుకోకుండా వైజయంతి తల్లిదండ్రులకు ట్రాన్స్‌ఫర్ కాబోతుందని, నాలుగు రోజుల్లో ఢిల్లీ వెళ్ళిపోతారనీ తెలిసింది అంతక్రితం రోజే...

"నాకు చాల బాధగా ఉంది వైజూ రెండేళ్ళు ఎంత త్వరగా గడిచి పోయాయి మరో మూడేళ్ళు కలసి చదువుకుంటాం అనుకుంటే ఇలా అయిపోయింది. అంది రాధ

"హాస్టల్లో ఉండి చదువుకోరాదు భార్గవి కూడా ఉందిగా అమ్మా వాళ్ళు ఒప్పుకోరా ?" అడిగింది విశాల.

"అమ్మో, అమ్మా వాళ్ళను విడిచి ఉండాలంటే నాకు చచ్చేభయం. అసలు అమ్మ కూడా ఒప్పుకోదు" అంది వైజయంతి. ఆమె పిరికితనం తెలిసిన స్నేహితులు ఇక ఆ విషయం మాట్లాడలేదు.

"అక్కడ బి.ఏలో చేరతావా ?" అడిగింది విశాల.

"ఆ, లేడీ శ్రీరామ్ కాలేజీలో సీటు వస్తుందన్నాడు నాన్నగారు"

"చాలా బావుంటుందిట కదూ కాలేజీ. ఏదో మ్యాగజైనులో చదివా దాని గురించి" అంది అనూరాధ.

"ఆ అందుకే అక్కడ చదివించాలని నాన్న పట్టుదల కాని నాకే భయం వేస్తోంది. అక్కడ అమ్మాయిలంతా గడుగ్గాయిలట"

"నాలుగు రోజుల్లో అంతా అలవాటయి పోతుంది లెద్దూ. ఇక్కడ చేరిన రోజున ఎంత భయపడ్డాం ?" భార్గవి గుర్తు చేసింది.

"నిజమే ననుకో. కాని మిమ్మల్ని మిస్సవుతాను"

"మళ్ళీ ఎప్పుడు కలుస్తామో గదూ అసలు కలుసుకుంటామో లేదో ?" భార్గవి స్వరంలో వేదన.

"మీరంతా ప్రోగ్రాం వేసుకొని ఢిల్లీ రాకూడదూ"

"ఈ ఊళ్ళోనే ఉన్నా స్కూలు ఫ్రెండ్స్‌ని కలవడానికి వెళ్ళనివ్వరు మా అమ్మ ఇక ఢిల్లీ పంపుతుందా" మూతిసున్నాలా చుట్టింది విశాల.

"నువ్వు ఎప్పుడైనా రావడానికి వీలుంటదా వైజూ?" అడిగింది రాధ.

"ఏమో, ఇప్పుడు మాకు దగ్గర బంధువులంటూ ఈ ఊళ్ళో ఎవరూ లేరు. వస్తే మాత్రం మిమ్మల్ని కలవకుండా వెళ్ళను లే"

ఉత్తరాలు రాస్తుండు. వైజూ. ఆ రకంగా నయినా మన స్నేహిన్ని కొనసాగిద్దాం" భార్గవి కోరిక.

"ఉత్తరాలు రాయడమంటే నాకు తగని బద్ధకం అని మీకు తెలుసుగా. నువ్వు మాత్రం మర్చిపోకుండా రాస్తూండు భార్గవీ నేను ప్రయత్నిస్తాలే" భార్గవి కలం స్నేహంగురించి వాళ్ళందరికీ తెలుసు.

"నాకో అయిడియా వస్తోందర్రా ఇప్పుడు ఆవేశంలో ఉన్నాం కాబట్టి కొన్నాళ్ళు ఉత్తరాలు రాసుకుంటాం. కాని ఆ తర్వాత అనుకోకుండానే దూరమయి పోతాం. కాని కొన్నేళ్ళ తర్వాత అందరం అనుకోకుండా కలుసుకుంటే ఎలా మాట్లాడుకుంటాం ఏం మాట్లాడుకుంటాం? ఊహించండి" అనూరాధ అప్పుడే ఆ దృశ్యాన్ని ఊహించేసుకుంటోంది.

"ఏముంది, పిల్లల గురించి మొగుళ్ళ గురించి మాట్లాడుకుంటాం" అంది విశాల వెంటనే.

"అవునులే నీకంతకంటే వేరే ఆలోచన ఎందుకొస్తుంది. ఎప్పుడెప్పుడు పెళ్ళవుతుందా, పిల్లల్ని కంటానా అని ఎదురుచూస్తుంటావు. నేను మాట్లాడేది అలాంటి విషయాలగురించి కాదు. ఈరోజున భవిష్యత్తు గురించి ఎన్నో కలలు కంటున్నాం ఈవయసులో పిచ్చి పిచ్చి కోరికలు, ఊహలు, చిన్న విషయాలకే ఆవేశపడిపోయి పోట్లాడుకోవడాలు చేస్తుంటాం. మన నలుగురిలో ఒకరి గురించి మరొకరికి బాగ తెలుసనే భావనలో ఉన్నాం. కాని పదేళ్ళ తర్వాత మనలో ఎలాంటి మార్పు వస్తుంది! ఏమవుదామని ఏమయ్యాం? అప్పుడు మాట్లాడుకుంటే మనలో నిజస్వరూపాలు బయటకు వస్తాయి గదూ?"

"నీ అయిడియా చాలా బావుంది రాధా. మరో పదేళ్ళ తర్వాత మనలో మెజారిటీ వస్తుంది. జీవితం గురించి మరింత బాగ ఎనలైజ్ చేసి మాట్లాడుకుంటాం. అలాగే చేద్దాం రాధా" అంది భార్గవి సంతోషంగా.

"అలా కుదురుతుందా? ఎవరెవరం ఎక్కడుంటామో" విశాల సందేహం వెలిబుచ్చింది.

"వేర్, దేరీజ్ విల్ దేరీజ వే" అన్నారు. మనసుంటే మార్గముంటుంది. ఆలోచిస్తుంటేనే ఎంతో ఎక్జయిటింగ్‌గా ఉంది. అందరు ఒకే ఊళ్ళో ఉండి అప్పుడప్పుడు కలుసుకుంటుంటే అది వేరే విషయం. కాని వైజయింతి వెళ్ళిపోతుంది, నేను వెళ్ళిపోవచ్చు. ఒక వేళ ఈఊళ్ళోనే ఉన్నా మన ముగ్గురికే ఒకే కాలేజీలో సీటు రాకపోవచ్చు. అది కాక పోయినా డిగ్రీ అయిపోయాక మనం విడిపోవచ్చు. కాని, పదేళ్ళ తరవాతంటే బహూశ జీవితాల్లో సెటిలయి పోతాం. అప్పుడు మనలో తప్పకుండా మార్పు వస్తుంది. అప్పుడు కలుసుకుంటేనే బావుంటుంది" అంది భార్గవి.

"నిజమే భార్గవీ, నువ్వలా అంటుంటే నాకూ అయిడియా బాగున్నట్టే తోస్తోంది. తప్పకుండా కలుద్దాం" అంది వైజయంతి.

"ఎలా, అప్పుడెవరెక్కడుందీ, ఎలా, ఎక్కడ కలవాల్సిందీ తెలిసేదెలా?" విశాల అనుమానం.

"అవును, నిజమే ఒకరి కొకరం రెగ్యులర్‌గా ఉత్తరాలు రాసుకుంటే తప్ప అది సాధ్యం కాదు. అలా జరిగితే మనం క్రొత్తగా చెప్పుకునేదేముంటుందిక?" రాధ అడిగింది.

"ఆ ఉత్తరాలు రాసుకోలేకేగా ఈ ప్రోగ్రాం వేసుకుంటున్నది. ఇక ఎలా కలుస్తాము అన్న ప్రశ్నకు జవాబు ఒకటుంది" అంది వైజయంతి.

"ఏమిటది చెప్పు?" అడిగారంతా.

"ఎప్పుడు ఎక్కడ కలవాలో యిప్పుడే నిర్ణయించేసుకుంటే సరి"

"ఇప్పుడా, అప్పటిదాకా గుర్తుంటుందా. ఒకవేళ కుదరని పరిస్థితుల్లో ఉంటే?"

"కుదరకపోతే అది వేరే విషయం. అది మన చేతుల్లో ఉంటుందప్పుడు. ఈ రోజు ఏప్రిల్ ఇరవై అయిదు. సరిగ్గా పదిహేనేళ్ళ తర్వాత, పదేళ్ళంటే త్వరగా గడిచి పోతాయి. అందుకే పదిహేనన్నాను. 1988 ఏప్రిల్ ఇరవై అయిదున మనం ఈ కాలేజీలో ఈ చెట్టుకిందే కలుద్దాం" వైజయంతి నిశ్చయం చేసేసింది.

"నేను ఓ.కే. నా జీవితంలో మర్చిపోలేని విషయాలన్నీ ఎప్పటికప్పుడు రాసి పెడుతుంటాను మీకు వినిపించడానికి" అంది భార్గవి ఉత్సాహంగా.

"ఆ పని నేనూ చేస్తాను" అంది అనూరాధ.

"అయితే మనం పంతొమ్మిది వందల ఎనభై ఎనిమిది, ఏప్రిల్ ఇరవై అయిదుని మర్చిపోకుండా గుర్తుపెట్టుకోవాలన్నమాట" అంది విశాల.

మరే, ఎక్కడయినా రాసిపెట్టుకో లేదా మీ బావకు యిప్పుడే చెప్పేసెయ్ గుర్తుంచుకోమని. పిల్లల ధ్యాసలో మర్చిపోయినా మర్చిపోతావు" వైజయంతి హెచ్చరించింది.

"అవసరం లేదులే. ఆమాత్రం గుర్తుండదేమిటి? ఇంతవరకూ ఎవరూ ఫేర్‌వెల్ పార్టీలో అనుకోని కొత్త తీర్మానం చేసుకున్నాం."

"అయితే అందరూ గుర్తుంచుకోండి. ఆ రోజున మనం యిక్కడే కలవాలి. రావడానికి వీల్లేకపోతే ఎవరితోనయినా కబురయినా చెయ్యాలి. సమయం ఉదయం పదిగంటలు, తేదీ ఏప్రిల్ ఇరవై అయిదు. ఎనభై ఎనిమిదో సంవత్సరం మన అనుభవాలన్నీ యిలాగే మాల గుచ్చి తీసుకురావాలి. కనీసం ఒక్క రోజన్నా కలసి గడపాలి" పొగడ మాలల్ని అందరికీ పంచుతూ అంది భార్గవి.

"ఓ.కె. డన్" అందరి చేతులూ కలుసుకున్నాయి.

(సశేషం)

సంచలన సంపాదకుడు 'ఆనందవికటన్' బాలసుబ్రమనియన్ తో 'జ్యోతి' ప్రత్యేక ప్రతినిధి శ్రీ పాలగుమ్మి మోహన్ రావు ప్రత్యేక ఇంటర్వ్యూ

ప్ర. జైలు శిక్ష గురించి వినగానే మీలో ఎలాంటి ప్రతి స్పందన కలిగింది?

జ. నేను అలాంటి చర్యను ముందుగానే ఊహించాను. అయితే మూడునెలల కఠిన కారాగార వాస శిక్ష విధిస్తారని మాత్రం అనుకోలేదు. ఆ సమయంలో నేను చాలా ప్రశాంతంగా ఉన్నాను. నేను కూరగాయలు పండించే మా 'ఫార్మ్ హౌస్'కి వెళ్ళి ఉన్నాను. మా ఆఫీసువారు మొట్టమొదటగా ఈ వార్తను నాకు తెలియజేసారు. నిజానికి నా అంతట నేనే పోలీస్ కమీషనర్ ఆఫీసుకి వెళ్ళి లొంగిపోవాలనుకున్నాను. అయితే, పోలీసులు తమవాహనాల్లో మా యింటికి, ఆఫీసుకి, ఫార్మ్ హౌస్‌కి వచ్చారు. ఒక నిముషం సమయంలో నేను చొక్కా వేసుకుని వారితో బయలుదేరి వెళ్ళాను.




ప్ర. ఎన్నో మేగజైన్లు న్యూస్ పేపర్లు ఇలాంటి కార్టూన్లనే - ఇంకా మాట్లాడితే మరింత తీవ్రమైన. అవహాస్యం చేసే కార్టూన్లను ప్రచురించాయి. అయితే కేవలం మిమ్మల్ని మాత్రమే ఈ కేసులో "ప్రత్యేకంగా శిక్షించటం" గురించి మీరేం అనుకుంటున్నారు?

జ. ఈ విషయంలో ప్రభుత్వం పూర్తిగా తప్పుడు అంచనా కలిగి ఉంది. వాళ్ళేమనుకున్నారంటే - రెండున్నర లక్షల సర్క్యులేషన్ ఉన్న 'ఆనందవికటన్' మేనేజింగ్ డైరెక్టర్ అండ్ ఎడిటర్ మీద చర్య తీసుకుంటే, మృదుభాషుడు, ఏకాంతాన్ని ప్రేమించే గౌరవనీయుడైన సంపాదకుడు, శ్రీ యస్.యస్. వాసన్ కుమారుడూ అయినవాడు "వాళ్ళను సంతృప్తి పరిచే విధంగా ప్రవర్తిస్తాడని" అనుకున్నారు. కాని ఎప్పుడైతే నేను చట్టపరంగా అరెస్ట్ కావడానికి సంసిద్ధుడినయ్యానో అప్పుడు వాళ్ళ అంచనాలన్నీ తల్లక్రిందులయ్యాయి.

> కాని ఎప్పుడైతే నేను చట్టపరంగా అరెస్ట్ కావడానికి సంసిద్ధుడినయ్యానో అప్పుడు వాళ్ళ అంచనాలన్నీ తల్లక్రిందులయ్యాయి.

ప్ర. మీ విడుదలకు కారణాలేమిటని మీరనుకుంటున్నారో చెప్పగలరా?
ఉదాహరణకు -
ఒకటి - కొన్ని వర్గాలు చెప్తున్నట్లు ముఖ్యమంత్రిగారి ఉదారతా?
రెండు - కేంద్రం జోక్యం కలిగించుకోవడమా?
మూడు - ఈ విషయమై పత్రికలు, ప్రజలు ఒక్క రీతిగా జరిపిన ఆందోళన కారణమంటారా?

జ. ఖచ్చితంగా మూడోదే! కేవలం మీ



ఇంత సంచలనానికి కారణమైన కార్టూన్ ఇదే.

ఆ పాఠకుడు కేంద్ర మంత్రి కావడం కాక తాళీయం.


కారణంగానే మిగతావి సంభవించి ఉండ వచ్చు. అంధ్రీ-పత్రికలు, ప్రజలు చేసిన ఆందోళన. ఎన్నో వార్తాపత్రికలలోని హెడ్‌లైన్స్ ఈ 'కామన్‌కాజ్'కి గుర్తుగా నిలిచాయి. దాదాపు 42 గంటలపాటు నేను జైల్లో ఉన్నాను. అటువంటప్పుడు ఇక 'ఉదారత' ఎక్కడవుంది?

ప్ర. ఒక కేంద్రమంత్రి మీ తరఫున (ఒక సంపాదకుని తరఫున) ఎందుకు క్షమార్పణ చెప్పుకోవలని వచ్చింది?

జ. ఏ మనిషి మరొక మనిషి తరఫున క్షమార్పణ చెప్పుకోవడం కుదరదు. అది కేవలం భావోద్వేగంతో ఒక 'ఆనంద వికటన్' పాఠకుడు చేసిన ప్రకటన. ఆ పాఠకుడు కేంద్ర మంత్రి కావడం కాక తాళీయం. ఆ ప్రకటనకు నేను వ్యక్తిగతంగా కృతజ్ఞుణ్ణి.

ప్ర. భారత దేశంలో పత్రికా రంగం నిజంగా స్వేచ్ఛగా ఉందని మీరను కుంటున్నారా? మిమ్మల్ని జైల్లో ఉంచారు. మరొక వ్యక్తి యింటిని శోధించారు. మరి కొందర్ని విచారణ చేస్తున్నారు. ఇట్లాఎన్నో... పత్రికా స్వాతంత్ర్యాన్ని నమ్ముతామని ప్రభుత్వం చెప్పే మాటల్లో అసలు అంతరార్థం ఏమిటని మీరను కొంటున్నారు?

జ. ప్రభుత్వం చెప్పేది ఒకటి. కాని ఉద్దేశించేది మాత్రం మరొకటి. ప్రభుత్వానికి కావాల్సింది పత్రికా ప్రపంచం వాళ్ళ ముందు వాలి, కిందకు వంగి ప్రాకాలని




ఆనందవికటన్ కార్టూన్ ఉదంతం పై ఉదయం కార్టూనిస్ట్ మోహన్ ప్రతిస్పందన (ఉదయం సౌజన్యంతో)

వాళ్ళ దృష్టిలో 'స్వాతంత్ర్యం' అంటే అర్థం వాళ్ళు కోరింది రాయడం, అధికార పార్టీని పొగడటం. పత్రికా ప్రపంచం ప్రతిసారీ తమ స్వాతంత్ర్యం గురించి నిర్విరామంగా యుద్ధం చేయాల్సిరావడం చాలా దయనీయమైన స్థితి.

ప్ర. మీ మీద తీసుకున్న చర్యలాంటి చర్యలను తీసుకోడానికి అసెంబ్లీకి కానీ, స్పీకర్‌కి కానీ, హక్కు ఉందని మీరు అనుకుంటున్నారా?


జ. ఖచ్చితంగాలేదు. ఇలాంటి విషయాలను వ్యవహరించే పద్ధతిలో ఎటువంటి చట్టవిరుద్ధమైన చర్యలకూతావుండకూడదు. ఏమాత్రం వివేకం ఉన్నా, ఆయన (స్పీకర్) నన్ను సంజాయిషీ అడిగిఉండాల్సింది. ప్రివిలేజెస్ కమిటీకి నివేదించి ఉండాల్సింది. లేదా అలాంటిదే మరోటి చేసి ఉండాల్సింది. సరైన అవకాశం యివ్వకుండా తన తీర్పును ప్రకటించడం మీదనే ఈ 'చట్టవిరుద్ధమైన' చర్య ఆధారపడి ఉంది.



ప్ర. ఈ విషయాన్నంతా ప్రస్ఫుటింప చేసేట్లు ఇంకో కార్టూన్ లేదా వ్యాసం ద్వారా తెలియ చెప్పే ప్రయత్నాలేమన్నా చేస్తున్నారా?

జ. ఈ ప్రశ్నకు శ్రీ బాలసుబ్రమన్యన్ సరికొత్త ఆనంద వికటన్ కాపీ (12-4-87) అందించారు. దాన్లో మూడు రకాల కార్టూన్లు ప్రచురింప బడ్డాయి.

మూడో పేజీలో 'పత్రికాస్వాతంత్ర్యం'



వాళ్ళ దృష్టిలో 'స్వాతంత్ర్యం' అంటే అర్థం వాళ్ళు కోరింది రాయడం.

నాలుగో పేజీలో: 'ఇదే కొనసాగితే -' ఎడిటర్లు/రిపోర్టర్లు.

ఐదో పేజీలో: వ్యాఖ్య మీరే చెప్పండి.

(ఈ మూడు కార్టూన్లనూ వేరే పేజీల్లో ప్రచురిస్తున్నాం —ఎడిటర్)


ఎ) ఇవి మా ఎడిటోరియల్ కార్టూనిస్టు మోహన్ స్పాంటేనియస్ రియాక్షన్.

ప్ర. మన ప్రభుత్వంలో ఎవరికైన (ప్రస్తుత విషయంలో) మీకుగాని తాము సమర్థించుకునే అవకాశం ఇవ్వకుండా తీర్పుచెప్పడం, శిక్ష విధించడం అన్యాయమని మీరనుకోవడంలేదా?

జ. దానిగురించి మరో అభిప్రాయం ఉండటానికి వీల్లేదు.

ప్ర. తమిళనాడులో అసెంబ్లీ న్యాయవ్యవస్థ పనివిధానంలో జోక్యం చేసుకుంటుందనీ, పత్రికా స్వాతంత్ర్యపు నోరు కట్టివేస్తుందనీ ఒక భావం బలపడిపోతుంది. దీని మీద మీ అభిప్రాయం ఏమిటి?


జ. నేను దీనిని అంగీకరిస్తున్నాను. ఇది దుర్భరం పరిణామం. "పత్రికా ప్రపంచం అంతా కలిసి భావంతో 'కోడిఫికేషన్ ఆఫ్ ప్రివిలేజస్' కొరకు పోరాటం సాగించాల్సిన సమయం ఆసన్నమైంది. ఇవాళ్టి రోజున ఎవరిస్థానం ఎక్కడో ఎవరికీ తెలీదు. ప్రతి పాత్రికేయుని పరిస్థితీ హాని పొంద దగినదిగా ఉంది. అతి సాధారణమైన మకుటం (హెడ్‌లైన్) కూడా ఎవరినైనా ఇబ్బందుల్లో పడవేసే అవకాశం లేకపోలేదు.




(ఈ సందర్భంగా శ్రీసుబ్రమనియన్ తమాషాగా ఒక ఉదాహరణ చెప్పారు.)

ఒక వార్తాపత్రిక 'శీతాకాలపు అసెంబ్లీ సమావేశాలు రేపటితో ముగుస్తాయి' అని రాసిందనుకోండి. స్పీకర్ మహాశయులు దాన్లో తప్పు పట్టుకొని 'వాళ్ళెవరు చెప్పడానికి - నేను మాత్రమే ఆ విషయాన్ని ప్రకటించగలవాడ్ని' అని అనవచ్చు.

ప్ర. నిరంకుశపాలన నిరసించదగ్గదే అయినా ఎమ్మెల్యేలను, మంత్రులను జేబుదొంగలుగా, బందిపోట్లుగా పోలుస్తూ కార్టూన్లు వేయడం కూడా నిరసించ దగ్గదే అని కొంత మంది అనుకుంటున్నారు. ఎందువల్లనంటే "పత్రికా స్వాతంత్ర్యం" పేరుతో ఏ ఒక్కరూ కూడా కొంతమంది ప్రజల్ని అప్రతిష్ఠ పాలుచేయడానికి సమ్మతించకూడదు కాబట్టి, దీని గురించి మీరేం చెప్తారు?



జ. అది కేవలం ఒక జోక్ మాత్రమే! తమిళనాడు ఎమ్మెల్యేల మంత్రుల పోలికలు మేం ప్రత్యేకమైన వాతావరణంకానీ, సూచనలుకానీ ఏమీ ఇవ్వలేదే! మామూలుగా, ప్రజాస్వామ్య పద్ధతిలో అధికారంలోకి వచ్చి, లంచగొండులుగా మారి ప్రజలకు ద్రోహం చేసే రాజకీయ నాయకులందరికీ సహజంగా ఈ జోక్ వర్తిస్తుంది. మా ఉద్దేశ్యం ప్రత్యేకించి ఏ ఒక్కర్నీ



> పత్రికా ప్రపంచం ప్రతిసారీ తమ స్వాతంత్ర్యం గురించి నిర్విరామంగా యుద్ధం చేయాల్సి రావడం చాలా దయనీయమైన స్థితి.

అగౌరవ పరచడం కాదు కాబట్టి, ఏ ఒక్క రాజకీయ నాయకుడూ కోపం తెచ్చుకోకూడదు. కానీ ఎవరికైనా ఈ వ్యాఖ్యానం సంపర్కం సరిపోతే మేం చేయగలిగిందేమీ లేదు.

ప్ర. జైల్లో ఎలాంటి ఆదరణ లభించింది?

జ. శ్రేష్ఠమైనదే, పూర్తి సహృద్భావ పూర్వకమైనదే!


ప్ర. దురదృష్టకరమైన అరెస్టును ఒక అవకాశంగా తీసుకుని మీరు జైల్లో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను పరిశీలించి ఉంటారనుకుంటాను?


జ. గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారి "ఉదారత" కారణంగా నాకంత అవకాశం కలిసి రాలేదు!!! 42 గంటల్లోపలే నేను విడుదల చేయబడ్డాను.

ప్ర. అసెంబ్లీ సభ్యుల మనోభావాలను నిజంగా గాయపరిచే అంశం ఆ కార్టూన్‌లో ఏదన్నా ఉందని మీరు వ్యక్తిగతంగా నమ్ముతున్నారా?

జ. నాలో హాస్యాన్ని ఆస్వాదించే గొప్ప గుణం ఉంది. ప్రతిరోజు మా సిబ్బంది నుంచీ, లెక్కలేనంతమంది పాఠకుల నుంచీ అందే కార్టూన్లనుంచీ/రచనల నుంచీ ఎంపిక చేస్తుంటాను. పోతే తరువాత అసెంబ్లీలో జరిగిందాన్నిబట్టి వారు కోపగించుకున్నారని తెలుస్తోంది. ఈ విషయంమీద కలిగిన ప్రతిస్పందనకూ, చైతన్యానికీ నేను గొప్పగా ఆశ్చర్య పడిపోయాను.

ప్ర. కొన్ని కార్టూన్లు ఒక వర్గానికి






చెందిన వ్యక్తుల భావాలను దెబ్బ తీస్తాయని మీరనుకున్న సందర్భంలో (ప్రస్తుతం. అసెంబ్లీ సభ్యులను) క్షమార్పణ చెప్పుకోవడం ఒక సంపాదకుని బాధ్యతగా మీరు భావించరా? అలాగయినట్లయితే మీరు క్షమార్పణ చెప్తారా?

జ. అవును. మీతో పూర్తిగా ఏకీభవిస్తున్నాను. ప్రస్తుత విషయంలోకూడా, మా భావాలను గాయపరిచే విధంగా ఉన్న అలాంటి కార్టూన్/జోక్ ఎందుకు ప్రచురించారని నన్ను ఏమాత్రం అడిగినా మరుసటి సంచికలోనే ఒక సంజాయిషీని ప్రచురించి ఉండేవాడ్ని.

అవి ఎమ్మెల్యేలనూ మంత్రులనుగాయపరుస్తాయని మేం ఎన్నడూ అనుకొని ఉండలేదు. ఒకవేళ నేనే ఏ విధంగానైనా వారి భావాలను గాయపరచి వుంటే, నేనందుకు కేవలం విచారిస్తూ; అలాంటి జోక్‌ను ప్రచురించినందుకు పశ్చాత్తాపం ప్రకటిస్తున్నాను. కానీ అసలు మొత్తం ప్రశ్న తలెత్తడానికి కారణం వాళ్ళు నాకు వివరించడానికి అసలు అవకాశం యివ్వకపోవడమే. పైగా శ్రీఘ్రంగా తీర్పునూ చెప్పారు. అవి నిష్పక్షపాతమైన చర్యేనంటారా?

ప్ర. ఈ సందర్భంగా, ఇంకేమైనా మీరు చెప్పడానికి ఇష్టపడతారా?

జ.. తమిళనాడులోని రాజకీయ నాయకులందరికీ - ముఖ్యంగా అధికార పార్టీకి నేను మనవి చేసుకునేది ఒక్కటే - ఇంకొంచెం మంచి మేలైన సెన్సాఫ్ హ్యూమర్ కలిగి ఉండమని. ●



సూర్యదేవర రామ్‌మోహన్‌రావు


నేడునాకు సెలవయింది సోదరులార,

నా కిప్పుడు వీడ్కోలివ్వండి.

మీ అందరికి నా నమస్సుమాంజలులు

అందిస్తూ శెలవు తీసుకుంటున్నాను.

ఇవిగో నా సామ్రాజ్యపు తాళపు చెవులు తిరిగి యిచ్చివేస్తున్నాను.
నేను ఇకపై ఈ ఇంటిని బంధించి ఉంచను.
ఈ ఇంటి సర్వాధి కారాలు వదిలి వేస్తున్నాను.





నేనో నియంతను - దుర్మార్గుణ్ని - సర్వంసహా - అధికారాలను నా సింహాసనం క్రింద తొక్కి పట్టి ఉంచు కున్నాను. కాని, ఒకే ఒక్క ఓటమి నన్ను విగత జీవిని చేసింది.

ఈ ఓటమిని నేను భరించలేను. ఓటమి అంటే నాకు అసహ్యం.

ఓటమిఅంటే నాకు అయిష్టం... అదే ఓటమి అంటే ప్రేమకూడా ఉంది. నేను మీకర్థంకాను. ఎవరికీ అర్థం కాను. ఒకే ఒక్కరికి తప్ప.

ఆ ఒక్కరూ అర్థం కానట్లే నటిస్తున్నారు.

అందుకే విసిగిపోయాను. ప్రొద్దు ఏటవాలి పోనున్నది.

నా ప్రయాణానికి నేను సిద్ధంగా ఉన్నాను. వారి ఆహ్వాన పత్రిక నేను వదిలేసిన నా గడపముందు ఎదురు చూస్తోంది.

వస్తాను - మిత్రులారా - వస్తాను. నాలాంటివారికి చరిత్ర ఎప్పుడూ ఒకేసిరా, ఒకే వాక్యాన్ని, అవే అక్షరాల్ని ఉపయోగిస్తుంది.

వస్తాను మరి!

* * * *

మిట్టమధ్యాహ్నం....ఎండ నిప్పులు చెరుగుతోంది. రోహిణికార్తె వడగాడ్పులు ప్రాణాల్ని రెపరెపలాడిస్తోంది. అయినా అలాగే తలొంచుకుని తవ్వుతూనే ఉన్నాడు. అతను - అతని తాత.

కృష్ణానది ఒడ్డున పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన అమరావతి, విహారయాత్రా స్థలంగా నిలదొక్కుకునే ప్రయత్నంలో ఎందరో మంత్రుల మంచాలక్రింద ఫైళ్ళలో నిద్రపోతోంది.

ఆ అమరావతిలో టూరిస్ట్ ఎట్రాక్షన్ అమర లింగేశ్వర స్వామి గుడి! ఆ గుడికి రెండు కిలోమీటర్ల దూరంలో వజ్రాల కట్ట ఒకటుంది. ఆ కట్టనానుకొని రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు పేర కట్టిన డిగ్రీ కాలేజీ. ఎడారిలో ఒయాసిస్‌లా కనిపించినా అదిమాత్రం కాదు.

గుంటూరుజిల్లా రాజకీయాలు ఆ కాలేజీస్టాఫ్ మెదళ్ళలో రూపుదిద్దుకుంటాయట.

వజ్రాలకట్ట విషయానికొస్తే అప్పట్లో ధాన్యకటకాన్ని రాజధానిని చేసుకొని (ఇప్పుడు ధరణికోటగా పిలవ బడుతోంది) రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ఏలుతూ ఉండేవాడట.

అతని ఖజానాలో కోట్లాది ధనరాసులు, వజ్ర వైఢూర్యాలు, మరక మాణిక్యాలు, బంగారం మూలుగుతూ ఉండేవట.

ఈ వార్త పరమ కర్కోటకుడైనా నిజాం నవాబు దృష్టికి వచ్చిందట. ఏదో ఒక కారణాన్ని అడ్డం పెట్టుకొని ఆ ధనరాసుల్ని కొల్లగొట్టేందుకు నవాబు దండయాత్రకు బయలు దేరాడట. సైన్యం వరద ప్రవాహంలా ధాన్యకటకంపై విరుచుకు పడేందుకు బయలు దేరింది.

జిహ్వాకో రుచిసార్ :

ఆఫీసర్‌ని డిన్నర్‌కి తీసుకొస్తానని చెప్పిన రంగారెడ్డి ఆఫీసర్ లేకుండానే ఇంటికి చేరుకునే సరికి వాళ్ళావిడ గడపలోనే నిలేసింది "ఏడీ మీ బాసు.?"

"అహ్హహ్హహ్హహ్హా -" అంటూ నవ్వాడు రంగారెడ్డి "అసల్సంగతేమిటంటే - అలా చెప్తే నువ్ మాంచి రుచికరమయిన వంటకాలు చేస్తావని అబద్ధం చెప్పాను -"

"ఈహిహిహిహి -" అందతని భార్య. "మీబాస్ నిజంగానే వస్తున్నడనుకుని హోటల్నుంచి కారియర్ తెప్పించాను."

ఆ జర్నలిస్ట్‌ని పిలిపించాడు "చాలా అద్భుతమయిన వార్త తయరు చేశావ్! ఇంతకూ నీకు మేము ఎంత జీతం ఇస్తున్నాం?" అడిగాడతను. ఆ ప్రశ్న కోసమే ఎదురుచూస్తున్న జర్నలిస్ట్ వెంటనే సమధానం చెప్పాడు "నెలకు నాలుగొందలు సార్ -" "ఓ నాలుగొందలా! ఫెంటాస్టిక్! మంచి జీతం" అన్నాడు ఎడిటర్ ఆనందంగా.

ఈ వార్త వేగులద్వారా నాయుడికి చేరిందట. అప్పట్లో రాజులు తన ప్రజ మాన ప్రాణాలకన్న సొమ్మునే అధికంగా ప్రేమించేవారు! (ఇప్పుడూ అంతే).

వెంటనే తన అంతరంగికుల్ని, మంత్రి మండల్ని సమావేశపర్చి ధనరాసుల్ని, రహస్య స్థలాల్లో పాతిపెట్టమని ఆజ్ఞలు జారీ చేశాడు.

సేనానిని పిలిచి యుద్ధానికి సిద్ధం కమ్మని హెచ్చరించాడట.

ఆ అపార ధనరాసుల్ని ఎవరికి తోచిన విధంగా వారు వాటిని వివిధ ప్రాంతాల్లో పాతిపెట్టారట.

అలా పాతిపెట్టిన వాటిల్లో వజ్రాలకట్ట ఒకటి. ఒకచోట పొడవునా వజ్రాలు చల్లి దానిపై ఒక కట్టలా మన్ను త్రవ్విపోసారట. (ఇప్పటికీ ధరణికోట ప్రాంతంలో అప్పుడప్పుడు వ్యవసాయదారులు పొలం పనులు చేసుకొనేప్పుడు బంగారు నాణేలు, నగలు పెట్టెలు బయట పడుతుంటాయి.)

అదిగో అలాంటి ప్రాంతంపై ఇబ్రహీంఖాన్ దృష్టి పడింది.

ఆ మరుక్షణం ఆ ప్రాంతంలో ఓ పది ఎకరాల్ని అక్రమంగా సొంతం చేసుకొని పురావస్తుశాఖవారి దృష్టికి రాకుండా తవ్వకాలు మొదలు పెట్టించాడు.

అప్పటికి త్రవ్వకం పనులు మొదలై వారం రోజులు.

రోజూ ఓ పందమంది కూలీలు ప్రొద్దుటే రెండు రొట్టెలు తిని పలుగు, పార చేతుల్లోకి తీసుకొని ఇబ్రహింఖాన్ వ్యాన్‌లో ఆ ప్రాంతానికి వస్తారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు త్రవ్వుతూనే ఉంటారు. ఒంటిగంటనుంచి రెండున్నర వరకు రెస్ట్ తీసుకొని మరలా రెండున్నరనుంచి ఐదున్నర వరకూ-అంటే పొద్దు ఏటవాలేవరకు

త్రవ్వుతూనే ఉంటారు.

కాలేజీ గంట కొట్టారు. పనిలో నిమగ్నమయివున్న కూలీలు పని ఆపేసి కబుర్లలో పడ్డారు.

కాలేజీ బెల్ 4.30 కి మోగుతుంది. ఇక అప్పటినుంచే తమ బసకు చేరుకొనే ఆలోచనల్లో పడతారు కూలీలు.

కాని రుద్రయ్య అతని తాత గోవిందయ్య మాత్రం ఐదున్నర వరకు అలా త్రవ్వుతూనే ఉంటారు. గోవిందయ్య చెమటలు కక్కుతూనే పలుగు వేస్తున్నాడు. అతని చెమట బిందువులు ఒక్కొక్కటి వచ్చి క్రింద వంగొని పారపని చేస్తున్న రుద్రయ్య వీపుమీద పడుతూన్నాయి.

"తాతా..." రుద్రయ్య పని చేస్తూనే పిలిచాడు.

ఆ మాట గోవిందయ్య చెవిన పడలేదు. రుద్రయ్య ఓసారి తలెత్తి చూసి "తాతా" అన్నాడు మరలా.


ఏం అన్నట్టు తలెగుర వేసాడు గోవిందయ్య.

"ఇది ఎవరి భూమోకదా ... ఖాన్‌గారు ఎలా సొంతం చేసుకున్నారు...?"

గోవిందయ్య ఉలిక్కి పడ్డాడు ఓ క్షణం. భయంగా చుట్టుపక్కలకు చూసి అక్కడెవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పినట్టుగా ఊపిరి తీసుకొని "అలాంటి మాటలు పెద్దగా అనకూడదు, వాడో మాయల ఫకీరు. వాడి దగ్గరెన్నో మాయలుంటాయి. ఆ మాయలతో ఈ భూమిని మాయం చేసుంటాడు..." గోవిందయ్య భయం భయంగానే అన్నాడు.

ఆయనకు తెలుసు తన మనవడు ఎంత మొండివాడో-ఒక ప్రశ్న వేసాడంటే దానికి సరైన సమాధానం వచ్చేవరకు నిద్రపోడు - అన్నం తినడని. అందుకే ఇష్టం లేకపోయినా గొణుగుతున్నట్టు చెప్పాడు.

పారతో బలంగా దెబ్బవేస్తూ మట్టిని గుంటి అవతలకు విసురుతున్నాడు



రుద్రయ్యా. "హు... వీడిలో ఈ బలం ఎన్నాళ్ళుంటుంది? ఇలాగే ఈ బండచాకిరి చేస్తూపోతే పాతికేండ్లకే వీడు ముసలివాడయి పోతాడు, ఇరవై యేండ్ల వయస్సులో, మిసమిసలాడే యౌవ్వనంలో పరవళ్ళు తొక్కుతున్న వీడిలోని ఆలోచనలు, ఆవేశం ఎక్కడికి దారి తీస్తాయో?"

"తాతా..." మరలా పిల్చాడు రుద్రయ్య. ఏం అన్నట్లు చూసాడు గోవిందయ్య.

"ఈ కట్టనెందుకు త్రవ్వుతున్నాం మనం?" గోవిందయ్య సమాధానం చెప్పలేదు. ఆలోచిస్తూ పలుగు వేస్తున్నాడు.

సమాధానంకోసం ఎదురు చూడకుండానే తిరిగి పార వెయ్యటంలో మునిగి పోయాడు రుద్రయ్య.

సాయం చీకట్లో ముసురు కుంటున్నాయి, కూలీలంతా సాయంత్రం తమను తీసుకెళ్ళటానికొచ్చే వ్యాన్ కోసం ఎదురు చూస్తూన్నారు ఓ చోట చేరి.

గోవిందయ్య ఓ సారి పరిసరాల్ని పరికించి చూసాడు. కాలేజీ లైట్లు అప్పుడే వెలిగాయి - పలుగు పైకి తీసి దాని మట్టంతా దులిపి భుజాన పెట్టు కున్నాడు.

ముసలి శరీరం ఆ పలుగు బరువుకే వంగి పోతున్నట్లుగా ఉంది. వయోభారం అతన్ని అణువణువునా వెనక్కి లాగుతోంది. శక్తికి మించి పని చేసిన అలసట అతన్ని కృంగదీస్తోంది. ఓ నిమిషం ఆ గోతి ప్రక్కనే నిస్త్రాణంగా కూల బడి పోయాడు.

తాత పరిస్థితిని కనిపెట్టిన రుద్రయ్య తోలు తిత్తిలో నిగిలి పోయిన ఆఖరి నీటి చుక్కల్ని గోవిందయ్య బట్టతలపై కుమ్మరించాడు.

గోవిందయ్య ఆత్రంగా ఆ నీటిని ముఖానికి పూలుముకున్నాడు. ప్రాణం కాస్త కుదుట పడ్డట్టయింది.

విచారంగా మనవడి వేపు చూసాడు.

నూనూగు మీసాల వయస్సులో, బలిష్టంగా ఆరోగ్యంగా కనిపిస్తున్న మనవడ్ని చూడగానే తన కూతురు గుర్తుకు వచ్చింది. రుద్రయ్యలో తన కూతురు పోలికలే. కేవలం పోలికలేకాదు ఆదే పౌరుషం, పట్టుదల పుణికి పుచ్చుకున్నాడు.


వీడి తరువాత పుట్టిన మరో మగ, ఆడ - పసితనంలో పోరాడుతున్నారు.

తన జీవితమెలాగూ శిధిలమై పోయింది. ఈ శిధిలాలయం వీడికి, వీడి తమ్ముడు, చెల్లెలికి కాస్తంత ఆశ్రయం కల్గించ గలిగితే చాలు. వాళ్ళు చేతికొచ్చేదాకా తను బ్రతికితే చాలు. ఆలోచనలనుంచి తేలుకొని ఓక్షణం నిట్టూర్చి మనవడి అసరాతో లేచి నిలబడ్డాడు.

ఇద్దరూ కట్టదిగువ భాగానికి నెమ్మదిగా కదులుతున్నారు.

రుద్రయ్యకూడా ఆలోచనల్లో ఉన్నాడు.

తామెందుకు ఇంత కష్టపడాలి? ఆ ఖాన్‌గాడు ఎక్కడో దర్జాగా ఎం...



కూర్చోవాలి....? ఆలోచనల్లో వుండి అడుగు వేగంగా పడక వెనకబడిపోయాడు.

కట్టమీదనుంచి దిగువకు ఏర్పరచిన కాలి బాటను తప్పిపోయాడు.

పరధ్యానంలో అలా నడుస్తూనే మైదానం లాంటి పొలంలోకి వెళ్ళిపోయాడు

వ్యాన్ నిలబడేస్థలానికి చేరుకున్న గోవిందయ్య మనవడి కోసం వెనుతిరిగి చూసాడు.

రుద్రయ్య కనిపించలేదు. అప్పటికి చీకటి బాగా పర్చుకుంది. చూపు బాగా అనటం లేదు.

కూలీలందరూ బీడీ దమ్ము కొడుతూ కబుర్లలో పడి పోయారు.

వ్యాన్ ఇంకా రాలేదు.

"ఎక్కడో ట్రబులిచ్చి ఉండాలి" ఒక కూలీ అన్నాడు.

"ట్రబులా... గిబులా... ఆ గుడ్డోడు ఎక్కడో ఆపేసి మందు కొడుతుంటాడు" మరోకూలీ అన్నాడు.

ఇవేవి గోవిందయ్య చెవిన బడడం లేదు.

తను పోత్తే ఈ రుద్రయ్య ఒక్కడూ తన తమ్ముడ్ని, చెల్లెల్ని సాకగలడా? పైకి తీసుకురాగలడా? తన కూతురుకి తనిచ్చిన మాట నెరవేరుతుందా? ఈ ఆలోచనలే గోవిందయ్యను చుట్టు ముట్టాయి.

మేస్త్రీ కూలీల్ని లెక్క పెట్టుకుంటున్నాడు మధ్యమధ్యలో నోటికొచ్చిన బూతులు కూస్తూ.

ఈ మేస్త్రీ హైదరాబాద్ ప్రాంతంలో ఒకపేరు మోసిన గూండా. ఖాన్‌కి కుడి భుజం. నోటి దురుసు ఎక్కువ. సరదాగా మాట్లాడుతూ మాట్లాడుతూనే చాకు బయటకు తీసి ఎదుటనున్న వాడ్ని కసుక్కున పొడిచి పారేస్తాడు. ఇతని క్రింద షుమారు నాలుగు వందల కుటుంబాలు బతుకుతుంటాయి, వీళ్ళంతా ఈ మేస్త్రీ క్రింద ఉంటే, ఈ మేస్త్రీ ఖాన్ క్రిందుంటాడు.

అలాంటి నరరూప రాక్షసుడ్ని ఈ వంద మంది కూలీల మీద అజమాయిషి కోసం నియమించాడు ఖాన్.

మేస్త్రీకి తెలిసి తెలిసి ఎవరూ మాట వరుసక్కూడా ఎదురు తిరగరు, ఒక సారి అనుకోకుండా రుద్రయ్య ఎదురు తిరిగాడు. ఆ రోజుతో రుద్రయ్యకు నూకలు చెల్లి పోయాయనుకున్నారు. కాని గోవిందయ్య వచ్చి మేస్త్రీ కాళ్ళమీద పడి ప్రాధేయపడి బతిమిలాడటంతో కాస్త శాంతించాడు.

అప్పటి నుంచి రుద్రయ్య మనస్సులో మేస్త్రీ కదలాడుతునే ఉన్నాడు, ఎప్పటికైనా వాడ్ని దెబ్బతీసికాని శాంతించను అని అనుకుంటుంటాడు కసిగా మనసులోనే.

సమయం రాత్రి ఏడుగంటలు. చీకట్లో రోడ్డు పక్కనున్న పాటి దిబ్బలపై 99 మంది కూలీలు ఆకలితో మాడిపోతూ, కోపంగా వ్యాన్ కోసం ఎదురు చూస్తున్నారు.

మేస్త్రీ అక్కడేవున్న ఓ బండమీద కూర్చుని నాటు సారా తిత్తి చివర నోట్లో ఉంచుకున్నాడు. అందరూ ఆశగా రోడ్ వేపు చూస్తున్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు తిన్న రాగి సంకటి పనిలోకి దిగిన రెండు గంటలకే అరిగిపోయింది. అప్పటినుంచి మొదలయ్యే ఆకలికి అందరూ అలవాటు పడితే రుద్రయ్యమాత్రం అవేశ పడుతుంటాడు. దాన్ని ఎప్పటికప్పుడు గోవిందయ్య పేదవాడికోపం అన్నిటికీ చేటు అని నమ్మదింపజేస్తుంటాడు.

కాని రుద్రయ్య అప్పటికి శాంతించినట్లే శాంతించి తరువాత ఆవేశంగా ఆలోచిస్తాడు - ఖాన్ గురించి, మేస్త్రీ గురించి.

రుద్రయ్యలో ఆకలి ఎక్కువయినకొద్దీ ఆలోచనలు ఎక్కువవుతాయి - పదును దేరతాయి.

గోవిందయ్య ఆందోళనగా ఎదురుచూస్తున్నాడు రుద్రయ్య ఏమయ్యాడని.

గంట తర్వాత తన కుడికాలి బొటన వేలికి, బలంగా తగిలిన దెబ్బకు స్పృహలోకి వచ్చాడు రుద్రయ్య.

అబ్బా ... అంటూ అక్కడే ఆగిపోయి పట్టలేని ఆవేశంతో ఎడంకాలితో విసురుగా నేలను తన్నాడు. బలమైన వస్తువేదో గట్టిగా తగిలింది రుద్రయ్య కాలికి.

క్రిందకు వంగి కోపంగా చీకట్లో కళ్ళు చిట్లించుకుని చూసాడు.

స్పష్టంగా అదేమిటో తెలియక పోయినా గతరాత్రి వర్షానికి బయటపడ్డ చెక్కపేటులా అనిపించింది.

రుద్రయ్య ఆవేశం ఎలాంటిదంటే ఆ చెక్కపెడును భూమినుంచి బయటకు లాగి కాల్చి దాని బూడిదను నీళ్ళలో వేసుకుని త్రాగేటంతటిది.

ఇదే ఆవేశాన్ని గోవిందయ్య తన కూతురిలో చూసేవాడు.

కూతురు బ్రతికుండగా తన పెద్దకొడుకు రుద్రయ్యతో అంటుండేది -

"పౌరుషం, పట్టుదల, లక్ష్యశుద్ధి లేని మగాడైనా, ఆడదైనా వాళ్ళ జన్మ నిరర్థకం కన్నా" అని రోజూ రుద్రయ్యకు అన్నం ముద్దలతోపాటు ఈ రకపు హితోపదేశం చేసేది.

ఆ సమయంలో గోవిందయ్య ఓక్షణం ఒణికిపోయేవాడు - ఎందుకు వీడ్నిలా తయారు చేస్తోందని.

ఆమెలో ఎందుకంత ఆవేశం ప్రోదివేసుకుందో తెలియనివాడేంకాదు గోవిందయ్య.

రుద్రయ్య వంగి చేత్తో దాన్ని తట్టి చూసాడు. చెక్కమూల బయటకు వచ్చి ఉంది. రెండు చేతులతో దాన్ని కదిలించే ప్రయత్నం చేశాడు. ఫలితం కనిపించ లేదు. అంగుళంకూడా అది కదలలేదు.

రుద్రయ్యలో అంతకంతకూ ఆవేశం పెరిగిపోతోంది. మరోసారి బలంగా లాగి చూశాడు. ఏమాత్రం కదలలేదు.

పళ్ళు పటపట కొరుకుతూ పారపైకెత్తాడు ఆ చీకట్లోనే - అంతలోనే దూరంగా తాత కేక వినిపించింది.

అటు తిరిగి చూసాడు ఓవారి, దూరంగా, చీకట్లో రెండు లైట్స్ కనిపిస్తున్నాయి.

వ్యాన్ వచ్చేసి ఉంటుంది.


ఇంకో క్షణం ఆలస్యం చేస్తే ఆ మేస్త్రీ అనవసరంగా తన మీద రుసరుసలాడతాడు. అసలే తనంటే కోపంగా ఉన్నాడు.

ఆ స్థలాన్ని గుర్తు పెట్టుకునేందుకు నలువేపులా ఓ సారి పరికించి చూసాడు. దగ్గర్లో ఒక తాటి చెట్టు కనిపించింది అస్పష్టంగా.

దాన్ని మనసులో గుర్తు పెట్టుకొని, పార భుజాన వేసుకొని వ్యాన్ వేపు పరుగు లంకించు కొన్నాడు.

రాత్రి 8 గంటలకు వ్యాన్ ఓ పాత పెంకుటింటి ముందాగింది.

స్నానాలు చేయటం కూడా మర్చిపోయి వంటింటి ముందు గుమికూడారు అంతా.



గోవిందయ్య మనవడి కోసం చూసాడు. ఎక్కడా కనిపించలేదు. పెరటి వేపుకు వెళ్ళి చూసాడు. దూరంగా ఓ రాయి దగ్గర కూర్చొని పలుగుకు పదును పెడుతున్నాడు.

పిచ్చివెధవకు ఆకలికూడా తెలియదు. తను వేసే దెబ్బలు బలహీనంగావుండి భూమిలోకి లోతుగా దిగకంలేదుగాని, పదును లేకనా? అని మనవడికి తనమీదున్న ప్రేమను తలుచుకుంటున్నాడేగాని, తన మనవడి జీవితాన్ని మలుపు త్రిప్పనున్న ఓ గడ్డపార పోటు గురించి అతనికెలా తెలుస్తుంది?

రాత్రి 12 గంటలు సమయం. కూలీలంతా ఒళ్ళు మరచి నిద్రపోతున్నారు. మేస్త్రీ, వంటవాడు, డ్రైవర్ బాగా తాగి నేలమీదే ఒరిగిపోయారు.

రుద్రయ్య అందరితోపాటే పడుకున్నాడుగాని నిద్ర పోలేదు. కళ్ళు తెరుచుకొని పై కప్పుకేసి చూస్తూ ఆలోచిస్తున్నాడు.

దూరంగా గుడిగంట మ్రోగిన శబ్దం విని ఉలికిపాటుగా లేచి కూర్చున్నాడు రుద్రయ్య. నిద్రపోతున్న అందర్నీ పరికించి చూసాడు.

పిల్లిలా నడుస్తూ ఎవరన్నా ఇంకా మేలుకొని ఉన్నారేమో అని వారి మీదకు వంగి చిటికెలు వేసి చూసాడు. అందరూ గాఢ నిద్రలో ఉన్నారని నమ్మకం చిక్కగానే మేస్త్రీ, డ్రైవర్, వంటవాడు పడుకున్న గదిలోకి వచ్చాడు.

ముగ్గురివి గురకలు వినిపిస్తున్నాయి. పక్కనే ఉన్న ఒక ఇత్తడి చెంబు విసిరి నేలకేసి కొట్టాడు.

వారిలో ఏ మాత్రం కదలిక లేదు. పూర్తి నమ్మకం చిక్కాక పడిపడిగా బయటకు వచ్చి వ్యాన్ ఎక్కి ఇగ్నిషన్‌కి వైర్స్ వేరుచేసి బ్యాటరీ వైరుకి కలిపాడు. ఇంజన్ స్టార్ట్ అయింది.

మరొక్కసారి సీటులోంచి బయటకు తొంగి చూసి లైట్స్ వేయకుండానే రోడ్ ఏ వేపు ఉందో ఊహించుకొని వ్యాన్‌ని ముందుకు దూకించాడు.

క్షణాల్లో అది రోడ్డెక్కింది.

రుద్రయ్య చేతిలో గేర్లు చకచకా మారిపోతున్నాయి.

స్పీడో మీటర్ యాభై దగ్గర ఊగిసలాడుతోంది.

నిర్మానుష్యంగా ఉన్న సన్నని తారురోడ్డుమీద వ్యాన్ క్రోసూరు వేపు దూసుకుపోతోంది.

మధ్యమధ్యలో సీటుకి ఆనించుకున్న పలుగు, పారని పడిపోకుండా చూసుకుంటూన్నాడు.

రుద్రయ్య డ్రైవింగ్ నేర్చుకున్నట్లు, ఎంతో అనుభవం ఉన్న డ్రైవర్‌కన్నా వేగంగా వ్యాన్‌ని తోలగలడని గోవిందయ్య ఊహకే అందని విషయం.

అప్పుడప్పుడు బీడీలకోసం, సినిమాలకోసం తాత తనకిచ్చే చిల్లర డబ్బుల్ని వ్యాన్ డ్రైవర్‌ని త్రాగించటానికి ఉపయోగిస్తూ రాత్రిళ్ళు డ్రైవింగ్ నేర్చుకుంటున్నట్లు రుద్రయ్యకూడా తన తాతకు తెలియనివ్వలేదు.

వ్యాన్ అరవై కిలోమీటర్ల స్పీడ్ దాటిపోయింది. ఆ స్పీడ్‌కి అది తట్టుకోలేక ఊగిపోతోంది. అయినా రుద్రయ్య వేగం తగ్గించలేదు. ఎవరో ఒకరు లేచేలోపే తన పని పూర్తి చేసుకు రావాలని రుద్రయ్య పట్టుదల.

కరక్టుగా అర్ధరాత్రి 12-20కి వ్యాన్ వజ్రాల కట్టదగ్గరకు చేరుకుంది. ఇంజన్ ఆఫ్‌చేసి, పలుగు పార చేతుల్లోకి తీసుకొని ఠెంగున వ్యాన్‌లోంచి బయటకు దూకాడు రుద్రయ్య.

చీకట్లోనే పడిపడిగా నడుస్తూ, తను గుర్తుపెట్టుకున్న స్థలాన్ని సూచించే తాటిచెట్టుకోసం పిటపక్కలా నలువేపులా చూస్తున్నాడు. నడకలో వేగంమాత్రం తగ్గలేదు.

ప్రకృతిని శాసించే మంత్రగాడిలా ఆ నిశీధిలో ముందుకు దూసుకు పోతున్నాడు.


పది నిమిషాలకు ఆ స్థలాన్ని గుర్తుపట్టి అక్కడే ఆగిపోయాడు.

చీకట్లోనే గురిచూసి పలుగు పైకిలేపి ఒక్క పోటు వేసాడు. శబ్దం విచిత్రంగా వచ్చి రుద్రయ్య ఒకింత ఆశ్చర్య పోయాడు.

క్రిందకు వంగి, జేబులోంచి తాతదగ్గర దొంగిలించిన అగ్గిపెట్టె తీసి ఒక పుల్ల వెలిగించాడు.

ఆ వెలుతురులో కనిపించిన వస్తువును చూసి రుద్రయ్య తృళ్ళిపడ్డాడు. తను చూస్తున్నది నిజమేనా? రుద్రయ్యలో ఏదో అనుమానం పొడచూపింది. మరో అగ్గిపుల్ల .... మరో అగ్గిపుల్ల .... అలా గీస్తూనే పోతున్నాడు. గీసిన అగ్గిపుల్లలు చుట్టుపక్కల చెల్లాచెదురుగా పడ్డాయి.

వరుసగా ముప్పై పుల్లలు గీసాక తన అనుమానం నిజమని నిర్ధారించుకున్నాడు.



ఆ చీకట్లోనే కళ్ళు చిట్లించి నలువేపులా చూసి ఎవరూ లేరని ఊపిరి పీల్చుకున్నాడు.

తను చూస్తున్నది నిజమని ఇంకా నమ్మలేక పోతున్నాడు.

ఉద్విగ్నతతో అతని రక్తం ఉరకలు వేస్తూంది. పలుగు బలంగా లేపి గురి చూసి ఒక్క పోటు వేశాడు ... మరోపోటు ... మరోపోటు ... ఆ వస్తువు చుట్టూ వున్న నేలను పలుగు చీల్చివేస్తోంది.

రెండు నిమిషాల తర్వాత పలుగు అవతల పడేసి, పార చేతిలోకి తీసుకున్నాడు. క్షణాల్లో మట్టి గుట్ట ఏర్పడింది. పక్కనే.

ఇకా వస్తువు కదులుతుందన్న నమ్మకం కుదిరాక పారకూడా పక్కన పడేసి మోకాళ్ళ మీద ముందుకు వంగాడు.

రెండు చేతులతో ఆ వస్తువును గట్టిగా పట్టుకొని బలంగా లాగాడు. అంతే భూమిని పెకిలించుకొని ఓ పురాతన కాలపు చెక్కపెట్టె బయటకు వచ్చింది.

దాన్ని ప్రక్కనే పెట్టి మరో అగ్గిపుల్ల వెలిగించాడు. చీకటిలో అస్పష్టంగా మసిబారి కొట్టుకుపోయి కనిపించిన ఆ చెక్కపెట్టెపైన నగిషీలు ఉబ్బెత్తుగా కనిపించాయి.

మరో పుల్ల వెలిగించాడు.


క్షణ క్షణానికీ రుద్రయ్యలో టెన్షన్ పెరిగిపోతోంది. అదేమయి ఉంటుంది?

ఆ పెట్టె మూత తెరవటానికి ప్రయత్నిస్తుండగా దూరంగా ... సుదూరంగా ఓ చావుకేక వినిపించింది.


ఒక్కసారి షాక్ అయ్యాడు రుద్రయ్య.

ఆ కేక తనొచ్చిన ప్లాన్‌లోంచని గ్రహించలేక పోయాడు రుద్రయ్య.


(సశేషం)




కంప్యూటర్ టీజింగ్



బహుమతి పొందిన ప్రశ్న:
అంకం సత్యప్రసాద్ బండారులంక
ప్ర మంత్రులు కుంగ్ ఫూ, కరాటే, జూడో నేర్చుకుంటే?
జ స్నేక్స్ ఇన్ ది మంకీస్ షాడో



బహుమతి పొందిన ప్రశ్న:
బి.వి. దుర్గాదేవి శ్రీకాకుళం
ప్ర పరిస్థితి ఉద్రిక్తంగా వున్నప్పటికి, ప్రశాంతంగావుంది ... అంటే అర్థం ఏమిటి?"
జ మీకు పెళ్ళయితే తెలుస్తుంది



బహుమతి పొందిన ప్రశ్న:
ఎస్.హెచ్.ఎస్. సాగర్ తెనాలి
ప్ర ఆడది అర్ధరాత్రి ఒంటరిగ తిరిగిన నాడే నిజమయిన స్వతంత్రం అన్నారు. అర్ధరాత్రులు ఆడది ఒంటరిగ తిరగాల్సిన అవసరం ఏమిటి?
జ మరునాటి రోజు లంచ్ కోసం



బహుమతి పొందిన ప్రశ్న:
గరిగ నర్సయ్య రామకృష్ణపూర్
ప్ర శోభనం రోజు పెళ్ళికూతురు పాల గ్లాసుతో వస్తుందెందుకు?
జ ఇంకో గ్లాసుతో వస్తే అభాసు "పాలు" అవుతుందని



బహుమతి పొందిన ప్రశ్న:-

కాజ హనిత ఏలూరు

ప్ర బూడిద వలన ఉపయోగం?

జ వారసుడికివ్వొచ్చు



గరిగ నర్సయ్య రామకృష్ణపూర్

ప్ర పెళ్ళి కాని అమ్మాయిని ఏమి అడగకూడదు?

జ గరిగ నర్సయ్య నీకు తెలుసా అని అడక్కూడదు

ప్ర మన దేశానికి అమెరికాకు తేడా?

జ బూడిదలో క్లీన్‌నెస్

ప్ర మనిషికిదేంమీద నమ్మకం పోయింది?

జ వద్దు సంసార పత్రికలో మనం ఇలాంటివి మాట్లాడుకోకూడదు

మురళీ ప్రత్తిపాడు

ప్ర "ఎంతోమంది మేధావులు మాలో ఉండగా కేవలం ఒక కంప్యూటర్ మా ప్రశ్నలకు సమాధానాలివ్వడం మా దీనస్థితి" అని నీ అభిప్రాయమా? నీఇష్టంవచ్చినట్లుసమాధానమిస్తున్నావ్


జ థాంక్స్ మురళీ ఇన్నాళ్ళకి నాకో మేధావి తగిలాడనిపించావ్

ప్ర "మన ముఖ్యమంత్రిగారు ఒకసభలో ఏదో అనేసి ఇంకోచోట నేను అలా అనలేదంటారేం?"

జ అనలేదనరు (అనుకో) లేదంటారు

బొబ్బిలి శ్రీనివాసరావు ద్రాక్షరామ

ప్ర దేశంలోని ప్రజలంతా గాంధీలయితే?



జ (విమల్) రెలియన్స్ కంపెనీ మూత పడుతుంది

ప్ర స్త్రీకి ప్రియమైనది ....?

జ మీకు విలువైనది

ప్ర డబ్బుకి విలువ లేకపోవడానికి కారణం?

జ ఇలాంటి ప్రశ్నలకై పదిహేను పైసలు ఖర్చు పెట్టడం

కె. కాయిలీల నందివెలుగు

ప్ర రాజకీయ నాయకునికి 'పదవి' పై ఎప్పుడు విరక్తి పుడుతుంది!?

జ కుర్చీ కదిలినప్పుడు

ప్ర మనరాష్ట్ర ప్రస్తుత భాష...!?

జ తిట్టు కవిత్వం

జి.హగా ఖమ్మం

ప్ర జీవితానికి అర్థం తెలిసేది ఏ వయసులో?

జ మన వయసులోనే గొప్ప హెడ్ వెస్టాఫ్ లక్

పానకాలరాము గుంటూరు

ప్ర కంప్యూటర్ నీకు మిక్కిలి ఇష్టమైనదేది?

జ ఊహూ నువ్వుకాదు

జి. రమేశ్‌బాబు ప్రత్తిపాడు

ప్ర అసలు బడుగు వర్గాలంటే ఎవరండీ?

జ క్రింద వుండేవారు

కె. ప్రకాష్ తాపుపూడి

ప్ర 'మందు' కు గూడా రేషన్ పెడితే?

జ వద్దండి తోసుకు వదండి ముందుకు



జె.ఏడుకొండలు నందివెలుగు

ప్ర అదృష్టానికి ... దురదృష్టానికి మధ్య దూరం ...?

జ మీకు బహుమతి రాక పోవటం

అందే రామలక్ష్మీదేవి కొత్తగూడెం

ప్ర సంతృప్తి లేకపోతే ....?

జ జనాభా పెరుగుదల

డి.యన్.కె ప్రసాదరావు అనకాపల్లి

ప్ర రూపాయి జీతంతో పని చేయాలి అని ఉంది ఎలా?

జ వంటికి బూడిద రాసుకుని

బి. సత్యనారాయణ నందివెలుగు

ప్ర దేశమంటే మనుషులోయ్.... మరి మనుషులంటే .... ?

జ ఫెయిర్ ఫాక్సులోయ్

కె.యస్.మాచన్న పాళ్ళనూతి

ప్ర పెళ్ళిచూపు లెందుకు?

జ చూపుల్లో క్రోమోజోమ్స్ వుండవు కాబట్టి

కిషోర్‌కుమర్ సూళ్ళూరుపేట

ప్ర ఆడవాళ్ళు గోళ్ళు ఎందుకు పెంచుతారు?

జ మనకు తెలిసిన వాటి గురించి ఎందుకు బ్రదర్ టైమ్‌వేస్టు


ఎన్నికైన ఉత్తమ ప్రశ్నలకు బహుమతిగా ఈ క్రింది పుస్తకాలలో మీరు కోరుకున్నది ఇవ్వబడుతుంది. మీకు కావలసిన పుస్తకం పేరు మీ అడ్రస్ కార్డు వెనుక వ్రాయడం మరచిపోకండి-ఎడిటర్.

డబ్బు డబ్బు		యండమూరి వీరేంద్రనాథ్
యుగాంతం		"
రాక్షసుడు		"
రాధ-కుంతి		"
హ్యూమరాలజీ	(మూడుభాగాల్లో ఏదైనా)	యర్రంశెట్టి శాయి
రైల్వే జంక్షన్		"
నవ్వూ నవ్వించుము	(మూడు భాగాల్లో ఏదైనా)	"

మా అమ్మకు పెళ్ళికాలేదు

ఏ.వి. శేషారత్నం

రాష్ట్రస్థాయి బాలల చిత్రకళా ప్రదర్శన జరుగుతోంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ పారిశ్రామిక వేత్త సతీమణి మృణాళినీదేవి కాళ్ళు ఆ చిత్రం దగ్గర సంకెళ్లు వేసినట్టు ఆగి



పోయాయి.

"అదొక చెత్తకుండి. కుండీలో చెత్త నిండిపోయాక మిగిలిపోయిన కాగితాలు గుడ్డ పీలికలు గాజు పెంకుముక్కలు చెల్లాచెదురుగా కుండీ చుట్టూ చెదర చేదరగా ఉన్నాయి. ప్రక్కనే పెంటకుప్పలమురిక్కాలన యమునా నదిలా పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తోంది.


చెత్తకుండీ ప్రక్కనే పడివున్న ఎంగిలాకుల మీద ఓ చిన్నమానవ ప్రాణి కదుల్తూ కొట్టుకుంటోంది. బొడ్డుతాడు చుట్టూ రక్తం మరకలు. ఈగలు దోమలు మహానందంగా ఆ చంటిబిడ్డమీద పడి విందు చేసుకుంటున్నాయి. ఉండీ ఉడిగీ క్యార్ క్యార్‌మంటున్నట్టు చిన్నగా తెరచిన నోరు.

పుట్టగానే తల్లి ఒడి వెచ్చదనానికి దూరమైన ఆ పసిగుడ్డు ఈ పాపపు లోకాన్ని చూడడం ఇష్టం లేదన్నట్టు నిద్రపోతున్నట్టు కళ్ళుమూసుకునేవుంది." ఆ పసిముఖంలో - రంగుల కలయికతో కదిలిన కుంచె - అసహ్యాన్ని కొట్టొచ్చినట్టు చిత్రీకరించింది.

అదే చిత్రంలో దూరంగా చీకటిలో - బరువు దింపుకున్న నిశ్చింతలో భవిష్యత్తుకు సోపానాలు నిర్మించుకుంటూ వడివడిగా తలదించుకుని కప్పుకున్న ముసుగుతో ఓ పడచి దాలెంత నడచి పోతోంది. చిత్రం పేరు 'మాతృప్రేమ -'

మరోచిత్రంలో అప్పుడే పుట్టిన పిల్లల్ని రక్షించుకుంటూ వాటిచుట్టూ గాభరాగా తిరుగుతున్న నల్లకుక్క కడుపులోని పచ్చి పేగులు తెగిపడేలా మొరుగుతోంది.

ఆ భావగర్భితమైన చిత్రాలు ఆమె కడుపులోని పేగుల్ని మెలితిప్పినంత బాధించాయి. ఏకసీ విరియని బాలలు



వేసిన చిత్రమేనా ఇది?

'ఈ చిత్రాలు ఎవరివి?' అతి మెత్త దిగా ప్రశ్నించిందామె.

"శివకుమార్ అని ఈ పదిహేనేళ్ళ బాబు వేసినవి మేడమ్! వయసుకు మించిన తెలివి తేటలున్నాయి."

శివకుమార్ ఆమెకు వినయంగా నమస్కరించాడు. ఒక్కక్షణం ఆ కుర్రాడిని చూడగానే విచిత్రమైన స్పందన కలిగింది మృణాళినీదేవిలో. వెంటనే సర్దుకుంటూ మృదువుగా అడిగింది.

'ఇంత చిన్న వయసులో ఇంతటి భావాన్ని ప్రస్ఫుటింపచేసే చిత్రాలు ఎలా వెయ్యగలిగావు?"

శివకుమార్ మృదువుగా నవ్వి - "మీ అభిమానం మేడమ్" అన్నాడు.

ఇంకా పసితనం పోని లేత చెక్కిళ్ళు చురుకైన కళ్ళు-ఆ కళ్ళలో ఏదో ఆర్తి, ఆవేదన - చెప్పలేని నిరాశ ద్యోతక మవుతున్నాయి.

"ఏం చదువుతున్నావ్ బాబూ?"

చెప్పాడు.

"మీ అమ్మా నాన్న....?"

"మా అమ్మకు పెళ్ళి కాలేదు."- శివ కుమార్ కంఠంలో రవంత కాఠిన్యం తొంగి చూసింది ఎందుకో-

గతుక్కుమందామె.

అక్కడున్న వాలంటీర్ సర్ది చెబుతున్నట్టుగా అన్నాడు.

"శివకుమార్ శ్రీకృష్ణ అనాధాశ్రమ బాలుడు మేడమ్. చదువులో, చిత్రలేఖనంలో అన్నింటా చాల చురుకైనవాడు. ఇతని 'కడుపుతీపి' చిత్రానికి అమెచ్యూర్ ఫస్ట్ ప్రయిజ్ వచ్చింది. ఇదిగో ఆ చిత్రం కూడా ఇక్కడ ప్రదర్శిస్తున్నాం"

మృణాళినీదేవి చెవులు వింటున్నా మనస్సక్కడ లేదు. ఆమె కళ్ళు 'కడుపు తీపి" చిత్రాన్ని చూసి పాలిపోయినట్టయ్యాయి.

కుంతీకన్య బాలకర్ణుడిని తొట్టెలోపెట్టి నీళ్ళలో వదులుతున్న చిత్రమది.

శివకుమార్‌వైపు చూసిందామె. ఏదో చూస్తున్నాడు. మాతృప్రేమకి నోచుకోని అనాథ బాలుడి ఊహాచిత్రాన్ని తదేకంగా చూసి ముందుకు కదిలిందామె.

• • •

పరుపుమీద దొర్లుతున్న మృణాళినీదేవికి ఆ రాత్రి నిద్రపట్టలేదు. ఆమె చెంపల మీదుగా కన్నీరు జారి దిండు తడిసిపోతోంది.

'మాతృప్రేమ' 'కడుపుతీపి' చిత్రాలు ఆమెను వెంటాడుతున్నాయి. అవి ఆమె జీవితపు అట్టడుగు పొరల్లోని ఏవో దృశ్యాలను వెలికి తీస్తున్నాయి.

జైన్ స్టేట్స్ వెళ్ళిపోయాడు. తిరిగి వస్తాడోరాడో-వచ్చాక తప్పకుండా పెళ్ళి చేసుకుందాం అన్నాడు. ఈ మూడేళ్ళ కాలం ఎన్ని మార్పుల్ని తెచ్చిపెడుతుందో? అతను అక్కడే ఎవర్నయినా పెళ్ళాడితే?

ప్రేమ గుడ్డిది అన్నారు. గుడ్డిగానే జైన్‌ను నమ్మింది. ఇంకా నమ్ముతూనే వుంది. ప్రకృతి సహజం - ఏమిటి ఆడది నమ్మడమా? అవసరం తీరేదాకా మగవాడు నమ్మించడమా?

పోనీ ఇప్పుడేమయింది? తనకాళ్ళ మీద తను నిలబడగలదు - మరి? కాని తండ్రి పరువు ప్రతిష్టలో? ఈ విషయం ప్రేమమైకంలో చిక్కుకున్న తన కింత



కాలం ఎందుకు గుర్తుకు రాలేదు? అది ప్రకృతి సహజం -

జైన్ స్టేట్స్‌నుంచి వచ్చేదాకా ఎదురు చూడాలి. అతను వచ్చాక కాదంటే?

అంత అభిమానం లేని ఆడది కాదు తను - అతన్ని దెబ్బకొట్టేలా మరో బిగ్ షాక్‌ను వెయ్యాలనుకుంది.

కాని?

సహజ ప్రకృతి- ప్రకృతి సహజంగా తన కడుపులో ఏదో కదలిక-తన గుండె వేగంగా కొట్టుకుంది. తన అనుమానం నిజమయితే?

నిజమయింది. తను తల్లి కాబోతోంది. అంతవరకు అనుకున్నవన్నీ మరచి జైన్‌కు - ఎన్నో వేలమైళ్ళ దూరాన ఉన్న జైన్‌కు అనుమానిస్తూనే లెటర్ వ్రాసింది.

అనుమానం నిజమే - జైన్‌నుంచి ఉత్తరం రాలేదు. ఇకముందు రాదుకూడ. ఆ ఎదురు చూడడంలో ఆలస్యమయింది.

నెత్తీనోరు కొట్టుకుంటూనే తల్లీదండ్రీ 'ఆరోగ్యం' నెపంతో దూరప్రాంతానికి తీసుకుపోయారు. తొమ్మిది నెలల పాప భారం భూమ్మీద పడింది.

కళ్ళు విప్పేసరికి కన్నబిడ్డ కనిపించలేదు. 'ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉంచారు' అన్నాడు తండ్రి.


కన్నబిడ్డమీద మమకారం పొంగులెత్తుతోంది. ఇంకా నెల్లాళ్ళదాకా బిడ్డను చూపించరట. శూన్యదృక్కులతో నర్సింగ్‌హోం విండోనుంచి చూస్తున్న తన కంటిముందొక హృదయవిదారక దృశ్యం.

చెత్తకుండీ చుట్టూ ఉన్న ఎంగిలాకుల మీద ఒక పసిబిడ్డ దిక్కులు పిక్కటిల్లేలా ఏడుస్తోంది.

తన మనసు కలుక్కుమంది.

చెదలు పట్టిన మానవత్వాన్ని
చూడలేక సూర్యుడు మబ్బుల చాటున
హం మొదామకుంటున్నాడు -
గాఢంగా నిట్టూర్పింది చెత్తకుండీ-
తనకీ పాపపు లోకంనుంచి త్వరగా
విముక్తి కలిగించమని అర్థిస్తున్నట్టు
అరవిచ్చుకున్న కళ్ళ మీద ఖల్లి చేతులు-

పొంపొంకెట్టు తెస్తున్న పల్ల కాబోలు కెవ్వున అరచి విసురుగా పరిగెత్తింది.



అంతే పది నిమిషాల్లో పెద్ద గుంపు పోగయింది.

'ఏ పాపిష్టి దానికి ఒళ్లుకొవ్వెక్కిందో'

'అంత ఇష్టం లేనిది ఏ అబార్షనో చేయించుకోక బిడ్డను కనడం దేనికో -'

'ఏ అనాథ శరణాలయంలోనో వదిలేసి పారిపోవచ్చుగా -'

"ఈ కాలం పిల్లలు పెళ్ళికి ముందే 'స్వేచ్ఛ' అంటూ బరితెగించి పోతున్నారు. నిన్ను గాఢంగా ప్రేమించానన్న మగాడు పెళ్ళి ప్రసక్తి వచ్చేసరికి ఉడాయించి వుంటాడు. ఆడపిల్ల ఏంచేస్తుంది? భవిష్యత్తు పాడు చేసుకోలేక ఇటు బిడ్డను చంపలేక ఎంత బాధ పడిందో -"

'ఆ బాధా గాడిద గుడ్డా - బిడ్డను కన్న మహాతల్లిని నా ఇంటి ముంగిలే - ఈ చెత్తకుండీయే కావల్సి వచ్చిందా పాపిష్టిది.'

'ఇంకా పసిబిడ్డ బ్రతకడులెండి, మురికాల్వ ప్రక్కన ఎన్ని గంటల నుంచి పడివున్నాడో.'

'ప్రాణం ఉందేమో చూసి ఏ అనాథ శరణాలయానికో అప్పగిస్తేనో?'

'ఆ ఎందుకొచ్చిన లంపటం? ఈ మధ్య ఇలాంటి కేసు లెక్కువయి వాళ్ళకీ విసుగెత్తినట్టుంది. పుణ్యానికి పోతే పాప మెదురయిందని మొన్నొకాయన ఇలాగే రైల్లో దొరికిన పిల్లను అప్పగించిపోతే ఈ పిల్ల నీ కూతురు కాదని ఋజువేమిటి అన్నారట -' నానా అవస్థా పడ్డాడా పెద్ద మనిషి.'


'నేనే అప్పగిద్దును. కాని నాయింట్లో పెళ్ళి కావలసిన ముగ్గురు ఆడపిల్లలున్నారని -'

"బొమ్మ బొమ్మలా ఉన్నాడు బిడ్డ. మీకు పిల్లల్లేరుగా అమ్మగారూ పెంచుకోకూడదూ?"

"పెంచుకోడానికి ఈ పాపపుముద్దే కావాలా? నువ్వు మళ్ళీ పనిలో కొచ్చావంటే కాళ్ళు విరగ్గొడతాను."

తన మనసు కకావికలయిపోయింది. మరీ అంత నిర్దాక్షిణ్యంగా ఆ తల్లి అలా చెత్తకుండీకి బిడ్డను బలి ఇవ్వడం చూసి ఆపుకోలేని కోపం వచ్చింది. తనేవెళ్ళి ...ఎందుకో ఆగిపోయాయి తనకాళ్ళు.

ఎనిమిది దాటుతున్నా జనం చెల్లాచెదురయి పోగవుతున్నారు తప్ప ఒక్కరూ ఆ బిడను తీసుకోలేదు. ఆ బొందిలో



ప్రాణం లేనట్టు కదలిక ఆగిపోయింది. కళ్ళుతెరవని పసిగుడ్డు కళ్ళు చుట్టూ - బొట్టుపెట్టూ దోమలు, ఈగలు.

తన కళ్ళవెంబడి నీళ్ళు ధారాపాతంగా కారిపోతున్నాయి. చూడలేక మంచంమీద వాలిపోయింది. మరో గంట పోయాక తండ్రి కంగారు పడుతూ వచ్చి త్వరగా ప్రయాణం కమ్మన్నాడు.

'మరి బాబు' తన గొంతులో ఆత్రం తల్లి తల వంచుకుంది. 'బాబుకి ఇన్ఫెక్షన్ వచ్చిందమ్మా! డాక్టర్ శాయశక్తులా ప్రయత్నించారు. కాని ఫలితం లేకపోయింది.'

బావురుమంది తను.

'పెంటమీద సంటోడిని లెక్కల పంతులమ్మ తీసికెళ్ళిందంట. ఆ శాంతమ్మకి పెళ్ళి కాలేదుగదా ఈ బిడ్డనేంచేసుకుంటుందో' - తన మనసు అంత బాధలోనూ రవంత శాంతించింది. లోకంలో మానవత్వం ఇంకా గొడ్డుపోలేదన్నమాట.

కానీ వెళ్లాక్క తర్వాత పాపం బద్దలయింది. తల్లీదండ్రీ దెబ్బలాటలో తన గుండె పగిలే రహస్యం బయట పడింది.

ఆనాడు చెత్తకుండీ దగ్గర జనం అన్న మాటలన్నీ సూదిగా బాణాల్లా తన గుండెలను నాటుకున్నాయి. వాళ్ళంతా శపిస్తున్నట్టు, ఆ శాపాగ్నిలో తను కాలిపోతున్నట్టు -

పసిబిడ్డ అనికూడ చూడకుండా తన కన్నకూతురు భవిష్యత్తుకోసం తల్లీదండ్రీ తన బిడ్డ భవిష్యత్తుని నాశనం చేసారు.


తల్లీదండ్రికి తెలియకుండా శాంత లెక్కల టీచర్ అన్న పేరుతో ఆ సుదూర ప్రాంతంలోని అన్ని హైస్కూల్స్‌కీ ఉత్తరాలు వ్రాసింది. కానీ జవాబులేదు.

ఇంట్లో తానొక విధంగా బందీగా బ్రతికింది.

విధి ఎంత చిత్రమైనదో-మూడేళ్ళలో ఎన్ని మార్పులో! తిరిగి వచ్చిన జైన్ తనని పెళ్ళిచేసుకున్నాడు. తను ఊళ్ళో లేని తొమ్మిది నెలల్లో ఎన్నో ఉత్తరాలు వ్రాసాడట. ఏదీ తనకందనే లేదు. కాదు అందనిచ్చి ఉండరు.

కానీ జైన్ అంత పెద్ద హోదాతో తిరిగివచ్చి తనను పెళ్ళి చేస్తుకుంటానంటే తండ్రి కాదనలేదు.

పెళ్ళికిముందు తనని నోరు విప్పనీయలేదు తల్లీదండ్రీ. పెళ్ళయ్యాక బావురు



పస్తు తనని జైన్ ఓదార్చాడు.

"ఆరోక పీడకల అనుకో మృణాళినీ! నీ ఉత్తరం నాకు చేరివుంటే ఇంత జరగక పోను. బాబు చనిపోయివుంటాడు. నీకా విషయం తెలియజేయడం ఇష్టంలేక శాంతగారు వ్రాసి ఉండరు. పోనీ - జరిగించేదో జరిగింది. మనకి బిడ్డలే పుట్టక పోతారా?"

కానీ చెత్తకుండీ ప్రక్కన దారుణ హింస బడిన పసిబిడ్డ శాపం - తనకి తగిలింది. తన కడుపు పండలేదు. మాతృత్వానికి శాపం -

ఎన్నో అనాధాశ్రమాలకి విరాళాలిచ్చింది. విద్యా సంస్థలకీ ప్రదానం అతి గౌరవ సూచకంగా తన చేతుల మీదే జరుగుతుంది. కానీ -

శివకుమార్ కళ్ళముందు మెదిలాడు. అతని కళ్ళలో ఆకోపం, నిర్వేదం, నిరాశ - ఆవేదన? ఆ చిత్రాల్లో ఒక రకమైన కసి, ఆర్తి -

అతడే తన బాబు అయితే? తనబాబు అనాధాశ్రమానికెందుకు వెళ్ళాడు? శాంతాదేవి పెంచలేక ఇచ్చేసిందా? పెళ్ళికాని తల్లిగా చిరకాలం బ్రతకడానికెవరు ఇష్టపడతారు?

ఒకసారి శ్రీకృష్ణ అనాధాశ్రమానికి వెళ్తే?

• * •

అధునాతనమైన కారు శ్రీకృష్ణ అనాధాశ్రమం ముందాగింది. పిల్లలు బిలబిల మూగారు. మృణాళినీదేవి జైన్ ఆశ్రమాధికారి ముందు నిలిచారు.

దాదాపు ఒక గంట తర్వాత - శివకుమార్ ఆశ్రమాధికారిచే పిలిపించబడ్డాడు. మృణాళినీ దేవివైపు కళ్ళెత్తి చూసాడు.

ఆమెకళ్ళు నిర్జీవంగా ఉన్నాయి. ప్రపంచంలోని దైన్యమంతా ఆమెలో మూర్తీభవించి వుంది. ఏక్షణాన్నయినా ఆమె అతడిని చేతులుచాచి గుండెల్లో దాచుకోవాలనేలా వుంది.

"శివా! నువ్వు చాల అదృష్టవంతుడివి. అమ్మకోసం నీ నిరీక్షణ ఫలించిరది. వీరు నీ కన్న తల్లిదండ్రులు. నిన్ను పెంచుకుంటారు. ఇక మీదట నువ్వు వీళ్ళ దగ్గరే ఉండొచ్చు"

'బాబూ! శివా!' యుగయుగాల మాతృమూర్తి పిలుపు అది. కాని శివకుమార్ అంగుళంకూడ కదల్లేదు.

"కాని మా అమ్మ శానిటోరియంలో కేన్సర్‌తో చనిపోయిందికదూసర్!"

"శాంతగారు నిన్ను పెంచిన తల్లే. చనిపోయేముందు నీ వివరాలు మాకుఇచ్చి నిన్ను ఆశ్రమానికి అప్పజెప్పారు. అవన్నీ అమ్మగారు చెప్తారులే శివా!"

శివకుమార్ మృణాళినీదేవివైపు తీక్షణంగా చూసాడు. అది గ్రహించిన జైన్ సానునయంగా అన్నాడు.

"పరిస్థితుల ప్రభావంవల్ల అనాధవయ్యావుగానీ నువ్వు..."

"ఆగండిసర్. మీరిప్పుడు నన్ను పెంచుకోడానికి తీసుకెళ్తున్నారా లేక కన్న కొడుకుగా లోకానికి పరిచయం చేస్తారా?"

'శివా! ఏమిటామాటలు?' ఆశ్రమాధికారి కంగారుగా అన్నాడు.

"అదికాదుబాబూ!..." మృణాళినీదేవి, జైన్ ఒకేసారి అన్నారు.

"ఏదికాదు. మీకుబిడ్డల్లేని కారణంగా ఒక అనాధ బాలుడిని మీరు పెంచుకుని లోకం చేత జేజేలు చెప్పించుకుందామనుకుంటున్నారు. అంతేగాని పదహారేళ్ళ క్రితం మీరు పాపపు మూటగా నన్ను పారేసడం...ఆ చరిత్ర అంతా చెప్పుకోలేరు. ఎందుకు? మీరు సంఘంలో పరువు ప్రతిష్టలున్నవారు కనుక."

ఒక్క అడుగు ముందుకు వెయ్యబోయింది మృణాళినీదేవి. "ఆగండమ్మా" ఈసారి శివకంఠం స్థిరంగా ఉంది ఆజ్ఞాపిస్తున్నట్టు.

"ఒకనాడు నన్ను కనేందుకు మీకు పరువు అడ్డం వచ్చింది. ఈనాడు కన్న బిడ్డగా చెప్పుకునేందుకూ అదే పరువు అడ్డుపడుతుంది. క్షమించండి మీ కారు ఆగగానే నేనిరూందగ్గర కొచ్చాను. మీ మాటలన్నీ విన్నాను. చెత్తకుండీ దగ్గర పడివున్న నా ప్రాణం కాపాడేందుకు శాంతాదేవి తన పరువును ప్రక్కకు నెట్టింది. మానవత్వం కోసం తన ప్రతిష్టను ధారపోసింది. నా భవిష్యత్తుకోసం తన పెళ్ళిని త్యాగం చేసింది. 'నాన్న ఎవరమ్మా' అన్న నా తెలిసీ తెలియని ప్రశ్నకు, తను నిలువునా కృంగిపోయింది. లోకం చేత 'పతిత' అన్న ముద్ర వేయించుకుంది. క్షమించండమ్మా! నేను మీవెంట రాలేను. మా అమ్మకు పెళ్ళి కాలేదు. నాకంతవరకే జ్ఞాపకం. ఏస్వార్థం లేని ఆమె మా అమ్మ. శాంతాదేవి మా అమ్మ అని చాలా గర్వంగా చెప్పుకుంటాను" - ధీమాగా తలెత్తి నడచిపోతున్న శివకుమార్‌లో వెయ్యిమంది కర్ణులు కనిపించారు మృణాళినీ దేవికి. కుంతీదేవి అంత నిబ్బరంలేని ఆమె మరుక్షణం కుప్పగా కూలిపోయింది. •••

అందమైన చిరునామా

హైద్రాబాద్‌లోని ఓ మల్టీస్టోరేడ్ భవంతి గోడ మీద ఇలారాసి ఉంది.

"ఎనిమిదో అంతస్తులో బట్టారేసే అందమయిని అమ్మాయి పేరు రాధిక. ఇంకా పెళ్ళి కాలేదు"

యర్రంశెట్టిశాయి

హ్యూమరాలజీ-52

హఠాత్తుగా కేకలు నవ్వుల శబ్దాలు వినిపించే సరికి నిద్రమెలకువ వచ్చేసింది నాకు. కళ్ళు నులుముకుంటూ బయటి కొచ్చి చూసేసరికి కాలనీ మధ్యలో రెండు పొడగాటి బస్‌లు నిలబడి ఉన్నాయ్! పిల్లా పెద్దా అందరూ బస్సుల్లో ఎక్కి కూర్చుంటున్నారు. అప్పుడు గుర్తుకొచ్చింది నాకు. నెలరోజుల క్రితం కాలనీలో ఓ మీటింగ్ పెట్టారు. కాలనీ వాళ్ళందరం కలిసి సమాజానికి ఉపయోగపడే కార్యక్రమం ఏదయినా నిర్వహిస్తే బావుంటుందని మా వాళ్ళ కోరిక. అయితే ఏంచేస్తే బావుంటుందా అనేదిమాత్రం ఎవరికీ తెలీలేదు.

"తాగుబోతులను సంస్కరిస్తే మంచిది" అంది జనార్థన్ భార్య. కానీ గోపాల్రావ్ ఆమె మాటలు కొట్టి పారేశాడు. ఎంత కష్టపడి సంస్కరించినా, వదిలేసిన రెండోరోజు ఎవరూ చూడకుండా మళ్ళీ మందు కొట్టేస్తారనీ అంచేత అది టైమ్ వేస్టనీ వాదించాడు.

"పోనీ వరకట్నాలకు వ్యతిరేకంగా ఉద్యమం లేవతీద్దాం!" అంది సావిత్రమ్మ. ఆమె ఇద్దరు కూతుళ్ళు పెళ్ళీడుకొచ్చారు. కానీ ఆ ప్రపోజల్ వినగానే మీటింగ్‌లో ఉన్న సగం మంది లేచి బయటకు నడవబోయారు. వాళ్ళందరికీ పెళ్ళీడుకొచ్చిన కొడుకులున్నారన్న విషయం మాకు తెలీటంవల్ల దానిని వెంటనే ఉపసంహరించుకున్నాము.

"సిగరెట్ తాగేవాళ్ళతో ఆ అలవాటు మానిపిద్దాం!" అంది సాయిరామ్ భార్య. మగాళ్ళందరం తీవ్రమయిన అభ్యంతరం తెలియజేశాము.

"సిగరెట్ రేట్లు పెంచి మెల్లగా ప్రభుత్వమే ఆ అలవాటు మానిపిస్తోందికదా - మళ్ళా ఇంకా మనకెందుకు" అంటూ పక్కదారి పట్టించబోయాడు రంగారెడ్డి.

కానీ ఈసారి ఆడాళ్ళంతా ఏకమయిపోయారు. "వీల్లేదు-మా ఆయన నెలకూ రెండొందల పాతిక వేస్ట్ చేస్తున్నాడు సిగరెట్స్‌మీద" అంది శ్రీలక్ష్మి. మరికొంతమందికూడా ఎవరి భర్తలు సిగరెట్లకింద ఎంత ఖర్చు చేస్తోందీ ఎకౌంట్స్ చూపించారు. "ఏమయినా సరే సిగరెట్స్ మాన్పించే కార్యక్రమమే చేపట్టాలి" అన్నారందరూ ముక్తకంఠంతో.

మాకేం చేయాలో అర్థం కాలేదు, ఏదో సమాజసేవ చేద్దామనుకుంటే మోజు పడేవాళ్ళను సంస్కరించాలి-" అన్నాడు గోపాల్రావ్ వాళ్ళను మరింతగా తప్పుదోవ పట్టిస్తూ.

దాంతో గొడవ పెద్దదయిపోయింది. ఇప్పుడు అయిదారు గ్రూపులేర్పడ్డాయ్. వాళ్ళల్లోనే. ఆ హడావుడిలో సిగరెట్ల సంగతి పక్కకెళ్ళిపోయింది.

"పోనీ వితంతు వివాహాలు చేయిస్తే ఎలా వుంటుంది?" అడిగాడు గోపాల్రావ్. దాంతో వాళ్ళావిడ మండిపడుతూ లేచి నిలబడింది.

"చాల్చాలెండి! అలాంటి పనులు మీరేం చేయనక్కర్లేదు. 'ఎవరి సంగతి వాళ్ళు చూసుకుంటారు?" అంది కోపంగా

పెళ్ళిళ్ల నాగరికత!

అది అటూ ఇటూ తిరిగి ఇలా రివర్స్ కొట్టిందేమిటా అని చిరాకు కలిగింది. ఆ సూచనను పక్కకు నెట్టాలంటే ముందు ఆడాళ్ళందరినీ ఒకటిగా మాట్లాడకుండా రెండుమూడు గ్రూపులుగా చీల్చాలని ప్లాన్ వేశాము అప్పటి కప్పుడే.

"ఆడాళ్ళ సినిమాలెక్కువ చూసే దురలవాటు కూడా మాన్పిద్దాం!" అన్నాడు రంగారెడ్డి. దాంతో మేము ఊహించినట్లే కలవరం చెలరేగింది.

-ఆడాళ్ళలోనే రెండు గ్రూపులేర్పడి నయ్.

"సినిమాలు పెద్ద దురలవాటేముందనీ; దాని బదులు చీరలమీద పిచ్చి అని చుట్టుపక్కలున్న ఆడాళ్ళ! ఎవరో ఏదో చెప్పింది. దాంతో అందరూ ఆ ప్రపోజల్ వద్దని కేకలు వేసి రద్దు చేయించేశారు.

అసలు సంగతేమిటంటే గోపాల్రావ్ ఈమధ్య వాళ్ళ న్యూస్‌పేపర్ 'ఈక్షణం' ఆఫీసులో ఓ వితంతువు జర్నలిస్టుతో కొంచెం చనువుగా ప్రవర్తిస్తున్నాడన్న విషయం అతని భార్య చెవిన పడింది.

ఇలా చాలారకాల కార్యక్రమాల గురించి ఆలోచించటం, అంతలోనే మా వాళ్ళనుంచే దానికి వ్యతిరేకత రావటంతో ఎటూ తేలని పరిస్థితి ఏర్పడింది.

హఠాత్తుగా మా రంగారెడ్డికి అద్భుత

గృహమేకదాన్వర్గసీమ

అడబాల వీరాస్వామి హైద్రాబాదొచ్చి వాళ్ళ దూరపు బంధువుల ఇంట్లో దిగాడు. భోజనాలయ్యాక అతనికి అతిథి గది చూపించారు ఇంటి వాళ్ళు.

గదిలో కెళ్ళి డ్రస్ మార్చుకుని మంచం మీద నడుము వాల్చాడో లేదో ఎదురుగ్గా గోడమీద స్టిక్కర్ కనిపించిందతనికి. "స్వంతిల్లే కదా మనిషికి స్వర్గసీమ" అని రాసి ఉంది దాని మీద.

మయిన అయిడియా వచ్చింది. అతనికి అద్భుతమయిన అయిడియా వచ్చిందన టానికి గుర్తేమిటంటే అతని మొఖంతో హఠాత్తుగా రెండొందల కాండిల్స్ బల్బ్ వెలిగినంత వెల్తురు వస్తుంది.

వెంటనే మాతోకూడా సంప్రదించ కుండా వేదిక మీదకు పరుగెత్తాడు.

"సైలెన్స్! సైలెన్స్! సోదర సోదరీ మణులారా! నాకో మాంచి అయిడియా వచ్చింది. అదేమిటంటే మనందరం వెంటనే అడవుల్లోకెళ్ళి అక్కడున్న అడవి జాతుల వాళ్ళను సంస్కరించి వారిని కూడా ఆధునిక ప్రపంచంలోకి తీసుకొద్దాం! దీనివల్ల మనందరం కొత్త పరిసరాల్లోకి వెళ్ళినట్లూ ఉంటుంది. మరో పక్క పాపం - ఆ అభాగ్యులకు మన ఉన్నల నాగరికత నేర్పినట్లూ ఉంటుంది. ఏమంటారు?" అన్నాడు గర్వంగా.

కొద్దిక్షణాలు నిశ్శబ్దంగా ఊరుకున్నాక ఒక్కసారిగా చప్పట్లు మార్మోగిపోయాయ్.

'వండర్‌ఫుల్ అయిడియా' అన్నాడు శాయిరామ్.

"థ్రిల్లింగ్" అంది పార్వతీదేవి.


మొత్తంమీద ఆడామగా అందరికీ ఆ అయిడియా ఎంతో బాగా నచ్చింది.

ఆ తర్వాత అంతా చకచక జరిగిపోయింది. అందరం కలిసి మన రాష్ట్రంలోని ఓ అడవిలోకెళ్ళి బాగా వెనుకబడిన ఓ అడవిజాతి వాళ్ళను కలుసుకుని. వాళ్ళతో కొద్దిరోజులు గడిపి వాళ్ళకు నాగరికత నేర్పాలనీ నిర్ణయించారందరూ. దానికి కావలసిన ఏర్పాట్లన్నీ చేసేబాధ్యత యాదగిరికి అప్పజెప్పారు. యాదగిరి విజృంభించిన ఉత్సాహంతో మన రాష్ట్రంలోని అడవుల వివరాలూ, వాటిల్లో ఎన్ని అడవి తెగలున్నాయీ, ఆ తెగలన్నిటిలోకీ వెనుకబడిన తెగ ఏదీ అన్నీ సేకరించి దాని ప్రకారం టూర్ ఏర్పాటు చేశాడు. ఆ టూర్‌కోసం రెండు టూరిస్ట్ బస్‌లుకూడా మాట్లాడాడు.

"ఏమిటిలా చూస్తున్నారు? త్వరగా పదండి! మేము రడీ అయిపోయాం-" అంది మా ఆవిడ.

నేను త్వరత్వరగా రడీఅయి బస్ దగ్గరకు చేరుకున్నాను. రెండు బస్సుల్లోనూ అందరూ సర్దుక్కూర్చున్నాక యాదగిరి హడావుడిగా శాయిరామ్‌తో పాటు వచ్చి అందరి పేర్లూ రాసుకోసాగాడు.

"త్వరగా స్టార్ట్ చేయమానవయ్యా-ఇప్పుడు పేర్లెందుకు?" అడిగాడు



గోపాల్రావ్

"యాక్సిడెంట్ గిట్ట అయితే ఎవరు పోయిన్రో ఎవరు మిగిలిన్రో తెల్వాలి గద భాయ్?" అన్నాడతను నవ్వుతూ.

సరిగ్గా ఉదయం తొమ్మిది గంటలకు బయల్దేరినయ్ బస్‌లు! కాలనీలో మిగిలిన వాళ్ళంతా ఇళ్ళ బయట నిలబడి చేతులూపుతూ వీడ్కోలు చెప్పారు మాకు.

మధ్యాహ్నం రెండు గంటల వరకూ ఆగకుండా పరుగెత్తినయ్ బస్‌లు. రెండు గంటలకు మెయిన్‌రోడ్‌మీద ఓ చెట్టుకింద ఆపారు భోజనాల కోసం. అందరికీ రడీమేడ్ భోజనాలు ఏర్పాటు చేశాడు యాదగిరి.

అందరు యాదగిరిని మెచ్చుకోకుండా ఉండలేక పోయారు - అంత చక్కని ఏర్పాట్లు చేశాడతను.

తిరిగి సాయింత్రం మూడుగంటలకు బయల్దేరినయ్ బస్‌లు. నాలుగ్గంటల కల్లా అడవి ప్రాంతంలోకి వచ్చేశాము. గుబురుగా ఉన్న చెట్లమధ్యనుంచి వెళ్తొంటే అందరికీ ఉత్సాహంగా, ఉల్లాసంగాఉంది. బస్‌లో పిల్లలు చాలామంది ఆ చెట్లు చూసి ఆశ్చర్యపోతున్నారు.

"అబ్బ! ఇన్ని చెట్లు ఒకేచోట ఎలా ఉంటాయ్ అసలు!" అడుగుతున్నారు పెద్దాళ్ళను.

"ఎందుకుండవురా! వెధవ చెట్లదేముంది? ఎక్కడ పడితే అక్కడే మొలుస్తాయ్" అని విసుక్కుంటున్నారు పెద్దాళ్ళు.

"అయితే! మరి హైద్రాబాద్‌లో ఏ కాలనీలో ఒక్క చెట్టుకూడా కనిపించదేం?" అడిగారు వాళ్ళు. వాళ్ళ నెత్తిన లాగి కొట్టాడు వాళ్ళ నాన్న.

"నోర్మూసుకుని సీనరీలు చూడండి! వెధవ ప్రశ్నలూ మీరునూ!-తాగటానికి నీళ్ళులేవుగాని కాలనీల్లో చెట్లు-" అన్నాడాయన.

దాంతో పిల్లలు నోర్మూసుకుండిపోయారు.

సాయంత్రం చీకటి పడుతూండగా, ఫారెస్ట్ గెస్ట్ హౌస్ చేరుకున్నాం. ఆ రాత్రి అందరం కొంచెంగా కనబడుతున్న వెన్నెల్లో కూర్చుని భోజనాలు చేశాము, ఆ తరువాత ఆ వెన్నెల్లోనే పడుకోవాలని పక్కలు వేసుకున్నాం. భోజనాలయ్యాక రంగరెడ్డి వాళ్ళ తాత

గారు అడవికి వేటకెళ్ళటం, అక్కడ పెద్దపుల్లిని ఎలా కాల్చి చంపింది అన్నీ కథలు కథలుగా చెప్పటం ప్రారంభిం చాడు. అతని కథలు సగం పూర్తయ్యే సరికి మేము నలుగురమే మిగిలాము. మిగతా వాళ్ళంతా ఎప్పుడు లోపలికి పారిపోయింది మాకే తెలీదు.

"పిరికి వెధవలు!" అన్నాడు రంగారెడ్డి నవ్వుతూ ముసుగు పెట్టుకుంటూ "అవును" అన్నాం మేము - వాళ్ళ పిరికి తనం చూసి నవ్వుకుంటూ.

తమాషా ఏమిటంటే తెల్లారే సరికి మేమంతా గెస్ట్ హౌస్‌లోపల ఉన్నాం.

అయితే ఎవ్వరం ఆ విషయం ప్రస్తా వించలేదు.

ఉదయం అందరం కాఫీ ఫలహారాలు చేసి కాలి నడకన బయలుదేరాం. ఎందు కయినా మంచిదని మాతోపాటు ఫారెస్ట్ గార్డ్‌ని కూడా వెంటపెట్టుకున్నాం.

రాత్రనాను అడవి బాగా చీకటిగా మారి పోతోంది. సూర్యుడి కిరణాలు ఒక్కటి కూడా లోపలకు చొచ్చుకు రావటంలేదు.

హఠాత్తుగా దూరంగా డప్పులమోత వినిపించింది.

"ఆ డప్పుల మోతేమిటి?" అడిగాము ఫారెస్ట్ గార్డ్‌ని.

"ఆ అడవి తెగవు ఇవాళ పండగను కుంటాను. పండగనాడు ఇలాగే డప్పు వాయిస్తారు" అన్నాడతను.

మరికొద్ది సేపట్లో ఆ అడవి తెగ ఉన్న చిన్న ఊరు చేరుకున్నాం. ఆ చెట్ల మధ్యే చిన్న చిన్న గుడిసెలు వేసుకుని ఉన్నారు వాళ్ళు. గుడిసెలను ఆనుకుని ఉన్న పెద్ద గుట్ట పక్కనుంచి ఓ చిన్న సెలయేరు పాములా మెలికలు తిరిగి ప్రవహిస్తోంది.

అందరం ఊళ్ళోకి చేరుకున్నాం. ప్రతి ఇంటిముందూ మేకలు, కోళ్ళు కన బడుతున్నాయి. ఆ ఇళ్ళ మధ్యలో ఉన్న ఖాళీస్థలంలో ఆడా మగా అందరూ కలసి వలయాకారంగా నిలబడి డాన్స్ చేస్తు న్నారు. కొంతమంది కొమ్ములతోనూ, డప్పులతోనూ విచిత్రమయిన ఆర్కెస్ట్రా వాయిస్తున్నారు.

మమ్మల్ని చూసి డాన్స్ ఆపేశారు





వాళ్ళు. వాళ్ళ నాయకుడు లేచి మాకెదురు వచ్చాడు. "ఏం కావాలిమీకు?" అనడి గాడు అడవి భాషలో. అతని మాటల అర్థాన్ని మా ఫారెస్ట్ గార్డ్ సహాయంతో తెలుసుకుని సంభాషణ కొనసాగించాము.

"మేము బాగా వెనకబడి ఉన్న మీ అడవి తెగను నాగరీకులుగా తయారు చేయడానికి వచ్చాము. కొద్దిరోజులు ఇక్కడే ఉండి మిమ్మల్నికూడా పట్న వాసపు ప్రజల్లాగా ఆధునికంగా మార్చే స్తాము" అన్నాడు రంగారెడ్డి.

వాళ్ళ మొఖాల్లో ఆనందం కనిపిం చింది.

"అంటే మేముకూడా మీలాగా అయి పోతామా?" అడిగారు పట్టరాని సంతో షంతో.

"అయిపోతామా ఏమిటి? అయి తీర్తారు!" అన్నాడు శాయిరామ్. అప్పటి కప్పుడే గంటసేపట్లో వాళ్ళు మాకోసం అరడజను గుడిసెలు కట్టేశారు. అందరం నోరు వెళ్ళబెట్టుకుని వాళ్ళపని చూస్తుండి పోయాం!

"గంటసేపట్లో అరడజను గుడిసెలు వేసేయగలిగారా?" మొఖాలు చూసు కున్నాం అందరం.

"ఇదే మన హైదరాబాద్‌లో అయితే ఒక గుడిసె వేయటానికి రెండువేల రూపాయల ఖర్చు, వారంరోజుల టైమూ పడుతుంది -" అన్నాడు గోపాల్రావ్.

అందరం ఆ గుడిసెల్లో ఎడ్జస్ట్ అయి పోయాము.

ముందుగా వాళ్ళు సరయిన బట్టలు ధరించేలా చేయాలని నిర్ణయించుకున్నాం. మా కెదురుగ్గా అర్థనగ్నంగా నిలబడ్డ స్త్రీ పురుషులందరినీ గమనించి, ముందుగా వాళ్ళు శరీరమంతా కవర్ చేసే వస్త్రాలు ధరించేలా చేయాలని అందరం అను కున్నాము.

"మీరు ఇలా అర్థనగ్నంగా ఉండకూడదు. శరీరమంతా బట్టలు ధరించాలి!" అన్నాడు రంగారెడ్డి.

ఆ స్త్రీలు మావేపు ఆశ్చర్యంగా చూశారు. ఫారెస్ట్ గార్డ్ మా ప్రశ్న అర్థం వాళ్ళ భాషలో చెప్పాడు.

"శరీరం బయటకు కనబడితే అది అనాగరికమా?" అనడిగారు వాళ్ళు వాళ్ళ భాషలో.

"అవును-" అన్నాం మేము ధీమాగా.

"మరి మీ వెంబడి వచ్చిన ఆడాళ్ళ దుస్తులు మాకంటె ఘోరంగా ఉన్నాయి కదా! బట్టలున్నా - వాటిల్లోనుండి ఒళ్ళు కనబడుతూనే ఉంది-" అంది వాళ్ళల్లో ఒకామె.

మేము వెనక్కు తిరిగి మా కాలనీ స్త్రీలవేపు చూశాము. అందరి బట్టలూ నిజంగానే ఆ అడవితెగ స్త్రీలకంటె అధ్వాన్నంగా ఉన్నాయ్. బొడ్డుకిందకు చీర కొంతమంది కడితే, ఒళ్ళంతా కన బడే దుస్తులు మరికొంతమంది ధరించారు.

ఆ అడవి భాషను తర్జుమా చేసి చెప్తున్న ఫారెస్ట్‌గార్డ్ మా అవస్థచూసి నవ్వాడు.

"అనుకుంటూంగానండీ! బట్టల విషయంలో మనకంటే వీళ్ళే బెటరండీ! బాగా మందంగానూ, ఎక్కువ శరీరం కవర్ అయేట్టుగానూ వేసుకుంటారు వీళ్ళు" అన్నాడతను.

అందరం మాలోమేము డిస్కస్ చేసుకున్నాక, బట్టల విషయంలో మాకంటె వాళ్ళే నాగరికంగా ఉన్నట్లు ఋజువయింది మాకు. "అందాకా ఎందుకు: మన తెలుగు సినిమాల్లోని నటీమణులను చూస్తే వీళ్ళు వెయ్యిరెట్లు నయం-" అన్నాడు గోపాల్రావ్.

"అవున్నే! బట్టలకు సంబంధించినంత వరకూ మనం వీళ్ళనుచూసి చాలా నేర్చుకోవాల్సి ఉంది-" ఒప్పుకున్నాడు రంగారెడ్డి. మగాళ్ళంతా ఆమాట ఒప్పుకున్నారు గానీ అడాళ్ళల్లో చాలామంది మాకు ఎదురు తిరిగారు. మా మగాళ్ళ మనస్తత్వాలు కుంచించుకు పోయాయని స్టేట్‌మెంటిచ్చారు.

మధ్యలో సాయిరామ్ కల్పించుకుని ఆ టాపిక్‌ని వదిలేయ్యమని అందరికీ సలహా యిచ్చాడు.

అప్పటికే మధ్యాహ్నం భోజనాల సమయం వచ్చేసింది. అంచేత అందరం భోజనాలకు కూర్చున్నాము. యాదగిరి చేసిన ఏర్పాట్ల వల్ల మాతో వచ్చిన వంటవాళ్ళు బహురుచికరమయిన భోజనం తయారు చేశారు.

"మీరు కూడా భోజనం చేయండి-" అంది పార్వతీదేవి - మాచుట్టూ మూగిన అడవి తెగవారితో.


ఆతెగ నాయకుడు మిగతా వారితో ఏదో చెప్పాడు. మరుక్షణంలో మధ్యలో పెద్ద మంట వేశారు. అప్పుడే కొంత మంది పరుగుతో కొన్ని కుందేళ్ళను పట్టుకొచ్చారు. కోళ్ళను కుందేళ్ళను మంటలో


లారీపేజీ


భారతదేశంలోకెల్లా అతి వృద్ధుడయిన వ్యక్తిని న్యూస్ పేపరు వాళ్ళు ఇంటర్‌వ్యూ చేస్తున్నారు.

"తాతగారూ - మరింత ఎక్కువ కాలం బ్రతకటానికి ఏమయినా గొప్ప రహస్యం ఉందా?" అడిగాడు ఒకతను.

"అవును! అదేమిటంటే నేనెప్పుడూ లారీలు పోయే త్రోవలో నడవలేదు -"







కాల్చి సిద్ధంగా పెట్టారు. అందరూ చుట్టు కూర్చుని మద్యం తాగుతూ వాటిని తినటం మొదలు పెట్టారు.

"తాగుడు మంచిది కాదు. మీఆరోగ్యాన్ని పాడు చేస్తుంది –" అంది రాజేశ్వరి వాళ్ళకు నచ్చజెప్పటానికి ప్రయత్నిస్తూ.

"అవును ! మీరు వెంటనే తాగుడు మానేయాలి ! అది చాలా అనాగరికం" అన్నాడు జనార్ధన్.

"తాగుడు వల్ల ఎన్ని నష్టాలున్నామో మీకు తెలీదు. మాకూ తెలీదనుకొండి ! కానీ మాప్రభుత్వం ఎప్పుడూ చెప్తూం టుంది తాగుడు వల్ల కలిగేహాని గురించి" అన్నాడు శాయీరామ్.

"గ్రీన్‌కార్డ్ హోల్డర్సుకి మాత్రం తాగుడు అంతగా హాని చేయదనుకోండి ! అందుకని ప్రభుత్వమే సప్లయ్ మొదలు పెట్టిందీమధ్య" అన్నాడు జనార్థన్.

మా మాటలు విని వాళ్ళంతా ఆశ్చ ర్యపోయారు.

"మాకెప్పుడు హాని కలిగించలేదే!" అన్నాడు వాళ్ళ నాయకుడు. "అదీగాక మేము పండగలకే తాగుతాము. మిగతా రోజుల్లో ఎవ్వరూ తాగరు. ఎవరి పనుల్లో వాళ్ళుంటాము –"

మాకు మరీ ఆశ్చర్యం కలిగించిందా మాట. వాళ్ళు కేవలం పండుగలకే తాగుతారంటే – "అంటే వాళ్ళే తాగుడు విషయంలో మనకంటే ఎక్కువ ప్రగతి సాధించారన్న మాట" అంది అలివేలు.

"అవును ! ఎక్కడిదాకానో ఎందుకు? మన కాలనీలోనే చూడరాదూ ? రోజు రాత్రింబగళ్ళు తాగి పెళ్ళాం బిడ్డలను ఏడిపించుకు తింటున్నారు కొంత మంది". అంది సావిత్రమ్మ అలివేలుకి సపోర్ట్‌గా.

మరి కొద్ది నిమిషాల్లో ఆడాళ్ళంతా కలసి మా మొగాళ్ళను దుయ్య బట్టేయసాగారు.

"నిజంగా ఈ ఆడవిజాతి వాళ్ళు ఇంత డిసిప్లిన్‌గా ఉంటారనుకోలేదు" అంది రాధారాణి.

మేమెవ్వరం మాట్లాడలేదు. ఆ సమయంలో మాట్లాడటంవల్ల చివాట్లు తినటం తప్ప మరో ఉపయోగం లేదని అందరికీ తెలుసు.

మాలో కొంతమంది సరిగ్గా భోజనం చేయలేక పోయారు. కొంతమందిని డాక్టర్ భోజనం చేయవద్దని సలహా ఇచ్చా

డట. మరి కొంతమందికి ఉదయం ఫలహారం అరగలేదన్నారు.

"చాలా తమాషాగా ఉందే! ఆ అడవి వాళ్ళేమో ఉడికీ ఉడకని మాంసం తినేసి ఆరోగ్యంగా ఉన్నారు. మనమేమో అన్ని జాగ్రత్తలూ తీసుకుని అనారోగ్యాలతో ఛస్తున్నాం" అన్నాడు గోపాల్రావ్.

"అంటే దీనర్థం తిండి విషయంలోనూ, తాగుడు విషయంలోనూ వీళ్ళే మనకంటె ఎడ్వాన్స్‌గా ఉన్నారన్న మాట" అన్నాడు రంగారెడ్డి చిరాకుగా.

మా అందరిలోనూ ఓ విధమయిన అశాంతి బయల్దేరింది.

"వీళ్ళనేదో సంస్కరిద్దామని వస్తే ఇదేమిటి?" విసుక్కున్నాడు చంద్రకాంత్.

"ఆ-ఈ ఒకటి రెండు విషయాల్లో ఏముందిలే! పుట్టుకలు, పెళ్ళిళ్ళు, చావులు మూఢాచారాలు, నిరక్షరాస్యత- వీటన్నిటిలోనూ వీళ్ళను సంస్కరించాల్సిందేకదా మనం" అన్నారు జనార్థన్ ఆశగా.

అప్పుడే అడవితెగవాళ్ళు నలుగురు కలసి సెలయేరులోనుంచి సన్నగా ప్రవహిస్తోన్న నీళ్ళను ఓపెద్ద కుండలోకి తోడి తీసుకొచ్చారు. వాళ్ళందరూ ఆ నీళ్ళు తాగబోతూంటే మేమంతా అడ్డుపడ్డాం.

"ఇలా ఏ నీళ్ళుపడితే ఆ నీళ్ళు తాగారంటే ఛస్తారు. నీళ్ళల్లో సూక్ష్మక్రిములుంటాయ్. అందుకని వీటిని కాచి, వడకట్టి తాగాలి-" అంది పార్వతీదేవి గర్వంగా చెప్తూ. వాళ్ళు భయపడిపోయారు. ఆ నీళ్ళవేపు చూసి సూక్ష్మక్రిములకోసం వెతికారుగానీ కనిపించలేదవి. "అవి కనిపించదంత చిన్నవిగా ఉంటాయ్! అందుకని కనబడవ్!" అన్నాను నేను.

"మరి ఇప్పుడు నీళ్ళెలా తాగటం?" అడిగారు వాళ్ళు.

"ఆనీళ్ళు కాచి, వడగొట్టేవరకూ-మా నీళ్ళు తాగండి. మేము బాగా క్లీన్ చేసిన నీళ్ళు తీసుకొచ్చాము-" అన్నాడు రంగారెడ్డి ఆనందంగా. మా నీళ్ళు వాళ్ళకు గ్లాసుల్లో పోస్తూంటే స్పష్టంగా కనిపిస్తున్నయ్ సూక్ష్మ రూపాలతో ఉన్న పురుగులు.

అదీగాకుండా నీళ్ళన్నీ బురద నీళ్ళల్లా ఎర్ర రంగులోకొచ్చేశాయ్.

వాటిని చూస్తూనే అడవి తెగల వాళ్ళు మాకు దూరంగా జరిగి నిలబడ్డారు.

"గాంబా దూంఫ్ దఫేహా" అంటూ అరిచాడు వాళ్ళ నాయకుడు. మేమందరం అతని భాషకు నవ్వుకున్నాం గానీ తీరా వాళ్ళందరూ విల్లంబులు మాకు గురి పెట్టి నిలబడటం కనిపించే సరికి మానవ్వు హఠాత్తుగా ఆగిపోయింది. అందరం భయంగా మొఖాలు చూసుకున్నాం. ఫారెస్ట్ గార్డ్ ఛప్పున జోక్యం చేసుకొని వాళ్ళతో సంభాషణ ప్రారంభించాడు. అయిదు నిమిషాల తరువాత వాళ్ళు విల్లంబులు దించేశారు మళ్ళీ.

సంగతేమిటంటే ఇంతటి మాలిన్యం ఉన్న నీళ్ళను వాళ్ళ తెగ ఆచారం ప్రకారం శత్రువుల కిస్తారట! ఆనీళ్ళు తాగి వాళ్ళు ఛావాలని వాళ్ళ ఉద్దేశ్యమట! కనుక మేము వాళ్ళకు ఆనీళ్ళు ఆఫర్ చేయటం ద్వారా శత్రువులయి పోయామట.

ఫారెస్ట్ గార్డ్ వాళ్ళకు సర్ది చెప్పి



వాళ్ళకోపం తగ్గేలా చేశాడు.

ఆతెగలో ఓపిల్ల పెళ్ళి ఆరాత్రికి జరుగబోతున్నట్లు ఫారెస్ట్ గార్డ్ మాకు తెలియజేశాడు. వాళ్ళ ఆచారం ప్రకారం పెళ్ళి అవ్వాల్సిన అమ్మాయి ఇంటి మీద ఓకోడిని కట్టేస్తారు. తెల్లారే సరికి ఆ ఆకోడిని ఏయువకుడెత్తుకుపోయి వండుకు తింటే వాడిని పట్టుకుని పెళ్ళికూతురుతో సహా ఆఇంటి వారందరూ కలసి చావగొడతారు. ఆ తరువాత అలా చావగొట్టినందుకు పరిహారంగా వాడికే ఆపిల్లనిచ్చి పెళ్ళిచేస్తారట. పెళ్ళవగానే వాళ్ళిద్దరికీ కొత్త గుడిశె వేసి వేరే కాపురం పెట్టించేస్తారట. మేమందరం వాళ్ళ పెళ్ళి పద్ధతులు వింటూనే ఘొల్లున నవ్వాము.

"ఇంత వెనుకబడిన వాళ్ళను సంస్కరించటం మనవల్ల అవుతుందా?" అంటూ సందేహం వెలిబుచ్చాడు రంగారెడ్డి.

నాకు అదే అనుమానంగా ఉందని చెప్పాను నేను.

ఆసాయంత్రం వరకూ వాళ్ళ పెళ్ళి పద్ధతి ఎంత మొరటు పద్ధతో వాళ్ళకు నచ్చ జెప్పటానికి ప్రయత్నించాము గానీ వాళ్ళ బుర్రకు మేము చెప్పింది సరిగ్గా ఎక్కినట్లు కనిపించ లేదు.

వాళ్ళ నాయకుడు కాసేపు ఆలోచించి "మీనాగరికుల పెళ్ళి పద్ధతి ఎలా వుంటుంది?" అంటూ ప్రశ్నించాడు.

అందరం ఉత్సాహంగా ఒకేసారి చెప్పటం మొదలు పెట్టబోయి, ఆపేసి రంగారెడ్డిని చెప్పనిచ్చాం.

"మా పద్ధతి ఎలావుంటుందోతెలుసా? ముందు మాంఛి కుర్రాడిని వెతుకుతాం! ఆకుర్రాడు తల్లిదండ్రులతోనూ, ఫ్రెండ్స్‌తోనూ వచ్చి అమ్మాయిని చూస్తాడు. తరువాత కట్నం గురించి ఒక నిర్ణయానికొచ్చాక పెళ్ళి జరుగుతుంది. పెళ్ళవగానే, అమ్మాయి అత్తారింటికెళ్ళిపోతుంది అక్కడ వాళ్ళంతా కలసి కిరసనాయిలు పోసి ఆఅమ్మాయిని ఛంపేస్తారు"

వాళ్ళు అదిరిపోయారు.

"ఛంపేస్తారా?"

"అవును-"

"ఎందుకు?"

"ఇంకా ఎక్కువ కట్నాలు, కానుకలు తెమ్మంది వేధించి తేకపోతే ఛంపి పారేస్తారు-"

వాళ్ళకు కొద్దిసేపు నోటమాటరాలేదు.

"మాతెగలో ఎంత పెద్దతప్పు చేసినా మేమెవ్వరినీ చంపం! అలాంటిది మీరు పెళ్ళికూతురిని చంపిపారేస్తారా?" అంటూ

ఆవేదనగా అడిగారు.

రంగారెడ్డి నాలిక్కరుచుకున్నాడు.

"అడెడెడె! పొరబాటున నిజం మాట్లాడేశాను-" అన్నాడు బాధగా. "ఇప్పుడు వీళ్ళదగ్గర మనం లోకువయి పోతామో ఏమో-"

"మీ పెళ్ళిపద్ధతికంటె మా అడవితెగ పద్ధతే బాగుంది-" అన్నాడు వాళ్ళ నాయకుడు మళ్ళీ "మా పద్ధతి కొంచెం మోటుగా ఉన్నా పెళ్ళికూతురినిమాత్రం చంపరు!" అన్నాడు ధీమాగా.

ఈసారి ఎవ్వరం మాట్లాడలేదు. మా టాపిక్‌ని ఎంత త్వరగా పెళ్ళిమీదనుంచి మళ్ళిద్దామా అనిపించింది.

ఆడాళ్ళంతా మామీద విరుచుకుపడ్డారు.

"అలా ఉన్నదున్నట్టు చెప్పేస్తారా ఎక్కడయినా" అంటూ. ఆ తరువాత వాళ్ళకు మేము ఎంత సర్దిచెప్పినా ఉపయోగం లేక పోయింది.

"అసలు కట్నాలు, కానుకలూ ఏమిటి? ఎందుకవి? మా అడవి తెగల్లో పిల్లనిచ్చినందుగ్గాను అల్లుడే ఒక మేకను ఇస్తాడు" అంటూ చిరాకుపడ్డారు వాళ్ళు. ఆ తరువాత వాళ్ళల్లో వాళ్ళు గుసగుసలాడుకోసాగారు.

ఆ గుసగుసల అర్థం గార్డ్ మాతో వివరంగా చెప్పలేదుగానీ మేము ఊహించుకుందేమిటంటే మేము అడవికి రావటం వాళ్ళకు అయిష్టంగా ఉందిట.

"వీళ్ళతో మనకెందుగ్గానీ రేపట్నుంచీ స్కూలు మొదలుపెట్టి చదువు నేర్పిద్దాం. చదువొస్తే వాళ్ళ మూఢనమ్మకాలూ, ఆచారాలూ అన్నీ . . . తట అవే పోతాయ్"

అంది పార్వతీదేవి.

ఆడాళ్ళంతా ఆమె మాటను సపోర్ట్ చేశారు. రాత్రి పడుకోబోయేప్పుడు, మా టెంట్‌కు ఎవరు కాపలా ఉండాలీ అన్న విషయం మీద మాలో మేము గొడవ పడుతూంటే వాళ్ళ నాయకుడు వచ్చి సంగతేమిటని అడిగాడు. మేము విషయం చెప్పేసరికి వాళ్ళందరూ ఆశ్చర్యపోయారు.

"దొంగలా? దొంగలంటే ఎవరు? దొంగతనం అంటే ఏమిటి?" అనడిగారు వింతగా.

మాకు మతి పోయినట్లయింది.

"అదేమిటి? మీకు దొంగలంటే తెలీదా?" అనడిగాడు రంగారెడ్డి.

వాళ్ళు తెలీదన్నట్టు తలూపారు.

ఫారెస్ట్‌గార్డ్ వాళ్ళకు వివరంగా, దొంగల గురించీ, దొంగతనాల గురించీ, బాగా నాగరికత ప్రబలి ఉన్న ప్రాంతాలలో ఎంత విచ్చలవిడిగా దొంగతనాలు జరిగేదీ అన్నీ చెప్పాడు. వాళ్ళు నిశ్చేష్టులయిపోయారు.

"కానీ అలాంటి వాళ్ళను అరికట్టటానికి మీరేమీ చర్యలు తీసుకోరా?" అనడిగారు మళ్ళీ.

"ఎందుకుతీసుకోము? వాళ్ళను పట్టుకోటానికే 'పోలీస్' అనే డిపార్ట్‌మెంట్ ఒకటి ఏర్పాటు చేసుకున్నాము-"

"అయితే మరింకా దొంగతనాలు ఎలా జరుగుతున్నాయ్?"

మాకేంచెప్పాలో తెలీలేదు. నేను బుర్ర గోక్కుంటూ రంగారెడ్డివేపు చూశాను. రంగారెడ్డి యాదగిరివేపు చూశాడు.

—సశేషం

ఈనెల 'అత్యుత్తమ అబద్ధం' పోటీ

మొదటి అత్యుత్తమ అబద్ధం

రూ॥ 100/-

"రాష్ట్రంలో విద్యుత్ కోతలేదు, విద్యుత్ కోత వున్నట్లు ప్రభుత్వానికి తెలియదు" —

ముఖ్యమంత్రి శ్రీ రామారావు

(ఆంధ్రజ్యోతి - ఏప్రిల్ 7, 1987)

కొత్త శివరామకృష్ణ ప్రసాద్

ఏలూరు

రెండవ అత్యుత్తమ అబద్ధం

రూ॥ 75/-

"శ్రోతలు మీకిష్టమైన పాటలు వింటున్నారు."

(ఆకాశవాణి)

పోలాని రమేష్ బాబు

హైదరాబాద్

మూడవ అత్యుత్తమ అబద్ధం

రూ॥ 50/-

" "తను తరచు శ్రీ ఎన్టీఆర్‌మీద తదితర తె.దే. నాయకులమీద తీవ్ర వ్యక్తిగత (దు) విమర్శలకు (అసభ్య పదజాలంతో కూడినవి) పాల్పడుతున్నట్లుగా వచ్చిన వార్తలను పిసిసి అధ్యక్షుడు, కేంద్ర పరిశ్రమల మంత్రి అయిన శ్రీ జలగం వెంగళ్రావు ఖండించారు."

(ఉదయం వార్త.)

ఎమ్. అప్పారావు

హైదరాబాదు

ఇతర అత్యుత్తమ అబద్ధాలు

"నాకు ఎప్పుడూ ప్రజలనాడి తెలుసు" అన్నారు పి.సి.సి. అధ్యక్షులు జలగం వెంగళరావు.

(ఈనాడు : 14-3-1987)

బి. వసంత్

కడప

భారతదేశ ఉపాధ్యక్షుడైనా, ప్రధాని అయినా, గవర్నర్ ముఖ్యమంత్రి ఎవరైనా, ఎంతటి ఉన్నత పదవిలో వున్నా ఇకమీదట తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని క్యూలో వెళ్ళి సందర్శించాల్సి వుంటుంది.

ఆంధ్రప్రభ వార్త మార్చి 28, 87.

వి. సాంబశివరావు

గుంటూరు

అవినీతి నిరోధక చట్టాన్ని మరింత బలపరుస్తామని" దేశ వ్యవహారాలశాఖ మంత్రి పి. చిదంబరమ్ అన్నారు.

10-3-87 ప్రాంతీయ వార్తల్లో

కాంగ్రెస్‌వారు చేసింది చెప్పుకోలేదు శ్రీమతి జమున

శ్రీమతి మహబూబున్నీసా బేగం

గోపాలపట్నం

"ఎన్‌టీఆర్‌ని గద్దె దింపే నిద్రపోతా."

మండల ఎన్నికల ఫలితాలపై జలగం వ్యాఖ్య

(మార్చి 18వ తేది 'ఉదయం' దినపత్రికలో)

జి. రమేష్ బాబు

గుంతకల్

నేనెప్పుడూ ముక్కుసూటిగా పోయేమనిషిని. చాటుమాటు వ్యవహారాలు నాకసలు గిట్టవు. నేను నిజాయితీపరుణ్ణి. నిజాయితీగా పన్ను కట్టే మనిషిని.
ఎమ్. పి. అమితాబ్ బచ్చన్ (ఏప్రిల్ 5వ తేదీ ఆంధ్రభూమిలో)

కాకా శ్రీనివాస

ద్రాక్షారామం

మా బాలయ్య పసికూన" వారసత్వపు ప్రకటనపై వ్యాఖ్య ఎన్‌టిఆర్

(మార్చి 14వతేది ఉదయం దినపత్రికలో)

జి. భారతి

గుంతకల్

ప్రజాసేవకు పదవులు అవసరంలేదు జమున

(5-7-84 ఆంధ్రభూమి వీక్లీ)

ఎస్. హెచ్. ఎన్ సాగర్

తెనాలి

మీకు మరింత మెరుగైన సేవల నందించేందుకు మాకు సాయపడండి"

ఆం.ప్ర.రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డు

వి. యస్ ఎ. అప్పారావు

విశాఖపట్నం

పోలంపల్లి శాంతాదేవి సీరియల్

నవత - యువత

జరిగినకథ:-

వనజాక్షికి పెళ్ళి చూపులు జరుగుతాయి. ఆమె స్నేహితురాళ్ళు ఆ పెళ్ళి అంటే ఇష్టపడరు. సుధకు విలేజ్‌వర్కర్‌గా వనపర్తిలో పోస్టింగ్ వస్తుంది. ఆమెను ఒంటరిగా పంపడానికి ఇంట్లో ఒప్పుకోరు. శాలినికి కూడా వనపర్తి దగ్గిర పల్లెటూర్లో టీచర్ ఉద్యోగం వస్తుంది. సుధ విలేజ్ వర్కర్‌గా జాయిన్ అవుతుంది. ఊళ్ళోకి వెళ్ళిన సుధకు ఆ వాతావరణం, రొచ్చు వాసనలు ఇబ్బంది కల్గిస్తాయి. అయినా ఓర్చుకొని తన కార్యక్రమం ప్రారంభిస్తుంది.

—ఇక చదవండి

"ఏ సబ్జక్ట్ అయినా ఈజీగా చెప్పొచ్చునేమోగాని లెఖ్ఖలు అలా చెప్పేందుకు వీలుకాదు! దానికి చాల ఏకాగ్రత అవసరం! ఆ సంగతి గుర్తు పెట్టుకొంటే మీరు ఏ లెఖ్ఖ అయినా ఈజీగా చేసేయ గల్గరు!" అని వెళ్ళిపోయాడు శర్మ.

"తనకి ఏ కాగ్రత లేదని ఎలా తెలిసింది అతడికి? తన మనసు అతడు వేస్తూన్న లెఖ్ఖమీద కాక అతడి ముఖంమీదే ఉందని ఎల్లా తెలిసి పోయింది?"

ఆ రోజంత పరధ్యానంగానే ఉంది శాలిని.

సుధ ఒకటి రెండు సార్లు ఏదో అడిగితే సరిగా జవాబివ్వలేదు.

"ఏమిటంత పరధ్యానం? ఎక్కడుంది మనసు?" అడిగింది సుధ.

"పరధ్యానం కాదు! శర్మ ధ్యానం!"

"శర్మ ధ్యానం ఏమిటి?" అడిగింది ఆశ్చర్యంగా.

"మనసులో తొలిసారిగా పడ్డ బొమ్మ చెరగదు కదూ?"

"అవును! చెరగదు!"

"నీకెలా తెలుసు?" ఈసారి ఆశ్చర్యపడడం శాలిని వంతు అయింది.

"ఎందుకు తెలియదు మనిషి మనసులో మొదటి సారిగా పడేది అమ్మ



బొమ్మ! అది చచ్చేదాక చెరగదు!"

"నీ మొహం!"

"ఇంకేవరు ?"

"వయసొచ్చి వలపు వాకిలి తెరుచుకున్న తరువాత తొలిసారిగా మనసు తెర మీద పడే బొమ్మ!"

"ఏమిటీ? కథ చాలా దూరం వచ్చిందే?" సుధ బుగ్గలు నొక్కుకుంది. "ఏదో పాపం ఉద్యోగం వచ్చింది కదాని మీఅమ్మ వాళ్ళు ఇక్కడికి పంపిస్తే నువ్వు చేసే నిర్వాకం ఇదా? ఇంతకీ కథ ఎంత దూరం వచ్చిందేం?"

"ఎంత దూరం రాలేదు. మొదలయిందంతే! అదీ వన్‌వే ట్రాఫిక్‌లో!"

"పొడుపు కథ చెప్పినట్టుగా చెబితే నాకేం అర్థమౌతుంది? కాస్త అర్థమయ్యేట్టు చెప్పు! అర్థమయ్యాక నీచెంపలు వాయగొడతాను! ఎందుకంటే, నిన్ను ఉద్యోగానికి రికమెండ్ చేసింది నేను కనుక! ఒక్క ఇంటిలో ఉండి కష్టం సుఖం పంచు కొంటున్నాం కనుక! ఆ అధికారం నాకుంది!"

"అదేం లేకపోయినా, బాల్యస్నేహితురాలివి కనుక ఆ అధికారం నీకెలాగూ ఉంటుంది!"


"ఉబ్బేయకు గాని సంగతి చెప్పు!"

"రాధాకృష్ణశర్మ అని మాస్కూల్లో మాథ్స్ టీచరు! అతడిని ఒక్క మాటలో వర్ణించాలంటే కన్నె మనసుకు గిలిగింతలు పెట్టే రూపమని చెప్పాలి! అతడిని చూసిన మొదటి రోజే 'కలవర మాయె మదిలో! నామదిలో' అని పాడుకొనేట్టుగా అయింది మనసులో, రోజు అతడు కనిపించినప్పుడల్లా గుండెలయ తప్పడంలాంటి వికారాలన్నీ మొదలయ్యాయి. ఈరోజు చాలా దగ్గరగా ఒకరి ఊపిరి ఒకరికి తగిలేంత దగ్గరగా వచ్చినప్పటి నుంచి ఇహ నామనసు నామాట వినడం మానేసింది!" ఎక్కడో స్వప్న లోకంలో తేలిపోతున్నట్టుగా చెప్పింది శాలిని.

"వయసొచ్చిన ఆడపిల్లను ఒంటరిగా వదిలితే, ఇదిగో - ఈవికారాలు ఈజీగా లోబరుచుకొంటాయనే పెద్దవాళ్ళు పిల్లల్ని ఒంటరిగా వదలడానికి ఒప్పుకోరు! కాని, మనం దండెత్తుతాం వాళ్ళమీద. 'చదువుకొన్నాం, మామంచి చెడ్డలు మేం నిర్ణయించుకోలేమా?' అని! కాని. వయసు మంచి చెడ్డ విచక్షణని అంతం చేయగలదని నిన్ను చూస్తుంటే తెలుస్తోంది!"

"సహజ పరిణామమే! దానికి నిగ్రహమనే ఆనకట్ట వేయకపోతే మనిషిజంతు ధర్మం వైపు లాగబడతాడు కదా?"

"అసలు ఆ ఊహే మనసులోకి రాకుండా అరికట్టడం బ్రహ్మకైనా సాధ్యం కాదు! యవ్వనం ఉన్నంత వరకు ఈ స్పందన ఉంటూనే ఉంటుంది! స్నేహితురాలివి కనుక మనసులో మాట చెప్పుకొన్నాను గాని నాకు నిగ్రహం లేదని ఈవలపు భారంతో వెళ్ళి అతడిని కౌగలించు కొంటానని ఎందుకను కొంటున్నావు? ఇంతేనా



నువ్వు నన్ను అర్థం చేసుకొంది?" శాలిని నొచ్చు కొన్నట్టుగా అంది.

"ఇంతకీ అతడిది ఏఊరు, ఏమిటి తెలుసా?"

"తెలియదు."

"కోపం వచ్చిందా?" శాలిని దగ్గరికి వచ్చి చేయి వేసింది సుధ.

"కోపం ఎందుకు?" శాలిని ముఖం త్రిప్పు కొంటూ అంది.

"మీ అమ్మలానో, నాన్నలానో కోప్పడ్డానని! ఇద్దరం స్నేహితులం, కలసి ఉంటున్నాం. ఒకరు రాంగ్ స్టెప్ వేస్తే ఇంకొకరికి సరిదిద్దే హక్కు ఉంటుందని నా నమ్మకం!"

"............"

"ఇంతకీ అతను బాచ్‌లరేనా?"

"నేను తెలుసు కోలేదు! నేను ప్రేమిస్తున్నాను ఆయన్ని! అతడికి పెళ్ళయిందా లేదా? అని ఎవరిని అడగను?"

"అయితే నేను తెలుసు కొంటాలే! అతడు నీకు తగిన వాడైతే మీఇద్దరి మధ్యన ప్రియదూతికను నేనవుతాను! సరేనా?"

శాలిని క్షణంలో తన అలుకను మరిచి పోయినట్టుగా లేచివచ్చి సుధను కౌగిలించుకొని ఊపేస్తూ తన సంతోషాన్ని వ్యక్తం చేసింది.

రెండు రోజుల తరువాత, ఆఊరు టూర్ ప్రోగ్రాం పెట్టుకు వెళ్ళొచ్చిన సుధ, "బుద్ధి లేకపోతే సరి! మనసు తెరమీద బొమ్మ చిత్రించుకొనే ముందు అతడికి పెళ్ళయిందీ లేనిదీ తెలుసుకో వద్దా? అతడు నలుగురు బిడ్డల తండ్రి తెలుసా?" అంది, చీవాట్లు పెడుతూ.

శాలిని ముఖం తెల్లగా పాలిపోయింది. "భార్యా బిడ్డలున్న వాడంటే నమ్మను అతడలా కనిపించడు. బాచ్‌లర్‌లో ఉండే చురుకుదనం, ఉత్సాహం వేరు! గృహస్థులో వాటికి బదులు నిండుదనం ఉంటుంది!"

"అతడిలో ఉత్సాహం, చురుకుదనం ద్విగుణీకృతం చేసిన ఉత్తమ గృహిణి అయిఉంటుంది ఆమె! అతడిఉత్సాహానికి కారణం ఆమెను అతడు అత్యంతగాఢంగా

ప్రేమించడం కూడా కారణం కావచ్చు !"

శాలిని నీళ్ళు నిండిన కళ్ళతో నిశ్శబ్దంగా చూడసాగింది,

"అతడి బొమ్మ ఇప్పుడైనా తుడిచి వేస్తావా? లేదా మగవాడికి ఇద్దరు భార్య లుండొచ్చునని సమర్థించుకొంటావా ?"

"ఛీ ! నీకళ్ళకి నేనెలా కనిపిస్తున్నాను ?"

"ప్రేమ కొందరి కళ్ళ ముందు వెలుగులు పరిస్తే కొందరి కళ్ళ ముందు చీకట్లు పరుస్తుంది ! ఆ చీకట్లో దారి తప్పుతారు. భార్య ఉన్న మగడిని ప్రేమించి తమ జీవితాలను నాశనం చేసుకొన్న స్త్రీల కథలెన్ని లేవు ?"

"ఆ కథల్లో నాదొక కథ అవుతుందని నువ్వు భయపడకు, సుధా !" పయిట కొంగుతో కళ్ళు తుడుచుకొంటూ అంది శాలిని.

మరుసటి రోజుబడిలోశర్మ కనిపించ్చా నప్పుడు శాలిని గుండెలో అలజడి రేగ లేదు. అతడంటే ఆసక్తి చచ్చి పోయినట్టుగా అయింది ! అతడితో ఇదివరకే మరొక స్త్రీ జీవితాన్ని పంచుకొంది ! అతడి ప్రేమానురాగాల మీద, రూప సౌంధర్యాల మీదా హక్కు సంపాదించు కొంది.

ఇంకే ముందని ప్రేమిస్తుందతడిని ?

కాని, శాలినిలో ఉత్సాహం, సంతోషం ఊడేసి నట్టుగా అయ్యాయి !

ఒక పచ్చటి తీగను నిర్దాక్షిణ్యంగాపెలికి వేసినప్పడు అది నిలువునా ఎండి పోతూ పడే బాధా, నరకం లాంటివి శాలిని ముఖంలో కనిపిస్తుంటే, సుధకు తను అనవసరంగా పాపం చుట్టుకొంటున్నాననిపించింది.

"ఏయ్ ! విరాగిణీ ! నీకో మంచి మాట చెబుతాను! నాకివ్వడాని స్వీట్‌పాకెట్ రెడీగా పెట్టుకో !"

"ఇహ ఈ ప్రపంచంలో మంచి మాటలుంటాయనుకోను !" విషాదంగా అంది శాలిని.

"ఆమాట విన్నాక ఈమాట అనలేవు ! కనీసం చేతిలో పంచదార అయినా పట్టుకో !"


"నీకంత తినాలని ఉంటే డబ్బాలోంచి తీసుకు తినరాదు ?" శాలిని విసుగు వ్యక్తం చేసింది.

"పూర్వం రాజులకి, రాణులకి శుభవార్తలు చెబితే చెప్పిన వాళ్ళకి మెడలోంచి మణి. రత్నహారాలు అమాంతం తీసిచ్చే సంప్రదాయం ఉండేదట !"

డేంజర్ సిగ్నల్

ఒక వోమన్స్ లిబ్ మెంబర్ ఇంట్లో వంట గదిలో ఇలా రాసి ఉంది.

"నలుగురు పిల్లలున్న వాడిని ఎప్పటికీ పెళ్ళి చేసుకోవద్దు – ఒక వేళ వాళ్ళు నీ పిల్లలే అయినా సరే !"



"నేను రాణిని కాదు ! నా దగ్గర మణిరత్నహారాలు లేవుగాని ఏమిటో చెప్పు!" అడ్డు తగిలింది శాలిని.

"ఇంత విసుగైతే చెప్పనులే !"

"చెప్పకు ! తెలుసు కోవాలనే ఆసక్తి నాకేం లేదు !"

"ఇప్పుడు తెలుసు కోకపోతే తరువాత బాధపడుతావు ! ఎందుకు తెలుసుకో లేదా అని ! నీ ఇష్టం ! నాకేం !"

"సుప్పేం ఊరించకు !"

"నీ మొహం ! చెప్పేస్తున్నా ! శ్రీశ్రీశ్రీ రాధాకృష్ణశర్మ గారికి ఇంకా వివాహ కాలేదు. ఆయనకి నలుగురు బిడ్డలు కాదు, ఒక బిడ్డ ఉండడం కూడా పూర్తిగా అబద్ధం !"

శాలిని ముఖంలో చప్పున మార్పు వచ్చింది. ఆశ చిగురు తొడిగినట్టుగా అయింది ! "అది చెప్పింది నువ్వే ! ఇది చెప్పింది నువ్వే ! ఏది నిజమో, ఏది అబద్ధమో తెలుసుకో లేకుండా ఉన్నాను !"

"ముందు చెప్పింది అబద్ధం. కేవలం నిన్నో ఆట ఆడిద్దామని అలా చెప్పాను ! కొంత విషాదం తరువాత వచ్చే ఆనందం చాలా అపురూపంగా ఉంటుందని ! ఇహ నేను శర్మ గారి గురించి తెలుసుకొన్న నిజమైన వివరాలు, అతడికింకా పెళ్ళికాలేదు. అతడు ఒంటరిగానే ఉంటున్నాడు. వాళ్ళ వాళ్ళు హైదరాబాద్‌లో ఉంటారు. ఇతడు ఇంటికి పెద్ద కొడుకు ! ఇతడి తరువాత ముగ్గురాడ పిల్లలూ, తరువాత అబ్బాయిట. వాళ్ళ నాన్నగారు ఈ మధ్యే రిటరైయ్యారు. మధ్య తరగతి సంసారం. ఈకాలంలో కాస్ట్ గురించి బహిరంగంగా మాట్లాడడం సభ్యత, నాగరికత కాదు ! కాని, పెళ్ళి అనేసరికి కులం ప్రసక్తి తప్పకుండా వస్తుంది. ఉద్యోగం కావాలన్నా, విద్య కావా లన్నా తప్పని సరిగా గవర్నమెంటే 'నీకులం ఏమిటి ? నీమతం ఏమిటి ?' అని అడు గుతూంటే ఈకులం మతం ఇప్పట్లో పోయేవి కాదు ! అదృష్టవశాత్తు మీకులం ఒక్క టే కాని శాఖాభేదాలు ఉన్నట్టున్నాయి. ఈకాలం లోనూ శాఖలను కూడా కొందంతలు

చేసే వాళ్ళు లేక పోలేదు. మీ ఇద్దరికి పెళ్ళి కావాలంటే ఒకపెద్ద యుద్ధం చేయాల్సి వస్తుందేమో !"

"ఆలు లేదు. చూలు లేదు. కొడుకు పేరు సోమలింగం అన్నాడట వెనుకటి కెవరో. అలా ఉంది నీవరుస ! అతడేమిటో, అతడి మనస్సేమిటో తెలియకుండానే- మాఇద్దరికి పెళ్ళి నిశ్చయం చేసేస్తున్న నీతెలివికి సంతోషించాలో, ఏడవాలో తెలియడం లేదు !" అంది శాలిని. "అతడికి ఇది వరకే పెళ్ళి అయిందని, నలుగురు బిడ్డల తండ్రి అని చెప్పి నన్ను ఎంతనరకం పెట్టావు ! నువ్వు చేసిన ఈపరిహాసానికి పెట్టిన బాధకు నువ్వు నలుగురి బిడ్డల తండ్రిని ప్రేమించి బాధ పడాలని శాపం ఇస్తున్నాను !" అంది పెదవుల మధ్య నవ్వుని బంధిస్తూ.

"కాని, ఇప్పుడు అతడు బ్రహ్మచారి అని తెలిసి 'స్వర్గం ఎక్కడో లేదు జీవితం లోనే ఉంది' అనిపిస్తుందా లేదా ?"

"రెండు నాలికలున్న స్నేహితురాలి వల్ల అంతా దుఃఖమే ననిపిస్తూంది !"

* * * *

ఆగ్రామంలో ఒక మహిళా మండలి ఏర్పటు చేయించాలని వచ్చినప్పటి నుండి శ్రమ పడుతూంది సుధ. స్త్రీలు తమ సమస్యలను ఒక చోటచేరి చర్చించు కొనేందుకు ఏదైనా ఒక న్యాయం కావాలంటే, ఒక హక్కు కావాలంటే అందరూ ఒకటై సాధించు కొనేందుకు ఈమహిళా సంఘాలు ఎంతో తోడ్పడతాయి.


మొదట్లో ఎవరూ చేరడానికి ఒప్పుకోలేదు. 'ఆఁ ఏం మహిళామండలిలెద్దూ ! కూరకి వస్తాయా ? కుండకి వస్తాయా ?' అని పెదవి విరవడం కొందరు చేస్తే, 'మా అత్త తోలదు !' అని ఒకామె అంటే 'నా మొగుడు తిడతాడు !' అని ఒకామె అంది.

తిట్టేందుకు అక్కడేముంటుందో తెలియలేదు సుధకు.

"మళ్ళ మహిళా సమాజంల జేరితే మిషనిప్పిస్తవా ?" అని ఒకామె అడిగింది.

"అడిగిన వాళ్ళందరికీ మిషన్లివ్వడానికి నాకు మిషన్ల ఫ్యాక్టరీ లేదు ! ఎన్ని అడిగితే అన్ని ఇచ్చేందుకు గౌర్నమెంట్‌లో నాకు చుట్టమూ లేడు. మహిళా సంక్షేమం కోసం గవర్నమెంట్ ఎన్ని సంక్షేమ పథకాలు చేపట్టినా, ఫండ్స్‌మాత్రం చాలా కొద్దిగా, బొటాబొటి అన్నట్టుగా ఉంటాయి. ఆ విషయం మీరు గుర్తుపెట్టుకోవాలి ! నాకున్న ఆహతులో ప్రయత్నించి ఇక్కడ ఒక కుట్టుసెంటరు పెట్టివ్వగలను ! ఒకటి రెండు మిషన్లతోపాటు, కుట్టు నేర్పడానికి ఒక టీచరుని ఇస్తారు. సోషల్ వెల్‌ఫేర్‌తో కాంటాక్ట్ చేసి ఒకటి రెండు మిషన్లిప్పించగలను !

"అయితే ఇలా కుట్టుమిషన్లకోసమో, కోళ్ళఫారం కోసమో ఈ మహిళా సమాజాలు కాదని మీరు గుర్తుపెట్టుకోవాలి ! మీరు ఎలాగూ ఇరుగూ పొరుగూ కలిసి ఏవో కబుర్లు చెప్పుకొంటూనే ఉంటారుకదా ? ఆ చెప్పుకొనేది ఏదో, మహిళా సమాజం అని ఒకటి ఏర్పాటు చేసుకొని వారానికి ఒకటి రెండుసార్లు మీటింగ్ అయి చెప్పుకోవచ్చు. కష్టసుఖాలు చెప్పుకోవడంలో తప్పేమీ లేదు ! కాని, 'పుల్లి మీద ఎల్లి, ఎల్లి



మీద పుల్లి' అన్న చాడీలుమాత్రం వద్దు. మీ బ్రతుకు తెరువుకు ఉపయోగ పడేవి చెప్పుకోండి. ఇంతకంటే మెరుగ్గా జీవించడానికి ఏంచేస్తే బాగుంటుందో మాట్లాడుకోండి. విజ్ఞానం కలుగజేసే కబుర్లు చెప్పుకోండి ! మీకున్న సమస్యలేమిటి ? ఆ సమస్యలనుండి బయట పడడానికి మీరేం చేయాలి ? మీలో విజ్ఞానం, చైతన్యం కలిగించే మంచి మంచి పుస్తకాలు, పత్రికలు నేను తెప్పించి పెడతాను. మీరు చందా వేసుకొని ఆ డబ్బు ఇచ్చినా సరే, లేకపోతే నా జీతంనుండి కొంత ఖర్చుపెట్టి తెప్పించి ఇస్తాను. చదువొచ్చిన వాళ్ళు చదువు రానివాళ్ళకు చదివి వినిపించండి. వాళ్ళని మీతోపాటు విజ్ఞానవంతుల్ని చేయండి."

రెండు మూడు నెలల శ్రమ ఫలంగా ముప్ఫై మంది సభ్యులతో ఒక మహిళా మండలి ప్రారంభోత్సవం చేసేరోజు వచ్చింది.

మహిళా మండలి మీటింగులు జరుపుకోడానికి ఆ ఊరి పెద్దరెడ్డిగారి కోడలు తమ లంకంత యింట్లో ఓ గది కేటాయించింది. ఆవిడే మహిళా మండలి ప్రెసిడెంట్‌గా ఉండడానికి నిర్ణయమైంది. ఆవిడపేరు సత్యవతి. అయిదోతరగతి వరకు చదువుకుంది. చిక్కిన పుస్తకమల్లా తెగ చదివేస్తూ ఉంటుంది.

పల్లెటూళ్ళలో సాధారణంగా డిటెక్టివ్ పుస్తకాలంటే మోజెక్కువ ! అక్షర జ్ఞానం ఉండి కాస్త తెల్లబట్టలేసుకున్న ఏ మగవాడి చేతిలో చూసినా ఏ డిటెక్టివ్ పుస్తకమో దర్శనమిస్తూ ఉంటుంది. ఊళ్ళో అవే ఎక్కువ దొరుకుతాయి కనుక కాస్త చదవగలిగిన ఆడవాళ్ళు అవే చదివేస్తూ ఉంటారు.

సుధ ఎప్పుడు వచ్చినా సత్యవతి చేతిలో, డిటెక్టివ్ పుస్తకం పట్టుకు కనిపిస్తుంది.

"అరే ! ఎప్పుడు వచ్చినా మీ చేతిలో, ఆ డిటెక్టివ్ పుస్తకం ఉంటుంది ! లక్ష్మీదేవి చేతిలో కమలం పువ్వు ఉన్నట్టుగా, సరస్వతి చేతిలో వీణ ఉన్నట్టుగా, పార్వతి చేతిలో త్రిశూలం ఉన్నట్టుగా మీ చేతిలో, అహర్నిశలూ ఆ డిటెక్టివ్ పుస్తకం ఉండేట్టుంది" అంది సుధ ఒకరోజు చలోక్తిగా.

"పొద్దుపోదు ! ఏంజెయ్యాలి మళ్ళీ ?"

పది పన్నెండు గెదాలున్న పెద్దకాపులు వాళ్లు. నీళ్ళు తేవడం, పంట చేయడం జీతగాళ్ళే చేస్తారు. అజమాయిషీకి అత్తగారుంది. సత్యవతికి పనేం ఉండదు మరి. పెద్దకాపులు గనుక ఎవరిళ్ళకూ వెళ్ళి కబుర్లు చెప్పుకోడానికి లేదు. అందరూ వీళ్ళింటికే వచ్చి కబుర్లు చెప్పాలి మరి.

"ప్రొద్దుపోకపోతే మీ పెరడు చాలా పెద్దదిగా ఉంటుందికదా? పెరటితోట పెంచితే ఏపోతుంది? మీ పెరట్లో చేదుడుబావి ఉండనే ఉంది. చిన్న మోటారు బావికి పెట్టేస్తే బోలెడన్ని నీళ్లు తోటకు. చెట్లు పెంచడంలో ఆనందం ఒకసారి రుచి చూస్తే మరి వదలరు!"

"పెట్టలొచ్చి పడతాయి! ప్రక్కనే ఎద్దుల పాకె ఉంది."

"తోట పెంచాలని అభిలాష ఏర్పడితే కట్టుదిట్టాలు చేసుకోవడం ఎంతపని?"

"పసులు రాకుండా కట్టుదిట్టం చేస్తం కోళ్ళు కెలుకుతయి! వాటినేంచేస్తం?"

"తోట పెంచాలని అనుకొంటే కోళ్ళు కెలక్కుండా జాగ్రత్త తీసుకోలేరా? మీకు కావలసిన విత్తనాలను మా సమితినుండి సప్లయ్ చేస్తాం! జామ, మునగ, బొప్పాయి, కరివేపాకు – ఇవి ఉన్న ఇంట్లో అనారోగ్యం ఉండదు!"


"రెండు అనపతీగలు మిద్దెకు పాకించాలని విత్తనాలు వేస్తేనే కోళ్ళు వాటిని ఉంచవు! పాదు కెలికి పెట్టేస్తాయి! పాదులు చేసి, విత్తనాలువేసి, నీళ్ళుపెట్టి, అంత శ్రమపడిచేస్తే తీరా కోళ్ళు కెలికేస్తేనో, పశువులు మేసేస్తేనో ఎంత బాధ. ప్రాణం ఉసూరుమంటుంది."

ఇక ఎలా నచ్చజెప్పాలో తెలియలేదు సుధకు. ఈ గ్రామస్తులకు ముఖ్యంగా గృహిణులకు ఏదైనా ఒక మంచి పని చెప్పి చేయించాలంటే టక్కున ఏదో ఒక జవాబు చెప్పేస్తారు!

"తోట వేయకపోతే వేయకపోయారుగానీ ఆ చెత్త డిటెక్టివ్ పుస్తకాలు చదవకండి, స్త్రీ సమాజంలో ఎక్కడ చిన్నచూపు చూడబడుతోంది? తన హక్కులేమిటి? తను ఎక్కడ అన్యాయం చేయబడుతోంది? తను ఎక్కడ దోపిడీకి గురి అవుతోంది? అన్న చైతన్యాన్ని కలిగించని పుస్తకాలుచదవడం అనవసరమంటాను! ఈ డిటెక్టివ్ పుస్తకాలు కాలాన్ని హరించేవితప్ప మెదడుకి కాస్తకూడా వికాసం కలిగించవు."

"మాకు ఇవే దొరుకుతాయి ఇక్కడ!"

"మీరు మంచి పుస్తకాలు చదవాలనే అనుకొంటే మీరు పదిమంది, ఇరవై మంది కలిసి ఒక మహిళామండలిగా ఏర్పడండి. మంచి లైబ్రరీ కావాలని మీ సర్పంచ్‌ని డిమాండ్ చేయండి! గవర్నమెంట్ కొంత ఇస్తుంది. మీరు కొంత వేసుకోండి! ఒక లైబ్రరీ తెచ్చుకోండి ఊరికి! అంతేకాని, ఏ చెత్త అంటే ఆ చెత్త చదవొద్దండి. మనిషికి చదువు రావడం అనేది ఒక గొప్ప వరం అనుకొంటే ఇలాంటి చెత్త పుస్తకాలను చదివి ఆ వరాన్ని దుర్వినియోగం చేసుకోవద్దు."



సుధ ఎన్నో విధాలుగా చెప్పి చెప్పి చివరికి ఒక మహిళామండలి ఏర్పాటు చేయగలిగింది.

ఆరోజు మహిళామండలి ప్రారంభోత్సవం.

సత్యవతి మహిళామండలికోసం ఇచ్చిన గదికి రంగుకాగితాలతో అలంకరించారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్, ఇందిరాగాంధీ చిత్రపటాలు గోడలకి తగిలించారు గదిలో, గది బయటా చక్కటి ముగ్గులు వేశారు. ఆ ఊరి సర్పంచ్ భార్యతో రిబ్బను కట్ చేయించి అందరికీ బిస్కెట్లు టీలు ఇచ్చారు.

ఈ సందర్భంగా చిన్న ఉపన్యాసం ఇచ్చింది సుధ.

"మహిళామండలి అంటే కుట్లు, కోళ్ళు, పందుల పెంపకం – వీటివరకే పరిమితం కాదని ఇదివరకు చెప్పిందే ఇప్పుడూ చెబుతున్నాను.

చాలా మంది స్త్రీలకు ఆలోచించడం తెలియదు. ఉదాహరణకు, మగడు రోజూ తాగొచ్చి భార్యను కొడుతున్నాడనుకోండి! ఆభార్య ఏమనుకొంటుంది? నా ఖర్మ కాలి ఈతాగుబోతు పాలబడ్డాను! నాబతుకింతే! దెబ్బలతో తెల్లారి పోవలసిందె, అనుకొని, రోజూ దెబ్బలు తినడానికి ఓపిక కూడదీసుకొంటుందేగాని, వీడు రోజు ఎందుకు తాగుతాడు! తాగకుండా కట్టు దిట్టం చేద్దాం! అలా కట్టుబడనివాడైతే వాడిని వదిలేసి నాదారిన నేను వెళ్ళిపోయి ఈదెబ్బలు లేని జీవితం హాయి అయిన జీవితం గడుపుదామని మాత్రం ఆలోచించదు. ఎందుకంటే ఒకసారి కట్టుకొన్న మగడిని వదిలేయడానికి మన సంప్రదాయం ఒప్పుకోదు. సంప్రదాయం, సమాజం అనుకొంటుందేగాని అసలు ఈసంప్రదాయం ఎవరు సృష్టించారు? నా జీవితం ఈ సంప్రదాయానికి ఎందుకు బలి పెట్టాలి? రోజూ మగడి చేతిలో తన్నులు తింటున్న నాగురించి ఈ సమాజం ఏం చేసింది? ఈ సంప్రదాయం ఏంఆదుకొంది? నా దారిన నేను వెడితే ఈసమాజానికి అనే హక్కు ఎక్కడిది? ఇలా ఆలోచించడం నేర్చుకోలేదన్న మాట! అంటే మగళ్ళని వదిలిపెట్టెయ్యడమే స్త్రీ చైతన్యమని చెప్పడం

లేదు! రోజా ఒక మగవాడి చేతిలో నీచంగా తన్నులు తింటూ ఆత్మగౌరవం లేని బ్రతుకు బ్రతకవద్దనే నేను చెప్పేది!

"ప్రకృతి స్త్రీని బలహీనురాలిగా సృష్టించింది. ఈబలహీనత కారణంగానే పురుషుడు ఆమె మీద అధిపత్యం వహించి ఆమెనుదోచుకోగలుగుతున్నాడు. వంటకూ, పంటకూ శాశ్వతంగా కొనుక్కున్న బానిసగా చేస్తున్నాడు! 'ఇంటికి దీపం ఇల్లాలు' 'ఇల్లుని చూసి ఇల్లాలుని చూడు' లాంటి మాటలతో ఆమెను మభ్యపెడుతున్నాడు! ఇల్లనే చెరసాల నుండి బయట పడకుండా ఇల్లు దేవాలయమన్నాడు. స్వర్గసీమ అన్నాడు నోములు, వ్రతాలు అనే సాలెగూడుఅల్లాడు, పసుపు కుంకుమలే జీవిత పరమార్థమన్నాడు. మొత్తానికి ఆమెను నూతిలో కప్పలా జీవించేట్టు చేశాడు

నూతిలో కప్పల్లా ఇంకా ఎంతకాలంముటారు?

ఈఅజ్ఞానాంధకారంలో ఇంకా ఎంత కాలముంటారు?

ఈఆంధకారం చీల్చుకొని బయటకి రండి! విద్య అనే కరదీపిక పట్టుకోండి. చదువురాని వాళ్ళందరి కోసం ప్రభుత్వం అనియత విద్యా కేంద్రాలు, వయోజన విద్యా కేంద్రాలు నడుపుతోంది! ప్రభుత్వ పథకాలను మీరు సక్రమంగా ఉపయోగించుకోండి.

మీ కోసం గవర్నమెంట్ చవక ధరల దుకాణాలు నడుపుతూంది. కాని, అందులోని వస్తువులు మీకు సక్రమంగా పంపిణీకావు! చక్కెర, గోధుమలు, బియ్యం, నూనె బ్లాక్‌లోకి వెళ్ళి పోతూంటాయి. ఈ అన్యాయం గురించి మీకు తెలుసు! వీధి అరుగుల మీద కూర్చొని చర్చించు కొంటూనే ఉంటారు! వీధి అరుగు చర్చల వల్ల ఈ అన్యాయం అరికట్ట బడదు."

"చూడడానికి గడ్డిపరక! గడ్డి పరకలు కొన్ని కలిపి పేనితే మోకు అవుతుంది. ఆ మోకు ఏనుగునుకూడా బంధించగలిగిన శక్తి కలదౌతుంది. ఆ మోకుతో సమానమైంది మహిళా మండలి! ఊళ్లో జరిగే ఏ అన్యాయమైనా ప్రతిఘటించవచ్చు మీ మహిళా మండలి ద్వారా, మీకు కలిగే ఏ అసౌకర్యమైనా ప్రభుత్వం దృష్టికి తీసుకురావచ్చు.

మహిళా మండలి అని పెట్టుకోగానే సరికాదు. మీ లో ఐక్యత ఉండాలి. పట్టుదల ఉండాలి! ఐక్యతగా పనులు సాధించుకోవాలి! ఎవరికి వాళ్లు ఆత్మ వికాసం పెంపొందించుకోవాలి...." ఇలా సాగింది సుధ ఉపన్యాసం.

సుధ మాటలు ఎంత వరకు అర్థమయాయోగాని, సభ్యులందరి ముఖాల్లో ఒక విశ్రాంతి నిండిపోయింది.

"శాన మంచిగ చెప్పినవ్, దొరసానీ! మాకిట్ల చెప్పేటోళ్ళు లేకనే ఇట్ల చీకట్ల ఉన్నం! ఇదే బతుకనుకొంటున్నం!" అంది ఒక వయసు మళ్ళినామె.

"మీరు వినాలేకాని ఎన్ని మాటలైనా చెప్పగలను!" అంది సుధ, తృప్తిగా.

* ● ● ●

ఆగస్ట్ పదిహేను వారంరోజుల్లో ఉంది.

ఆ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమం ఇప్పించే ప్రయత్నంలో హడావిడిగా తిరుగుతున్నాడు శర్మ.

"శాలినిగారూ!" అంటూ వచ్చాడు క్లాస్‌రూంలోకి. "పిల్లలచేత ఈ నాటకం వేయించాలనుకొంటున్నాను. ఇది మీరొకసారి చదివి, పిల్లల్ని ప్రిపేర్ చేయించడంలో మీరు నాకు సాయం చేయాలి" అన్నాడు చేతిలోని స్క్రిప్టు కాగితాలు అందిస్తూ.

"నేనెప్పుడూ నాటకాలు వేయలేదండీ!"

"నాటకాలు వేయకపోతే ఏమిటండీ? పాత్రకనుగుణంగా డైలాగులు పలకడం చెప్పలేరూ?"

"మీరొకసారి ఆ డైలాగులు పలికి నాకు చెప్పండి! నేను పదిసార్లు కాకపోతే ఇరవైసార్లు అరిచి వాళ్ళచేత ప్రాక్టీసు చేయించగలను."

"నా డైరెక్షన్‌లో మీరు తయారయ్యే తరువాత వాళ్ళని తయారు చేస్తారన్న మాట! ఓ.కే. నాకిప్పుడు క్లాసుంది: నాలుగో పీరియడ్ ఖాళీగా ఉంటాను. స్టాఫ్ రూంకి రండి. అక్కడ రిహార్సల్స్ మొదలు పెడదాం!" చిరునవ్వుతో అని వెళ్ళిపోయాడు శర్మ.

నాలుగవ పీరియడ్‌కి స్టాఫ్‌రూంకి వెళ్ళింది శాలిని.

శర్మ వచ్చి డైలాగులు చెప్పడం మొదలు పెట్టాడు.

డైలాగులు పలికేప్పుడు అతడు ముఖంలో వ్యక్తపరిచే హావభావ ప్రదర్శన చూస్తున్న నెపంతో అతడి ముఖంలోకి తనివితీరా చూడసాగింది శాలిని. చూస్తూ తననితాను మరిచిపోయింది.

"ఏదీ ఈ డైలాగు చెప్పండి!" అంతకు ముందే ఆ డైలాగుని రెండుసార్లు చెప్పిన శర్మ అన్నాడు.

కళ్ళప్పగించి చూస్తున్న శాలిని నుంచి డైలాగు ఎంతకూ ఊడిపడలేదు!

"శాలినిగారూ: ఏ లోకంలో ఉన్నారు?"

శర్మ మందలించేసరికి తృళ్ళిపడి ఈ లోకంలోకి వచ్చింది శాలిని.

"మీరు ఎక్కడో వున్నారు! మనసుపెట్టి వినడంలేదు."

"ఇక్కడే వున్నాను కనిపించడంలేదా? అదృశ్యకరిణిలాంటి విద్యలేం రావే నాకు!" ఆశ్చర్యం వ్యక్తం చేసింది శాలిని.

"వట్టి పరధ్యానం మనుషులు! మీకేం రాదు!"

"మనసుని ఏకాగ్రంచేసి మీ ముఖంలో ఎక్స్‌ప్రెషన్స్ చూస్తున్నానండీ: ఏ తెలుగు నటుడికీ తీసిపోని అందం, హావభావ ప్రదర్శన...అవునూ, మీరు సినిమాకు ఎందుకు ప్రయత్నించ కూడదూ?"

"మొద్దుపిల్ల క్యారెక్టర్‌కి మీరూ బాగా సరిపోతారు! మీరెందుకు ట్రై చెయ్యకూడదు?"

(సశేషం)



పునర్జీవితం

హిరణ్మయీదేవి

బెర్త్ సీటులో సూట్‌కేస్ పెట్టి తన సీట్లో కూర్చున్నాడు సీతారామరాజు. కర్చీఫ్ తీసి మొహం తుడుచుకొని కాస్త రిలాక్సయ్యాడు. యధాలాపంగా ఎదుటి సీట్లో కూర్చున్న యువతి వైపు చూస్తూనే - కాస్త నిటారయ్యాడు. ఆమెనెక్కడో చూసిన ఫీలింగ్...పరిచయం వుండీ - లేనట్లుగా వింతయిన భావం. ఎక్కడ చూసేనంటూ గుర్తు చేసుకోసాగాడు...

"నీ జ్ఞాపకశక్తి మాకుంటేనా" అంటారతని స్నేహితులు, పరిచయస్థులు మెచ్చుకోలుగా. రెండు నిమిషాలు కళ్ళు మూసుకొని గుర్తు తెచ్చుకొన్నాడు. నిజానికది ఎక్కువ టైం తీసుకోవడమే అతని విషయానికొస్తే ... చటుక్కున గుర్తుకొచ్చింది.

తన పత్రికలో "తిరుగుబాటు" అనే కధకి కన్సొలేషన్ బహుమతిని ఇచ్చాడు. ఆకధకి రచయిత్రి ఈమె. 'ఫోటో - పరిచయం' లో చూశాడు. తన గురించి ఏమీ చెప్పుకోలేదామె. 'సింధువు లాంటి ఈ రచనా వ్యాసంగంలో ఓ బిందువుని" అని చెప్పుకొన్న ఆమె నిరాడంబరత తనకెంతగానో నచ్చింది ఇంకా కొంత ప్రోత్సాహమిస్తే - అతి స్వల్ప కాలంలో గొప్ప పేరు సంపాదించుకోగలదని తను భావించడం వల్ల అలా గుర్తుండి పోయింది. ఫోటోలోని మొహం అదీగాక తన పత్రికలో వచ్చే ప్రతీచిన్న శీర్షికకు ఆమె నుండి వచ్చే రెస్పాన్స్ వల్లను గూడా ఆమె పేరు తనకి బాగా 'టచ్' లో వుంది. పేరు... పేరు 'శ్రీలేఖ' యస్ శ్రీలేఖే

ఆలోచనల్లో నుండి తేరుకుని ఆమె వైపు చూశాడు. కిటికీలో నుండి అవతల కన్పించే మనోహర దృశ్యాలని చూడ్డంలో నిమగ్నమయింది. నుదుటిన మెరిసే ఎర్రటి కుంకుమ అభాలభానునితో పోటీపడుతున్నట్లుగా వుంది. గులాబీరంగు చీర ఆమె ఒంటి రంగులో కలిసిపోతున్నట్లుగా వుంది. పవిత్రమైన భావాన్ని కల్గించే అపురూపమైన అందాన్ని ఇముడ్చుకొన్న ఆమెలో అదో నిర్లిప్తత.

ప్రక్కన కూర్చున్నది ఆమె భర్తేమో - సీతారామరాజు చూపుల్ని గమనించి కొరకొరా అతని వైపు చూశాడు. అది గమనించిన సీతారామరాజు చూపు మరల్చుకొన్నాడు. మనసులో 'గిల్టీ' గా ఫీలౌతూ మళ్ళీ ఆలోచనలలో మునిగిపోయాడు.

ఆమె తనని చూసిందనుకొంటూ. మళ్ళీ ఇంకోసారి ఆమె తనని చూస్తే గుర్తుపడుతుంది. తననో ఫేమస్ ఎడిటర్‌గా చాలామంది గుర్తిస్తారు. మరి ఈమె చూపుల్లో ఎలాంటి మార్పు లేదేం? ఆమె తనని గుర్తు పట్టక పోవడంతో అదోలా ఫీలయ్యాడు.

తనని చూడాలని - కలుసుకొని మాట్లాడాలని ఉవ్విళ్ళూరే జనాల్ని చూశాడింతవరకు. ప్రయాణాలెంతో ఇష్టమైనా - ఆ ప్రయాణాలని తప్పించుకోవడానికి ప్రయత్నిస్తాడంటే - ఓ విధంగా పాఠకులు కల్పించే యిబ్బంది వల్లనే. తన క్లోజ్ ఫ్రెండ్స్ అంటుంటారు గూడా "ఒక్క సినిమా హీరోలని, రాజకీయ నాయకుల్ని, పేరున్న రచయితలని మాత్రమే ఎగబడి చూస్తారనుకున్నాం ఇంతవరకూ - ఆ లిస్ట్‌లో నిన్నూ చేర్చాలోయ్" అని. తనెక్కడయినా కన్పిస్తే ప్రశ్నలతో ఊపిరాడనివ్వక పోవటం - చేసేవారికే ఓ విధంగా అలవాటుపడ్డ అతనికి వాళ్ళు తననో అనామకుడిలా ట్రీట్ చేయడం కొంత అహాన్ని దెబ్బతీసింది.

అందుకే తన అలవాటుకి భిన్నంగా తనకై తనే మాట కల్పుతూ "ఎందాకా వెడుతున్నారండి ?" అనడిగాడు ఇద్దర్నీ ఉద్దేశించినట్టుగా...

తపోభంగం అయిన తపస్విలా ఆమె తలతిప్పి చూసింది. అంతేగానీ పెదవి కదల్చలేదు.

"రాజమండ్రి - గోదావరి స్టేషన్‌లో



దిగాలి" ముక్తసరిగా చెప్పాడు అతడు.

సంభాషణా చతురుడని పేరుపడ్డ ఆ మహా ఎడిటర్‌కి-అతనితో ఇంకెలా సంభాషణ పొడిగించాలో తోచలేదు. "ఏం చేస్తుంటారు? ఐమీన్ ఏజాబ్ చేస్తున్నారు" అడిగాడు మళ్ళీ.

"పొగాకు వ్యాపారం" అనేసి పేపర్ చదవడానికే తను పుట్టానన్నట్లుగా -పేపర్‌లో తలదూర్చేశాడు. ఇక ఏం మాట్లాడలేక ఆమె వైపుచూశాడు. కళ్ళు మూసుకొని వుందామె. ఆమె మొహంలో సౌకుమార్యం. అమాయకత్వం పోటీపడుతున్నట్లుగా వున్నాయి. గాలికి నుదుటి మీద జీరాడుతున్న ముంగురులు వింతశోభని కల్గిస్తున్నాయామెకి.


ఆమె భర్త అడిగే ప్రశ్నలకి జవాబులు గూడా తలాడించి-చెప్పిందే గాని పెదవి విప్పని ఆమె వైఖరి ఎందుకో సీతారామరాజుకి అమితమయిన ఆశ్చర్యాన్ని కల్గించింది. "కబుర్లకు మారుపేరు ఆడవాళ్ళు" అనేవాళ్ళకి ఈమెను చూపిస్తే టక్కున తమ అభిప్రాయం మార్చుకొంటారు.

ఏంటి తను ఇవాళ-ఇలా ఆలోచిస్తున్నాడామె గురించే ఓసారి గూడా పరిచయం లేని ఆమె గురించి అనుకుంటూ దృష్టి మళ్ళించడానికి తనింకా చేయవలసిన పనులని పునశ్చరణ చేసుకోసాగాడు. అంతే అప్పుడు అతని మెదడు నిండా ఆఫీస్ వ్యవహారాలే చోటుచేసుకొన్నాయ్. దీపావళి ప్రత్యేక సంచికకు కథలు పంపమంటూ కోరమని రచయిత(త్రుల) లిస్ట్ టైపిస్ట్‌కిచ్చాడు. అవి పోస్టయి వుంటాయీ పాటికి. వచ్చే సంచిక నుండి పిల్లలకోసం బొమ్మల సీరియల్ వేయాలనుకొన్నాడు ఆర్టిస్ట్ బొమ్మలేయడం కంప్లీట్ చేశాడో - లేదో...ఎంతో అద్భుతంగా బొమ్మలు గీసే ఆ ఆర్టిస్ట్ అవిటి(కుంటి) వాడని ఎవరికీ తెలియదు...

ఒక రోజు తన ఫ్రెండ్ ఇంట్లో తను గీసిన బొమ్మల్ని చూసి ఆశ్చర్యపోయాడు. కొంచెం ప్రోత్సాహమిస్తే ఇట్టే అల్లుకు పోగలడన్న నమ్మకంతో చేరదీశాడు. అతడిని చూసిన కొందరతడి ముందే "ఇంత కన్నా మంచి ఆర్టిస్ట్ దొరక లేదా" అంటూ అపహాస్యం చేశారు ఎందుకో తనకి అతడిలోని స్పార్క్ ఇట్టేకనబడడంతో వారి మాటల్ని లెక్క చేయలేదు. "ఓ రెండేళ్ళ తర్వాత చూడండి" అంటూ ఛాలెంజ్ చేశాడు. ఆ ఛాలెంజ్ తనదిగా భావించాడేమో పట్టుదలతో దీక్షతో - అనితర సాధ్యం అన్పించేలా బొమ్మలు గీయడంతో ఓ క్రొత్త వరవడిని సృష్టించాడు - అపహసించిన వాళ్ళే ముక్కున వేలు వేసుకొనేలా.... .

"ప్రతిభ అనేది ఎక్కడ వున్నా ఇట్టే పట్టేస్తాడు మన రాజు" అంటారు విజ్ఞులు - కానీ విమర్శించడమే ధ్యేయంగా పెట్టుకొన్న కొందరు మాత్రం "ఆడవాళ్ళనిమాత్రం బాగా ప్రోత్సహిస్తాడంటూ" అపవాదు వేశారు - పొగడ్తని - విమర్శనీ ఒక్కలాగే రిసీవ్ చేసుకొన్న అతనిని చూసి ఆశ్చర్య పోయేవాళ్ళే చాలామంది వున్నారు.

ఓ విధంగా చెప్పాలంటే - సున్నితమయిన భావాల్ని - సెంటిమెంట్స్‌ని రచయిత్రులు చెప్పి నట్టుగా రచయితలు చెప్పలేరేమో అన్నంత అద్భుతమయిన రచనలని చేసిన రచయిత్రిగా శ్రీలేఖ తన మనసులో ఓ స్థానం సంపాదించుకొంది. ఆమె కథలకెన్నో బహుమతుల



నందుకొందామె. ఇంతకీ తన ఎదురుగా కూర్చున్నది ఆమెనో...లేక ఆమె పోలికలే వున్న ఆమె చెల్లెలో, అక్కనో... పోనీ పలుకరిద్దామంటే - అకారణంగా ఆమె భర్త కొరకొరా చూస్తున్నాడాయె.

ఆలోచనలతో చాలా టైమ్ గడిచిపోయిందతనికి. ఇంతలో 'నిడదవోలు' జంక్షన్ వచ్చింది. 'ఇదుగో నిన్నే భోజనం పట్టుకొస్తాను - ఆ మర చెంబిలా ఇయ్యి' అన్నాడామెనుద్దేశించి. ఆమె లేచి వంగొని సీటుకింద్ర వున్న మరచెంబుని తీసిచ్చింది - అదేనిర్లిప్తతతో. ఆ మర చెంబుని చూస్తూనే నవ్వొచ్చింది సీతారామరాజుకి సైజు చూస్తేనే....ఇంకా మర చెంబులే వాడుతున్నారీకాలంలో గూడా. అంటే "పాతభావాలకి రాజపోషకులన్న మాట" అనుకొంటూ

నిడదవోలు జంక్షన్ కావడం వల్ల ట్రైన్ చాలా సేపు ఆగింది.

హోటల్ భోజనమంటే ఇష్టపడదనే ఫలహారాన్ని టిఫిన్ బాక్స్‌లో పెడుతుంది, ప్రయాణాలప్పుడు సీతారామరాజు భార్య ఆటిఫిన్ బాక్స్‌పై టకుతీద్దామా అనుకొని-వాళ్ళు భోంచేస్తున్నప్పుడే తనూ తీస్తే సరి అని - విరమించు కొన్నాడు.

అతను లేడుగా - ఓసారి ఆమెని పలుకరిస్తేనో అది సభ్యతగా వుంటుందా అని తటపటాయించినా - ఆసక్తి దాన్ని డామినేట్ చేయడంతో "చూడండి" అన్నాడామెని ఉద్దేశించి. ఉలిక్కిపడి చూసిందామె. ఆ చూపుల్లో ఏదో భీతి - కలవరం.

ఎంత చదువుకొన్నా ఈ ఆడాళ్ళకి బెదురెప్పుడు పోతుందో అనుకొంటూ "ఏమన్నా మాగజైన్స్ వున్నాయా?" అనడిగాడు సంభాషణకి నాందిగా.

'లేవు' అన్నట్లుగా తలాడించిందామె.

"మీరేమయినా పుస్తకాలు చదువుతుంటారా?"

"ఊహు" అంది మెల్లిగా.

తనని తాను పరిచయం చేసుకొంటూ "ఆంధ్రవాణి" పత్రిక చదివారా? దాని ఎడిటర్‌ని నేను-" అన్నాడు తనలోని 'ఇగో'ని చంపుకొంటూ.

"అలాగా" అన్నట్లు చూసిందంతే.

ఆ చూపుల్లో ఎలాంటి సంభ్రమంగానీ, ఆసక్తిగాని కన్పించక పోవడంతో నిరుత్సాహం కల్గింది రాజుకి - పైగా ఆమె

మొహంలోని ప్రసన్నత - శ్రావణమాసపు సిరెండలా మాయమైనట్లు తోచిందోక్షణం.

ఇంతలో ఆమెభర్త వచ్చాడు-వస్తూనే ఆమెవైపు అనుమానాస్పదంగా చూశాడు.

సీతారామరాజు పుస్తకం తెరిచి బలవంతాన తన కళ్ళకి పని చెప్పాడు. ఆలోచనలు మాత్రం ఆమెనుండి మరలి రానని మారాం చేస్తున్నాయి. ఎందుకో...

ఉగాది కథల పోటీలో బహుమతులని పొందిన వారి కథలతో పాటుగా - వారి ఫోటోలు - సంక్షిప్త పరిచయాలు వేయడమే కాకుండా వెరైటీగా ఉండాలని రచయిత(త్రు)ల-పాఠకులమధ్య స్నేహ పరిచయాలు వర్ధిల్లాలన్నట్లుగా తమ కార్యాలయపు ఆవరణలో 'ఫంక్షన్' ఏర్పాటు చేశాడు. ఎందరో ఆహ్వానితులతో-మూర్తీభవించిన సరస్వతిలా కళకళలాడింది ఆ సభ.

ప్రైజెస్ అందుకోవడాన్కి బహుమతి పొందిన వారంతా వచ్చారుగాని, సెకండ్ ప్రైజ్ పొందిన శ్రీలేఖ రాకపోవడం తెలియని వెలితిని కల్గించిందారోజు. ఎంతో డబ్బు ఖర్చుచేసి సన్మానాలు చేయించుకొనే ఈ కాలపు రచయిత(త్రు)లకి శ్రీలేఖకి ఎంత తేడా! ఆమెందుకు రాలేదో అన్న ఆలోచన రెండుమూడ్రోజులు వేధించింది తనని.

అదంతా మరిచి రొటీన్ పడిన తనకి మళ్ళీ ఇప్పుడిలా ఈమె దర్శనం ...ఆలోచనలతో అతడికెంతో సేపు నిద్రపట్టలేదు-గాని ప్రకృతి మాత్రం చీకటి కౌగిలిలోకి చేరిపోయింది.

తూర్పుకొండల్లో నుండి సన్నసన్నగా మొదలైన వెలుగు జగతినంతటిని ఆక్రమిస్తూండగా మెలకువ వచ్చింది రాజుకి. ఎదురుగా భానోదయం - ఎంతో మనోహరంగా కన్పిస్తోంది. మెల్లగా - ఎదుటి సీట్‌వంక చూశాడు. ఆమె అంతకన్నా ముందే ఎప్పుడు లేచిందో - యాంత్రికమైన మానవులంతా కోల్పోతున్న అనుభూతులని పొందడమే తన లక్ష్యం అన్నట్లుగా అరుణకిరణుడి అందాలని చూస్తోంది.


రాజు లేచి బాత్‌రూం వైపు వెళ్ళి మొహం కడుక్కొని వచ్చాడు. వచ్చేసరికి ఆమె ఏదో బుక్ దీక్షగా చదువుతూ వుండడం గమనించాడు - ఆమె భర్తింకా నిద్రనుండి లేవలేదు,

రాజుని చూస్తూనే ఓ క్షణం తత్తరపడినట్లయి - చదువుతున్న పుస్తకాన్ని ప్రక్కకు పెట్టేసిందామె,

రాజు ఆమెని పట్టించుకోనట్లే - తన సూట్‌కేస్ తెరిచి అరలో వున్న ఫోటోల కవర్ తెరిచాడు. ఆ సం॥ 'వికలాంగుల సంవత్సరం' జరుపుకొంటున్నారు కాబట్టి వికలాంగులలో - కొన్ని ప్రత్యేకమైన కళలలో నేర్పరులయిన కొందరి ఫోటోలని ముఖచిత్రంగా వేయాలన్న ఊహతో కలెక్ట్ చేసిన ఫోటోలవి. అవి ఏ వరుస క్రమంలోవేస్తే బావుంటుందో ఆలోచిస్తూ, పెన్సిల్‌తో - ఆ ఫోటోల వెనుక నెంబర్స్ వేస్తూ - ముఖచిత్రంలో కనీసం పది మంది ఫోటోలు రావాలి అనుకొన్నాడు.

ఇంతలో గోదావరి స్టేషన్ వచ్చింది. అతడు హడావుడి పడుతూ అన్నీ దించుతున్నా - ఆమె మాత్రం మౌనంగా -అదే నిర్లిప్తతతో చూస్తూండిపోయింది. అతడు విసుక్కొంటున్నా.

వెళ్ళేముందోసారి రాజువంక చూసింది ఆ చూపులో ఏదో అర్థంగాని భావం...



ఆ చూపుకే భాష్యం చెప్పుకోవాలో ఓ క్షణం పాటు తోచలేదు రాజుకి.

* * *

రాజమండ్రి స్టేషన్ రాగానే దిగిన రాజు - ఇక పూర్తిగా తన పనులలో బిజీ అయిపోయాడు, అతడికెప్పుడూ లీలా మాత్రంగాగూడా గుర్తుకు రాలేదు శ్రీలేఖ ఆ వారం రోజులు.

హైద్రాబాద్‌కి తిరిగొచ్చాక ఆఫీస్‌కెళ్ళి తన పనుల్లో నిమగ్నమయ్యాడు. ఆర్డినరీ లెటర్స్‌కి సబ్‌ఎడిటర్ రిప్లయ్స్ ఇచ్చేస్తాడు. ముఖ్యమయిన పోస్ట్ మాత్రగ రాజుకోసం అట్టేపెడతారు. ఆ లెటర్స్ చూస్తుండగా 'పర్సనల్' అని తన పేరు వ్రాసిన గులాబీరంగు కవర్‌మీద దృష్టి నిల్చిపోయింది.

చిరపరిచితంగా తోచిన ఆ దస్తూరిని చూస్తూనే కవర్ విప్పాడు. మనస్తత్వాన్ని తెలియజేస్తాయి అక్షరాలు అంటారు. అదే నిజమైతే ఈ లెటర్‌లోని అక్షరాలు వారి స్థిరమయిన మనస్తత్వాన్ని తెలియజేసేలా వున్నాయి అనుకొంటూ చూపు సారించాడు.

"ఎడిటర్ గారికి,

నమస్తే. నేను... శ్రీలేఖను. ఓ పది రోజుల క్రితం మనం ట్రెయిన్‌లో కలుసుకొన్నాం - గుర్తొచ్చానుకుంటాను. మిమ్మల్ని గుర్తించని ఓ మూగబొమ్మలా వుండిపోయి మీ మెదడుకి పని కల్పించినందుకు క్షమించండి.

రచయిత్రిగా ఇంతో - అంతో పేరు సంపాదించుకొన్నా-ఓ భర్తచాటు భార్యని నాకంటూ వున్న స్వతంత్ర భావాలని అర్థం చేసుకోలేని భర్తని పొందినందుకు ఎంతో విచారస్తుంటాను. అంతకు మించి ఏమీ చేయలేని ఓ పిరికిదాన్ని. కథలు వ్రాసే కొత్తలో - ఎన్నో కథలు తిరిగొచ్చాయి. ఐనా నేను నిరుత్సాహ పడకపోవడాన్కి కారణం "ఎంతో పెద్ద రచయితల రచనలూ మేము నచ్చకుంటే త్రిప్పి పంపుతాం కొద్దిగా మార్పులుచేసి పంపితే ప్రచురిస్తాం" అని మీరు చేసిన సూచనలు - విమర్శలు మాత్రమే.

ఏ మనిషికైనా ఓ చిన్న పొగడ్త, ఆత్మీయత, అభిమానం వుంటే చాలు. తన రంగంలో అభివృద్ధి సాధించడానికి. అది మీనుండి పుష్కలంగా పొందిన నేను కట్టుకొన్న భర్తనుండి మాత్రం పీస

మెత్తయినా పొందలేకపోయాను. అది నిజంగా చాలా దురదృష్టం.

నన్నెంతగానో పొగిడేవారున్నా - ఆయన దృష్టిలో మాత్రం నాకే విలువ లేదు. ఎందుకొచ్చిన పిచ్చిరాతలంటూ నిరుత్సాహ పరుస్తారు. నేనో రచయిత్రినని ఎవరికీ తెలియకుండా వుండేందుకు ప్రయత్నిస్తూంటారు ... ఫోటోని గూడా పంపనివ్వరు .... ఏదైనా అత్యవసరపు పనిబడి నేను, పరాయి మగాడిని చూసినా, పలుకరించినా సహించలేరాయన. అందువల్లే నాల్గుగోడల మధ్యే మ్రగ్గిపోతూ -నా కంటూ వున్న ఆ చిన్న పరిధిలోనుండే రచనలు చేస్తూండడం పరిపాటైపోయింది.

ఆరోజు మిమ్మల్ని గుర్తించీ, పలుకరించలేని నా అసహాయతకి కుమిలిపోయాను. నాకృతజ్ఞతలు - క్షమాపణలు తెల్పుకుంటూ-(చూపుద్వారా మాత్రమే) దిగిపోయాను... అది మీకర్థమయి వుంటుంది.

మా పుట్టింట్లో -పూర్తిగా ప్రోత్సాహకరంగా వున్న వాతావరణం నుండి వచ్చిన నేను - రెక్కలు కత్తిరించి మరీ పంజరంలో బంధించినట్లున్న అత్తవారింటి వాతావరణాన్ని భరించలేకపోయాను... అది ఓ హీరోయిన్‌కి వర్తింపజేసి ఆత్మహత్య ముగింపుగా ఓ కథ వ్రాసి పంపాను నేను. కానీ కథలో పరిపూర్ణత లేదంటూ - ఆత్మహత్య ముగింపుగా చూపడం నచ్చలేదంటూ మీరా రచన త్రిప్పి పంపారు. దాంతో నేను ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన నుంచి విరమించుకొన్నానంటే-బహుశా మీరు నమ్మలేరేమో-

ఓ సారి శృంగార కథల పోటీ కని ఎంతో సుతిమెత్తని శృంగారపు పర్ణసతో నేను వ్రాసిన కథని ప్రచురించడమేగాక బహుమతినిచ్చారు మీరు. కానీ దానిని చదివిన నా భర్త మాత్రం- "ఇంటి పరువు ప్రతిష్ఠలు బజార్నపడే రచనగా దాన్ని పేర్కొంటూ" ఎన్నో చీవాట్లు పెట్టారు. అడుగడుగునా అతని తిరస్కారాలు భరించలేని నేను అతనినుండి విడిపోవాలనుకొన్నాను. కానీ నాలో ప్రాణం పోసుకొంటున్న చిన్నారి గురించి-'రాజీ' పడాల్సి వచ్చింది.

నిజజీవితంలో ధైర్యాన్ని చూపించలేని నేను "ఏదైనా తిరుగుబాటుతత్వం" కథ వ్రాయాలనుకొన్నా "నిజాయితీలేని రచనతో నువ్వు పొందుతున్నదేంటని" నిలదీసే మనసుకి సమాధానం చెప్పుకోలేక రచనా వ్యాసంగానికి ఫుల్‌స్టాప్ పెట్టేశాను.

పూర్వకాలపు ఆర్యోక్తి ప్రకారం స్త్రీ బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో కొడుకుచాటున వారి ఇష్టాలకు అనుగుణంగా వుండాలన్నారు. ఎంతో నాగరికతని సాధించామంటున్నా ఈ తరంలోనూ స్త్రీ అదే పరిస్థితికి లోబడే వుండవలసి రావడం విచారకరం. నా తండ్రి హయాంలో ఇంతో అంతో వ్రాశాను. భర్తకిష్టం లేదని వదిలేశాను- ఇక కొడుకు ఇష్టపడితే మాత్రం నారచనా వ్యాసంగాన్ని సాగించాలి. ఇదంతా నేను నిర్ణయించుకొన్నది కాదు- మా తల్లితండ్రులు, బంధువులు, బలవంతాన నాకు బ్రెన్‌వాష్ చేయించి చెప్పిన మాటలు - చేయించిన పనులు.

భర్తను కాదని సంసారాన్ని కాలద్రోసుకొని - లోకులతోనూ, వారు చేసే కాకిగోలతోనూ బ్రతికే ధైర్యం లేక "రాజీ" పడి బ్రతుకు సాగిస్తున్న 'ఓ జీవచ్ఛవాన్ని'- అందుకే దీపావళి ప్రత్యేక సంచికకి కథని పంపమని మీరు వ్రాసినా పంపలేక పోతున్నాను.

నన్ను ప్రోత్సహించిన మీరుమాత్రం నాకెప్పుడూ గురుతుల్యులే. ఓ మంచి మనసున్న మనిషికిమారుపేరుగా ఎప్పుడూ నా గుండెల్లో నిలిచిపోయే విశిష్టమయిన వ్యక్తి మీరు.

బహుశా ఇదే నేను మీకు రాసే ఆఖరి లేఖ.

ఉంటానిక

నమస్కారములతో,

శ్రీలేఖ

అది చదవగానే మనసంతా భారంగా అయిపోయింది రాజుకి.

ఓ మణిపూస చేతుల్లోంచి జారిపోయిన ఫీలింగ్. భర్త నిరంకుశత్వం క్రింద అణగారి పోతున్న వారింకెంత మంది వున్నారో

పుస్తకాలలో, సినిమాలలో చూస్తే "స్త్రీ అభ్యున్నతి" నిజంగా ఎప్పుడూ ఉస్సురంటు నిట్టూర్చడం తప్ప ఏమీ చేయలేని "అశక్తత" ఆవరించిందతణ్ణి.

క్రమక్రమంగా శ్రీలేఖని మరిచిపోయాడు రాజు. ఆరోజే మద్రాస్‌నుండి తిరిగొచ్చిన రాజుకి ఫోన్ చేశాడు సబ్ ఎడిటర్-"మరో సబ్ ఎడిటర్‌కై ప్రకటించిన వారిని ఇంటర్వ్యూ చేసి-ముగ్గురిని ఎన్నుకొన్నానని - ఫైనల్‌గా మీరొచ్చి - నిర్ణయిస్తే-అందులో ఒకరిని సబ్ ఎడిటర్‌గా నియమించవచ్చని."

ఆ ఫోన్‌కాల్ రాగానే ఆలస్యం చేయకుండా - ఆఫీస్‌కి బయల్దేరాడు రాజు.

ఇద్దరితో ఇంటర్వ్యూ అయింది - మూడో అభ్యర్థిని పిలిచాడు. వచ్చిన యువతిని చూస్తూనే ఆశ్చర్యపోయాడతడు ఆమె శ్రీలేఖ - అంతే కాదు - 'అర్హత'లన్నీ వున్న అభ్యర్థి.

సీతారామ రాజుకి అప్పుడప్పుడో సందేహం వస్తూ వుంటుంది.

"మంచి పేరు ప్రఖ్యాతులతో సబ్ ఎడిటర్‌గా మారి తన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకున్న శ్రీలేఖ జీవితం సుఖాంతమైనట్టా లేక "భర్తకు దూరమై, సంసార సౌఖ్యాలకు దూరమై - ఒంటరిగా మిగిలిపోయినందుకు" దుఃఖాంతమైనట్టా అని.

శ్రీలేఖమాత్రం సుఖాంతంగానే ఫీలవుతోంది.

దేవతా డ్రైవింగ్ స్కూల్

పురావస్తు పరిశోధనా సంస్థ వారు త్రవ్వకాలలో బయట పడిన ఓ రథంతోటే దేవతా విగ్రహాన్ని ట్రాఫిక్ పోలీస్‌లకు బహుమతిగా ఇచ్చారు. ఆ శిల్పం మీద దేవత రథం కుడివేపు తిరుగుతునట్లుగా చేయి జాపితే రథం తాలూకూ గుర్రాలు మాత్రం ఎడమ వేపుకి తిరుగుతోంది

మతంకెళ్ళి సాయి

సీరియల్

ఆవ్యక్తి ప్రముఖ సినీనటుడు కృష్ణ మోహన్.

అతను ఆ పార్టీకి అధ్యక్ష పదవి చేపడితేనే పార్టీకి ప్రజాబలం వస్తుంది. ఎందుకంటే

ఎన్టీఆర్ తరువాత సినీరంగంలో ఎక్కువ గ్లామర్, అభిమాన సంఘాలు ఉన్న నటుడతను. ముఖ్యంగా "మాబ్ ఎట్రాక్షన్" విషయంలో అతను ఎవరికీ తీసిపోడు. ఆమె ఆలోచనలు విన్న వారందరూ ఏకగ్రీవంగా ఆమెను బల పరచారు. న్యూస్ పేపర్లలో ఆ విషయం ప్రస్తావించటం కూడా జరిగింది. తెలుగు దేశం ప్రభుత్వం పాలనలో పోలీసులు జర్నలిస్టులతో అనౌచిత్యంగా ప్రవర్తించిన తీరు, న్యాయవాదుల ఊరేగింపుపైవారు లాఠీ ఛార్జ్ చేయటం, ఎడిటర్లపైన, జర్నలిస్ట్లపైనా కేసులు బనాయించటం. ఇవన్నీ పత్రికల వారికి నచ్చకపోవటంవల్ల "తెలుగు భారతి" పార్టీకి కొంచెం ఎక్కువ మోతాదులో ప్రాముఖ్యం ఇవ్వసాగాడు. దాంతో జయలక్ష్మి హఠాత్తుగా చాలా ముఖ్యమయిన వ్యక్తిగా గుర్తింపు సంపాదించుకొంది. వివిధ పార్టీల్లో ఉన్న నాయకుల్లు కొంతమంది ఆమె పార్టీలో చేరటానికని రాయబారాలు పంపటం ప్రారంభించారు.

ఈ పరిస్థితిలో ఇంద్రకాంత్ తనకు సహాయంగా ఉంటేతప్ప తను సరయిన నిర్ణయాలు తీసుకోవటం సాధ్యం కాదని అనిపించిందామెకి.

ఆమె వర్తమానం అందిన వారంరోజుల తర్వాత వచ్చాడతను. ఆరోజునుంచీ రాత్రింబగళ్ళు పార్టీ కార్యకలాపాలు ముమ్మరంగా జరగ సాగాయ్.

సినీనటుడు కృష్ణమోహన్‌కి ఆప్తులయిన రాజకీయ నాయకులనూ, ఇతర సినీ ప్రముఖులను ఆశ్రయించి వారితోపాటు మద్రాస్ చేరుకున్నారువారు.

జరిగినకథ:-

సిద్ధార్ధ నీతిని నమ్ముకున్న రాజకీయ నాయకుని కొడుకు. తండ్రిలా కాక అవినీతి ద్వారానయినా సరే ముఖ్యమంత్రి అవాలన్న ఆశయంతో జీవితం ప్రారంభించాడు.

రాజకీయ వర్గాల్లో విపరీతమయిన పలుకుబడిగల భారతీదేవి తన కంటెచిన్న వయసులో ఉన్న సిద్ధార్ధ వేపు ఆకర్షితురాలయి సర్వం సమర్పించుకుంది. అతని ధ్యేయానికి తోడ్పడాలని నిర్ణయించుకుంది.

జమిందారు వంశంలో పుట్టిన గజపతిరాజా, తండ్రిని ఎన్నికల రంగంనుంచి విరమింప జేసి తను కాంగ్రెస్ పార్టీలో చేరి పోయాడు.

అతను మోసం చేద్దామనుకున్న పూర్ణ అతని మెడకు గుదిబందయింది. ముఖ్యమంత్రి అవాలన్న అతని కోరికకు పరిపూర్ణ సహకారం అందిస్తూన్న పూర్ణకు మరో వ్యక్తితో సంబంధం ఉందని తెలిసి ఆమెను పుట్టింటికి గెంటి వేశాడు.

1977 ఎన్నికలు అతనికి నిరుత్సాహాన్ని కలిగించినయ్.

మరోవేపు 'ఆంధ్రదేశం' దినపత్రిక రామవర్మ తన పత్రికను నిజాయితీగా నడిపితే నిలబడడం కష్టమని బ్లాక్ మెయిలింగ్ మొదలు పెట్టాడు. అదిచాలా లాభదాయకంగా పరిణమించి చివరకు పార్లమెంట్ మెంబర్‌గా అయ్యాడు. తన స్నేహితుడితో కలసి అనుభవిస్తున్న అమ్మాయినే భార్యగా చేసుకోవాల్సి వచ్చిందతనికి!

జయలక్ష్మి తెలంగాణా పోరాటంలో తండ్రినీ, తల్లినీ పోగొట్టుకుని కమ్యూనిస్ట్ పార్టీతరపున రాజకీయాల్లోకి దిగింది. డాక్టర్ విష్ణు ఆమెను పెళ్ళి చేసుకున్నాడుగానీ ఓ చింత కోరిక కోరాడు.

గజపతిరాజాకు కాబరే డాన్సర్ "ప్రమోద"తో పరిచయమయ్యింది. ఆమెను కోరగా తిరస్కరించి బెదిరించింది. సిద్ధార్ధ మంత్రి అయ్యాడు. ఎన్నికలలో గజపతిరాజా తనకు పోటీ అభ్యర్థిని హత్య చేయించి ఎన్నిక వాయిదా వేయిస్తాడు.

ఎన్నికలలో తెలుగు దేశం ఘనవిజయం సాధించింది. సిద్ధార్ధ తన కొడుకును రాజకీయాలలో చేర్చాలని నిర్ణయించుకొంటాడు. భారతీదేవి చెప్పినట్లు ఎన్టీఆర్ గద్దెదిగి, నాదెండ్ల ముఖ్యమంత్రి అయ్యాడు. మధ్యంతర ఎన్నికలు జరిగాయి ఈ సారి సిద్ధార్ధ గెలిచాడు.

రామవార్మ పత్రిక 'ఆంధ్రదేశం' తెలుగుదేశం ప్రభుత్వానికి మద్దతుగా ప్రచారం చేస్తుంది. ఆ పార్టీ విజయం సాధించడంతో అతనికి పట్టపగ్గాలు లేకుండాపోయి, తన కార్యక్రమాలు ప్రారంభించాడు. అతని భార్య డ్రగ్స్‌కు అలవాటు పడింది. ఆమెకు పుట్టినశిశువుకు ట్రీట్‌మెంట్ ఇవ్వాల్సివచ్చింది. పోలీస్ ఎన్‌కౌంటర్‌లో డాక్టర్ విష్ణు మరణించాడు.

—ఇకచదవండి

రాబందుల రెక్కల చప్పుడు

వారం రోజులపాటు కృష్ణమోహన్‌తో సంభాషణలు జరిగాయ్.

మొదట్లో అతను రాజకీయాల్లోకి దిగటానికి ససేమిరా ఇష్టపడలేదు.

"దయచేసి నన్నొదిలేయండి. ఆ రొచ్చులోకి దిగటం నాకిష్టంలేదు" అన్నాడతను అయిష్టంగా.

కానీ జయలక్ష్మి నిరాశ పడలేదు.

"తెలుగుదేశం ప్రభుత్వం చేస్తున్న అవక తవకలన్నీ మీకూ తెలుసు. దాని వల్ల రాష్ట్రానికీ, రాష్ట్రంలోని అనేక వర్గాల ప్రజలకూ ఎంతో హాని జరుగుతోంది! ఒక సినీ నటుడిగా ప్రజలు మీరంటే అభిమానం కురిపిస్తున్నారు. ఆ అభిమానాన్ని మీరు వారి సేవకే వినియోగిస్తే మీకెంత సంతృప్తిగా ఉంటుందో ఒక్కసారి ఆలోచించండి-" అందామె. ఆమెతోపాటు తన శ్రేయోభిలాషులుకూడా అతనిని బలవంత పరిచేసరికి అతను తన ఆలోచనాధోరణిని మార్చుకోక తప్పలేదు.

"కానీ ప్రజలకు సేవచేయడానికి ఎన్నో పార్టీలున్నయ్-ఎంతోమంది రాజకీయ నాయకులున్నారు. నన్నే ఎందుకు దింపాలనుకుంటున్నారు మీరు?" అడిగాడతను సంశయంగా.

"ప్రస్తుతం జాతీయ పార్టీకూడా ప్రజల అభిమానం సంపాదించలేని స్థితిలో వుంది. ఒక పార్టీ అవినీతికి అంకిత మయితే, మరోపార్టీ మత తత్వంతో నిండిఉంది. ఇంకోపార్టీ మనిషి మనుగడకే ప్రమాదం కలిగించే ధోరణి అవలంబిస్తోంటే మరో పార్టీ మనిషిని మరగా చేసే పాలసీ అవలంభిస్తోంది. ఈ పరిస్థితుల్లో కొత్త ప్రాంతీయ పార్టీ ఒక్కటే మన రాజకీయ పరిస్థితికి సమాధానం! సినిమా గ్లామర్ అన్నిచోట్లా అన్ని వ్యాపారాల్లో టానిక్‌లా ఉపయోగ పడుతున్న ఈ రోజుల్లో మన రాష్ట్రాన్ని ఏలుతున్న సినిమా గ్లామర్‌ని ఇంకో సినిమా గ్లామర్‌తోనే ఎదుర్కోవాలని మా ఆలోచన అంది జయలక్ష్మి.

"పార్టీలో తల దూర్చితే - నా సినిమాల సంగతేమిటి? అదిమాత్రం నేను వదలదల్చుకోలేను -" జయలక్ష్మికి లోలోపల ఆనందం కలిగింది. తను కోరుకుంటోందీ అదే! అతని గ్లామర్‌ని మాత్రమే తను ఉపయోగించుకుంటుంది. మిగతా బరువు బాధ్యతలన్నీ తనవే అవుతాయ్.

"అదికూడా నేను ఆలోచించాను. మీరు పార్టీ ప్రెసిడెంట్‌గా ఉండి మమ్మల్ని గైడ్ చేస్తే చాలు. మిగతా బాధ్యతలన్నీ నేనే చూసుకుంటాను-ఎన్నికల సమయంలో మాత్రం మీ అవసరం మాకుంటుంది. ఎన్నికల ప్రచారానికి మీ సమయం కొంత కేటాయించాలి-"

"సరే - మీరంతగా అడుగుతూంటే - కాదనటం నాకూ యిష్టంలేదు-" అన్నాడతను తన అంగీకారం తెలియజేస్తూ.

హైద్రాబాద్‌లో పెద్దఎత్తున తెలుగు భారతి పార్టీ స్థాపించడం జరిగింది. న్యూస్‌పేపర్స్ అన్నీ ఆ పార్టీ అవతరణను చాలా పెద్దఎత్తున సమీక్షించాయ్. దాంతో



ఆంధ్రప్రదేశ్ అంతటా ఒక్కసారిగా అలజడి మొదలయింది. హోటల్స్‌లో, సినిమా హాల్స్ దగ్గర, ఆఫీసుల్లో, బస్సుల్లో, రైళ్ళల్లో - ఎక్కడ చూసినా అదే చర్చాంశం అయిపోయింది.

జయలక్ష్మి ఆరోజునుంచీ మరింత శ్రమించ సాగింది. కృష్ణమోహన్ అభిమాన సంఘాలన్నిటినీ కలుసుకుని, వాటిని సంఘటితపర్చి హైద్రాబాద్‌లో రాష్ట్ర సమాఖ్య ఒకటి ఏర్పాటు చేసింది. ఆ తరువాత "తెలుగు భారతి" స్త్రీలశాఖ, 'తెలుగు యువభారతి' అనే యువకుల శాఖలకు ప్రారంభోత్సవాలు జరిగాయ్. ప్రతి ఊళ్ళోనూ 'తెలుగు భారతి' ఎన్నికల కార్యాలయాలు తెరిచేశారు. ప్రతిచోటా ఆమెకు లభిస్తోన్న అపూర్వమయిన ఆదరణ గమనించేసరికి తెలుగుదేశం పరిపాలన ప్రజలకు ఎంత చికాకు కలిగించిందీ అర్థమయిందామెకి. మొదటిసారిగా ఆమెకు సంశయం కలిగింది- రాష్ట్ర ముఖ్యమంత్రి అవాలనుకున్న తన ధ్యేయం ఈ ఎన్నికల్లో నెరవేరబోతోందా?

ఎన్నికలు సమీపించాక కృష్ణమోహన్ రంగంలోకి దిగాడు. ఊరు ఊరుకీ పల్లెపల్లెకూ వెళ్ళి ప్రజలను కలుసుకుని తమ తెలుగు భారతి పార్టీ పూర్తి ప్రజాస్వామ్యపార్టీ అనీ, ఇందులో నియంతలకూ, అల్లుళ్ళకూ, కొడుకులకూ స్థానం ఉండదనీ ప్రచారం ప్రారంభించాడు.

ఎన్‌టిఆర్ తన కొడుకు బాలకృష్ణ తనకు వారసుడని ఒకప్పుడు ప్రకటనచేసిటనను పూర్తిగా ఉపయోగించు కున్నారు వాళ్ళు.

రాత్రింబగళ్ళు రాష్ట్రమంతటా తిరగటం, సభల్లో మాట్లాడటం జయలక్ష్మికి సరికొత్త అనుభవం. ఇంద్రకాంత్ పక్కన ఉండటం వల్ల ఎంతో ధైర్యం, ఉత్సాహం ఆమెకు లభిస్తోన్నాయ్.

ఇంద్రకాంత్ ఆ రాత్రి పన్నెండు గంటలకు తనతో మాట్లాడుతూనే సోఫాలో నిద్రలోకి జారిపోయాడు.

హఠాత్తుగా అతని రూపం ఎన్నో సంవత్సరాలక్రితం తామిద్దరూ హోటల్లో మనసులు విప్పి మాట్లాడుకున్న నాటికి లాక్కెళ్ళి పోయింది ఆమెని. అతనికెదురుగ్గా

కూర్చుని మనసులో నిండిన తీయని అనుభూతితో అతని వేపే చూడసాగింది.

అప్పటి చిలిపితనం ఇప్పుడతని మొఖంలో లేదు. అప్పటి అందమూ లేదు గాని అతనిలోని ఆకర్షణ అప్పటికీ ఇప్పటికీ అలాగే ఉండిపోయింది.

అతని కోరికను తనెలా తిరస్కరించ గలిగిందారోజు? ఇప్పటికీ తన కర్థం కాని విషయం అది. బహుశా రాజకీయ పదవి మీద మోజే తన మనసుని అదుపులో ఉంచ గలిగిందేమో! ఆనాటి అతని కోరికను తనిప్పుడు తీర్చగలదా? అవును! ఇప్పుడు అతనూ ఒంటరివాడు! తనూ ఒంటరిది? తామిద్దరూ ఒకటవటంలో అనౌచిత్యం ఏముంది?

ఆరోజు విష్ణు కోరిన విచిత్రమయిన కోర్కె గుర్తుకొచ్చిందామెకి. తనప్పుడు విష్ణునెందుకంత కోపగించు కొందో తనకే తెలీదు. తనలోని 'భారతనారి' రక్తమా, లేక తనమనసులో శాశ్వతంగా నిలిచిపోయిన ఇంద్రకాంత్ రూపమా? తన మనసుని విష్ణు గ్రహించగలిగాడేమోనన్న భయమా?

ఏదయినా కావచ్చు! ఏదీకాక పోవచ్చు.

అతనిని చూస్తున్న కొద్దీ ఆమెను చుట్టు ముట్టిన ఒంటరి తనం మరింత భీకరంగా వికటాట్టహాసం చేస్తున్నట్లనిపించసాగింది.

తల్లీ, తండ్రీ, నాయనమ్మ, భర్తా అందరూ దూరమయి పోయారు తనకు. తనొక్కర్తే మిగిలిపోయింది. తనతో మొదటి నుంచి సుఖదుఃఖాలన్నీ పంచు కుంటున్న వ్యక్తి ఒక్క ఇంద్రకాంతే!

అతని పక్కనే కూర్చుని అతని గుండెలమీద తల వాల్చిందామె. అతను గాఢనిద్రలో ఉన్నా అతని స్పర్శ తన శరీరమంతా విద్యుత్‌ని ప్రవహింప జేస్తున్నట్లుంది. అతని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు తన మొఖం మీద వేడిగా తగులుతున్నాయ్. పూర్తిగా అతని మీదకు వరిగాక మెలకువ వచ్చిందతనికి. కొద్దిక్షణాలు ఆమె వంకే విస్తుపోయి చూస్తుండి పోయాడు.

ఆ తరువాత నెమ్మదిగా ఆమె పెదాల మీద ముద్దు పెట్టుకున్నాడు.

ఇద్దరికీ మాటలు రావటంలేదు. చూపులే భాషగా మారినయ్ ఇద్దరి వయసులూ అతి వేగంగా పాతికేళ్ళు వెనక్కు ప్రయాణించినయ్, కోర్కెల తుఫానులో ఇద్దరూ తీగల్లా ఊగిపోయారు.

* * * *

బై ఎలక్షన్లో హరిజన వాడ తమకు అడ్డుపడకుండా ఎలా తొలగించాల్సింది ముందుగానే ప్లాన్ సిద్ధం చేసుకున్నాడు గజపతిరాజా. ఎన్నికలయ్యాక విజయోత్సవం ఊరేగింపుగా హరిజన వాడ మీదనుంచీ వెళ్తోంటే తన కార్యకర్తలు కాల్చే బాణా సంచా వెలుగులో అగ్నికి ఆహుతిఅయిన గుడిశెల మధ్య కట్టుబట్టలు తప్ప మరేమీ మిగలని హరిజనులు నిస్తేజంగా నిలబడి ఉండటం ఆనందంగా గమనించాడతను.


"లేకపోతేవీళ్ళకు రాజకీయాలెందుకు? ఎవడి బ్రతుకాడు బ్రతకక!" అనుకున్నాడతను స్వగతంగా.

ఆ స్వగతాన్ని అర్థం చేసుకున్నట్లు జవాబిచ్చాడు సిద్ధారెడ్డి.

"అందుకే దేవుడీశిక్ష విధించాడు వాళ్ళకు –"

"గుడిశెలు ఎవరితో తగల బెట్టించావ్?" కుతుహలంగా అడిగాడు గజపతి రావ్.

"ఎవడో ఎందుకు? వాళ్ళ చేత్తోనే వాళ్ళ కన్ను పొడిపించాను. యాభయ్ వేలు పడేస్తే కన్నవాళ్ళనే పొడిచిపారేసే దేశం కదా మనది–" అన్నాడతను.





పదవీ ప్రమాణస్వీకారం చేసిన రెండోరోజునుంచే పార్టీ వ్యవహారాలన్నీ ఆసక్తితో గమనించసాగాడతను. అతని పరిశీలన వృధాకాలేదు. నాదెండ్ల ఒక వర్గాన్ని ఏర్పాటు చేసుకోవటం, ముఖ్యమంత్రిగా తనే అవాలన్న ఆలోచనల్తో రహస్య సమావేశాలు ఏర్పాటు చేసుకోవటం అతని ఆలోచనలకు ఊపిరి పోసినయ్. ప్రస్తుతం ఉన్న నాయకత్వాన్ని బలహీన పరుస్తేగానీ రాష్ట్రంలో అనిశ్చిత పరిస్థితి ఏర్పడదనీ, అప్పుడుగానీ తన ధ్యేయాన్ని నెరవేర్చుకునే అవకాశాలు రావనీ అతనికి తెలుసు. అగస్ట్ 14 రాత్రి నాదెండ్ల వర్గంలోచేరి, ఎన్టీఆర్ మంత్రివర్గాన్ని కూలదోయాలని నిర్ణయం తీసుకున్నాడతను.

అంతా అనుకున్నట్లే జరిగిపోయింది.

నాదెండ్లను ముఖ్యమంత్రిగా నిర్ణయించాడు గవర్నర్ రామ్‌లాల్. నాదెండ్ల మంత్రివర్గంలో సభ్యుడు కాకపోయినా గజపతిరాజాకు ప్రజాస్వామ్య తెలుగుదేశం పార్టీతో చాలా పలుకుబడి ఏర్పడిపోయింది. అతని ఆదేశాలు తు.చ. తప్పకుండా అమలు జరుపుతున్నారు. అతనింటిచుట్టూ కంట్రాక్టర్లూ, పారిశ్రామిక వేత్తలు, ఎన్‌జీవోల లీడర్లూ, వ్యాపారస్తులు మూగసాగారు.

అప్పటికప్పుడే తనకోవర్గాన్ని ఏర్పరుచుకోవాలని చురుకుగా సన్నాహాలు ప్రారంభించాడతను. ఎన్టీఆర్ గ్రూప్‌లోనూ, నాదెండ్ల గ్రూప్‌లోనూకూడా కొంత మంది ఎమ్మెల్యేలు అతనికి తమ మద్దతు తెలియజేశారు.

ఒక్కొక్క ఎమ్మెల్యేకు అయిదు లక్షల చొప్పున ఇస్తే తను ముఖ్యమంత్రి అవటం సాధ్యమేనన్న విషయం స్పష్టమయిందతనికి.

అరవైమందిని కొన్నాక పరిస్థితి మళ్ళీ తారుమారయ్యింది.

తిరిగి ఎన్టీఆర్‌నే ముఖ్యమంత్రిగా ఆహ్వానించాడు గవర్నర్. రాజకీయంగా రాష్ట్రమంతటా అనిశ్చిత పరిస్థితి అలుముకున్న సమయంలో అసెంబ్లీ రద్దయింది. మళ్ళీ ఎన్నికలు జరపాలని నిర్ణయించింది కేంద్రం.

దాంతో పూర్తిగా నిరాశ పడిపోయాడు గజపతిరాజా. ఆ సమయంలో ప్రమోద గుర్తుకొచ్చిందతనికి. తనను ఆ డిప్రెషన్‌నుంచి ఆమె ఒక్కర్తే కాపాడగలదనిపించింది. వెంటనే ఆమెకు ఫోన్ చేశాడతను.

"ఏంకావాలి ?" బార్‌నుంచి మాట్లాడిందామె నవ్వుతూ.

"ఆరోజు నేను చాలా అనౌచితంగా ప్రవర్తించాను. సారీ చెప్దామని-"

ఆమె నవ్వింది.

"కొత్త నాటకమా ఇది-"

"కాదు ప్రమోదా! నీతో మాట్లాడాలి-"

"ఏమిటా మాటలు ?"

"నేను నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను-"

ఆశావాది

నిజమయిన ఆశావాది ఎవరంటే షాపింగ్ కెళ్ళిన భార్య తిరిగి వస్తుందని ఎదురు చూసేవాడు.

ఆమె మళ్ళీ నవ్వింది.

"నిజంగానే ప్రమోదా! దయచేసి నవ్వకు-"

ఆమె ఫోన్ డిస్కనెక్ట్ చేసింది.

వెంటనే బయల్దేరి ఆమె డాన్స్ చేస్తోన్న బార్‌కి చేరుకున్నాడతను. అతన్ని చూసి చూడనట్లూరుకుందామె.

రాత్రి పన్నెండింటికి డాన్స్ అయిపోయాక బయటికొస్తూంటే కార్లో కూర్చుని ఎదురుచూస్తున్నాడతను.

"ఓ - ఇంకా వెళ్ళలేదన్నమాట -"

"ప్రమోదా - నువ్వు ఓ.కే. అంటే రేపే తిరుపతిలో పెళ్ళిచేసుకుందాం -"

ఆమె అతని మొఖంలోకి చూసింది.

"సరే -" అంది కొద్దిక్షణాల తర్వాత

పెళ్ళయింది.

మొదటిరాత్రే మనసువిప్పి మాట్లాడిందామె.

తనకు అతను మొదటివాడుకాడు. ఒకసారి గర్భవిచ్ఛిన్నం జరిగింది. ఆ తరువాత ఎవర్నీ ప్రేమించలేదు. చాలా విలాసవంతమయిన జీవితం గడపటం ఇష్టం తన స్వేచ్ఛకు ఎవరూ అడ్డురావటం నచ్చదు -

గజపతి రాజాకు అవన్నీ అడ్డంకులుగా అనిపించలేదు.

ఆ మర్నాడే ఎలక్షన్ కమిషనర్ ఎన్నికలతేదీ ప్రకటించాడు.

ఈసారి గజపతిరాజా ప్రజాస్వామ్య తెలుగుదేశం పార్టీ టికెట్‌మీద పోటీ చేశాడు.

ప్రప్రథమంగా అతని డిపాజిట్ గల్లంతయింది.

వెంటనే ప్రజాస్వామ్య తెలుగు దేశానికి రాజీనామా చేశాడతను. మండల్, మునిసిపల్ ఎన్నికల ఫలితాలు చూశాక కాంగ్రెస్ పార్టీలో చేరాడతను. తెలుగుదేశానికి కాంగ్రెస్ ఒక్కటే ప్రత్యామ్నాయ పార్టీ అన్న విషయం తెలిసిందతనికి. ఎన్నికల్లో ఆ పార్టీ టికెట్ సంపాదించటం ఏమంత సమస్య కాలేదతనికి. ఈసారి ఎన్నికవటమే కాకుండా రాష్ట్రానికి నాయకత్వం వహించాలన్న పట్టుదల అతనిలో ప్రవేశించింది. దానికోసం తన ఆస్తినంతా కూడా అమ్మి వేసినా ఫరవాలేదనిపించిందతనికి ఈసారి ముఖ్యమంత్రి పదవి సంపాదించలేకపోతే ఇంక తను రాజకీయాల్లో ఉండటం అనవసరం అని నిర్ణయించుకున్నాడు.

(సశేషం)

నీకూ-నాకూ మాటల్లేవ్..!

భమిడిపాటి రామగోపాలం

వై. మధు

స్వామి మహత్తరానంద ఉపన్యాసం విని ఇంటికి స్కూటర్ మీద వొచ్చారు ప్రకాశం, జ్యోతీ. అసలు అలాంటి ఉపన్యాసాలు వినే స్థాయికి వాళ్ళింకా చేరలేదు.

"ప్రపంచం అశాశ్వతం"

"జీవితం బుద్బుదప్రాయం"

"ఐహిక సుఖాలే పరమ అనర్థాలకి మూలం"

"అరిషడ్వర్గాన్ని జయిస్తే తప్ప పరిపూర్ణ మానవుడు కాలేడు"

—ఇలాటివేవో చెప్తారు సాధారణంగా ఆ ఉపన్యాసాల్లో. ఆచరించడంమాట ఎలావున్నా జీర్ణించుకోడమే కష్టమనిపించే పరిస్థితులు వాళ్ళవి. ఎటుచూసినా ఆమెకి ప్రకాశమే అతనికి జ్యోతే కనబడే ప్రపంచం వాళ్ళది.

కాని స్వామి మహత్తరానంద సామాన్యుడు కాదు. కొమ్ములు తిరిగిన ప్రాపంచికుల్ని క్షణాల్లో ఆధ్యాత్మిక చింతనాపరులుగా మార్చేసిన ఉదంతాలు అతని ఆముష్మిక చరిత్రలో కొల్లలు. ఆ దారమ్మట వస్తూవుండే ఆ హాలు గేటు దగ్గర కాషాయ వస్త్రాలేసుకున్న ఓ వ్యక్తి వాళ్ళని ఆపి "స్వామీజీ ఉపన్యాసం విని వెళ్ళండి చిరంజీవులూ" అన్నాడు.

అంతే సంగతులు.

ఉపన్యాసం షడ్రసోపేతంగా వుంది. చెప్పేది వేదాంతమే అయినా స్వామి ఉదహరించింది ప్రపంచమే. పిల్లిమీదా ఎలుకమీదా పెట్టి పిట్టకథలు చెబుతూ మహత్తరమైన హాస్యోక్తులు పేల్చారు. అయినా వక్తవ్యం సమంజసం కాదుగనక ప్రవీళ్ళే కాదు - అక్కడ కూచున్న రెండువందల మందిలో ఒక్కరుకూడా నవ్వలేదు. మనసుల్లో ఏమనుకున్నారో తెలియదు కదా!

అలాగే, జ్యోతికీ ప్రకాశానికీకూడా — పిల్లలిద్దరూ సెలవులకి ఊరెళ్ళి పోయారని, ఈ పూటకి వంట పూర్తయిపోయిందని, రాత్రి రేడియోలో గొప్ప ప్రోగ్రాము లేవీ లేవని, ఒకరితో ఒకరు చెప్పుకుని నిబ్బరించుకున్నట్టుండిపోయారు.



తిరిగొచ్చేటప్పుడు స్కూటరు మీద కూడా ఎప్పట్లా కూచోలేదువాళ్ళు. ఈ చేత్తో ఈ రింగు పట్టుకున్నానుకదా ఇంత ట్లోకే పడిపోతానా అన్నట్టు జ్యోతి కూచుంది. తను ముందుకి వొంగినా బొజ్జమీద కుడిచెయ్యి వెయ్యకపోయినా తను అక్కడ కూచునే ఉందిగాని తోవలో యెక్కడా రాలిపోయి వుండదని ప్రకాశమూ సరిపెట్టుకున్నాడు.

రాత్రి భోజనాలు చేస్తూ వాళ్ళాడుకున్న మాటలు మరీ అంత "తాత్వికంగా" లేకపోయినా ఎప్పట్లాంమాత్రం లేవు. ఆఖర్ని జ్యోతి అంది, "రేపు ఏకాదశి. మీకు శలవుకూడా వచ్చింది. నాబొజ్జా, నా యిల్లూ, నా లోకం అనే తాపత్రయం ఒక్క రోజుపాటు కట్టిపెట్టి మౌనం పాటిద్దామండీ."

"ఔను. ఎన్నెన్నో చెప్పేరు. అవన్నీ యెలాగూ చెయ్యలేం. ఇలా వారానికో రోజో, నెలకోరోజో మౌనం పాటించినా కూడా మంచిదే. పుణ్యమూ, మోక్షమూ కావాలని కాదుగాని ఆరోగ్యం అని అన్నారుగా స్వామీజీ!" అని తనూ ఆ దారికే చేరేడు ప్రకాశం.

"మా పెదనాన్నగారు, మీకు తెలుసో లేదో; ప్రతి సోమవారం మౌనవ్రతంలో ఉండేవారు. అరవై అయిదేళ్ళొచ్చినా ఒక్క వెంట్రుక తెల్లబడలేదు. మా నాన్నగార్నీ ఆయన్నీ వోచోట చూసినవాళ్ళు మీతమ్ముడుగారా అని అడగడం, అయ్యో మా అన్నగారండీ; నాకన్నా పన్నెండేళ్ల పెద్ద! అని ఈయన నవ్వుకోడం—"


"నాకెందుకు తెలీదు? ఆయన ఎలమంచిల్లో వుండేవారు. మన పెళ్ళికొచ్చేరు. (ఆవేళ సోమవారమే) ఆ తరవాతకూడా ఓసారి ఆయన్ని రైల్లో కలిశాను, ఆరోజూ సోమవారమే. కాగితంమీద రాసి పలకరించారు నన్ను - అబ్బాయీ! నువ్వూ, జ్యోతీ పిల్లాడూ కులాసా? అని. అప్పటికింకా పాప పుట్టలేదు."

"ఇహ నేమ్మరి? రేపంతా మనం మాట్లాడు కోకూడదని ఇదే నిర్ణయం. అంతగా సంజ్ఞల్తో బోధపడనిదేదైనా ఉంటే కాయితాల మీద రాసుకుందామేం?"

* • *

ఉదయం ఆరున్నరకి పాల మనిషి దగ్గిరే వ్రతభంగం అయినంత పనైంది జ్యోతికి. సెలవు రోజున ప్రకాశం ఇంటి దగ్గిరే ఉండి పోతాడు. బైట తాగే కాఫీలు (కనీసం పొద్దు పోయేకోగా నాలుగు) ఇంట్లోంచే రావాలి. అంచేత అర లీటరు పాలు చాలవు. పిల్లలు ఊళ్ళోలేరు కదా. అని లీటరు పాలు అరలీటరుకి తగ్గించుకున్నారు, ఐతే మరి సెలవు రోజున ఎలా లేదన్నా మరో పావు లీటరు అవసరం. ఆ మాట పాలమ్మితో చెప్పే పద్ధతి ఎరుక్కొచ్చేసరికి గగనం అయింది. "మరో డబ్బా పొయ్యి" అని మూడు మాటల్తో చెప్తే పోయేది. వెనక్కి తిరిగి వెళ్ళిపోతున్న ఆ మనిషి చెయ్యి పట్టుకుని ఆపి, జాడీలోంచి ఆ డబ్బా అందుకుని; 'ఒకటి' అన్నట్లుగా వేలితో చూపించి గిన్నె ముందుకి జాపింది జ్యోతి. అయినా ఆ మట్టిబుర్రకి అర్థం కాలేదు. "ఒకటే టమ్మా; రెండు కొల్చి పోసినాను గాదా?" అంది: "అదికాదు ఇంకోటి ఎగస్త్రా" అందామని, తల అడ్డంగ ఆడించింది జ్యోతి. "ఏటమ్మా ఇంకా నిద్దర తీర్నేదా? రెండు డబ్బాలు పోస్తే సూసుకుని కూడా ఒకటే పోశానంతావా?" అని జ్యోతి చేతిలోంచి గిన్నె లాక్కుని పాలన్నీ జాడీలో వొంపేసుకుని "ఇప్పుడు సరీగ సూడు." అని; "ఒకటీ"; "రెండూ" అని లెక్కగా స్పష్టంగా కొలిచి; గిన్నె ముందుకి తోసి, "ఎల్లెళ్లు. నా కవతల పనుంది" అని గిర్రున తిరిగింది పాల మనిషి. మళ్ళీ దాన్ని ఆపి, ఈ మారు మూడు వేళ్ళు చూపించి; పొయ్యమని గిన్నె ముందుకి జాపింది జ్యోతి. "ఓస్ అదా? అని; మరో డబ్బాడు పాలు పోసి; "నోటితో సెప్ప కోడదా? బంగారం రాలి పోద్దిగావాల!" అని విసుక్కుంటూ పోయింది.

"వాక్కు వెండి వంటిది, కాని మౌనం స్వర్ణమే," అని రాత్రి స్వామీజీ



చెప్పిన మాటలు మనసులో మెదిలాయి జ్యోతికి. పాల మనిషికి అక్షర జ్ఞానం లేనందుకు తొలిసారిగా ఆమెకి విచారం వేసింది.

"మీరు రోజూలాగా 'కాఫీ' అని అరవకండి, ఇవాళ మౌనవ్రతం, నేనే, కాఫీ తయారవగానే తెచ్చి ఇస్తాను." అని చీటీ రాసి ప్రకాశం చేతికి అందేటట్టు పెట్టినా సరే; (అతడు నిద్రలో అట్నుంచి ఇటు వొత్తిగిలడం వల్ల ఆ చీటీ కనుమరుగై పోయి కాబోలు) లేచీ లేవగానే "కాఫీ?" అని కేక పెట్టేశాడు. పరుగెత్తుకుంటూ వెళ్ళింది, జ్యోతి చీటీ ఏరి అతని చేతిలో పెట్టి, నోటికి చెయ్యి అడ్డంపెట్టి నవ్వింది. ప్రకాశం చీటీ చదువుకుని, తలాపి దిక్కున టీపాయ్ మీదున్న పెన్ తీసి "సారీ" అని రాశాడు ఆ చీటీ మీదనే ఓ మూల.

• * *

ఎనిమిదిన్నర దాటేక మేడమీది వాటాలో ఉంటున్న సుందర్రామయ్యగారబ్బాయి "ఏమండీ మీకు ఫోన్!" అని కేకేసి-తుర్రుమని మెట్లెక్కి వెళ్ళిపోయాడు. అసలా అబ్బాయి మెట్లన్నీ దిగనేలేదు. కిటికీకి పైన వెంటి లేటరుందికదా. గదిలో ఎవరైనా ఉన్నారా, ఉంటే వాళ్ళేం చేస్తున్నారు అన్నది అందులోంచి కనబడదు, గాని గదిలో ఎవరైనా ఉంటే మాత్రం అందులోంచి వేసిన కేక వినిపిస్తుంది, ఆ లెవెలుకి రాడానికి మేడమీంచి అయిదారు మెట్లుదిగితే చాలు. అంచేత ప్రకాశం ఆ కేకవిని గది తలుపు తెరిచి మెట్లదాకా వచ్చేసరికే ఆ అబ్బాయి పైకి వెళ్ళిపోయేడు. ఏం చెయ్యాలా అని ఆలోచిస్తూ ప్రకాశం మొదటి మెట్టు దగ్గిర నుంచుండిపోయేడు.

"ఏమండీ! మీకు ఫోన్" అని ఆ అబ్బాయి వేసిన కేక వంటింట్లోవున్న జ్యోతికికూడా వినిపించింది. "మౌనవ్రతంనాడు ఫోన్ లో మాత్రం మాట్లాడొచ్చా?" అని మనసులో కలిగిన సందేహానికి ఆమెకి చిరునవ్వు వచ్చింది. ఖచ్చితంగా చెప్పాలంటే మాట్లాడనే కూడదు. కాని ఈ ధర్మసూక్ష్మం ప్రకాశానికి తట్టిందో లేదో. అతను ఫోనొచ్చిందికదా అని (దూరంగా ఉన్న మనిషితో మాట్లాడెయ్యొచ్చు కదా అని) సరదాపడి వెళ్ళి మాట్లాడేస్తాడేమో అని చిలిపి దిగులుతో, చేస్తున్న పని ఆలా వదిలేసి గదిలోకి, మెట్ల

దగ్గిరికి వచ్చేసింది.

ఫోనొచ్చింది అని సూచిస్తూ చెవిదగ్గిర ఎడంచేతి పిడికిలి మూసిపెట్టుకుని కుడిచేతి చూపుడు వేలును మేడమీదికి చూపించేడు ప్రకాశం.

ఎడంచెయ్యి నోటికి అడ్డంగా పెట్టేసుకుని, కుడిచేత్తో "వీల్లేదు" అని సంజ్ఞ చేసింది జ్యోతి.

"మరి ఎలాగ" అని సూచన చేసేననుకుని కుడిచేతి పిడికిలితో ఒకఆంగికం చేసేడు ప్రకాశం

"ఎందుకు మాట్లాడ కూడదు" అన్నాడనుకుంది జ్యోతి. "లోపలికి రండి" అని సంజ్ఞ చేసి మరి అతనివేపు చూడకండా గదిలోకి వెళ్ళిపోయింది.

పెరుగు గిన్నెలోంచి వెన్న తీసి విడిగా పెడ్తూ ఉన్నపాట్న బయలుదేరిన జ్యోతికి పెన్ తీసి రాయాలంటే కుడి చేతికి వెంటనే వీలుకాదు. అందుచేత మళ్ళా వంటింట్లోకి వెళ్ళి వేళ్ళని అంటుకున్న వెన్నను గిన్నె అంచులతో గీకి, ఇంకేమీ వృధా పోలేదన్నంత వరకు ఆ పనిచేసి ఇవతలికి వస్తూ ఉండగా. ఎంతసేపటికీ రాదేమి ఈ కరణేషు మంత్రి అని చిరాకు పడుతూ వంటింటివేపు వస్తున్న ప్రకాశాన్ని ఢీ కొట్టింది.

"హుఁ" అంటే "హుఁ" అనుకున్నారిద్దరూను.

"ఉండండి" అని సంజ్ఞచేసి గదిలోకి వచ్చింది జ్యోతి. మంచం పక్కన టీపాయ్‌మీద పెన్ ఉందిగాని కాగితం లేదు. ఏవో కాగితాలున్నాయిగాని వాట్లో ఏ ఒక్కటీ చిత్తురాతకి పనికొచ్చేటట్లు లేదు. మెడికల్ షాపువారిచ్చిన రశీదు అది బిల్లు పెట్టుకోడానికి కావాలి. వెనకాల ఖాళీగానే ఉంది కాని డాక్టర్‌గారు అక్కడేదో రాసి సంతకంపెట్టే పనివుంది. ఎవరో స్నేహితుడు ప్రకాశానికి రాసిన ఉత్తరం...దాని వెనక పక్క కూడా ఖాళీగానేఉంది కాని ఆ ఉత్తరంలో ఇది ఫలానా వాళ్ళకి చూపించు, అని ఏదో ఉంది. అంచేత దానిమీదకూడా ఏమీ రాయకూడదు. ఇంక మిగిలినవి రెండు వేపులా రాసినవో టైపు చేసినవో అచ్చు వేసినవో ఉన్నాయిగాని ఖాళీగా ఉన్నవి, ఆ సమయంలో చేతికి అందలేదు. పిల్లల పుస్తకాలు అద్దాల అల్మారాలో ఉన్నాయి. దానికి చిన్న తాళంకప్ప. అది తెరిచి, ఒక నోట్‌బుక్ తీసి, అందులోది ఒక కాగితం ముక్క చించి, ఆ పుస్తకాన్నే వొత్తుకి పెట్టుకుని, రాయడానికి కూర్చునేటంతలో మేడమీది వాళ్ళబ్బాయి మళ్ళీ వచ్చాడు. "అయ్యో, ఇంట్లోనే ఉన్నారా? మీరు ఎంతకీ రాకపోతేనూ, లేరేమో అనుకుంటున్నాను" అన్నాడు.


"ఆగు" అని సంజ్ఞకి చెయ్యి అడ్డం పెట్టింది జ్యోతి. కాగితంమీద 'చకచకా రాసేసింది, "ఇవాళ మేం ఇద్దరం మౌనవ్రతం. అంటే- అసలే ఏమీ మాట్లాడకూడదని నియమం పెట్టుకున్నాం" అని.

"అయితే?" అన్నాడు ఆ అబ్బాయి

"మాకోసం ఎవరైనా ఫోన్ చేస్తే వారికి ఈ సంగతి చెప్పాలి. అవసరం అనుకుంటే వాళ్ళు ఇక్కడికి రావచ్చు. మేం ఇంట్లోనే ఉంటాం"...వ్రాత.

"మరి అప్పుడు మాత్రం ఎలా మాట్లాడతారు?"- మాట. చిరునవ్వు.

"ఇదుగో ఇలాగే. మేం రాస్తాం, వాళ్ల



మాట్లాడతారు ?"- వ్రాత.

ఆఅబ్బాయికీ నవ్వొచ్చింది. "సర్లెండి అలాగే" అని వెనక్కి తిరిగాడు.

పెన్ కిందపడేసి చప్పట్లు కొట్టింది జ్యోతి. ఆ అబ్బాయి మళ్ళీ ఇటు చూశాడు. "థేంక్స్. మీకు చాలా శ్రమయిస్తున్నాం" అని రాసి ఆతనికి చూపించింది జ్యోతి.

"ఫరవాలేదులెండి" — అని చెప్పి ఆ అబ్బాయి వెళ్ళాడు.

ప్రకాశం 'జ్యోతి మొహాన్ని తన చేత్తోనూ మూత్తోనూ అభినందించి, ఆమె చేతిలో పెన్ లాక్కుని "నువ్వు చాలా గొప్ప" అని ఇంగ్లీషులో రాసేడు. జ్యోతి తన మందమీద కొద్దిగా మిగిలిపోయిన వెన్న జిడ్డు అతని మొహానికి పట్టించి "మీరు చాలా జిడ్డు" అని రాసి వంటింట్లోకి పారిపోయింది.

• • •

"ఇదుగో, చూడండీ -" తలుపు తీసుకుని లోపలికొచ్చిన సుందర రామయ్య ప్రకాశంతో అన్నాడు. "సారీ ! మీ జోనల్ మేనేజర్ నీలకంఠేశ్వర రావుట- ఈవూరికి ఇవాళే క్యాంప్ వచ్చాట్ట. బృందావన్ లాడ్జి రూమ్ నెంబరు 318లో ఉన్నాట్ట. ఫోన్‌చేసి లైన్లో వున్నాడు."

"ఒక్క నిమిషం కూర్చోండి" అని చెప్పటానికి రెండు సంజ్ఞలు చేసి కాగితం కలం పుచ్చుకుని వంటింట్లోకి వెళ్ళాడు ప్రకాశం. "టెలిఫోన్‌కి మినహాయింపు ఇచ్చెయ్యకూడదూ" అని రాసి జ్యోతికి చూపించాడు.

జోనల్ మేనేజర్ నీలకంఠేశ్వరరావుని కలవడం, అతను రేపు ఉదయం మొదటి బస్సులో శ్రీకాకుళం వెళదామని ప్రోగ్రాం నిర్ణయించడం అక్కణ్ణించి విజయ నగరం వచ్చి పన్లు చూసుకుని ఎల్లుండి సాయంకాలానికి ఇంటికి చేరవలసి వుండడం అవన్నీ వివరంగా సందేహాలకి సమాధానాలతో సహా రాసుకుని "భోజనం చేద్దాం" అని సంజ్ఞలు చేసుకున్నారు, ప్రకాశం, జ్యోతి.. "సరే" అన్నట్టు తల ఆడించి లేచిన జ్యోతిని చెయ్యిపట్టుకుని ఆపి, "అంతే ఏమన్న మాటా, మన మౌనవ్రతం ఒకరోజు అనుకున్నదల్లా మూడు రోజులు అవుతోంది" అనిరాశాడు ప్రకాశం.


భోజనాలు చేస్తున్నంత సేపూ ఏమీ రాసుకోడానికి వీల్లేకా (ఇద్దరికీ కుడి చేత్తో రాసే అలవాటే ; మరి !) సంజ్ఞలు చేసుకోడంతో అనుభవం చాలక నానా అవస్థాపడి ఎలాగో అయిందనిపించేరు, మొదట ఇవతలి కొచ్చింది, ప్రకాశం, గది తలుపు చప్పుడు, అందులోంచి సందులోంచి ఉత్తరం.


జ్యోతికి, ఉత్తరం చూపించి, "మీ తమ్ముడు." అని చెప్పడానికి కొక సంజ్ఞ చేసేడు ప్రకాశం. జ్యోతికి అది సరిగ్గా అర్థమైనట్టు, ప్రవర్తించక పోగానే కవరు తెరవకుండానే కలంతో "సత్యం, ఏలూరు" అని దాని మీద రాశాడు. "విప్పండి" అన్నట్టు సంజ్ఞ చేసింది జ్యోతి.

"డియర్ బావగారూ ! మేం అంతా ఇక్కడ కులాసా మీరూ ! అక్కా క్షేమం అని తలుస్తున్నాము. పిల్లలు బాగా ఆడుకుంటున్నారు, నాకు ఈ నెల 17వ తేదీని మంగళ వారం ఉదయం 8 గంటలకి మీ వూళ్ళో ఒక కంపెనీలో ఇంటర్వ్యూకి రమ్మని పిలువు వచ్చింది. నాకే కాక, నా స్నేహితుడు రవికి కూడా అదే కంపెనీలో అదే వుద్యోగానికి ఆరోజే ఇంటర్వ్యూకి రమ్మని పిలుపు వచ్చింది. మేం ఇద్దరం సోమవారం సాయంకాలానికి అక్కడికి వస్తున్నాము. రవి వాళ్ళ బంధువులకి మీ వూళ్ళో బృందావన్ అని ఒక లాడ్జింగు ఉన్నదట. అక్కడ ఉంటాము. సోమవారం సాయంకాలం మేం ఇద్దరం మీ ఇంటికి వస్తాము. మంగళవారం ఇంటర్వ్యూ అయిపోగానే ఆరోజే మెయిల్‌కి వచ్చేస్తాము. ఇద్దరం కనుక మీ ఇంట్లో వుంటే ఇబ్బంది అని అతన్ని ఒంటరిగా వదిలెయ్యడం బాగదని లాడ్జిలో ఉంటున్నాము. అన్యథా భావించ వద్దని మనవి. అక్కను ఆడగానని చెప్పవలెను. సోమవారం అనగా 15వ తేది సాయంకాలం ముఖస్తంగా విశేషాలన్నీ మాట్లాడుతాను-ఇట్లు,సత్యం"

"నిన్న మనం స్వామీజీ ఉపన్యాసానికి వెళ్ళినప్పుడు వాళ్ళు మనింటికి వచ్చుంటారు" అని రాసింది జ్యోతి.

ఉదయం ఒక చిత్తు కాగితం మీద ప్రారంభమైన వాళ్ళ "రాత- భాషణం" (అప్పుడొక) మాటా (అప్పుడొక) మాటా పెరిగి, ఇక విడి కాగితాలతో కుదరక,





ఒక ఎక్సర్‌సైజ్ బుక్‌లో ప్రవేశించింది. ఇది ఎనిమిదోపేజి.

"ఓ చీటీ రాసి తాళం కప్పకి తగిలించి ఉండొచ్చుకదా" అని రాసేడు ప్రకాశం.

"రాసిపెట్టేడేమో మనం వచ్చేసరికి ఆలస్యం అయిపోయింది. ఆ దృష్టిలో లేక మనం చూడలేదేమో"

"మకీని! కప్పతాళానికి పెట్టిన చీటీ చూడకుండా లోపలికొచ్చేసేటంత లేటేమీ అయిపోలేదు."

"కప్పతాళానికే పెట్టేడో చీటీ లేక మడతపెట్టి తలుపు సందులోంచి లోపల వేసేడో."

"ఆలా అయినా మనం లోపలికి రాగానే లైటేసినప్పుడు కనిపించాలి కదా?"

"కప్పతాళానికి పెట్టిన చీటీ గాలికి ఎగిరి పోయిందేమో"

"ఏడవలేక పోయాడు. అన్నీ ఇలాంటి పిడతపన్లే. చేసేదేదో సవ్యంగా చెయ్యకూడదు?"

"ఏమిటి వాడు చేసినదాంట్లో అపసవ్యం?"

"సోమవారం వస్తున్నానని రాసిన ఉత్తరం మంగళవారం నాటికి అందేటట్టు రాయడం ఒకటి."

'ఒకటి-ట, ఇంకా వున్నాయిగావును'

"వాళ్ళ ఫ్రెండు ఉంటేమాత్రం ఏం, మనింట్లోనే దిగొచ్చు కదా! అద్దె లేకండా లాడ్జిరూమ్ దొరికిందని పెద్ద గొప్పగా లాడ్జిలో దిగటం –"

"చాల్లెండి. ఇక్కడికొస్తే తనకేకాక తన ఫ్రెండుకికూడా ఇబ్బంది అని వాడు రావాతుగా. పైగా మనకి నాలుగు రోజుల నుంచి నీళ్ళు సరిగా వొచ్చి చావడంలేదు"

"పోనీ అతని ఫ్రెండుని లాడ్జిలో వదిలేసి తను సరాసరి మనింటికి వచ్చెయ్యొచ్చుగా."

"వచ్చేడే అనుకోండి. ప్రత్యక్షమైంపిగా తాళం కప్ప: దేవుడా అని మళ్ళీ ఆటోలోనో రిక్షాలోనో ఆ లాడ్జికే ఆఘోరించాలికదా!"

"సోమవారంనాడు వస్తున్నాను అని ఒక టెలిగ్రాం యిస్తే మనం ఖచ్చితంగా ఇంటిపట్టున ఉండిపోయేవాళ్ళం కాదేంటి?"

"సరే, ఏదో స్నేహితుడి సలహా

వల్లనో మరో కారణం వల్లనో తనకి తోచినట్టు చేసేడు. ఇప్పుడు మీరెళ్ళండి ఆ బృందావన్ లాడ్జికేకదా. ఓసారి చూడకూడదు గావును"

"ఓహో, బాగా సలహా చెప్పేవు. మా జోనల్ మేనేజర్ కోసం వెళ్ళిన లాడ్జింగేకదా అని, మీ లాడ్జిలో ఎవరెవరు ఏయేరూముల్లో దిగారు, కాస్త పేర్లూ అడ్రసులూ చెప్పండి అని అడిగి వుండవలసిందిగాబోలు. వీపు ఛిట్లగొట్టి పంపే వాళ్ళు."

"సరే, సరే, సరే! ఏదో అయిపోయింది. మేమూ, మా తమ్ముళ్ళూ అందరం తెలివితక్కువవాళ్ళం. అంతేగా మీరనేది" అని రాసేసి బుంగ మూతి పెట్టి అటు తిరిగి పోయింది జ్యోతి.

ప్రకాశం పుస్తకం కింద పెట్టేసి ఆమెని దగ్గరకు తీసుకున్నాడు. కళ్ళు తుడిచినట్టు అభినయం చేసేడు. గడ్డం పుచ్చుకుని "నా తల్లే, యాదవకమ్మా" అన్నట్టు మూతి తిప్పాడు. జ్యోతి అతన్నుంచి తప్పించుకుని మళ్ళీ పుస్తకం అందుకుంది.

"అదికాదు. మళ్ళీ ఓసారి వెళ్ళండి. వాళ్ళింకా బయల్దేరి వెళ్ళి పోయి వుండరు. వెంటనే వెళ్ళి తమ్ముణ్ణి తీసుకురండి" అని రాసింది.

నెత్తి కొట్టుకున్నాడు ప్రకాశం. వాచీ చూపించాడు ఒంటిగంటా నలభై. ఈ పాటికి మెయిల్ అనకాపల్లి దాటేసి ఉంటుంది.

"పోనీ రైలు స్టేషన్ కెళ్ళండి. ఖర్మ కాలి మెయిల్ ఓ గంట లేటయినా చాలు. వాడు దొరుకుతాడు, ప్రయాణం ఆపేసి ఇంటికి తీసుకురండి, అంతగా రేపు తనకి కలవు లేదంటే "బొకారో"కో "గోదావరి"కో పంపిద్దాం"

"ఏమో, ఈ ప్రయత్నం అంతా దండుగేమో నని నాకు అనిపిస్తోంది.–"

"అసలు మీకు సత్యం మీద ఏమీ అభిమానం అపేక్షలేవు. అందుకే ఇలా ఎడ్డం అంటే తెడ్డం అంటున్నారు."

"అతనికి మన మీద మహా ఉంది గావును, అపేక్ష, అభిమానం అనురాగన్ను. తన ఇంటర్‌వ్యూ తన ఫ్రెండు అనే చూసుకున్నాడుగాని, అయ్యో అక్కా-బావా ఉన్నారు, వాళ్ళతో ఓ గంట కబుర్లు చెబుదాం, పిల్లలు కూడా ఏలూర్లో ఉన్నారు; ఆమాటా ఈమాటా చెబితే సంతోషిస్తారుఅని ఏమైనా ఆలోచించాడా? అంతగా మనల్ని చూడాలని అతనికి వుంటే రాత్రి ఎనిమిది గంటలపుడు మనం లేకపోతే ఏ సినిమాకో వెళ్ళేరనుకుని పది గంటలప్పుడు ఓ మారు మళ్ళా రావచ్చుగా?"

"మీ ధోరణి చాలా బావుందే. వేలి కేస్తే కాలి కేస్తున్నారు. కాలి కేస్తే మెడ కేస్తారు."

"పోనీ అయిందేదో అయింది. ఆ లాడ్జికో రైల్వే స్టేషన్‌కో ఓ సారి వెళ్ళి రాకూడదేం?"

"అంత దూరం వెళ్ళనే అక్కర్లేదు" అది ఇంకా ఏదో రాయబోతూవుంటే జ్యోతి ప్రకాశం చేతుల్లోంచి కలం పుస్తకం లాగేసుకుని కలం ముడిచేసి పుస్తకం నేలకేసి కొట్టేసింది.

ప్రకాశం కింద పడిన పుస్తకం తీసుకుని వివరంగా మళ్ళీ రాశాడు. "నీ



దేదో పూర్తిగా చెప్పనియ్యవు. రైల్వే స్టేషన్‌కి ఫోన్ చేసి మెయిల్ లేటేమో కనుక్కొని మిగతా కార్యక్రమం రూపొందించుకో వచ్చు కదా అని రాయబోతే నువ్వు ఊరికే అలిగి పుస్తకం విసిరి కొట్టి - ఏమిటి ఇదంతా ?"

అలోగా జ్యోతి రెండు చేతులూ మొహం మీద మూసుకుని తలగడ మీద బోర్లాపడి ఏడ్చెయ్యడానికి సిద్ధం అయిపోయింది. ప్రకాశం ఆమెని తట్టి "ఊఁ!" అని అబ్బం చేసి కొత్తగా రాసింది చూపించేడు.

"మరి వెళ్ళండి, ఫోన్ దగ్గిరికి." అని రాసింది.

"ఇప్పుడు సుందర్రామయ్యగారు ఇంట్లో వుండరు, అందుచేత, ఫోన్ దగ్గిరికి వెళ్ళవలసింది నువ్వుగాని, నేనుకాదు"

"మనం యిలా తర్జన భర్జనలు చేసుకుంటూ కూర్చుంటే ఈలోప్పుగా పుణ్యకాలం కాస్తా మించిపోయి రైలు గంట లేటు వచ్చినా వెళ్ళిపోతుంది."

"కనక, త్వరగా నడు, మేడమీదికి. ముందే కాగితం మీద, రైలు స్టేషన్‌కి ఫోన్ చేసి ఆవిడే, మెయిలు లేటా రైట్ సైమా కనుక్కోవాలనీ, అప్పుడు. లాడ్జికి ఫోన్ చేసి ఆవిడే సత్యంతో మాట్లాడి ప్రయాణం ఆపు చేసుకోమని చెప్పాలనీ రాయి !"

"గొప్ప తెలివి తేటలే."

"ఏం, కాక ?"

"లాడ్జిలో రూమ్ మా తమ్ముడి పేరిట ఉంటుందేం ?"

"కాకపోతే ఆ ఫ్రెండు రవి పేర్న ఉంటుంది ; రవి, ఏలూరు నుండి వాచ్చారు - అని సూచనగా చెప్తే చాలు, వాళ్ళే కనెక్షన్ ఇస్తారు."

"ఏమిటో, ఖర్మ !" అన్న సంజ్ఞ చాలా సులువుగా చెయ్యొచ్చు. కనక సంజ్ఞే చేసి, మేడమీది సుందర్రామయ్య భార్యకి చూపెట్టవలసిందంతా ప్రకాశం కోసం కాదు గనక వేరే పేజీ ప్రారంభించి బాగా కుదురైన దస్తూరీతో రాయసాగింది. అది పూర్తయ్యేలోగా ప్రకాశం రెండుసార్లు వాచీ ఆమె కెదురుగా తెచ్చేడు రెండుసార్లూ అతన్ని హుంకారంతో వదిలించు కుంది జ్యోతి.

"ఏదానికైనా మంచిది. మీరు ప్యాంటు షర్టు వేసుకుని స్కూటర్ తీసి సిద్ధంగా ఉండండి" అని రాసి ప్రకాశానికి చూపించింది. ఓకే అన్నట్టు తల ఆడించి లేచాడు ప్రకాశం.

అప్పుడు తలుపు చప్పుడైంది.

"నే చెప్పానా ! మా తమ్ముడే వొచ్చాడు !" అనేభావంకోసం చేతనైన విధంగా సంజ్ఞచేసి చాటంత మొహంతో నవ్వుకుంటూ వెళ్ళి తలుపు తీసింది జ్యోతి.

వచ్చిన వ్యక్తినిచూసి ఇద్దరూ నిర్ఘాంత పోయారు.

అతను జ్యోతి తమ్ముడు సత్యంకాదు.

జ్యోతి పెదనాన్నగారు, రఘురామయ్య.

"ఏమమ్మా కులాసా? పద." అంటూ లోపలికి వచ్చి, చెప్పులు విడిచి "ఆఁ, ఏంటీ, ఈరోజు ఇంటిదగ్గరే ఉన్నావే, సెలవా బాబూ ఇవాళ?" అంటూ కుర్చీలో కూర్చున్నాడు అతను.

జ్యోతి లోపలికి పరుగెత్తుకెళ్ళి మంచి నీళ్ళ గ్లాసుతో వస్తూ "మౌనం జాగ్రత్త" అని ప్రకాశానికి సంజ్ఞ చేసింది.

ప్రకాశం, ఆయన మంచినీళ్ళు తాగేలోగా "ఇవాళ మాకు సెలవు మామయ్యగారూ. అందుకే ఇంటిదగ్గరున్నాను... అయితే, మౌనవ్రతం పాటిస్తున్నాం ఈ రోజు; మీవంటివారే మాకు మార్గదర్శకులు" అని రాసి పుస్తకం ఆయనచేతిలో పెట్టాడు.

ఆయన జేబులోంచి కళ్ళజోడుతీసి ఆ సందేశం చదివి, "మంచిదే. కాని మౌనవ్రతానికి మంగళవారం మంచిది కాదు. సోమవారం, లేదా శనివారం దానికి తగినరోజు. పోనీలెండి, ఏదో ఓరోజు పాటిస్తున్నారు, అది మెచ్చుకోతగిన సం



గతే. యోగవాశిష్ఠంలో చెప్పేడు, మౌన వ్రతం పద్ధతిగా ఆచరించడంవల్ల కలిగే లాభాలు. ఇంతకీ ఎన్ని వారాలయింది ప్రారంభించి ? నేనెప్పుడూ వినలేదే?" అన్నాడు.

జ్యోతీ ప్రకాశం మొహాలు చూసుకున్నారు.

జ్యోతి ఆయన పక్కనే ఇంకో కుర్చీ వేసుకుని కూర్చుని "నిన్నరాత్రి స్వామి మహత్తరానంద అనేఆయన ఉపన్యాసం విని ఈ నిర్ణయం తీసుకున్నాం. ఇవాళే మొదలు" అని రాసి పుస్తకం ఆయనకి అందించింది.

ఆయన తల నిలువుగా ఆడించి "సరే! ఏదో హడావిడిగా వున్నారేమిటి మరి ?" అన్నాడు.

"సత్యం నిన్న ఊళ్ళోకొచ్చాడట. ఇక్కడికి రాలేదు. ఈపూట మెయిల్‌కి వెళ్ళిపోతాడట. వాణ్ణి ఆపాలని రైల్వే స్టేషన్‌కి ప్రయాణం అవుతున్నారు మీ అల్లుడుగారు" అని రాసింది జ్యోతి.

"సత్యం రాలేదులేమ్మా ! నేను ఏలూర్నుంచే వస్తున్నాను. వాడికి ఇవాళ ఇక్కడ ఇంటర్వ్యూ జరగవలసింది, అది వారానికి వాయిదా వేస్తూన్నట్టు నిన్న ఉదయం అక్కడికి టెలిగ్రాం వచ్చింది. సరే, మీ పిల్లలిద్దర్నీ అక్కడ చూశాను. మిమ్మల్ని కూడా చూడాలనిపించి ఇప్పుడే మెయిల్ దిగివస్తున్నాను" అన్నాడాయన

ప్రకాశం మంచం మీద చతికిలపడి నిట్టూర్పు వదిలాడు. జ్యోతి ఆందోళన సడలినందుకు భారీగా నవ్వింది.

ఈలోపుగా ఆయన యథాలాపంగా పుస్తకం అంతా తిరగేసేసి, పకపకా నవ్వాడు.

"చూస్తే మీరిద్దరూ చాలా సంభాషణే చేసినట్టుగా ఉందే !" అన్నాడు. పుస్తకం మూసేసి, జ్యోతీ తలమీద చెయ్యివేసి నిమిరి "మౌనవ్రతం అంటే మాట్లాడ్డం మానెయ్యడం ఒక్కటే అనుకుంటున్నారా అమ్మా ? ఇంతలేసి గ్రంథం రాసేస్తే అది మౌనం కాదు, తెలుసా ? మనలో చెలరేగే ప్రాథమిక భావాలను ఎవరికీ తెలియపర్చకుండా మనలో మనమే అంటే మనసును మనసులోనే సంయమ మార్గంద్వారా నిక్షిప్తం చేసుకుని రాగ ద్వేషాలకు అతీతంగా ఉండటమే మౌన వ్రతం అనిపించుకుంటుందిగాని ఇలా పేజీలకు పేజీలు నువ్వెంతంటే నువ్వెంతని వాదించుకుంటే అది మౌనం కాదు" అన్నాడాయన.

జ్యోతి సిగ్గుతో తల వంచుకుంది.

ప్రకాశం ఎటో చూసేడు.

"లే,లే! మీరేం మౌనవ్రతంలో లేరు. ఎంచక్కా కడుపునిండే కబుర్లు చెప్పు తల్లీ" అని ఆయన జ్యోతి వీపుమీద తట్టాడు.

"థాంక్స్ ! పెదనాన్నా" అంది నవ్వుతూ జ్యోతి. •••

Edited & Published by V. Leelavathy Raghaviah, at 1-8-519/11 Chikkadpally, Hyd 20. & Printed by P. Ramakrishna at Raghava Printers, 1-8-4/1/1, Chikkadpalli, Hyderabad-20


JYOTI June-'87 Regd NO: H/SD-73 1



ఆడపడుచు



వసుంధర



రాత్రి ఎనిమిది గంటల సమయం.

నేలంతా పిండార బోసినట్లు వెన్నెల వెన్నెల్లో జలకాలాడుతోందా అన్నట్లు పెరట్లో అసహనంగా అటు యిటూ పచార్లు చేస్తోంది ముక్త.

ఆమె ఆలోచనలనిండా భర్త గౌతమ్ ఉన్నాడు.

వారిద్దరికీ వివాహమై ఏణ్ణర్థం దాటింది.

పెళ్ళికి ముందు ముక్త జీవితం గురించి ఎన్నోకలలు కంది.

ఆమె తండ్రి బడి పంతులు. అదృష్టం కొద్దీ ముగ్గురే పిల్లలు. అందులోతనొక్కర్తె ఆడపిల్ల.

గారంగానే పెరిగింది కానీ కోరికలేమీ తీరేవికాదు.

తండ్రి తనకు వచ్చే జీతంలో ఒబ్బిడిగా గడుపుకుంటూ తన కోరికలన్నీ త్యాగం చేసి పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేయాలను కున్నాడు. ఆ ప్రయత్నం లోనే ముక్తకు గౌతమ్ వంటి వరుణ్ణిచ్చి చేశాడు.

గౌతమ్ ఉద్యోగం ప్రైవేట్ కంపెనీలో. ఎమ్మే ప్యాసయ్యాడు. నెలకు పదిహేను

వందలు జీతమంటే చాలా ఎక్కువనే అనుకుందామె.

వేరు కాపురం ప్రారంభించాక కానీ అసలు విషయం తెలియలేదు.

ముక్త కలలు కనే లాంటిల్లు కావాలంటే అద్దె కనీసం వెయ్యి రూపాయలవుతుంది. మూడు వందల యాభై రూపాయలిచ్చి ఓ రెండు గదులింట్లో ఉంటున్నారు. అందులోనే అదృష్టం - ఇంటికి కాస్త పెరడుండడం!

గౌతమ్ కింటి బాధ్యతలున్నాయి. నెలనెలా అతడు తల్లి దండ్రులకు రెండు వందల రూపాయలు పంపిస్తుంటాడు. పెళ్ళికి ముందు అతడు తన గురించంటూ ఏమీ నిలవేసుకోకుండా - మిగిలిందంతా తల్లిదండ్రులకే పంపేవాడు.

ఒక్కసారిగా పదివేలు ఖర్చు పెట్టలేక గౌతమ్ స్కూటర్ కొనడంలేదు. అతడాఫీసుకు బస్సులో వెడతాడు.

ముక్తకు గట్టిగా తనకు నచ్చిన చీర కొందామంటే లేదు.మంచి చీరలేవీ రెండొందల యాభైకి తక్కువలో లేవు.

"నెల ఖర్చుల్లో జాగ్రత్తగా ఉంటే, ఆర్నెల్ల కొకసారి దర్జాగా ఉండొచ్చు", అనిగౌతమ్ అంటాడు.

బయటకు వెళ్ళినప్పుడల్లా దర్జాగా ఉండాలని ముక్త కోరిక.

బైటకు వెడితే ఆటోలో వెళ్ళాలి. బైట కూర్చుంటే ఐస్‌క్రీమ్‌లు తినాలి.

అందుకే దంపతులిద్దరూ కలసి బైటకు వెళ్ళడం తగ్గించేశారు.

ఇంట్లోనే ఒకరి నొకరు చూసుకుంటూ, ఒకరితో ఒకరు కబుర్లు చెప్పుకుంటూ గంటలు క్షణాల్లా దొర్లించేయగలమని గౌతమ్ అంటాడు.

ముక్త మనసు కది సరిపడలేదు.

ఆమెకు బయట ప్రపంచంలో తిరగాలని ఉంది. తానందరికీ కనబడాలి. తను రాకుమారిలా, తన పక్కన భర్త రాకుమారుడిలా -.... ఇద్దరూ విహరిస్తుంటే లోకమంతా కళ్ళప్పగించి తమవంకే చూడాలన్నదామె కోరిక ...

భర్త తనను ప్రేమించడంలో ఆమె కానందం లేదు. భర్త తన కిచ్చే హోదాను ప్రదర్శించడంలోనే ఉందామె సంతోషం.

"మీ అంతస్థు, హోదా పెరగాలి ... అందుకోసం మీరేం చేసినా నా కభ్యంతరం లేదు -" అనితరచుగా ఆమె భర్తతో అంటూండేది.

భార్యంటే ఎంతో యిష్టపడే గౌతమ్ కామె కోరిక మన్నించి తన హోదాను పెంచు కోవాలనే ఉంది. కానీ అతడి పరిమితులతడికున్నాయి. ఆ విషయం భార్య ముందొప్పుకోవడమిష్టంలేక - ప్రేమ గొప్పతనాన్ని పొగుడుతూండేవాడు. జీవితంలో ప్రేమను మించినదేదీలేదనీ, ఏ దారి తొక్కినా డబ్బు సంపాదించవచ్చుననీ - ప్రేమ అలా దొరికేది కాదనీ భార్యతో అంటూండేవాడు. ముక్త ప్రేమ తనకు లభించడం వల్ల ఇతర భోగభాగ్యాల మీద మనసు లేదన్నాడు. భార్య కూడా అలాగే అంటుందని ఆశించాడు.

కానీ ముక్త అతడేదారైనా సరే తొక్కి - డబ్బు సంపాదిస్తే -అప్పుడే అతణ్ణి నిజంగా ప్రేమించేలాగుంది.

ఈ విషయం చూచాయగా పెళ్ళైన ఆర్నెల్లలోనే గ్రహించాడు గౌతమ్. అతడది గ్రహించాక మరో ఏడాది గడిచింది.

సరిగ్గా నిన్నటి రోజున గౌతమ్‌కి విషయం మరింత ఎక్కువగా గ్రహించాల్సిన అవసర మేర్పడింది.

గౌతమ్ బాస్ పేరు భానుప్రకాష్.

అతడికి బాగా డబ్బున్నప్పటికీ సింపుల్‌గా ఉంటాడు. తన క్రింది వారందరితోనూ అరమరికలు లేకుండా మాట్లాడుతాడు. కంపెనీ యాజమాన్యంలో అతడికి చాలా మంచి పేరుంది.

భానుప్రకాషింట్లో పేరంటం.

పేరంటానికి పిలుపు భానుప్రకాష్ ద్వారా అందింది గౌతమ్‌కు.

భానుప్రకాష్ భార్య సంధ్యకు రెండ్రోజుల నుండి జ్వరం.ఆ కారణంగా అందరిళ్ళకూ స్వయంగా వెళ్ళి పిలవడంలేదు. చాలా మందిని ఫోను ద్వారా పిలిచింది. కొందరికి కార్లో మనిషి ద్వారా కబురంపింది. ఆఫీస్ స్టాఫ్‌కు భానుప్రకాష్‌ని చెప్పమంది.

పేరంటం గురించి గౌతమ్ భార్యకు చెప్పాడు.

అతడు భానుప్రకాష్ వైభవాన్ని వర్ణించి– "అక్కడ నీకు గొప్పగొప్ప వాళ్ళు పరిచయాలవుతాయి -" అన్నాడు.

ముక్తకా సరదా ఉన్నట్టు లేదు. ఆమె తను వెళ్ళనంది.

"నాకో మంచి చీరలేదు.- పార్టీకెలా వెళ్ళను?" అందామె.

ముక్తకు పెళ్ళినాటి పట్టు చీరలు రెండున్నాయి. కానీ ముక్తకు పట్టుచీర కట్టుకోవడం ఇష్టం లేదు.

"వెళ్ళేది పేరంటానికైనా - పట్టుచీర నా వయసుకు తగ్గది కాదు. మంచి గార్డెన్ చీరైతే బాగుంటుంది-" అంది ముక్త.

రెండు నెలల క్రితం గౌతమ్ ఆమెకో గార్డెన్ చీర కొన్నాడు. ఖరీదు రెండు వందల ఎనభై రూపాయలు.

"గొప్ప వాళ్ళింటికి పేరంటానికి వెడుతూ నగ లేసుకోకుండా ఎలా? పెళ్ళికి మా నాన్న చేయించిన నీలపురాళ్ళ నెక్లెస్ వేసుకుంటాను. దానికి మ్యాచింగ్ ఉంగరం కూడా ఉంది. ఈ రెండూ ఉన్నప్పుడు వాటికి మ్యాచింగ్ చీర లేకపోతే ఏంబాగుంటుంది? అప్పుడు కొన్న గార్డెన్ చీర లేతపసుపు రంగుది...." అందిముక్త.

అంటే యిప్పుడు నీలంరంగులో గార్డెన్‌చీర కొనాలి. వెళ్ళేది గొప్పింటి పార్టీకి కాబట్టి చీరఖరీదు మూడొందల యాభైకి తగ్గకూడదు. పాతచీరతోనే సరి పెట్టుకోవాలంటే అందుకూ ఆమె సిద్ధమే! దానికి మ్యాచింగ్‌గా రాళ్ళనెక్లెస్, ఉంగరం

కావాలి. కాకిబంగారం ఆమెకు పడదు.

చీరరంగు నిర్ణయమైతే మ్యాచింగ్ జాకెట్టుకూడా కొనుక్కోవాలనుకొంటోందామె.

గౌతమ్ అప్పుడు తనకొచ్చిన యిబ్బందులన్నీ ఆమెకేకరువుపెట్టుకుని – "నీ కోసం కొండమీద కోతినీ దింపాలనుంటుందినాకు. నీ అంత అందమైన భార్యనిచ్చిన దేవుడు – నిన్ను సంతోషపెట్టే శక్తి నివ్వలేదు –" అని బాధపడ్డాడు.

ముక్త అతడి జుత్తులోకి వేళ్ళు పోనిచ్చి ఎంతో ప్రేమగా – "పోనీ లెద్దురూ – నాకు మీ ప్రేమాభిమానాలు చాలు. పేరంటానికి వెళ్ళకపోతేనేం?" అంది.

అది బాస్ ఇంటిపిలుపు. వెళ్ళకపోతే ఆయనకోపం వస్తుంది. ఆఫీసులో ఆయన తనపై కక్ష గట్టవచ్చు.

"నాభార్య స్వయంగా పిలవలేదని నీభార్య రానంటుంది. ఆమెకు నిజంగా జ్వరం. నీభార్యనెలాగో అలా ఒప్పించాలి –" అన్నాడు బాస్ ప్రతి ఉద్యోగితో.

ముక్త వెళ్ళకుంటే అది అసహాయతగాకాక అహంకారంగా భావించబడుతుంది గౌతమ్ భార్యకు తన యిబ్బంది చెప్పుకున్నాడు.

"మీరు మీ సంగతే చూసుకుంటున్నారు. నా సంగతి ఆలోచించరేం? ఆడాళ్ళ మధ్య ఎన్నో ఉంటాయి. సలుసురిలోను అవమానపడే కంటె పేరంటానికి వెళ్ళక పోవడమే మేలు......" అంది ముక్త.

చివరకు గౌతమ్ అప్పు చేయాలని నిర్ణయించుకున్నాడు. నెలాఖరు రోజుల్లో అయినాకొందలంటే మాటలు కాదు. అతడు తన ప్రయత్నం తను చేస్తున్నాడు.

ఆ రోజాఫీసునుంచి పెందరాళే యింటి కొచ్చేస్తాననీ – ఇద్దరం కలసి షాపింగుకు వెడదామనీ భర్త ఆమెకి చెప్పాడు.

పెందరాళే అన్నవాడు అసలు టైము దాటినా యింటికి రాలేదు.

టైము ఎనిమిదయింది. అయినా అతడింకా రాలేదు.

ముక్త అసహనంగా పచార్లు చేస్తోంది పెరట్లో!

పేరంటం వంక పెట్టి గార్డెన్ చీర కొనుక్కోవాలనుందామెకు. కానీ ఏదైనా కుంటిసాకు చెబుతాడేమోనని ఆమె భయం.

గుమ్మంలో ఎదురు చూసి చూసి – చివరకు పెరట్లోకి వచ్చింది.

ఆకాశంలో వెలిగి పోతున్న చంద్రుడుకానీ, అతడు కురిపిస్తున్న వెన్నెలకానీ ఆమెకు సంతోషాన్నివ్వడంలేదు.

తలుపు తట్టిన శబ్దం కోసం ఎదురు చూస్తోంది.

చివరికాశబ్దమామెకు వినిపించింది.

ఒక్క పరుగున యింట్లోకి వెళ్ళి వీధి తలుపు తీసింది.

గుమ్మంలో గౌతమ్!

"ఇంత ఆలస్యమయిందేం?" అంది ముక్త.

"ఆలస్యమయితేనేం డబ్బు దొరికింది. ఎలుండి కదా! రేపు సాయంత్రం

మనం షాపింగుకి వెడదాం –" అన్నాకనే గౌతమ్ లోపలి ప్రవేశించాడు.

భానుతేజంలో వెన్నెలలు కురిపిస్తూ – ఎందరికో కవితా వస్తువైన పున్నమి చంద్రుణ్ణి మించి – గౌతమ్ ముఖం వెలిగి పోతోంది.

ఆ వెన్నెలలు ముక్త కానందాన్ని కలిగిస్తున్నాయి.

2

ఆటో ఆ బంగళా ముందాగింది.

ముక్త ఆటో వాలాకు డబ్బిచ్చి క్రిందకి దిగింది.

ఎదురుగా చిన్న గేటు ...

ముక్త గేటు తీసుకుని లోపలకు వెళ్ళింది ...

ఇంటి చుట్టూ పూలతోట.

తోటలో రకరకాల పూలు ... అందమైన పూలు ....

ఆ పూలన్నీ ముక్తను పలకరిస్తున్నాయి.

ముక్త వాటి అందాన్ని చూడ్డం లేదు. పలకరింపుని వినడం లేదు.

ఆ పూలతోట యజమానురాలిని తల్చుకుని అసూయ పడుతోంది.

ఆ అసూయతోనే ఆమె ఆ యింట్లో ప్రవేశించిoది.

ముందుగా నేడుందో పెద్ద హాలు ....

ఆహాల్లోనే పేరంటాళ్ళున్నారు ...

ముక్త గుమ్మంలో అడుగు పెట్టగానే చాలామంది కళ్ళటు తిరిగాయి.

ఆ యింటిని దూరాన్నుంచి చాలాసార్లు చూసింది ముక్త లోపలకు వెళ్ళడం అదే మొదలు.

ఒక సన్నని పొడవాటి స్త్రీ ఆమెను సమీపించింది.

అమె మరీ అంత అందగత్తెకాకపోయినా హుందాగా ఉంది. ఛాయ మాత్రం బంగారంలా మెరిసి పోతోంది.

ఆమె కనులలో కనిపించీ కనిపించని విషాదం.

అది కూడా ఆమె కందాన్నే యిచ్చింది.

"నేను మిసెస్ భాను ప్రకాష్. అందే సంధ్య మీరు మిసెస్ గౌతమ్ కదూ – మీ పేరు?" అందామె.

"ముక్త –"

"మీ అందానికి తగ్గ పేరు –" అందామె.

తను మిసెస్ గౌతమ్ అని ఆమెకెలా తెలిసిందా అని ఆలోచిస్తూ లోపలి అడుగు పెట్టింది ముక్త.

దూరంగా నిర్మల కన బడింది.

నిర్మల సదానందం భార్య. సదానందం గౌతమ్‌కు సీనియర్ కొలీగ్. వారందరికీ చాల కాలం నుంచీ పరిచయముంది.

"నేను ఫలానా అని నిర్మల చెప్పి ఉంటుంది -" అనుకుంది ముక్త.

అయితే నిర్మల ముక్తను పలకరించలేదు. ఆమె వంక చూడలేదు. అక్కడ పెత్తనం చెలాయిస్తూ హడావిడి పడి పోతోంది. తనకు లభించిన కొత్తపదవిని నిర్వహించడంలో ఉన్న ఆనందం - ఎరిగున్న వారిని పలకరించడంలో ఆమెకున్నట్లు లేదు.

సంధ్య ఆమెను కాస్త లోపలకూ తీసుకెళ్ళి ఓ కుర్చీలో కూర్చోమని చూపించింది.

ముక్త కుర్చీలో కూర్చుంది.

కొత్త మోడల్ ఫైబర్ గ్లాసు కుర్చీ అది.

రంగు రంగుల చీరల్లో ఆడవాళ్ళున్నట్లే - ఆ కుర్చీలు కూడా వివిధ రంగుల్లో ఉన్నాయి.

కుర్చీలో కూర్చుంటే మెత్తగా సోఫాలో కూర్చున్నట్లుంది.

"చాలాఉన్నాయి. కొన్నారో - అద్దెకు తెచ్చారో -" అనుకుంది ముక్త.

సంధ్య అక్కణ్ణించి వెళ్ళి పోయింది.

ముక్తకు పక్కనే కూర్చున్న ఒకామె ఆమెను పలకరించి - "మిమ్మల్నెప్పుడూ చూడలేదు -" అంది.

"నేనూ అంతే !" అంది ముక్త.

పక్కనున్నావిడ దెబ్బతిని - "నా పేరు సరళ. మావారు రావ్ అండ్ రావ్ కంపెనీలో మానేజింగ్ డైరెక్టరు" అంది.

ముక్త ఏదో అనే లోగనే ఆమె తన భర్త గురించి చాలా వివరాలు చెప్పుకుని ముక్త సరళ ఏమీ అడగ లేదని గుర్తించిందో ఏమో - "మీ వారేం చేస్తున్నారు ?" అనడిగింది.

తటపటాయిస్తూనే చెప్పింది ముక్త.

"ఓహో -" అంది సరళ. తర్వాతామె తన కటు పక్కనున్న మరో స్త్రీతో కబుర్లు ప్రారంభించింది.

తన హోదా తెలియగానే సరళకు తనపై ఆసక్తి నశించిందని గ్రహించిన ముక్తకు మనసు చివుక్కుమంది.

అప్పుడామె అక్కడున్న వారొక్కరినే పరిశీలిస్తోంది.

ప్రతివారి ముఖంలోనూ దర్పంకళ స్పష్టంగా కనబడుతోంది. కానీ వారందరిలోకీ తనే అందంగా ఉంది. ఇంకా చెప్పాలంటే తను హీరోయిన్లా ఉంది.

అక్కడ చాలా మంది స్త్రీలు గుంపులు గుంపులుగా చేరి మాట్లాడుకుంటున్నారు. ముక్తకు తోడెవ్వరూ లేరు

ఎవరైనా కొత్తవారు రాగానే చాలామంది ఆమె చుట్టుచేరుతున్నారు.

సరళ తన హోదా గురించి చెప్పేసిందేమో - ఎవరు తన పక్కకు రావడం

లేదని ముక్త అనుకుంది.

ఆసమయంలో అక్కడకో యువతి ప్రవేశించింది,

ఆమెకు సుమారు ముప్పై ఏళ్ళుంటాయి.

సుమారైన అందగత్తె ఆమె. మనిషి హుందాగా, గంభీరంగా ఉంది.

ఆమెలోపలకు రాగానే సంధ్య ఆమెను రిసీవ్ చేసుకుందుకు వెళ్ళింది. - "రా పావనీ !" అందామె,

ఆమాటలు హాల్లో అందరికీ వినిపించాయి.

సంధ్య పావనిని హాల్లో కుర్చీలో కూర్చోపెట్టకుండా లోపల గదిలోకి తీసుకొని వెళ్ళింది.

హాల్లో ఒక్కసారి నిశ్శబ్దం.

ముక్త ఆశ్చర్య పడింది.

ఎవరీ పావని ? వస్తూనే ఇక్కడింత నిశ్శబ్దాన్నెలాసృష్టించగలిగింది ? సంధ్య ఆమెను ప్రత్యేకంగా లోపలకెందుకు తీసుకెళ్ళింది ?

పక్కనున్న సరళ మరో ఆమెతో అంటోంది - "పావనిట...పావని ! కనీసం పేరు మార్చుకోవాలనైనా తోచలేదు......"

"బాగ చెప్పారు. మనమైతే జరిగిందానికేనుయ్యో గొయ్యో చూసుకునే వాళ్ళం..." అంది సరళ పక్కనున్నామె.

ముక్త కుతూహలం చంపుకోలేక - "ఎవరండీ ఆపావని ?" అని సరళ నడిగింది.

ఆ ప్రశ్నకు సరళ ముందుగా చలించలేదు. అయితే తనకోగొప్ప అవకాశం పోనున్నదని వెంటనే ఆమె గ్రహించి ఉండాలి ... ముక్తవైపు తిరిగింది.

స్నేహభావంతో పలకరించడానికి మనిషి తనచుట్టూ ఎన్నైనా అడ్డుగోడలు నిర్మించుకుంటాడు. కానీ సాటి మనిషిని కించపర్చడానికదే మనిషి ఎన్ని మెట్లయినా దిగిరావడానికి సంకోచించడు.

సరళ నోట ముక్త పావని కథ వింది.

పావనికో ప్రియుడున్నాడు. పెళ్ళికి ముందే వాళ్ళిద్దరికీ సంబంధమేర్పడింది. ప్రియుడామెను మోసం చేశాడు. పావని అబార్షన్ చేయించుకుంది. అబార్షన్ చేసిన డాక్టరే ఆమె అంటే యిష్టపడి పెళ్ళి చేసుకున్నాడు. అలా కొన్నేళ్ళు గడిచాయి. ఎక్కడికో పోయిన పావని ప్రియుడూరికి తిరిగొచ్చాడు. పావనిని బ్లాక్‌మెయిల్ చేయాలనుకున్నాడు. ఫలించలేదు. పావని కథ భర్తకు తెలుసునని తెలిశాక - అతడామెను రేప్ చేశాడు. పావని పోలీసు రిపోర్టిచ్చింది. పావని ప్రియుడికి యావజ్జీవ కారాగారశిక్ష పడింది.

జరిగిందానికి పావని సిగ్గుపడలేదు. పైగా ధైర్యంగా తలెత్తుకుని తిరుగుతోంది. పావని భర్తకామెఅంటే ప్రాణం. అతడు బహుశా నపుంసకుడై ఉండాలి.

లేకుంటే చెడిన ఆడదాన్నెందుకు పెళ్ళి చేసుకుంటాడు? ఆ తర్వాత ఆమె అత్యాచారానికి గురైతే ఎందుకు మన్నిస్తాడు?

"అనాదిగా మగాడి వంచనకు, అత్యాచారానికి గురవుతోంది ఆడది. నా ధైర్యం, నా భర్త, సహనం – ఆ వంచకుల కెదురుదెబ్బ! మహిళామణులకు కొత్త ఊపిరి –" అంటుంది పావని.

పావని భర్త హస్తవాసి మంచిది. కాబట్టి సమాజంలో ఆయన్నెవరూ చిన్న చూపు చూడ్డంలేదు. కానీ – సంప్రదాయానికి విలువనిచ్చే సమాజంలో పావని పతితగానే గుర్తించబడుతోంది. ఎందరో ఆమెను వెలివేశారు.

ఎక్కువ పార్టీలకు పావని రాదు. సాటివారు వేసే ప్రశ్నలనామె భరించలేదు. ప్రశ్నలు వేయనిచోట వారి చూపులనుకూడా ఆమె భరించలేదు.

"నేనేమీ తప్పు చేయలేదు. ఓ పురుషుణ్ణి నమ్మి ప్రేమించి నా తనువు నర్పించాను. అతడు నన్ను మోసం చేశాడు. తర్వాత నాకు పెళ్ళయింది. నిండు మనసుతో నా భర్తను ప్రేమించాను. నన్ను మోసగించినవాడు నాపై అత్యాచారం చేశాడు. అందులో నా తప్పేముంది? నా దురదృష్టం. వాడు మళ్ళీ మరొకరిపై అత్యాచారం చేయకూడదని పోలీసులకప్పగించాను. సమాజం నా ధైర్యాన్నభినందించాలి –" అంటుందామె.

ఆమె ధైర్యం సాటి ఆడవారిలో ఆమెకు సానుభూతి లేకుండా చేసింది.

ఎవరి విషయమెలాగున్నా – సంధ్య పావనిని ప్రతి పేరంటానికీ, పార్టీకీ పిల్చి తీరుతుంది.

పార్టీలో యితరు లెవ్వరికీ పావనిరాక గిట్టదని ఆమెకు తెలుసు. అందుకే ఆమెను ప్రత్యేకంగా లోనికి పిలిచి వాయనాలిచ్చి ముందుగా శంపేస్తుంది. ఆమె వెళ్ళిపోయాకనే అసలు ఫంక్షన్ ప్రారంభమవుతుంది.

పావనికి సిగ్గులేదు. తన్నుచూసి నవ్వుకుంటారని తెలిసికూడా పిల్చిన ప్రతి చోటకూ వెడుతుంది.

పావనికి అహంకారం. నలుగుర్ని పిలిచి పలకరించి స్నేహం పెంచుకోవాలని చూడదు. తనతో స్నేహం కోరేవారు తననే పలకరించాలంటుంది.

సంధ్యకు పావనితో స్నేహమెందుకో తెలియదు.

పావని భర్త సంధ్యకు ఫామిలీ డాక్టరుకూడా కాదు.

సరళ అభిప్రాయంలో సంధ్య అమాయకురాలు. మాయ, మర్మం తెలియని మనిషి. పావనికెక్కడా స్నేహితురాండ్రు లేరు. సంధ్యనామె బుట్టలో వేసుకుని స్నేహితురాలిని చేసుకుంది.

పావని గురించింకా రకరకాలుగా చెప్పాలనుకుంది సరళ. కాని యింతలోనే వాయనం తీసుకుని వెళ్ళిపోతోందామె.

ఆమె వెళ్ళిపోయేదాకా హాల్లో నిశ్శబ్దం.

పావని నిష్క్రమించాకనే అక్కడ కార్యక్రమం ప్రారంభమయింది. కార్యక్రమం నడుస్తూండగా ఎందుకో భానుప్రకాష్ వచ్చాడు.

సంధ్య అతడికెదురై – "ఈ సమయంలో వచ్చారేమిటి?" అంది.

అతడు నవ్వాడు.

అతడి రూపం అతడి హోదాకు తగ్గట్టే వుంది.

ఎందరో కన్నెపిల్లలు కలలుగనే సినీ హీరోలా ఉన్నాడతడు.

అతడి నవ్వుమాత్రం సినీ హీరోల నవ్వుకంటె మనోహరంగా ఉంది.

"ఉండండి. వీరందర్నీ మీకు పరిచయం చేస్తాను–" అంది సంధ్య.

ఆమె ఒక్కొక్కరినే పేరు పేరునా భర్తకు పరిచయం చేసింది. వారిలో చాలామంది భానుప్రకాష్‌కు తెలుసు. తనకు తెలియని వారివంక అతడు కుతూహలంగా చూస్తున్నాడు.

తనను పరిచయంగానే – "నమస్తే!" అన్నాడతడు.

"నమస్తే!" అంది ముక్త.

క్షణకాలం ఇద్దరి చూపులూ కలిశాయి.

అతడి చూపుల్లో అయస్కాంతంవంటి ఆకర్షణ చూసింది ముక్త.

భానుప్రకాష్ లోపలకు వెళ్ళిపోయాడు.

"పావని అయితే – నమస్తే చెప్పి ఊరుకోదు. షేక్‌హ్యాండిస్తుంది..." అంది సరళ.

నలుగురైదుగురు నవ్వారు.

"మన సంప్రదాయమంతా ఆడదాని పవిత్రతలో ఉంది. అది నిలుపుకోనినాడు మనం మనంకాదు –" అందింకొకామె.

ముక్తకూడా ఆ సంభాషణలో ఆసక్తిగా పాల్గొంది.

డబ్బున్నవారికి లేనివారు చులకన. అధికారమున్న వారికి లేనివారు చులకన. నీతిపరులకు అవినీతి పరులు చులకన. కానీ ...

లేనివాళ్ళ శ్రమతో ఉన్నవాడి దగ్గర డబ్బు చేరుతోంది. ఊరూ పేరూలేని సామాన్యుడు ఓటు – మరో సామాన్యుడి నధికారిగా మార్చుతోంది. ఫలితంగా అవినీతిపరులు నీతిపరులను శాసిస్తున్నారన్న విషయం తెలిసికూడా గ్రహించరెవ్వరూ...

మనను పాలించే వాడిలో అవినీతి ఉంది. మనకు పాఠం చెప్పేవాడిలో అవినీతి ఉంది. మనం బతికే బ్రతుకులో క్షణం క్షణం అవినీతి ఉంది.

కానీ ప్రతివాడూ తను నీతిపరుణ్ణనే అనుకుంటాడు.

ముక్త ఈ ఫక్కీలో ఆలోచించడం లేదు.

ఆమె పావని గురించి ఏహ్య భావాన్ని పెంచుకుంటోంది.

ఎంత నమ్మితేమాత్రం – పెళ్ళికి ముందే పరాయి మగాడితో ఎందుకు సంబంధం పెట్టుకోవాలి? అందులో ఆమె మానసిక బలహీనత ఉంది. ఆ బలహీ

నతనే సమాజం తప్పు పడుతోంది.

ఒకసారి మోసగించిన ప్రియుడు - తిరిగి ఆమెను బలాత్కరించగల ఏకాంతాన్నెలా పొందాడు? ఆమెకతడికలాంటి అవకాశమెలా యిచ్చింది?

పావనిలో ఏదో బలహీనత ఉంది.

పాత ప్రియుడినామె మరచి పోలేకపోతోంది.

లేక నలుగురూ అనుకుంటున్నట్లామె భర్త నపుంసకుడే కావచ్చు.

తన కోర్కెలను చంపుకోలేక, మనసు నదుపులో పెట్టుకోలేక - ఆమె పాత ప్రియుడితో తిరిగి సంబంధం పెట్టుకుని - పట్టుబడితే దాన్ని బలవంతంగా మార్చి ఉంటుంది.

ఛీ ... ఎలాంటి ఆడది?

క్రమంగా పేరంటం కార్యక్రమం ముగిసింది.

వచ్చిన వారిలో చాలామందిని వెనక్కు తీసుకుని వెళ్ళడానికి కార్లు వచ్చాయి.

తనూ లేచింది ముక్త.

"మొదటిసారి వచ్చారు. కాసేపు కూర్చోండి -" అంది సంధ్య.

ముక్త ఆమె బలవంతం చేయగా కాదనలేక పోయింది.

అంతా వెళ్ళిపోయాక సంధ్య, ముక్త మిగిలారు.

అప్పుడు సంధ్య ముక్తను ఆమె గురించిన వ్యక్తిగత వివరాలడిగింది.

మొదట్లో తటపటాయించినా క్రమంగా సంధ్యతో మంచి స్నేహితురాలిగా భావించి - ఒక్కొక్కటిగా కుటుంబ విశేషాలు చెప్పిందామెకు ముక్త.

తన కుటుంబం గురించి చెబుతున్నప్పుడు ముక్త కళ్ళలో కనబడ్డ మెరుపును చూసింది సంధ్య.

"మధ్యతరగతి కుటుంబాల్లో ఆర్థిక సమస్యలున్నప్పటికీ అభిమానాలూ, ఆత్మీయతా వాటిని కప్పేస్తాయి -" అంది సంధ్య.

"అవును - అమ్మన్నా, నాన్నన్నా, అన్నయ్యలన్నా నాకెంతో యిష్టం" అంది ముక్త.

"నాకూ అంతే! నేనూ మధ్యతరగతి నుంచే వచ్చాను. మావారుకూడా మధ్యతరగతిలోనే పుట్టి పెరిగారు. ఇప్పుడైశ్వర్యం పేరుకున్నప్పటికీ మేము వీలైనంత సింపుల్‌గా ఉంటాం. మా కిద్దరు పిల్లలు. ఇద్దరూ స్కూలుకు వెడుతున్నారు. వాళ్ళనికూడా మధ్యతరగతి వాతావరణంలోనే పెంచాలన్నది మా కోరిక. అందుకే తరచు మేము బంధువులిళ్ళకు వెడుతుంటాం. స్నేహం కూడా ఎక్కువగా మధ్యతరగతి వారితోనే......" అంది సంధ్య.

ఆమె మాటిమాటికీ మధ్య తరగతి అంటూంటే ముక్తకది తననే ఉద్దేశించి అన్నట్లనిపిస్తోంది. సంధ్య తనకంటే చాలా ఎత్తులో ఉన్నదనిపిస్తోంది. ఈ తరహా సంభాషణ ఆమెకు నచ్చలేదు.

మాట మార్చడంకోసం ఆమె పావని ప్రసక్తి తెచ్చింది.

సంధ్య ముఖం పాలిపోయింది.

"పావని గురించి మీకెవరు చెప్పారు?" అందామె.

"ఇక్కడ చేరిన వాళ్ళంతా ఆమె గురించే మాట్లాడుకున్నారు. మీరు మంచివారు కాబట్టికానీ ఆమె వంటివారితో స్నేహం చేయరన్నారు..."

"పావని చేసిన తప్పేమిటో వాళ్ళు మీకు చెప్పారా?"

ముక్త పావని గురించి తను విన్నదామెకు చెప్పి - "ఇది నిజమేనా?" అంది.

"నిజమే - కానీ మీకందులో తప్పు కనబడుతోందా?"

"ఊఁ" అంది ముక్త ఆలోచించకుండా.

"వెంటనే ఊఁ అనడం కాదు. కాసేపాలోచించి చెప్పండి -"

"ఇందులో ఆలోచించడానికేముంది? బలహీనతను జయించడంలోనే సంస్కారముంది..."

"సంస్కారం బలహీనతను జయించడంలోకాదు. మన్నించడంలో ఉంది." అని - "పావని పరిస్థితులు మీకే ఏర్పడితే ఏం చేసేవారు?" అంది సంధ్య.

"ఆ పరిస్థితుల నామె ఆహ్వానించింది. పెళ్ళయ్యే వరకూ నాకు పరాయి మగాళ్ళతో పరిచయమే లేదు -..."

"పోనీ - ఇంట్లో ఏ బావో ఉంటే ....?"

ముక్తకు తన బావ గుర్తుకొచ్చాడు. అతడు తన కంటే రెండేళ్ళు పెద్ద. ఒకటి రెండు సార్లతడు తనకు దగ్గరగా రావడానికి ప్రయత్నించాడు. ఆమె సాగనివ్వలేదు.

"ఎవరైనా మనమిస్తేనే అవకాశం ...." అంది ముక్త నమ్మకంగా....

సంధ్య తనూ నవ్వేసి - "మీవి కచ్చితమైన అభిప్రాయాలు. ఇలాంటి వారితో మాట్లాడ్డం మా వారికి చాలా యిష్టం. కాసేపుండకూడదూ?" అంది.

ముక్త తడబడుతూ - "నేను వారితో ఏం మాట్లాడగలను?" అంది.

"ఈ మాట వారితో మాట్లాడేక అందురుగాని ..." అంది సంధ్య.

ఇద్దరూ ఓ గదిలోకి వెళ్ళారు.

గదిలో నాలుగు సోఫాలు, రెండద్దాల బీరువాలు ఉన్నాయి.

ఒక సోఫాలో కూర్చుని భానుప్రకాష్ చదువుకుంటున్నాడు.

"మావారి రీడింగ్ రూమిది!" అని అంది సంధ్య.

భానుప్రకాష్ పుస్తకంలోంచి తలెత్తి వారివంక చూసి చటుక్కున లేచి నిలబడి ప్రశ్నార్థకంగా భార్యవంక చూశాడు.

"మిసెస్ గౌతమ్ - పేరు ముక్త - అభిరుచుల్లో మీవంటిదే ఈమె. మనకు మంచి స్నేహితురాలు -..." అంది సంధ్య.

ఇద్దరూ అతడి కెదురుగా కూర్చున్నారు.

కబుర్లు మొదలయ్యాయి.

"ఆఫీసుకు నేనే బాస్‌ని కావడం వల్ల నా యిష్టం వచ్చిం వచ్చినప్పుడల్లా యింటికి వచ్చేస్తూంటాను. అయితే అందరికంటే నేనే ఎక్కువసేపు పనిచేస్తాను. రాత్రింబవళ్ళు తేడా లేకుండా పని చేస్తాను ..." అన్నాడు ముందుగా భానుప్రకాష్.

ఆ సమయంలో యింట్లో ఉండడానికతడు సంజాయిష్ యిస్తున్నట్లు తోచింది ముక్తకు.

"ఒక సారింటికి వచ్చేక మళ్ళీ ఆఫీసుకు వెళ్ళ బుద్దేస్తుందా ?" అంది ముక్త.

"ఏముంది ? ఏ మీవంటి వారినో పలకరించడమవుతుంది. ఆ ఇన్‌స్పిరేషన్‌తో మరింత ఉత్సాహంగా పని చేయగల్గుతాను ...." అన్నాడు భానుప్రకాష్,

ముక్త ఇబ్బందిగా నవ్వింది.

సంధ్య వెంటనే - "అయితే మీ స్టాఫ్‌ను కూడా ఓ వేళాపాళా లేకుండా ఇంటికి పంపేస్తూడండి - బాగా పని చేస్తారు -" అంది.

"నువ్వు చెప్పిందాలోచించవలసిందే ..." అంటూ భానుప్రకాష్ ఆలోచన నభినయించ సాగాడు.

"మీ రాలోచిస్తూండండి. నేనిప్పుడే వస్తాను ...." అంటూ సంధ్య అక్కణ్ణించి లేచి వెళ్ళి పోయింది.

ముక్త తనూ లేవాలనుకుంది కానీ సంధ్య చాలా త్వరగా వెళ్ళిపోయింది. ముక్త లేచేలోగా భానుప్రకాష్ ఆమెతో - "మిగతా స్టాఫ్ విషయమెల్లాగున్నా మీ వారిని ఆఫీసు మధ్యలో ఇంటికి పంపలేను. మాకు మీరు ఇన్‌స్పిరేషన్ కావచ్చు. కానీ మీవారికి ఎట్రాక్షన్ ... అంతే అయస్కాంతం. ఒకసారింటికి వెడితే ఇకరాడు రాలేడు ..." అన్నాడు,

ముక్త కేమనాలో తోచక ఇబ్బందిగా నవ్వింది.

"మిసెస్ ముక్తా ! మీ ముఖంలో సంస్కారంతో పాటు - ఒక విధమైన గ్రేస్ ఉంది. ఏ దేశానికో మహారాణి కావలసిన సౌందర్యం మీది. కాకపోవడం మీ అదృష్టం. ఎందుకంటే మహారాణికి భర్త సాన్నిధ్యం లభించదు ..." అన్నాడు భానుప్రకాష్.

తను మాట్లాడక పోతే బాగుండదని - "మీ యిల్లు చాలా అందంగా తీర్చిదిద్దారు. సంధ్యగారి అభిరుచి గొప్పది -" అంది.

"అభిరుచి సంధ్యది కాదు - నాది !" అన్నాడు భానుప్రష్.

అతడ లాగనడం మోటుగా అనిపించింది ముక్తకు. భార్య గురించి తనన్న ఒకే ఒక్క మంచి ముక్క నతడామోదించక పోవడం సంస్కారం కాదని పించిందామెకు.

భానుప్రకాష్ మళ్ళీ తనే - "నేను సంధ్యను చిన్నబుచ్చాలనిలాగనలేదు. నిజం చెప్పడానికి నేను సంకోచించను. సంధ్య కూడా నా నిజాలంటే ఇష్టపడుతుంది. ఉదాహరణకు మీరు వెళ్ళాక సంధ్యతో చెబుతాను - ఐశ్వర్యమున్న వాకంటే - మీరున్న గౌతమ్ అదృష్టవంతుడని ! ఆమె ఏమీ అనుకోదు ..." అన్నాడు.

మొదటిసారిగా ముక్తకు చిరాకు కలిగింది. ఆ చిరాకు ముఖంలో వ్యక్తం చేసిందామె.

భానుప్రకాష్ అది గమనించిన వాడిలా - "ఒక విధంగా నేనదృష్టవంతుణ్ణి. నాకు తోచింది నేను ధైర్యంగా మాట్లాడ గలను. ఎదుటి వాళ్ళకు నా మాటలు చిరాకు కలిగించినా వింటారు. ఎందుకంటే నేను వారికో, వారి భర్తలకో అధికారిని కనుక ! ఎందరి భవిష్యత్తో నా చేతుల్లో వుంది కనుక !" అన్నాడు.

ముక్త కతడి మాటలో హెచ్చరిక కనబడింది. ఆ హెచ్చరిక ఆమె చిరాకును భయంగా మార్చింది.

భానుప్రకాష్ ఆ భయాన్నికూడా చదివినట్లే ఉన్నాడు - "సినిమాల్లో అసభ్య దృశ్యాలు, సంభాషణలు ఉంటున్నాయి. వాటికారణంగా చిత్రం ఘనవిజయం సాధిస్తుందని నిర్మాతల అభిప్రాయం. పత్రికల్లో క్రమంగా అశ్లీలత చోటుచేసుకుంటోంది. పత్రిక సర్క్యులేషన్‌కదే కారణమని సంపాదకుల అభిప్రాయం. మనమంతా ఆ సినిమాలు చూస్తున్నాం. పత్రికలు చదువుతున్నాం. స్నేహితులతో చనువుగా మాట్లాడుకుందుకు భయపడుతున్నాం. హేమమాలిని బాగుంటుంది. శ్రీదేవి బాగుంటుంది. భానుప్రియ బాగుంటుంది. వాళ్ళు బాగున్నారని చెప్పుకుంటానికేమీ సందేహించని మనం - మనలో మనం బాగోగుల గురించి చెప్పుకుందుకెందుకు తటపటాయిస్తామో నాకు తెలియదు. అందంలో మీరు వాళ్ళను మించారు. సినిమాల్లో నటించని కారణంగా మీ అందం గురించి మాట్లాడ్డానికే భయపడాలా - నేను !"

అతడి వాదన చిత్రంగా అనిపించిందామెకు.

"ఏ మిథున్ చక్రవర్తో, గోవిందాయో బాగుంటాడని మీరు మీ భర్తకు చెప్పకుండా వుండగలరా ? అది తప్పుగా మీ భర్త భావిస్తాడా ? అలాంటప్పుడదే విధంగా నేను మీ గురించీ, మీరు నా గురించీ మాట్లాడుకోవడం తప్పవుతుందా ?"

"ఇదంతా ఎందుకు చెబుతున్నారు ?" అంది ముక్త.

"స్నేహానికి మొదటిమెట్టు చనువు. అర్థంలేని బహువచనాలతో ఒకరినొకరు దూరం చేసుకోకూడదు. నేను నిన్ను నువ్వంటాను. నువ్వు నన్ను నువ్వను. ఆ విధంగా మనం స్నేహితుల మవుదాం. మన స్నేహం నా మానసిక వికాసానికీ, మీ ఆర్థిక వికాసానికీ మంచిది. నాతో స్నేహాన్నాశించే వారెందరో ఉన్నారు. కానీ నేను నాకు నచ్చిన వారితోనే స్నేహం చేస్తాను. నాకు నువ్వు నచ్చావు..." అన్నాడు భానుప్రకాష్.

ముక్తకేం చెప్పాలో తెలియలేదు. అతడి చనువామెకిచ్చిందిగానే పరిణమించింది.

భానుప్రకాష్ మళ్ళీ - "నువ్వు బహుశా నాసంస్కారం గురించి ఆలో

చిన్తాంటావు. నాసంస్కారం గొప్పది. ఆడవాళ్ళను స్నేహితులుగా చూడగలను. నా స్నేహితులగురించి నా భార్యతో మామూలుగా మాట్లాడగలను. అదేవిధంగా ఆమె స్నేహితుల గురించి వినగలను. నా సంస్కారం గురించి ఆలోచించేముందు-ఈ సంభాషణను నీ భర్తకు చెప్పుకోగలవేమో ఆలోచించు. అతడి సంస్కారం గురించి తెలుస్తుంది నీకు ...." అన్నాడు.

ముక్తకంతా అయోమయంగా అనిపించింది. భానుప్రకాష్ మనుసులో ఏదో దురూహ ఉన్నట్లు లీలగా తోస్తోందామెకు.

"నేను మధ్యతరగతిలో పుట్టి పెరిగాను. మధ్యతరగతి గురించి నాకు క్షుణ్ణంగా తెలుసు. మధ్యతరగతి అంటే నా కెంతో యిష్టం. కానీ మధ్యతరగతిలో కొన్ని లోపాలున్నాయి, వారిలో ఫ్రాంక్‌నెస్ లేదు. నిజాయతీ లేదు. సాహసం లేదు. నేను జీవితంలో పైకిరావడానికి మధ్యతరగతి లోపాల్ని అధిగమించగలడమే కారణం. నువ్వూ అంతే! తలుచుకుంటే కార్లలో తిరగ్గలవు. మేడల్లోమసలగలవు. ఫోన్లలో మాట్లాడగలవు. మధ్యతరగతి లోపాల్ని జయించాలి అంతే! నా స్నేహం నీ కందుకు సహకరిస్తుంది..."

ముక్త సహనానికి అంతరం వచ్చింది. ఆమె లేవాలనుకుంటూండాగా అక్కడికి వచ్చింది సంధ్య ఆమె. చేతిలో ట్రే ఉంది. ట్రేలో మూడుగ్లాసులు....

"ఆరంజి జ్యూసు..." అంది సంధ్య.

"చాలా ఆలస్యమయింది..." అంది ముక్త ఇబ్బందిగా.

"మావారు మిమ్మల్ని కార్లో డ్రాప్ చేస్తారు..." అంది సంధ్య.

"మిమ్మల్ని అనకు. ఆమె ఈ క్షణంనుంచీ మన స్నేహితురాలు..."

"అంటే ?"

"చనువుగా నువ్వు అను...అక్కచెల్లెళ్ళలా మసలండి...."

"భలే వారే- నేను బైటకు వెళ్ళిన కాసేపట్లోనే ఏం మంత్రం వేశారండీ?" అంది సంధ్య ఆశ్చర్యం ప్రకటిస్తూ.

ముక్త ధైర్యం తెచ్చుకుని - "భార్య భర్తను ఏమండీ అంటే పోని చనువు-పరాయి వాళ్ళంటే పోతుందా ?" అంది.

"భార్యా భర్తల అనుబంధం వేరు. మీకని మన్నించినా ఆమె ఏరా అనే తల్లికంటే భర్త దగ్గర చనువుగా ఉండగలదు, భార్యా చెల్లెలు మరదలు కూడా నన్ను నువ్వనే పిలుస్తుందని మర్చిపోకూడదు -" అన్నాడు భానుప్రకాష్.

"వారిని మాటల్లో జయించడం కష్టం -" అంది సంధ్య.

ముగ్గురూ జ్యూస్ తాగేరు -"నేనొక్కర్తినీ వెళ్ళగలను..." అంది ముక్త.

"వద్దు. నిన్ను నేనే ఉంచేశాను నిన్నింటిదగ్గర దింపడం నాదీ బాధ్యత..."

"ఎవరైనా చూస్తే బాగుండదు..." అంది ముక్త.

సంధ్య నవ్వి -"ఎందుకు బాగుండదు! కార్లో నేనూవస్తున్నాగా-" అంది.

"మీరూ వస్తున్నారా ?" అంది ముక్త ఉత్సాహంగా. అంతలోనే -"అన

వసరంగా మీకెందుకు శ్రమ !" అంది మొహమాటానికి.

"శ్రమకాదు. ఇట్సే ప్లెజర్..." అన్నాడు భానుప్రకాష్.

ముక్త ఉత్సాహంపై నీళ్ళు చల్లినట్లయింది. ఆమె సంధ్య వంక చూసింది. సంధ్య ముఖం గంభీరంగా ఉంది.

3

ఇల్లు చేరుకున్నాక ముక్త కేపనిమీదా ధ్యాస మళ్ళ లేదు.

భానుప్రకాష్ మాటలామె చెవిలో గింగురుమంటున్నాయి.

అతడి రూపం ఆమె కళ్ళ ముందు కదలాడుతోంది.

అతడి చూపులామెను వళ్ళంతా తడుముతున్నాయి.

"ఛీ - ఏం మనిషి ?" అనుకుందామె.

ఐశ్వర్యంలో ఓ స్థాయి చేరుకుంటే మనిషి సంస్కారాన్ని కోల్పోతాడా! లేక సంస్కారాన్ని కోల్పోయే ధైర్యాన్ని ఐశ్వర్యం మనిషికిస్తుందా ?

ఐశ్వర్యవంతులకు సంస్కారాన్ని కోల్పోవడమే సంస్కారమేమో !

భానుప్రకాష్ గురించి భార్య సంధ్యకు తెలుసా ? ఆమె అతడి గురించేమనుకుంటోంది ?

అసలు సంధ్యే తనను ప్రత్యేకంగా భర్తకు పరిచయం చేసింది. అదీకాక ఆఫీసు టైములో కూడా అతడింట్లోనే ఉన్నాడు. అంటే ముందుగానే అనుకుని ఇలా చేశారా ? ఇలాచేయడం వల్ల సంధ్యకు ప్రయోజనమేమిటి ? ఆమె భర్త విషయంలో అసహాయురాలా ? అతడి ప్రవర్తన నదుపు చేయలేదు సరిగదా - అతడి చెడు నడతకామె సహకరించాలా ? అదే నిజమైతే ఎంత దురదృష్టం ?

"నీవంటి భార్య ఉంటే నేనూ యిల్లొదిలి పెట్టలేను. నావంటి వారికి ఇన్స్పిరేషన్ ... నీ భర్తకు ఎట్రాక్షన్ ..."

భానుప్రకాష్ సూటిగా చెప్పిన మాటలివి.

అతడికి భార్యంటే యిష్టంలేదా ?

సంధ్యంటే అతడికెలాంటిష్టమో తెలియదు. కానీ తానంటే అతడికిష్టం ఐయుద్దేరిందని ముక్త గ్రహించింది.

అది దేనికి దారి తీస్తుందోనని ఆమెకు భయంగా ఉంది.

భానుప్రకాష్ మాటల్లోంచి -

"నువ్వు నాకు నచ్చావు ..."

"నువ్వు తలచుకుంటే కార్లలో తిరగ్గలవు. మేడలో మసలగలవు. ఫోన్లలో మాట్లాడగలవు... నా స్నేహం నీ కందుకు సహకరిస్తుంది ..."

పగైరాలామె చెవుల్లో గింగురు మంటూ అతడు తన్ను ప్రలోభ పెడుతున్నాడని చెప్పక చెబుతున్నాయి. ఆ ప్రలోభానికి తాను లొంగకూడదనుకున్నప్పటల్లా -

"ఎదుటి వాళ్ళు నా మాటలు చిరాకు కలిగించినా వింటారు. ఎందుకంటే

నేను వారికో వారిభర్తలకో అధికారిని కనుక ! ఎందరి భవిష్యత్తో నాచేతుల్లో ఉంది కనుక ..." అన్న భానుప్రకాష్ హెచ్చరిక ఆమెను భయపెడుతోంది.

ముందు ముందేం జరుగుతుంది ?

ఏదో జరుగుతుందనే ముక్తకు అనిపిస్తోంది.

ఏం జరుగుతుందో కూడా ఆమెకు చూచాయగా తెలుస్తోంది.

ఏదో కొత్త భయమామెనావహించగా - మనసు స్థిమితం తప్పడం వల్ల ఆమె ఏపని మీదా దృష్టి మళ్ళించ లేకపోతోంది.

ఆమె అలాంటి స్థితిలోనే ఉండగా గౌతమ్ ఇల్లు చేరుకున్నాడు.

వస్తూనే అతడుత్సాహంగా భార్యను కౌగలించుకుని ఉక్కిరి బిక్కిరి చేశాడు.

"ఏం జరిగిందండీ ?" అంది ముక్త ఆశ్చర్యంగా.

"ఆఫీసులో మన హోదా పెరిగింది -"

"ఎలా ?"

"మనింట్లోకి ఫోన్ వస్తోంది ..."

"ఎందుకు ?"

"ఎందుకేమిటి ? ఆఫీసులో నాపై అధికారికే ఫోనులేదు. ముఖ్యమైన ఆఫీసు పనుల నిమిత్తం నాకు ఆఫీసు ఫోనిచ్చింది ... బాస్ ఇన్‌ఫ్లుయన్స్ వల్ల బహుశా వారం రోజుల్లోనే మనకు ఫోన్ రావచ్చు ..."

"బాస్ అంటే ..."

"వేరే చెప్పాలా ? ఈ రోజే పేరంటానికూ్కడా వెళ్ళొచ్చావు ...."

"భానుప్రకాష్‌గారా ?" అంది ముక్త.

"అవును ..."

ముక్త చటుక్కున - "ఈ ఫోన్ విషయం మీ కెప్పుడు తెలిసింది ?"

"పావు తక్కువ అయిదుకి. ఆఫీసులో బాస్ అందరిముందూ ఎనౌన్స్ చేశాడు. చాలామంది అసూయపడ్డారు. చాలాకాలంగా ఈ ఫోన్ శాంక్షన్ తమకొస్తుందంటే తమ కొస్తుందని అంతా ఆశపడుతున్నారు. నా కొస్తుందని నేనుకలలో కూడా అనుకోలేదు. ఇటీజే ప్లెజంట్ సర్ప్రయిజ్ ...." అన్నాడు గౌతమ్.

"ఆయన మీకిది పావు తక్కువ అయిదుకి చెప్పాడా ?"

"అవును - ఏం ?"

ముక్త నిట్టూర్చింది. పేరంటంలో తన్ను కలుసుకుని మాట్లాడినాకనే భానుప్రకాష్ ఈ నిర్ణయం తీసుకున్నాడు.

అతడు తనకు తన శక్తి చూపిస్తున్నాడు.

"ఈ వార్త నీకు నేననుకున్నంత సంతోషం కలిగించినట్లులేదు..." అన్నాడు గౌతమ్ నిరుత్సాహంగా.

"ఫోన్ వస్తే మనమేం చేసుకుంటాం ? దాని వల్ల మనకేం లాభం ?"

"కంపెనీ మనకు ఫోనిచ్చిందంటే మన అంతస్థు పెరిగిందన్నమాట ... మనింట్లో ఫోనుందంటే చుట్టు పక్కల మన కెంతపేరు ? ముక్త ! నువ్వు పాదం పెట్టిన వేళ మంచిది. మనింట్లోకి ఫోన్ వస్తోంది. ఆ తర్వాత కారు ...."

"కారా ? అప్పుడే మన కంత డబ్బా ?" అంది ముక్త ఆశ్చర్యంగా.

"అంతా నీ విశేషం. ఏమొచ్చినా నీ కారణంగానే...." అన్నాడు గౌతమ్ అభిమానంగా.

"నువ్వు కార్లలో తిరగగలవు. మేడల్లో మసలగలవు. ఫోన్లో మాట్లాడగలవు ..." అన్న భానుప్రకాష్ మాటాలామెకు మళ్ళీమళ్ళీ గుర్తొస్తున్నాయి.

"ఏమొచ్చినా నీ కారణంగానే ..." అన్నాడు గౌతమ్.

"నువ్వునాకు నచ్చావు -" అన్నాడు భానుప్రకాష్.

ఇవన్నీ కలిపితే ...

"ఏమిటదోలాగున్నావు ?" అన్నాడు గౌతమ్.

"బానే ఉన్నానే !"

"లేదు. రోజూలా లేవు నువ్వు ...."

ముక్త ముక్తసరిగా నవ్వింది.

"పేరంటంలోగానీ ఎవరేనా ఏమైనా అన్నారా ?"

ముక్త తల అడ్డంగా ఊపింది.

"అసలు నిన్నడగనే లేదు. పేరంటం విశేషాలేమిటి ?"

చెప్పాలని ముక్తకు నోటి చివరి దాకా వచ్చింది.

"సంస్కారం గురించి ఆలోచించే ముందు - ఈ సంభాషణను నీ భర్తకు చెప్పుకోగలవేమో ఆలోచించు. అతడి సంస్కారం గురించి తెలుస్తుంది నీకు -" అన్న భానుప్రకాష్ మాటలామె నప్పుడు హెచ్చరించాయి.

భానుప్రకాష్ తనతో మాట్లాడినాకనే భర్తకు ఫోన్ సదుపాయమిచ్చాడు. ఈ విషయం గౌతమ్‌కు తెలిస్తే ఏమనుకుంటాడు ?

"గౌతమ్ సంస్కారాన్ని నేను శంకించకూడదు -" అనుకుంది ముక్త.

అయితే ఆమె రిస్కు తీసుకోలేదు.

4

గౌతమ్ ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

అంట్లుతోమి, బట్టలుతికి పనిమనిషి వెళ్ళిపోయింది.

నవల నొకటి తీసుకుంది ముక్త.

పుస్తకాలంటే ఆమెకిష్టం. పుస్తకాలకంటే కబుర్లంటే యింకా యిష్టం. కబుర్లకెవరూ దొరకనప్పుడు పుస్తకాలు చదువుతుందామె.

నవల ఆమె అభిరుచులకు తగ్గట్టుగానే ఉంది.

ఒక స్త్రీ - ఇద్దరు ప్రేమికులు ...

ఇద్దరిలో ఒకడు దుర్మార్గుడు, ధనవంతుడు.

రెండోవాడు మంచివాడు, పేదవాడు.

స్త్రీ రెండోవాణ్ణి ప్రేమించింది. కానీ ఆ స్త్రీ తండ్రికి క్యాన్సర్. జబ్బుకు వైద్యం చేయించాలంటే డబ్బు, పలుకుబడి కావాలి.

దుర్మార్గుడు స్త్రీకి సాయం చేస్తానన్నాడు. ఆమె తనను పెళ్ళి చేసుకోవాలని షరతు పెట్టాడు. ఆమె తనను పెళ్ళి చేసుకుంటే ఆమెకోసం తన జీవిత పథాన్ని మార్చుకుని మంచివాడినై పోతానన్నాడు. ఆమె తనను కాదంటే మరింతగా చెడిపోతానని - అందుకామే బాధ్యురాలవుతుందనీ బెదిరించాడు.

ఒకపక్క జబ్బులో బాధపడుతున్న తండ్రి...

మరొకపక్క నూరేళ్ళ పంటకై ఎదురుచూసే పేదప్రియుడు ...

ఆమె ఏం చేయాలి ?

కొంచెంగా అటూ యిటూ మార్పులతో శతాబ్దాలుగా కవులను, రచయితలను ప్రభావితం చేస్తున్న కథ యిది.

నవలా రచయిత నేర్పుగా కథను నడిపిస్తున్నాడు.

ముక్త నవల చదువుతూ లోకాన్ని మరిచిపోయింది.

టెలిఫోన్ ట్రింగుమనేవరకూ ఆమె నవలాలోకంనుంచి బైటపడలేదు.

"హలో !" అందామె.

"మాట్లాడేది ముక్తకదూ ?" అందవతలిగొంతు.

"అవును - మీరెవరు ?"

"భానుప్రకాష్..."

ఉలిక్కిపడింది ముక్త. నవల కల్గించిన మత్తంతా విడిపోయిందామెకు.

"ఫోన్ బాగా పనిచేస్తోందా ?" అన్నాడు భానుప్రకాష్.

"ఊఁ"

"అప్పుడప్పుడు నీతో కబుర్లు చెప్పుకుందుకు వీలుగా ఉంటుందని నేనే మీయింట్లో ఫోన్ ఏర్పాటు చేయించాను..."

"తెలుసు..."

"తెలివైన దానివి నువ్వు..."

"థాంక్స్..."

"ఒప్పుకుంటే చాలదు. నీ తెలివి చూపించాలి...."

"అంటే ?"

"ఆధునిక ప్రపంచంలో భర్తల ప్రగతికి-అందమైన భార్యలే సోపానాలు..." అన్నాడు భానుప్రకాష్.

"ఇలాంటి మాటలు నాకు నచ్చవు ...."

"చిన్నప్పుడు మానాన్న రోజూ చదువుకోమని నీతిబోధ చేస్తే నాకు నచ్చేది

కాదు. అయినా విన్నాను. చదువొచ్చింది..."

"అయితే..."

"ప్రతి విషయంలోనూ ప్రగతి పథానికి కొన్ని మార్గాలుంటాయి. అవి మనకు నచ్చకపోయినా అనుభవజ్ఞులు చెబితే వినాలి..."

"ఒక వయసు దాటేక మనిషికెవరి సలహాల్తో అవసరముండదు..."

"నిజం చెప్పావు. కానీ నీకింకా ఆ వయసు దాటలేదు...."

"ఇంతకీ మీరేం చెప్పదల్చుకున్నారు ?"

"మీరు కాదు - నువ్వు..."

ముక్త ఫోన్ పెట్టేయాలనుకుంది కానీ అది సరికాదనిపించి- "అంత సులభంగా నేనందర్నీ నువ్వనలేను...." అంది.

"సులభ పద్ధతి నేను చెబుతానుగా...."

"వద్దు...." అంది ముక్త.

"ముక్తా ! ఒకరికొకరెదురైనప్పుడెన్నో మాట్లాడుకోవాలనిపిస్తుంది. మొహమాటం అడ్డొస్తుంది. అలాంటప్పుడుత్తరాలు పనికొస్తాయి. మనిషికి నోటితో చెప్పలేనివి ఉత్తరాల్లో అక్షరాల రూపంలో చెప్పుకోవచ్చు. కానీ అందరికీ ఉత్తరాలు రాయడం రాదు. పెదవి పల్కించే అక్షరాన్ని కాగితం మీదకు తరలించడం ప్రత్యేకమైన కళ. ఆ కళలో ప్రావీణ్యం లేక ఎందరో స్నేహితులయి ఎదుటపడి మాట్లాడుకోలేక, అటు ఉత్తరాలు రాసుకోలేక - ఒకరికొకరు క్రమంగా దూరమైపోయారు. మనకలాంటి దుర్గతి లేదు. మనముత్తరాలు రాసుకోనవసరం లేదు. మాట్లాడుకునేటప్పుడు ఒకరికొకరెదురు పడనవసరమూ లేదు. ఫోనుంది. నిస్సంకోచంగా, చనువుగా మాట్లాడుకుందాం..."

"మాట్లాడుకోవడానికేముంది ?" అంది ముక్త.

"నువ్వు నా అందాన్ని పొగుడు. వింటాను..."

"నావల్లకాదు..."

"పోనీ - నీ అందాన్ని నేను పొగుడుతాను. విను..."

"వాటీజ్ దిస్ మిస్టర్ భానుప్రకాష్ ...." అంది ముక్త.

"దిసీజ్ ఫర్ మై ఇన్స్పిరేషన్..."

"మీ ఇన్స్పిరేషన్‌తో నాకేంపని ?"

"నా ఇన్స్పిరేషన్‌వల్ల లాభమంతా నీకే ! ఇన్స్పిరేషన్‌తో నేను కంపెనీ గురించి పాటుబడలేదు. కంపెనీ వృద్ధిపొందుతుంది. కంపెనీతోపాటే నీ భర్తకూడా."

ముక్త మాట్లాడలేదు.

"ఫోన్ పెట్టేయకు. నేనింకా మాట్లాడుతున్నాను..."

ముక్త వింటోంది. అతడామె అందాన్ని పొగుడుతున్నాడు.

పేరంటంలో ఆమె ఎలా తనకు కనబడిందో వర్ణిస్తున్నాడు.

ఆ వర్ణనలో అసభ్యత లేదు. కవిత్వముంది.

ఆ పొగడ్తలామెకు సంతోషం కలిగించలేదు.

"ఎలా ఉన్నాయి నా మాటలు ?" అన్నాడు భానుప్రకాష్ చివర్లో.

"అందే ?"

"నీ అందానికి న్యాయం చేకూర్చానా ?"

"నాకు పెళ్ళి కాగానే నా అందానికి న్యాయం జరిగింది. వేరెవ్వరూ నా అందానికి న్యాయం చేకూర్చ నవసరం లేదు...."

"ముక్తా ! భర్త వేరు, స్నేహితుడు వేరు. ఈ తేడా తెలుసుకునే సంస్కారం నువ్వు పెంచుకోవాలి. ప్రస్తుతానికి సెలవు...."

అవతల ఫోన్లో క్లిక్‌మన్న చప్పుడు వినిపించింది.

ముక్త తనూ ఫోన్ పెట్టేసింది.

5

వారంరోజుల్లో ముక్తకు భానుప్రకాష్‌నుంచి నాలుగుసార్లు ఫోన్ వచ్చింది.

అతడి మాటల్లో సభ్యత లోపించడంలేదు. కానీ అతడి ఊహలు మాటల్లో స్ఫురిస్తున్నాయి. ముక్తకు చాలా ఇబ్బందిగా ఉంటోంది.

స్నేహం పేరిట అతడు చనువు పెంచుకుంటున్నాడు.

ఆఫీసులో గౌతమ్‌కు ప్రత్యేకమైన గౌరవం లభిస్తోంది.

"అందమైన భార్యలు - భర్తల ప్రగతికి సోపానాలు...."

ఇదీ భానుప్రకాష్ అభిప్రాయం.

అతడు తననుంచి ఏమాశిస్తున్నాడు ?

ఈ విషయంలో భానుప్రకాష్ ముందడుగు వేయకుండా ఎలా ఆపాలి ?

అప్పుడామెకు సంధ్య గుర్తుకొచ్చింది.

సంధ్య తనసెంతో ఆప్యాయంగా ఆదరించింది. ఆమెకు భర్త గురించిన నిజం తెలుసా ? తెలియక పోతే తను చెబితే .... ?

ముక్త సంధ్యను ఫోన్లో పలకరించింది.

"ఫోన్లో ఏం మాట్లాడు కుంటాం ? కాసేపు మా యింటికి రాకూడదూ ?" అంది సంధ్య.

ముక్త సరే ననాలనుకుంది. కానీ ...

పేరంటం జరుగుతున్నప్పుడే భానుప్రకాష్ వచ్చేసి తనతో తను కోరిన విధంగా మాట్లాడ గలిగాడు. ఇప్పుడు మళ్ళీ యింటికి వస్తే ...

"నేను మీ యింటి కొచ్చాను. మీరే ఓ సారి మా యింటికి రావాలి...

"మీరు కాదు - నువ్వు ..." అంది సంధ్య.

చటుక్కున ముక్తకు భానుప్రకాష్ మాటలు గుర్తు కొచ్చాయి.

"అంత సులువుగా కొత్త వారిని నేను నువ్వన లేను ..."

"కానీ మావారి మాట నాకు శిలాశాసనం ...."

"మీ వారి గురించే మాట్లాడాలి. మా యింటికి రండి ..."

"ముక్తా ! అక్కా చెల్లెళ్ళలా మసలమని నీ గురించి వారు నాకు చెప్పారు. నువ్వు నన్ను నువ్వనకపోతే - ఏ చనువుతో - ఏ పేరంటమూ లేకుండా మీ యింటికి రాను ..." అంది సంధ్య.

"అక్కా ! అర్జంటుగా నీతో మాట్లాడాలి. మా యింటికిరా -" అంది ముక్త అలా మాట్లాడినందుకామె అదోలాగుంది.

కాసేపట్లో కారామె యింటి ముందాగింది.

డ్రైవర్నోగంట పోయాక రమ్మని పంపేసింది సంధ్య.

ముక్త ఆమెను సాదరంగా ఆహ్వానించింది. సంధ్య ఇల్లంతా చూసి - ఎంత బాగా సర్దుకున్నారని మెచ్చుకుంది.

"మీ యింటితో పోలిస్తే - ఇదేముంది ?" అంది ముక్త.

"మాయింట్లో ఉన్నది వైభవం. మీయింట్లోది అభిరుచి...." అంది సంధ్య.

"వైభవంలో అభిరుచి ఉండదా ?"

"ఉండొచ్చు. కానీ అభిరుచికి వైభవం అవసరం లేదు..."

"నువ్వు చాలా బాగా మాట్లాడగలవు..."

"అంతా మావారిదగ్గర నేర్చుకున్నాను...."

ముక్త వెంటనే -"నీకు మీవారంటే ఆరాధన-కదూ ?" అంది.

"ఏ భార్యకు భర్తంటే ఆరాధన ఉండదు ?" అంది సంధ్య.

ముక్త మాట్లాడలేదు.

"మా వారికి అందముంది, పర్సనాలిటీ ఉంది, సంభాషణా చాతురి ఉంది, హోదా ఉంది, డబ్బుంది. అటువంటి వారినారాధించకపోతే ఆ భార్యలోనే ఏదో లోపముండాలి...." అంది సంధ్య.

"కానీ మెరిసేదంతా బంగారం కాకపోవచ్చు ...." అంది ముక్త.

"అంటే ?"

"మీవారి గురించి నేను చెడ్డగా విన్నాను...."

సంధ్యముఖం ఎర్రబడింది- "చెడ్డగా అంటే ?"

"వారి ప్రవర్తన మంచిదికాదుట ..."

"వ్యాపారంలో సీదాసాదాగా పైకొచ్చేవారుండరు..."

"ప్రవర్తన అంటే వ్యాపారానికి సంబంధించిందికాదు ... ఆయన వ్యక్తిత్వానికి సంబంధించి...."

"చెప్పు..." అంది సంధ్య.

"ఆయన ఆడపిల్లల్ని వలలో వేసుకుందుకు ప్రయత్నిస్తారుట..."

సంధ్య నవ్వి - "ఆడపిల్లల వలలో ఆయన పడకుండా ఉండాలని నాకోరిక. వలలో వేసుకుందామన్నా ఆయనకా అవకాశ మేదీ ?" అంది.

"అంటే?"

"ఆయన వల వేద్దామనుకునేలోగానే వాళ్ళాయనపై వల విసురుతున్నారు. ఆయన పొజిషన్ అలాంటిది..."

"తనకీ - ఆయన పొజిషన్‌కీ సంబంధమేమిటి?"

"కంపెనీ ఆయనవల్ల బాగా వృద్ధిలోకొచ్చింది. ఇతర కంపెనీలాయన్ని లాగాలని చూస్తున్నాయి. కొందరికాయన పతనమైతే చాలు. మరి కొందరికైతే - ఆయన్ని తమవైపు ఆకర్షించుకోవాలనుంది ...." అని - "అందుకోసం ఆయనపై ఆడపిల్లలను ప్రయోగిస్తారు. అర్థమయిందా?" అంది సంధ్య.

"కానీ .... నేనింకోలా విన్నాను ..." అంది ముక్త.

"ఏం విన్నావో చెప్పు..."

"ఆయననే ఆడపిల్లలవెంట పడతారనీ ... అవతల యువతి వివాహితా కాదా అన్న విచక్షణకూడా చూడరనీ...."

సంధ్య నవ్వి - "ఎవరు చెప్పారు?" అంది.

ముక్త తడబడింది.

సంధ్య తనే మళ్ళీ - "వారుగానీ నీతో మాట్లాడేరా?" అంది.

"లేదు -" అంది ముక్త వెంటనే.

"ఒకవేళ వారు నీతో చనువుగా మాట్లాడినా తప్పుగా అర్థం చేసుకోకు"

"ఎందుకని?"

"ఒక వయసులో మగాడికి ఆడది - ఆడదానికి మగాడు గొప్ప ఆకర్షణ! ఆ ఆకర్షణలోంచి బైటపడి తప్పించుకోవడం ఎక్కడో మహాత్ములకు తప్ప సాధ్యం పడదు. మావారికి తన ప్రవర్తన గురించి పట్టుదల ఉంది. వారిపై నాకు నమ్మకముంది. కానీ ఒకోసారి తన మనసు చలిస్తుందేమోనని వారిభయం. పరాయి స్త్రీలతో చనువుగా ఉండడంద్వారా - అనుకోకుండా ఎదురయ్యే ఆకర్షణలనుంచి తప్పించుకోవడానికి వీలవుతుందని ఆయన అనుకుంటారు..."

"అదెలా సాధ్యం?"

"నిగ్రహానికికూడా ప్రాక్టీసుండాలికదా! భార్యముందు చేసే ప్రాక్టీసు ప్రాక్టీసు కాదు. అలవాటుపడ్డ మనిషి కాబట్టి..." అంది సంధ్య - "అందుకని మావారు కొత్త వాళ్ళతో చనువుగా ఉంటూంటారు. ఒకసారేమయిందో తెలుసా? వారూ - మరదలూ ఒక రాత్రంతా ఒకేగదిలో పడుకున్నారు. నేను తన్ను గమనిస్తున్నట్లుకూడా వారికి తెలియదు. ఇద్దరూ శుభ్రంగా పక్కెరక్కుండా పడుకున్నారు. వాళ్ళను కాపలా కాసి కాసి నాకే నిద్రలేదు...."

"నువ్వు చెబుతున్నది నాకు చాలా చిత్రంగా ఉంది -" అంది ముక్త.

"వారంటే నాకు ఆరాధన! వారిపట్ల నాకు పూర్తి నమ్మకం. వారి ప్రవర్తన సరైనది కాదనడానికి కళ్ళారా చూడగల ఋజువు లభిస్తే నా కళ్ళే నన్ను మోసం

చేస్తున్నాయనుకుంటాను తప్ప వారి ననుమానించను -" అంది సంధ్య.

"నీ నమ్మకం నీ భర్తను పాడు చేయడమే కాదు. ఎందరో పతివ్రతలను పతితల్ని చేస్తుంది -" అంది ముక్త.

"పతివ్రతలు పతితలు కాలేరు -" అంది సంధ్య.

"ఎందుకు కాలేరు?"

"తమను తాము రక్షించుకొనేందుకు పతివ్రతలు భర్తలపై ఆధారపడరు. తాము పూర్తిగా అసహాయులైనపుడు దేవుడే వారిని రక్షిస్తాడు..."

"అలా రక్షించక పోతే?"

"వారు పతివ్రతలు కారని అర్థం..."

"నీ భర్త సరైన వాడు కాదనడానికి నాకు కొన్ని ఋజువులు లభించాయి. కాస్త ముందడుగు వేస్తే విషయం నీ ముందుకూడా ఋజువు చేయగలను..."

"ఏమిటి నీ ఋజువులు?"

"ఇప్పుడు చెప్పను..."

"ఎప్పుడు చెబుతావు?"

"అదీ నాకు తెలియదు. నేను రిస్కు తీసుకోవాలి. నాకు దేవుడి మీద నమ్మకం లేదు...." అంది ముక్త.

"దేవుణ్ణి నమ్ము. తన భక్తులకాయనెప్పుడూ అన్యాయం చేయడు...."

"తప్పు చేసిన వాళ్ళే దేవుణ్ణి నమ్ముతారని మా నాన్నగారంటారు...."

సంధ్య ముఖం పాలిపోయింది "-నేను తప్పు చేశానంటావా?"

"నీ భర్తనంతలా నమ్మడం నువ్వు చేస్తున్న తప్పు. అందు వల్ల అతడు బరి తెగించి ప్రవర్తించే అవకాశముంది..."

"నువ్వు మా వారినెందుకు పట్టించావు?" అంది సంధ్య.

"ఆలోచిస్తే నీకూ మీ వారి గురించి అర్థమవుతుంది. అతను నిన్ను వెర్రి బాగులదాన్ని చేసి ఆడిస్తున్నాడు. లేని పక్షంలో తను ప్రత్యేకించి ఆడవాళ్ళతో చనువుగా మాట్లాడడమెందుకు? మరదలితో ఒక్కడు వేరేగదిలో పడుకోవడమెందుకు?"

సంధ్య ఏదో చెప్పబోయి ఆగిపోయింది. కాసేపుండి నెమ్మదిగా -"నీకు మావారి మీద దురభిప్రాయం కలిగింది. ఎందుకో చెబితే పోగొట్టగలను...." అంది

"మీవారి మీద ఆడ పిల్లలు వలలు విసురుతారన్నదబద్ధం. అతడే ఓ ఆడ పిల్ల మీద వల విసురుతున్నాడిపుడు...."

"ఎవరామె?"

"ఎవరైనా ఆమె పతివ్రత!"

"ఎవరా పతివ్రత?" అంది సంధ్య.

"ఎవరైనా ఈపరిస్థితినుంచెలా బైటపడాలా అని ఆమె భయపడుతోంది. ఆమెకు భర్తే ప్రాణం. భర్తే లోకం, భర్తే దైవం. కానీ ఆ భర్తనే రూపు రేఖలు

లేకుండా నాశనం చేయగలడు నీ భర్త. అందుకే ఆమె భయపడుతోంది....”

“ఇందుకు ఋజువుందా?”

“ఋజువు నీకు చూపిస్తాను. నమ్ముతావా ?”

“నువ్వు చూపిస్తే నమ్ముతాను...” అంది సంధ్య.

“చూపాలనే ఉంది. కానీ నేను భయపడుతున్నాను. ఋజువు చూపడానికి కొంత రిస్కు తీసుకోవాలి. అప్పుడు దేవుడు రక్షించకపోతే ?”

“మీవారు నిజంగానే ఓ ఆడ పిల్లపై వల విసిరితే, ఆమె పతివ్రతే అయితే నీకేమీ భయం అవసరం లేదు. రక్షించడానికి నేనున్నాను. నేనే దేవుణ్ణనుకో... నన్ను నమ్ము...” అంది సంధ్య గంభీరంగా.

“అక్కా !” అంది ముక్త అప్రయత్నంగా.

“మా వారే మనిద్దరికీ ఈ వరస కలిపారు. అందువల్ల అక్కగా నాకు నీ బాధ్యత ఉంది నీ సమస్యేమిటో నిర్మోహమాటంగా చెప్పు. నేను చేయ గలిగింది చేస్తాను....” అంది సంధ్య.

“ప్రస్తుతానికి నువ్వేమి చేయనవసరం లేదు. మీ వారినో కంట కని పెడుతూండు –” అంది ముక్త.

6

“నువ్వింట్లో అడుగు పెట్టిన వేళావిశేషం మంచిది. ఆఫీసులో నాకు మంచి ఫ్యూచర్ కనబడుతోంది–” అన్నాడొకరోజున గౌతమ్ భార్యతో.

“ఫ్యూచర్ ఎలా కనబడుతుందండీ ?” అంది ముక్త.

“బాస్ నన్ను విపరీతంగా అభిమానిస్తున్నాడు. కొన్నాళ్ళపాటు నిన్ను గమనిస్తూంటాను. నాకు నచ్చితే నా తర్వాత నా అంతటివాణ్ణి చేస్తానని ఆయన నాతో అన్నాడు...” సంతోషంగా అన్నాడు గౌతమ్.

భర్త ముఖంలోని సంతోషం ముక్తను భయపెట్టింది.

“ఒకవేళ మీ బాస్‌కు మీరు నచ్చకపోతే ?” అందామె.

“ఎందుకు నచ్చను ?”

“ఎందుకంటే ఏం చెప్పగలం ? దురదృష్టమనుకోండి...”

“నువ్వుండగా దురదృష్టం నావంక కన్నెత్తికూడా చూడలేదు....”

ముక్త ఉలిక్కిపడి భర్తవంక పరీక్షగా చూసింది. అతడి ముఖంలో ఆనెక్ష భానుప్రకాష్ కనిపించాడు.

“అందమైన భార్యలు ప్రగతికి సోపానాలు...” అంటున్నాడతడు.

“ఏమన్నారూ ?” అందామె.

“నువ్వు నా అదృష్టానివంటున్నాను...”

“అదృష్టమంటే ఎలాంటి అదృష్టాన్ని ?”

“చెప్పడం నాకు చేతకాదు...”

“మీలో సమర్థత ఉంది. అందుకే మీ బాస్ మిమ్మల్నభిమానిస్తున్నారు. బాస్‌కు మీ అవసరముంది. మీరు లేకుండా ఆయన కంపెనీ నడవదు. అలాంటప్పుడొకోసారి అసూయకూడా బయల్దేరుతుంది. మీ బాస్ మిమ్మల్నుద్యోగంనుంచి తొలగించవచ్చు. అప్పుడు మీకు మరో కంపెనీ స్వాగతం పలుకుతుంది...” అంది ముక్త.

“ప్లీజ్ ముక్తా ! నువ్వలా మాట్లాడవద్దు –” అన్నాడు గౌతమ్.

“ఎందుకని ?”

“ఉద్యోగం విషయంలో నేను నువ్వనుకున్నంత గొప్పవాణ్ణి కాను. మా నాన్నగారి రికమెండేషన్‌మీద వచ్చిందీ ఉద్యోగం నాకు. ఇదిపోతే ఎక్కడికి వెళ్ళినా ఈ ఉద్యోగమెందుకు పోయిందో సంజాయిషీ యిచ్చుకోవాలి. మా బాస్ బాగా పలుకుబడి ఉన్నవాడు పగబట్టాడంటే ఈ చుట్టుపక్కలెక్కడా నాకు మంచినీళ్ళుకూడా పుట్టవు”

భర్త కళ్ళలోని భయాన్ని స్పష్టంగా చదివింది ముక్త.

“అంటే మీరు పూర్తిగా మీ బాస్‌పై ఆధారపడిపోయారు భవిష్యత్తుకోసం –” అంది ముక్త.

“అసలా ఆధారం దొరకడమే ఓ అదృష్టం. దొరికిన ఆధారాన్ని వదులుకోలేను...” అన్నాడు గౌతమ్.

“చాలా బాగుంది. ఇలాగైతే మీరు బాస్‌కి పూర్తిగా లోకువైపోతారు, అతడొకరోజున మీనుంచి ఎలాంటి ప్రతిఫలాన్నైనా కోరవచ్చు....”

“ఆయన నానుంచి ప్రతిఫలమెందుకు కోరతాడు ? కోరినా నేనాయనకివ్వగలిగిన దేముంది ?” అన్నాడు గౌతమ్.

ముక్త మాట్లాడలేదు.

“మంచి మూడ్ పాడుచేసేశావు ముక్తా !” అన్నాడు గౌతమ్.

“నా మూడ్‌కూడా పాడయింది. తనభర్త అందరికంటే అధికుడిగా ఉండాలని ఏ భార్యయినా కోరుకుంటుంది. మీరు బాస్‌కి బానిసలని తెలిస్తే నాకెంతో బాధగా ఉంది –” అంది ముక్త.

“బాస్‌కి బానిస కావడంలో వింతేముంది ? అది మన దేశ సాంప్రదాయం ?” అన్నాడు గౌతమ్.

“మీ బలహీనతను మన సంప్రదాయానికంటగట్టకండి –”

“నీకు ప్రపంచం తెలియక అలాగంటున్నావు...” అన్నాడు గౌతమ్.

హైస్కూల్లో హెడ్మాస్టరుకి మిగతా టీచర్సు బానిసలు. వ్యక్తిత్వముండి ఎదిరించినవాడు మన్య ప్రాంతాలకు ట్రాన్స్‌ఫరవుతాడు. యూనివర్సిటీలో ప్రొఫెసరుకి మిగతా స్టాఫంతా బానిసలు. వ్యక్తిత్వం చూపాలనుకుంటే చాలు– భవిష్యత్తును కోల్పోతాడు. ఇది విద్యారంగం.

లేబరేటరీల్లో డైరెక్టరుకి సైంటిస్టులు బానిసలు. స్వతంత్ర భావాలున్నవాడు నోబెల్ ప్రైజుకొట్టే విశేషం కనిపెట్టినా అది లాబొరేటరీ గోడలు దాటి బయటకురాదు.

అది వైజ్ఞానిక రంగం.

క్రీడారంగంలో ఆటగాళ్ళు యాజమాన్యానికి బానిసలు. రాజకీయ రంగంలో రాజకీయ వాదులు నాయకులకు బానిసలు.

శతాబ్దాల తరబడి భారతీయులు విదేశీయులకు బానిసల్లుగా ఉన్నారు. స్వతంత్రం వచ్చేక స్వదేశీయులకు బానిసలయ్యారు.

"మీరన్నది నిజమే కావచ్చు. కానీ కనీసం నా ముందైనా ఈ నిజం ఒప్పుకోకండి. నాకు తృప్తిగా ఉంటుంది...." అంది ముక్త.

"ఏంచేయమంటావో చెప్పు ..." అన్నాడు గౌతమ్.

"కాసేపు మీ బాస్‌ను తిట్టండి -"

"బాస్‌నా ?"

"ఊఁ"

"ఎందుకు ?"

"నా సంతోషంకోసం !"

"నా బాస్‌ను తిడితే నీకెందుకు సంతోషం ?"

"ఆఫీసులో అతడితో ఎలా ఉంటున్నారో నాకు తెలియదు. ఇంట్లోనైనా అతణ్ణి తిడితే - అతడికంటే మీరే గొప్పవారనిపిస్తుంది ... అదో తృప్తి నాకు..."

గౌతమ్ ఏదో అనబోయి చుట్టూ చూశాడు.

చిన్న పడకగది. గది మధ్యన మంచం. మంచంపై తనూ, ముక్త...

పైన సీలింగ్‌కు వ్రేలాడుతోంది ఫ్యాన్ ...

గది తలుపు గడియ వేసుకున్నారింట్లో ఎవరూ లేకున్నా...

గదిచుట్టూ గోడలు...

తిరుగులేని ఏకాంతమది !

ఆ ఏకాంతంలో తనూ, ముక్తా...

అక్కడ తనేం చేసినా చూసేవారు లేరు.

తనేమన్నా వినేవారు లేరు. ఏదీ గోడదాటి పోదు.

చుట్టూ చూశాడు గౌతమ్. గోడలు కనిపించాయి.

"తిట్టండి !" అంది ముక్త.

"వద్దు..."

"ఏం ? ఇక్కడెవరూ లేరుగా..."

"ఏమో - గోడలకు చెవులుంటాయంటారు...."

ముక్తకు కోపం వచ్చి మరోవైపు తిరిగింది. గౌతమ్ ఆమె నడుంమీద చేయి - "ముక్తా ! నువ్వు పక్కనుండగా ఎవరినో తిట్టి సమయం వృధా చేసుకోలేను. వర్ణిస్తాను...." అన్నాడు,

ముక్త మాట్లాడలేదు.

అతడామెను వర్ణించ సాగాడు. తనకంటికామె ఎలా కనబడుతుందో వర్ణిస్తున్నాడతడు.

ముక్తకు భర్త మాటలు వినబడటం లేదు. ఫోన్లో భానుప్రకాష్- పేరంటంలో తానెలా కనబడిందీ వర్ణిస్తున్నాడు. ఆ మాటలేవి ఆమె చెవుల్లో గింగురు మంటున్నాయి.

భానుప్రకాష్ వర్ణనముందు గౌతమ్ వర్ణన పేలవంగా ఉంది.

ముక్త భానుప్రకాష్‌కి పరాయి ఆడది. గౌతమ్‌కి కట్టుకున్న భార్య. గౌతమ్ వర్ణన పేలవంగా ఉండడానికదే కారణమా ? పరాయి స్త్రీ పుట్టించగల భావావేశం భార్య పుట్టించలేదా ?

లేక - భానుప్రకాష్ బాస్. గౌతమ్ బానిస. తన బానిస మనస్తత్వాన్ని భార్య ముందుకూడా వదిలిపెట్టలేక పోవడంవల్ల ముక్తకు గౌతమ్ వర్ణన పేలవంగా అనిపించిందా ?

లేక...

ముక్త ఉలిక్కి పడింది.

గౌతమ్ తనకు కట్టుకున్న భర్త. భానుప్రకాష్ పరాయి మగాడు. అందుకే తనకతడి వర్ణన బాగుందా ?

ఇందులో ఏది నిజం ?

నిజమేదైనప్పటికీ-ఆ రాత్రి తొలిసారిగా ఓ విశేషం తెలుసుకున్నాడు గౌతమ్.... అన్ని సమయాల్లోనూ ఆడవాళ్ళు పొగడ్తలకు లొంగరు !

7

"హలో ముక్తేనా మాట్లాడుతుంది..."

ముక్త ఆ గొంతును సులభంగా గుర్తుపట్టింది - "ఊఁ"

"ఇంట్లో వుండవేమోనని భయపడ్డాను...."

ముక్త మాట్లాడలేదు.

"గౌతమ్ చాలా ఉత్సాహంగా ఉంటున్నాడాఫీసులో. అతడిలో ఆశలు పెంచేస్తున్నాను. ఇదంతా ఎందుకో తెలుసా ?"

"తెలియదు !"

"అతణ్ణి ఎవరెస్ట్ శిఖరాగ్రానికి తీసుకుని వెడతాను. అప్పుడు...."

"వద్దు..." అంది ముక్త.

"ఏమిటివద్దు !"

"మావారినేమీ చేయొద్దు..."

"ఏమీ చేయను. అంతా నీలో ఉంది ..."

"నేనేంచేయాలి ?"

"నువ్వేమీ చేయనవసరం లేదు. అభ్యంతర పెట్టకుండా ఉంటే చాలు..."
అన్నాడతడు.

"హద్దుమీరుతున్నారు..."

"నువ్వుకూడా నన్ను నువ్వను. హద్దులవే తొలగి పోతాయి..."

"హద్దులు తొలగాలని నేననుకోపడంలేదు...."

"నీభర్త ఎవరెస్టు శిఖరంవైపు వెడుతున్నాడు..."

ముక్తకేం చెప్పాలో తెలియలేదు.

గౌతమ్ ఎవరెస్టు శిఖరంవైపు వెడుతున్నమాట నిజం. కానీ అతడినెలా ఆపాలి ?

"మాట్లాడుముక్తా ! ఫోన్‌లో విన్నా నీగొంతు తీయగా ఉంటుంది...."

"మావారికన్యాయం చేయొద్దు –" అందామె.

"అది నీలో ఉంది..."

"నన్నూ మావారి కన్యాయం చేయమనొద్దు..." అంది ముక్త.

"ఆధునిక ప్రపంచం గురించి నీకు తెలియక పోవటం నా దురదృష్టం... నీ కారణంగానైనా సరే తను పైకి రావాలని నీభర్త అనుకుంటాడు. అది అన్యాయమని నువ్వనుకుంటే నీకు ప్రపంచజ్ఞానం లేదనుకోవాలి ..."

"నాకున్న జ్ఞానం చాలు నాకు...."

"ఈ ఊళ్ళో అజంతా ఇంటర్నేషనల్ ఉంది. రోజూ మధ్యాహ్నం రెండు గంటలకిఊళ్ళోని ఆఫీసర్సు కార్లలో అక్కడికి వస్తారు. ఎందుకో తెలుసా ?"

"తెలియదు..."

"ఎందుకు ?"

"తమ భార్యలనక్కడ దిగవిడిచి వెడతారు ...."

"వారక్కడ హోటల్లో కొన్ని గంటలు గడిపి వెడతారు. ఫలితంగా వారికి కార్లు, బంగళాలు, వైభోగాలు..."

ముక్త మాట్లాడలేదు.

"నెలకు రెండుమూడు వేలు తెచ్చే ఆఫీసరు కేవలం జీతంమీద వైభవాన్ని కొనుక్కోలేడు. అందుకే ఇటీవల ఆఫీసర్లు – అందమైన భార్యలనే పెళ్ళిచేసుకుంటున్నారు. వారిని తమ ఆర్థిక, సాంఘిక ప్రగతికి సోపానాలుగా వాడుకుంటున్నారు"

ముక్తకు వళ్ళు జలదరించింది – "నేను నమ్మను" – అందామె.

"నీ నమ్మకంతో పని లేకుండా జరిగిపోతున్న నిజమిది...."

"అయినా సరే నేను నమ్మను..."

"ఎందుకని ?"

"మీరు చెప్పారు కాబట్టి !"

"పోనీ – నీ భర్తను నమ్ముతావుగదా ! అతణ్ణే అడిగి తెలుసుకో..."

"ఈవిషయమై ఒకరినడగాల్సిన అవసరం. కుతూహలం నాకు లేవు ...."

"అలాగనకు నీ మంచి కోరి చెప్పాను .... ఆలోచించుకో ..."

అవతల క్లిక్ మంది.

8

"ఏమండీ ! అజంతా ఇంటర్నేషనల్ గురించి మీకు తెలుసా ?" అందిముక్త భర్తతో.

"అదో స్టార్ హోటలు ..."

"అదికాదు ... ఇంకా ..."

"ఇంకా అంటే ?"

తటపటాయిస్తూనే తన సందేహం బైట పెట్టింది ముక్త.

"ఎవరు చెప్పారు నీకు ?" అన్నాడు గౌతమ్ ఆశ్చర్యంగా.

తడబడింది ముక్త

"ఎవరు చెప్పారు ?"

"ఈ వీధిలోనే – పంకజంగారని ..."

పంకజం, ముక్త చాలా అరుదుగా మాట్లాడుతుంటారు. పంకజం నోరు మంచిది కాదని ఆ వీధిలో చెప్పుకుంటారు. అందుకే ఆపేరు చెప్పిందామె.

గౌతమ్ నిట్టూర్చి – "నీకివి తెలుసుకోవాలనెందుకనిపించిది ?" అన్నాడు.

"లోకంలో యిలాంటివి కూడా ఉంటాయా అని !"

"ఉంటాయి –" అన్నాడు గౌతమ్.

"అంటే యిది నిజమేనా ?"

"ఊఁ"

"ఛీ – ...." అంది ముక్త.

"ఛీ అనడానికిందులో తప్పేముంది ?"

"మీ కిందులో తప్పు అనిపించడం లేదు ?"

"లేదు ..."

"తప్పు అనిపించడం లేదూ ?" రెట్టించింది ముక్త.

"సావధానంగా విను...." అన్నాడు గౌతమ్.

శీలం అన్నది మనిషి కల్పించు కున్నది. ధర్మం అన్నది బలహీనుడు బలవంతుల్ని శాసించడానికి సృష్టించినది. విదేశాల్లో శీలానికి ప్రాముఖ్యత లేదు. పవిత్రతకు అర్థం లేదు. ఆ దేశాలు సిరి సంపదలతో తులతూగి పోతున్నాయి. ఏయేదేశాల్లో పవిత్రత పేరిట స్త్రీ అణగ ద్రొక్కబడుతోందో – ఆదేశాలు ప్రగతి సాధించ లేక పోతున్నాయి.

దేశ ప్రగతి మనిషిలో ఉంది. మనిషి ప్రగతి స్త్రీలో ఉంది. స్త్రీ దానికి ప్రాముఖ్య

తనూ, పవిత్రతను అంటి గట్టి-అవి కాపాడ్డానికే జీవితాన్నంకితం చేసినంత కాలం మనిషి ప్రగతిని సాధించలేడు.

అజంతా ఇంటర్నేషనల్‌కు తమ భార్యలను తీసుకుని వెళుతున్న ఆ ఆఫీసర్లు దుష్ట సంతులు. శీలం ప్రాముఖ్యతను తొలగిస్తే వారు చేసిందాట్లో తప్పేమీ లేదు. వారి ప్రగతినెవరూ ఆపన్నూలేరు.

"అయితే అలాంటి తప్పు మీరు కూడా చేస్తారా!" అంది ముక్త.

గౌతమ్ ఉలిక్కిపడి -"నా సంగతి నేనాలోచించ లేదు-" అన్నాడు.

"ఆలోచించండి -" అంది ముక్త.

"ఛీ!" అన్నాడు గౌతమ్ అప్రయత్నంగా.

"మీ విషయంలో ఛీ అనిపించినదితరులకు మంచిదెలాగవుతుంది?" అంది ముక్త భర్తను నిలదీస్తూ.

"సారీ ముక్తా! నేనెక్కువదూరమాలోచించ లేదు. నువ్వడిగినప్పుడు నేనింకోలా ఆలోచిస్తున్నాను. అసలేం జరిగిందంటే..." అన్నాడు గౌతమ్.

ఆరోజు ఆఫీసులో భానుప్రకాష్ గౌతమ్‌ని పిలిచాడు. మాటల సందర్భంలో అజంతా ఇంటర్నేషనల్ ప్రసక్తి వచ్చింది. ఆయన అక్కడి విశేషాలను సమర్థించాడు. గౌతమ్ బాస్ అభిప్రాయాలన్నింటితోటీ ఏకీభవించాడు. అవే యింటి దగ్గర రిపీట్ చేశాడు.

"ఈ అభిప్రాయలు నావికాదు. నా బాస్‌వి..."

"మీ అభిప్రాయం కూడా చెప్పండి...."

"ఎందుకు నీకంత పట్టుదల?"

"ఈ విధంగానైనా మీ బాస్‌ను తిడతారని!"

"నా బాస్‌ను తిట్టాలని నీకంత పట్టుదలెందుకు? ఆయన నిన్నేం చేశాడు...?" అన్నాడు గౌతమ్.

ముక్త తడబడింది. అప్పుడామెకు మళ్ళీ పంకజం గుర్తు కొచ్చింది.

పంకజం పేరునే మళ్ళీ ఉపయోగించు కుందామె.

"అజంతా ఇంటర్నేషనల్‌కి మీబాస్ కూడాఆడ వాళ్ళని రప్పించు కుంటాడట. పంకజం చెప్పింది..."

గౌతమ్ ముందు తడబడినా తర్వాత తేలికగా నవ్వేసి -"బాస్ చాలా మంచివాడు. అయనకు డబ్బుంది కాబట్టి ఏం చేసినా సాగుతుంది. నేనాయనకు జూనియర్నైనా నా దగ్గరెంత చనువుగా ఉంటాడు. తన ప్రవర్తనను తప్పు పట్టి నేనసహ్యించుకుంట నన్న భయం కాబోలు....ఆయన పనిగట్టుకుని రోజు నాదగ్గర ఆ హోటలు ప్రసక్తి తెచ్చి సమర్థించు కున్నాడు. అయనెలాంటివాడైనా ఆరాధన తప్పదు నాకు. అయినా నన్ను కన్విన్స్ చేయలని చూస్తాడు. గొప్ప సంస్కారం కదూ!" అన్నాడు.

"ఇదేం సంస్కారం?" అంది ముక్త.

"ఆలోచించి చూడు. నీకే కనబడుతుంది సంస్కారం!"

"నాకేం కనబడ్డం లేదు...పరాయి ఆడవాళ్ళతో హోటళ్ళలో కులికే మీ బాస్‌లో సంస్కారాన్నెలా చూడగలను?" అందిముక్త.

"శ్రీకృష్ణుడు గోపికలను వస్త్రాపహరణం చేస్తే అది రాసలీల అయింది. శ్రీకృష్ణుడుదేవుడయ్యాడు. నా బాస్ నాకు దేవుడు -" అన్నాడు గౌతమ్.

"కానీ - ఆయనలో వేరే దురుద్దేశ్యముందేమో ఆలోచించారా?"

"వేరే దురుద్దేశ్యమంటే?"

"ఆయన పనిగట్టుకుని అజంతా ఇంటర్నేషనల్ గురించి మీకెందుకు చెప్పాడు? అది తప్పుగాదని మీ దగ్గరెందుకు సమర్థించాడు?"

"ఎందుకో చెప్పానుగా - అదాయన సంస్కారం..."

"సంస్కారంకాక దురుద్దేశ్యమేం కనబడలేదా మీకు!"

"నీకేదైనా కనబడిందా?"

"నేను మీ సంగతడిగాను..."

"నా సంగతి నేను చెప్పాను. నీసంగతి చెప్పు..."

"ఈయన కెలా చెప్పేది?" అనుకుంది ముక్త. మనసులో ఆమెకు రవంత అనుమానం కూడా వచ్చింది. భర్తకు నిజంగా అసలు విషయం స్ఫురించలేదా, నటిస్తున్నాడా అని!

9

"హలో!" అంది ముక్త భయపడుతూనే.

"స్వీట్ వాయిస్...."

ఆ గొంతు ముక్త గుర్తుపట్టి - "ఎందుకు మీరిలా మాటిమాటికీ ఫోన్ చేసి నన్ను వేధిస్తారు?" అంది.

"నాలో వేదన ఉంది...." అన్నాడు భానుప్రకాష్.

"ప్లీజ్ - ఇక మీదట ఇలా ఫోన్ చేయొద్దు..."

"నువ్వు నన్ను కలుసుకొంటానంటే ఫోన్ చేయడం మానేస్తాను..."

"కలుసుకోవడమెందుకు?"

"నీ భర్త ప్రగతి కోసం"

"నా భర్తకీ ప్రగతి చాలు...."

"ఆమాట అతడిని చెప్పమను..."

"మిమ్మల్నతడు తెలుసుకోలేక పోతున్నాడు. తెలుసుకో గలిగిన రోజున ఏమైనాజరుగుతుంది!"

"నన్నతడు తెలుసుకున్నాడు. నువ్వే అతణ్ణి తెలుసుకోలేక పోతున్నావు..." ఫోన్లో నవ్వాడు భానుప్రకాష్.

"అంటే ?"

"ఇంకా నీకు నీ భర్త ఉద్దేశ్యం తెలియ లేదంటే అతడు నీ దగ్గర నటిస్తూండి ఉండాలి. లేదా నువ్వువాతో అబద్ధం చెబుతూండాలి ..."

ముక్తకు చాలా ఉక్రోషం వచ్చింది. –"ఇక ముసుగులో గుద్దులాటఅనవసరం. ఈరోజు నేను నా భర్తతో మాట్లాడి అసలు విషయం తేల్చేస్తాను..." అంది.

"అందులో ప్రమాదముంది...." అన్నాడు భానుప్రకాష్.

ఫోన్‌లో అతడు వివరిస్తూంటే ముక్తకు మతి పోయినట్లయింది.

జరుగు తున్నది గౌతమ్‌కి తెలుసు. తన పరువు కాపాడు కోడం కోసం అతడు తెలియ నట్లు నటిస్తున్నాడు. ముక్త నిల దీసి అడిగితే తనకేమి తెలియదనే అంటాడతడు. పైగా యింత కాలం నాకెందుకు చెప్పలేదంటాడు. నీ ప్రోత్సాహం లేకుండానే వ్యవహారమింతవరకూ వచ్చిందా అంటాడు అక్కణ్ణించి మాట మాటికీ భార్య ననుమానించడం ప్రారభించి ఆమెకు జీవితంనరకం చేస్తాడు. అంత వరకూ గౌతమ్‌లో మనిషిని చూసిన ముక్త ఇక మీదట రాక్షసుణ్ణి చూస్తుంది.

"అలా ఎన్నటికీ జరగదు...." అంది ముక్త.

"ఎందుకు జరగదు? అసహాయుడైన మనిషి తన కంటే అసహాయుల్ని వెతుక్కొని వేధిస్తాడు. వివాహిత స్త్రీకి మించిన అసహాయులు మన దేశంలో ఎక్కడా ఉండరు..." అన్నాడు భానుప్రకాష్.

ముక్త ఆలోచనలో పడింది.

"నామాట విను ముక్తా! ఇందులో నువ్వు చేస్తున్న తప్పేమీ లేదు. నువ్వు తప్పను కుంటున్నావు కాబట్టి అది తప్పయింది. తప్పు కాదని అనుకో అప్పుడు సమాజంలో నీస్థాయి తప్పు చేస్తినా ఎవరు వేలెత్తి చూపలేని ఎత్తుకు చేరుకుంటుంది. ఈ ప్రసక్తి నీ భర్త ముందు తీసుకురాకు. అతడు తనకేమీ తెలియ నట్లే ఊరుకుంటాడు అతడిని నిలదీశావా – నీకేమీ ప్రయోజనముండదు. వ్యవహారం నీకే ఎదురు తిరుగు తుంది..."

"మీరు నన్ను బ్లాక్ మెయిల్ చేస్తున్నారు..."

"లేదు. మధ్య తరగతి బలహీనతలు నీలోంచి తొలగించాలని ప్రయత్నిస్తు న్నాను. అదీ నీ మంచికే!"

"నామంచి గురించి మీ కెందుకు?"

"నాకు నువ్వు నచ్చడం నీ అదృష్టం...."

"ఏమైనా నేనిది భరించలేను. వారితో మాట్లాడతాను ...."

"బాగా ఆలోచించుకో. అందువల్ల ఎదురయ్యే ప్రమాదానికి నువ్వు తట్టుకో లేవు. భర్త నిరసనను ఏ స్త్రీకూడా భరించలేదని నాకు తెలుసు. నీభర్తపై నీ కింకా నమ్మకముంటే – అది పోగొట్టడానికి గట్టి ఋజువు చూపగలను. అందుకు నువ్వో పని చేయాలి. నాలుగు రోజుల్లో నీ భర్త కోటూరు ప్రోగ్రాముంటుంది. కూడా నువ్వో

వెళ్లొచ్చు. రానను. అతడితో బయల్దేరివెళ్ళి తర్వాతేంజరుగుతుందో చూడు ..."

ముక్త ఆలోచనలో పడింది.

అవతల ఫోన్ క్లిక్ మంది.

10

గౌతమ్ చాలా ఉత్సాహంగా ఉన్నాడు.

"బాస్ చాలా మంచివాడు. ఇలాంటి గౌరవం మనకరుదుగా లభిస్తుంది ...." అన్నాడతను.

మర్నాడే గౌతమ్ టూర్లో ఒక పట్టణం చేరుకోవలసి ఉంది. ప్రయాణం కంపెనీ కార్లో. మకాం కంపెనీ గెస్ట్‌హౌస్‌లో. కూడా అతను భార్యను కూడా తీసుకుని వెళ్ళొచ్చు.

"కొత్తగా పెళ్ళయిన వాళ్ళం. ఇంకా పిల్లలులేరు. బాస్ మనకిది హనీమూన్ ప్రిప్పసుకోమన్నాడు ..."

నిట్టూర్చింది ముక్త.

"ఇంతమంచి విశేషం నీకేమీ ఆనందం కలిగించడం లేదా?"

"లేదండీ – పంకజం మాటలు నన్ను భయపెడుతున్నాయి ..."

"ఎందుకు ?"

"మీ బాస్ ప్రవర్తన మంచిది కాదని మీకు తెలుసు. ఇదంతా ఆయనెందుకు చేస్తున్నట్లు ?"

"ముక్తా! మన సుఖం మనం చూసుకోవాలి. ఆయన ప్రవర్తనతో మనకేం పని ?"

"పంకజమంటుంది – ఈరోజుల్లో మగాళ్ళుకూడా బరితెగించారని – డబ్బు కోసం భార్యల్ని బాసుల కప్ప జెబుతారని ...

"అలాంటి వాళ్ళు లేక పోలేదు."

తటపటాయిస్తూనే – "మీరూ అలాంటి వాళ్ళే నంటుందామె–" అంది ముక్త.

గౌతమ్ ముందులిక్కిపడ్డాడు. తర్వాత – "ఏమన్నావ్ ?" అన్నాడు. అతడి మాట నీరసంగా వచ్చింది.

ముక్త మాట్లాడలేదు.

"ఒకసారి ఆపంకజాన్ని పిలు. ఏకిపారేస్తాను ...."

"వద్దులెండి. అవని నేనే చేశాను ..."

"అసలా పంకజాని కంత ధైర్య మెలాగొచ్చింది ?"

"మనింట్లో ఫోసురదని ఏడుపు. మీలాంటి చిన్న ఉద్యోగుల కిలాంటి సదు పాయాలుత్తినే రావుట ..."

గౌతమ్ ఆవేశపడ్డాడు – "ఆ పంకజం భర్త – ఆమెనలాగుపయోగించుకుం టున్నాడేమో అనలేక పోయావా ?"

"అన్నానండీ - ఆమె చలించలేదు. పంకజం అందంగా ఉండదు. తన భర్తకలాంటి దురూహలు లేవు కాబట్టే తన మంచితనాన్ని చూసి ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడంటుందామె..."

"తనకందంలేదని అందమైన వాళ్ళంటే అసూయన్నమాట ..."

"అందమైన భార్యలు - భర్తల ప్రగతికి సోపానాలు .... అంటుందామె!"

ఆవేశంలో గౌతమ్ గొంతు వణికింది - "ఇలా మాట్లాడే మనిషినొక్క క్షణం కూడా భరించ కూడదు. నేనేవెళ్ళి నిలదీస్తానో రోజు ..."

"అలాంటి వాళ్ళతో నోట్లో నోరు పెట్టి లాభం లేదండీ. ఊరూ వాడా ఏకం చేస్తారు ..." అంది ముక్త.

గౌతమ్ కొద్ది క్షణాలాయాసపడి - "బాస్టర్డ్ ... బగర్ ... " అన్నాడు.

"ఎందుకండీ ఆమెను తిట్టడం? నేను మిమల్ని నమ్ముతున్నాగా?" అంది ముక్త భర్త వంక ఆప్యాయంగా చూస్తూ.

"నువ్వు నమ్మడం దాకా బాగానే ఉంది. కానీ అసలనుమానమంటూ ఎందుకు రావాలి?" అన్నాడు గౌతమ్ ఉక్రోషంగా.

"అవసరే - అసలు సంగతి తెలిస్తే మీరింకా మండిపడతారు..."

"ఏమిటది?"

"పంకజం అంటుందీ - అజంతా ఇంటర్నేషనల్ గురించి నీ భర్తకు చెప్పి చూడు. ఆతడికోపం రాదు సరిగదా - వారందర్నీ సమర్థిస్తాడు. నీ భర్త బాస్ ప్రవర్తన మంచిని కాదను. అతడు దాన్ని సమర్థిస్తాడు. అంటే అర్థం నీ భర్త కూడా అలాంటి వాడేనని..."

"ఇదంతా ఎందుకు చెబుతున్నావు?" అన్నాడు గౌతమ్ అనుమానంగా.

"ఆమె చెప్పిందంతా విని ఊరుకోవడం తప్ప నాకు మీ మీదే అనుమానమూ లేదని చెప్పడానికి. నేనేం చెప్పినా భయం మీ బాస్ గురించే తప్ప మీ గురించికాదు. మీరే చెప్పండి. మీ బాస్ కన్ను మీ భార్య మీద పడితే ఏం చేస్తారు?"

"అలాజరగదు...."

"జరిగితే ఏం చేస్తారో చెప్పండి...."

"ఆ పంకజం నీ బుర్ర పాడు చేసి లేని పోని సందేహాలు కలిగిస్తోంది. అలా జరగదని నేనంటున్నాగా?"

"జరుగుతుందని నేననడంలేదు. జరిగితే ఏం చేస్తారూ అంటున్నాను..."

గౌతమ్ కళ్ళెర్ర బడ్డాయి. మనిషి ఆవేశంతో ఊగాడు.

ముక్త అతడినే పరీక్షగా చూస్తూ - "ఇది నిజమైన ఆవేశమే! నటన కాదు...." అనుకుంది.

గౌతమ్ ఇంకా ఆవేశంతో ఊగుతూనే ఉన్నాడు.

"చెప్పండీ!" అంది ముక్త.

గౌతమ్ ఏదో చెప్పబోయి - "ఎందుకులే - గోడలకు చెవులుంటాయి -" అన్నాడు.

ముక్త ఉత్సాహం చల్లారి పోయింది.

ఆమె ఆలోచనలో పడింది.

ఏం జరుగుతుందిప్పుడు?

గౌతమ్ ఆమెను సమీపించి దగ్గరగా తీసుకుని - "ముక్తా! కొన్ని ప్రశ్నలు వేసి నన్ను వేధించకు. నేను పిరికివాణ్ణి. కానీ నా పిరికితనం సమాజానికి భయపడి పారిపోయేలా చేయదు. సమాజం బలానికెదురు తిరక్కుండా చేస్తుంది. నా పిరికితనమే నాకు రక్ష. నా ప్రగతికి సోపానం. అయితే యిదంతా ఎందుకనుకుంటున్నావ్? నీకోసం ... నిన్ను సుఖపెట్టడంకోసం ... నిన్ను సంతోషంగా ఉంచడంకోసం ... సుఖసంతోషాలతో నువ్వు నాదానివిగానే ఉండాలి. నువ్వు నాదానివికాక మరేమైనా అయితే .... నేనేంచేస్తానో తెలియదుకానీ ఏమైపోతానో తెలుసు. ముక్తా! నువ్వు చెప్పింది జరిగితే నేను పిచ్చివాడినైపోతాను ...." అన్నాడు.

ముక్తకతడి శరీరం చల్లగా తగుల్తోంది....

అతడు నటిస్తున్నాడో నిజం చెబుతున్నాడో ఆమెకు తెలియలేదు. కానీ - "నా వల్ల మీకన్యాయం జరుగదు...." అని మనసులో అనుకొందామె.

11

మర్నాడాఫీసుకు వెడుతూ - "సాయంత్రం నాలుగింటికి కార్లో వస్తాను. సామాను సర్ది రెడీగా ఉంచు. ఆలస్యంచేస్తే బాగుండదు..." అన్నాడు గౌతమ్.

అతడు వెళ్ళిపోగానే సంధ్యకు ఫోన్ చేసిందామె.

సంధ్య యింట్లో లేదు. రాత్రిదాకా రాదని తెలిసింది.

ముక్త భయపడింది. తన ప్రయాణం గురించి సంధ్యకు చెప్పాలనుకుందామె. అప్పుడు సంధ్య భర్తవిషయంలో జాగ్రత్త పడుతుంది.

ఈ టూరు గురించామెకు బెంగగానే ఉంది.

ఎంత చెప్పినా గౌతమ్ కర్థంకాదు. అతడు వేరే లోకంలో ఉన్నాడు.

"ముక్తా! నువ్వు చెప్పింది జరిగితే నేను పిచ్చివాడినైపోతాను -" అన్న భర్త మాటలామెను కలవర పెడుతున్నాయి.

పన్నెండు గంటలకు ముక్తకు ఫోన్ వచ్చింది భానుప్రకాష్‌నుంచి;

"ముక్తా! టూరుకు వస్తున్నావుకదూ! వస్తావని నాకు తెలుసు. రానన్నా నీ భర్త నిన్నొప్పించగలడని నా నమ్మకం...."

"వస్తున్నాను. ఇప్పుడేం జరుగుతుంది?"

"తినబోతూ రుచి అడగడమెందుకు?"

ఫోన్ క్లిక్‌మంది.

ఫోన్ వచ్చేక ముక్త భయం పెరిగింది.

భానుప్రకాష్ చాలా పకడ్బందీగా పథకం వేస్తున్నాడు. గెస్టుహౌస్‌లో ఏదో జరుగుతుంది. ఏం జరుగుతుందో మరి !

సాయంత్రం నాలుగింటికి భర్త వచ్చేసరికి ముక్త తయారై సిద్ధంగా ఉంది.

ఇద్దరూ కార్లో వెనకసీట్లో కూర్చున్నారు.

ప్రయాణం ప్రారంభమైంది.

గౌతమ్ ఉత్సాహంగా ఖార్యకేమేమో చెబుతున్నాడు.

ముక్త అన్యమనస్కంగా వింటూ - భర్తకావిషయం తెలియకుండా ఉంచాలని చూస్తోంది.

గౌతమ్ తన ధోరణిలో తానున్నాడు.

రెండుగంటల ప్రయాణం వారిని గెస్ట్‌హౌస్‌కు చేర్చింది.

అక్కడ వారికోసం ఓ గది సిద్ధంగా ఉంది.

గదిలో ఖరీదైన కార్పెట్. గోడలకు శృంగార భరితమైన ఆయిల్ పెయింటింగ్స్. హంసతూలికా తల్పాలు. అతిథి మర్యాదకై కుషన్ సోఫాలు. స్టీరియో సెట్టు, కలర్ టెలివిజన్...

గదిలోని హంగులు చూసి దిమ్మెర పోయింది ముక్త.

గదికి అటాచెడ్ బాత్ ఉంది. బాత్రూంలో టబ్బుంది. షవరుంది.

భార్యాభర్తలిద్దరూ అప్పటికప్పుడు వేడినీళ్ళ స్నానం చేశారు.

మొదటిసారిగా టబ్బుస్నానం చేసింది ముక్త. అనుకూలంగా లేకపోయినా చాలా హాయిగా ఉంది. భర్త దగ్గర్లోనే ఉండి సాయపడుతూంటే అదొక మధురానుభూతిగాకూడా ఆమెకు తోచింది.

అప్పుడామె భానుప్రకాష్ గురించి పూర్తిగా మరిచిపోయింది.

వారి స్నానాలు కాగానే బాయ్ వారిద్దరికీ కాఫీ, బిస్కట్లు తెచ్చిచ్చి - భోజనం గురించి అడిగాడు.

తమకేంకావలో పురమాయించింది ముక్త.

బాయ్ వెళ్ళిపోయాడు ఇద్దరూ వేడివేడి కాఫీలు తాగారు.

“ఇంత మంచి మంచముండగా సోఫా ఎందుకు ?” అన్నాడు గౌతమ్

ఇద్దరూ మంచం మీద మేనులు వాల్చారు.

పాతాళంలోకి కృంగి పోతున్నట్లూ స్వర్గంలోకి తేలి పోతున్నట్లూ...

ఒకే సారి రెండు విభిన్నానుభూతులు కలిగాయి ముక్తకు.

ఆమె భర్త వైపు తిరిగింది. అతడామె వైపు తిరిగాడు.

“ఇంట్లో కూడా యిలాంటి బెడ్డుంటే ?” అందామె.

అతడు బదులివ్వకుండా ఆమె నడుం మీద చేయివేసి దగ్గరగా లాక్కున్నాడు. అతడు లాక్కోనవసరం లేకుండానే ఆమె అతడికి దగ్గరగా జరిగింది.

ఇద్దరూ ఒకరికొకరు హత్తుకుని పోయారు.

ఏదో కొత్త లోకంలో ఉన్నట్లుందిద్దరికీ !

అతడామెను మృదువుగా పెదవులపై చుంబించాడు.

ఎన్నడూ కలుగని వింత పరవశం - ఆమెకు కలిగిందారోజున....

సరిగ్గా అప్పుడే....

గదిలో ఫోన్ మ్రోగింది.

మంచం పక్కనే టెలిఫోన్...

గౌతమ్ ఒక చేతిని చాసి ఫోన్ అందుకున్నాడు. అతడు ఫోన్లో మాట్లాడుతూంటే ముక్తకతడో పెద్ద అధికారిలా తోచాడు.

ఆమె అతడి మాటలు వినడంలేదు. ఆరాధనాపూర్వకంగా అతడి వంకే చూస్తోంది. అతడి చేష్టలను గమనిస్తోంది.

ఉన్నట్లుండి అతడామెను విడిపించుకొని ఫోన్ పెట్టేసి మంచం దిగాడు.

కల జరిగినట్లయింది ముక్తకు.

గౌతమ్ బట్టలు మార్చుకుంటున్నాడు.

“ఏం జరిగిందండీ ?” అంది ముక్త.

“నేను బయటకు వెళ్ళాలి....”

“ఎందుకు ?”

“ఒక పార్టీతో మాట్లాడాలి ...”

“ఇప్పుడా ?”

“ఇప్పుడేమరి...” అన్నాడతడు. తన బ్రీఫ్‌కేస్‌లో కొన్ని పేపర్లు సర్దుతున్నాడు.

“అంత అర్జంటేమిటండీ - రేపొస్తానని చెప్పండి....”

“అలా వీలుకాదు. ఆయనకు రెండు ఫ్యాక్టరీలున్నాయి. బిజీమనిషి. నేనిప్పుడే వెళ్ళాలి. డిన్నర్ టైంకి వచ్చేస్తానుగా...” అన్నాడతడు.

“సరదాగా గడుపుదామనుకున్నాను...”

“రాత్రంతా మనదేనని మర్చిపోకు....”

గౌతమ్ వెళ్ళిపోయాడు.

ముక్తకు నిరుత్సాహంగా ఉంది. కాలక్షేపంకోసం ఆమె అక్కడున్న పుస్తకాలు చూసింది.

ఇంగ్లీషుతోపాటు తెలుగు పత్రికలున్నాయక్కడ.

ఓ పత్రిక తీసి పేజీలు తిప్పింది.

“వాత్స్యాయన కామసూత్రాలు....”

చటుక్కున పత్రిక మూసి మరొకటి తీసింది, పేజీలు తిరగేయగానే ఒకథ. కథలో ఏముందో చూపే బొమ్మ. బొమ్మలో ఉన్నది ఆడా, మగా....లేనిది వారికి దుస్తులు ...

అప్పుడు ముక్త అక్కడున్న ఇంగ్లీషు పత్రిక తీసుకుంది. అందులో సినిమా విశేషాలు నచ్చుతాయి.

స్మితాపాటిల్ బిడ్డనెవరు పెంచుతారు ?

భానుప్రియ రాకతో శ్రీదేవిస్థానం పడిపోతుందా ?

మన్‌మోహన్‌దేశాయ్ అమితాబ్ లేకుండా హిట్ పిక్చర్లు తీయగలడా ?

నామ్‌తర్వాత కుమారగౌరవ్, సంజయ్‌దత్‌లు కలిసి నటిస్తారా ?

ఇవే దేశాన్ని వేధించే సమస్యలన్నట్లు పత్రికలవాళ్ళు రాస్తూంటే చదువుతుంది ముక్త. ఆమెకు కాసేపు డైవర్షన్ కావాలి. తెలుగు పత్రికలివ్వలేని డైవర్షనాపత్రిక ఇచ్చిందామెకు.

ఆ సమయంలో కాలింగ్‌బెల్ మ్రోగింది.

భర్త వెనక్కు వచ్చాడేమోనన్న ఆశతో ముక్త తనే వెళ్ళి తలుపు తీసింది. గుమ్మంలోనున్న వ్యక్తిని చూడగానే ఆమె గుండె అదిరిపోయింది.

అతడు భానుప్రకాష్ !

అతడి ముఖంలో చిరునవ్వు.

అతడి చూపులో – కాటేసే కాలనాగు కనబడుతోంది.

ముక్త అలాగే నిలబడిపోయింది.

ఒక్కనిముషం తనూ అలాగే నిలబడినా అతడు చటుక్కున చొరవ చేసి ఆమెను తప్పుకుని లోపలకు ప్రవేశించాడు.

ముక్త మామూలు మనిషి కావడానికి కాసేపు పట్టింది.

ఆమె గదిబయటకు చూసింది.

హాలు – అక్కడెవ్వరూలేరు.

తలుపు వదిలి ఆమె వెనక్కు తిరిగింది.

తలుపు దానంతటదే వెనక్కు పడింది.

మరోసారి ఉలిక్కిపడింది ముక్త.

"ఎయిర్ కండిషన్డ్ గదిలో తలుపు దానంతటదే పడుతుంది –" అన్నాడు భానుప్రకాష్.

ముక్త మాటాడలేదు.

"రా – ఇలా కూర్చో –" అన్నాడు భానుప్రకాష్.

అతడు కూర్చోమన్న వైపు చూసిందామె.

అదతడికెదురుగా ఉన్న సోఫా.

"కొంతలో కొంత మర్యాద చూపిస్తున్నాడు –" అనుకుంటూ ఆమె అతడి కెదురుగా కుర్చుంది.

అతడుత్సాహంగా ఉన్నాడు.

ఆమె మనసు చిక్కబెట్టుకుందుకు ప్రయత్నిస్తోంది.

"నేను మాట్లాడ్డం ప్రారంభిస్తాడు. నువ్వు మామూలుగా ఉండు..." అన్నాడు భానుప్రకాష్ గంభీరంగా.

"ఎందుకొచ్చావిక్కడికి ?" అందామె.

"చాలా థాంక్స్... మొదటి సారిగా నువ్వు నన్ను నువ్వన్నావు. అంటే నా దారిలోకి వస్తున్నావన్నమాట ..." అన్నాడు భానుప్రకాష్.

"నీ అభిప్రాయం తప్పు. నా దృష్టిలో నీ విలువ పడిపోయింది. అందుకే నువ్వన్నాను ..."

"అంటే ఇన్నాళ్ళూ పడలేదన్నమాటగా ! అంటే ఫోన్లో మాట్లాడిన మాటలు నీ దగ్గర నా విలువను నిలబెట్టుకున్నాయనేగా ... ఇంకా చాలా థాంక్స్...."

"నువ్వు నన్నెందుకిలా వేధిస్తున్నావ్..." అంది ముక్త దీనంగా.

"నీకు తెలియకుండా నువ్వే నన్ను వేధిస్తున్నావు. నాకు తెలిసి నేను నిన్ను వేధిస్తున్నాను. రెండూ తెలిశాకకూడా ఒకరికొకరు వేధించుకోవడమెందుకు ? అవగాహనతో దగ్గరవుదాం–" అన్నాడు భానుప్రకాష్.

"ప్లీజ్ – ఇలా మాట్లాడకు –" అందామె.

"కంగారు పడకు. నీభర్త యిప్పట్లో రాడు..."

ముక్త మాట్లాడలేదు.

"ఇక్కణ్ణించి నేను ఫోన్ చేశాకనే అవతల పార్టీ నీ భర్తను వదిలిపెడతాడు. కాబట్టి నీకాభయమవసరంలేదు...." అన్నాడు భానుప్రకాష్.

"నాభయం నా భర్త వస్తాడనికాదు. నువ్వున్నావని..."

"దూరంగా ఉన్నంతసేపే నువ్వు నాకు భయపడతావు. ఒక్కసారి దగ్గరైతే భయం పోయి ఆకర్షణ పుడుతుంది–" అన్నాడు భానుప్రకాష్.

ముక్త చురుగ్గా అతడివంక చూసింది.

"నిజం చెబుతున్నాను. నాకు నీ చూపులంటే చాలా యిష్టం. ఆడదాని అందమంతా చురుకుతనంలో ఉంది–" అన్నాడు భానుప్రకాష్.

"నీవంటి కుసంస్కారులు పై అధికారులుగా ఉండడం వల్లనే దేశమిలా అధోగతిలో ఉంది–" అంది ముక్త.

భానుప్రకాష్ ముఖం ఎర్రబడింది– "ముక్తా ! హద్దులు మీరుతున్నావు–" అన్నాడతడు కోపంగా.

"హద్దులు మీరుతున్నది నేనుకాదు. నువ్వు..."

"ఇప్పుడు నేను తలచుకుంటే ఈ గదిలో నిన్నేమైనా చేయగలను. నువ్వు నన్ను ప్రతిఘటించలేవు. నీకెవరూ సాయం రారు. అయినా నేను మంచిమాటలతో నచ్చజెప్పి నా కార్యం చక్కబెట్టుకోవాలనుకుంటున్నాను. బలాత్కారం నాకు నచ్చదు. పరస్పరానురాగంలో ఒకరి కొకరు చేరువ కావాలనుకుంటున్న నాది కుసంస్కారమని నువ్వంటున్నావు..."

"నీది కుసంస్కారమని ఒకసారికాదు - వెయ్యిసార్లంటాను... నీ హద్దులు తెలుసుకోకుండా ఇలా వచ్చి నాతో మాట్లాడ్డం కుసంస్కారమని నేనేకాదు-సంస్కారం తెలిసిన వారెవరైనా అంటారు..."

"మాటి మాటికీ హద్దుల గురించి మాట్లాడుతున్నావు. ఒక విషయం తెలుసుకో. నీకు హద్దులున్నాయి. అయినా నువ్వు వాటిని మీరుతున్నావు. నాకు హద్దులు లేవు. నేను లేని హద్దుల్ని సృష్టించుకుని వాటిలోపలే ఉంటున్నాను..."

"నీకెందుకు హద్దుల్లేవు?"

"ఒక్కసారి నాకు దగ్గరగా రా - నీకూ హద్దులుండవు...."

"నాకు హద్దులే యిష్టం..."

"హద్దులు బలహీనులకి. పేదవారికి. అసమర్థులకు హద్దులను తొలగించుకొనడం హోదా. నేను నీ భర్తకు హోదా యిస్తాను. అందుకు నీవు హద్దుల్ని మర్చిపోవాలి."

"నీ అభిమానానికీ, సలహాలకూ కృతజ్ఞతలు. నువ్వింక యిక్కణ్ణించి వెళ్ళు."

"నా సంస్కారం నన్నిక్కణ్ణించి వెళ్ళమనే అంటోంది. అందుకే వెళ్ళిపోతున్నాను. కానీ ఒక్క విషయం గుర్తుంచుకో-ఈ గెస్ట్‌హౌస్‌లో నువ్వు చూస్తున్న వైభవం - నీ యింట్లోకి తరలి రాగలదు. అందుకు నీకు నా సహకారం అవసరం."

"థాంక్స్...."

"నువ్వు నన్నిలా బయటకు పంపేశావని తెలిస్తే ఈ ఏర్పాటు చేసిన నీ భర్త నిరుత్సాహ పడతాడు..." అన్నాడు భానుప్రకాష్.

అతడి మాటలకు షాకతింది ముక్త. ఆమె ఆ షాక్‌నుంచి తేరుకునేలోగా భానుప్రకాష్ అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

12

గెస్ట్‌హౌస్‌కి వచ్చిన మర్నాడు మధ్యాహ్నంమూడింటికి గౌతమ్ మరో పార్టీతో మాట్లాడ్డానికి వెళ్ళాడు. అతడు వెళ్ళిన పదినిముషాల్లో భానుప్రకాష్ ఆమె గదిలో ఉన్నాడు.

"మళ్ళీ ఎందుకొచ్చావ్?" అందామె.

"ఈపాటికి నీభర్త నీకు బుద్ధిచెప్పి ఉంటాడని!"

ముక్త తెల్లబోయి - "ఆయనెందుకు నాకు బుద్ధి చెప్పాలి?" అంది.

"అందమైన భార్యలు - భర్తల ప్రగతికి సోపానాలు..."

"ఆయనలాంటివారు కారు..."

"నువ్వసలతడికి చెప్పావా?"

"లేదు..."

"నేననుకున్నాను. నువ్వు చెప్పలేవని!" అని భానుప్రకాష్ నవ్వాడు - "నీకూనాకూ మధ్యమాటల్లో నీ భర్తకు తెలియని రహస్యం యింతుంది -" అంటూ

చేతులతో అభినయించి చూపించి - "చేతల్లోకూడా యింత రహస్యమూ ఉంటే బాగుంటుంది. నీకు రహస్యం దాచడం బాగా చేతనవును..." అన్నాడు.

ముక్త నెమ్మదిగా - "నీకు దణ్ణం పెడతాను. వెళ్ళిపో -" అంది.

"వెళ్ళను...."

"వెళ్ళకపోతే నీ భార్యకు ఫోన్ చేస్తాను..."

"నిరభ్యంతరంగా చేయి. ఇప్పుడే చేయి. ఆమె యింట్లోనే ఉంటుందిప్పుడు. నీకు గుర్తులేకపోతే నంబరుకూడా నేనే యిస్తాను..."

"ఏమిటి నీ ధైర్యం?" అంది ముక్త తెల్లబోయి.

"ఇందులో ధైర్యమేమీలేదు. నా సంస్కారం. నా భార్య నన్నే నమ్ముతుంది. నిన్ను నమ్మదు. నీక గొప్పదనుకుంటున్న నీ సంస్కారం గురించి ఆలోచించుకో.... నీ భర్తకు మనమిలా కలుసుకున్నామని నువ్వు చెప్పుకోగలవా? అతడు నిన్ను నమ్ముతాడా?"

ముక్త ఆలోచిస్తోంది. తను భర్తకితడి విషయం చెప్పాల్సింది. కానీ ఎందుకు చెప్పలేకపోయింది?

గౌతమ్ భావిజీవితం గురించి కలలు కంటున్నాడు. ఆ కలల ధోరణిలో వాస్తవాన్ని పట్టించుకోవడంలేదు.

ఇప్పుడు తనకారణంగా బాస్‌తో గొడవ పెట్టుకుందుకతడు సిద్ధపడవచ్చు. కానీ ఆ తర్వాత జీవితాంతం తనను సాధిస్తూంటాడు - నీ కారణంగా నా భవిష్యత్తు నాశనమయిందని.

ముందే చెబితే వినిపించుకోలేదు. ఇప్పుడు చెబితే ముందే ఎందుకు చెప్పలేదంటాడు.

తామిద్దరూ ఒకరికొకరెంతో దగ్గరయ్యారు. కానీ తానతడి సంస్కారాన్ని నమ్మడంలేదు. లోపమెక్కడుంది?

"మన సమాజంలో ఆడది ఆడది కావడం కారణంగా బలహీనురాలు. నువ్వు నువ్వు సంస్కారమంటున్నది సంస్కారం కాదు. మగాడినన్న ధైర్యం!"

భానుప్రకాష్ తమాషాగా నవ్వి - "వచ్చే జన్మంటూ ఉంటే ఆడదానిగా పుట్టించమని దేవుణ్ణి కోరుకుంటాను. ఎందుకో తెలుసా? ఆడదానికి అందమొక్కటి చాలు. ఏమైనా సాధించగలదు. సంధ్య నీకంటే విశేషమైన వ్యక్తికాదు. చెప్పాలంటే ఆమెకు నీకున్నంత అందం లేదు. అయినా ఆమె నాకు భార్యకావడంవల్ల నీకంటే గొప్పదయింది. సంధ్యకంటే ముందు నీవంటిదాన్ని చూసిఉంటే - బహుశా ఆమెను పెళ్ళాడి ఉండేవాణ్ణికాదు. ఏది ఏమైనా మగాడి పరిస్థితి అంత సులభం కాదు. అతడు ప్రగతిని సాధించాలంటే సమర్థుండాలి. ఎలాంటి సమర్థతంటే - తను కోరినవి సాధించడమేకాదు. తను కోరుకుంటున్న యువతి భర్తకి కూడా అన్నీ సాధించి పెట్టాలి...." అన్నాడు.

ముక్త అతడిమాటలు వింటూ- "రోజురోజుకూ ఇతడుమితిమీరి పోతున్నాడు. ఎలా ఇతడినాపడం ?" అనుకుంది.

తాను వివాహిత. స్వతంత్రురాలు.

అయినా ఒక పరాయి మగాడు తనపట్ల కోరికను వ్యక్తపరుస్తూంటే తన్ని తగలేయలేక పోతోంది.

"మిస్టర్ భానుప్రకాష్ ! మావారి ఉద్యోగమేమైనా నాకు ఫరవాలేదు. నీవిక నా దగ్గరకు రావద్దు. మరోసారి వస్తే నిన్ను నేనల్లరి పెట్టాల్సి ఉంటుంది..."

భానుప్రకాష్ లేచి నిలబడి - "నేను నిన్ను కలుసుకుందుకు రాను. అది నీ అదృష్టం కాదు. దురదృష్టం-" అన్నాడు.

"దురదృష్టానికి నేను భయపడను..."

"అది కాలమే చెబుతుంది. కానీ ఒకవిషయం గుర్తుంచుకో .... సిరిరా మోకా లడ్డుకున్నావు...."

"సిద్వారా వచ్చే సిరికి నా మోకాలెప్పుడూ అడ్డమే !"

"ఆవేశంలో నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలియడంలేదు. నేనెవరో తెలుసుకోలేక పోతున్నావు. అది నీకు తెలిసేలా చేస్తాను...."

"నీ బెదిరింపులకు నేను భయపడను..."

"నాకు నీమీద జాలిగా ఉంది. అభిమానం పొంగుతోంది. అందుకే వద్దన్నా మరో అవకాశం యిస్తున్నాను. అదేనీకు ఆఖరి అవకాశం..."

"నాకే అవకాశాలూ వద్దు..."

"వద్దన్నా యిస్తున్నానని ముందే చెప్పాను. ఈ రోజుకు సరిగ్గా వారంరోజులు అంటే వచ్చే మంగళవారం - మధ్యాహ్నం మూడుగంటలకు ... సరిగ్గా మూడు గంటలకు .... నువ్వు నా యింటికి రావాలి. అప్పుడింట్లో నేను, సంధ్యమాత్రం ఉంటాం. సంధ్యను కలుసుకోవాలన్న వంకతో నువ్వు మా యింటికొస్తావు. నిద్ర మాత్రల ప్రభావంతో సంధ్య నిద్రపోతూంటుంది. నేను నిన్ను బలాత్కారం చేయను. ఒక్కమాటకూడా అనను. సంతోషంతో నిన్ను నువ్వు నాకర్పించుకోవాలి...."

"అలా ఎన్నటికీ జరుగదు..."

"నేను వెడుతున్నాను. మంగళవారం మాయింట్లో కలుసుకుందాం ..." అని వెళ్ళిపోయాడు భానుప్రకాష్.

13

టూర్నించి బుధవారం సాయంత్రానికి భార్యాభర్తలిద్దరూ తిరిగివచ్చి యిల్లు చేరుకున్నారు.

భర్తకు విషయం చెప్పాలని ముక్త ఎన్నోసార్లనుకుంది. కానీ ఈ విషయం చెప్పడానికి తనకీ అతడికీ మధ్య ఎంతో దూరముందనిపిస్తోందామెకు.

ఇంతకాలం తనకీ అతడికీ రహస్యాలు లేవనుకుందామె. ఇద్దరికీ మధ్య చను

వుందనే భావించిందామె.

తాను చనువనుకుంటున్నది చనువుకాదు.

భర్తకుకూడా చెప్పుకోలేని రహస్యాలు తనకేర్పడ్డాయి. అందుక్కారణం అతడేనన్న అనుమానమామెలో ఉంది. ఆ అనుమానం అతడినే అడిగి తీర్చుకునే చనువునామె చూపలేక పోతోంది.

గురువారం నాడామె సంధ్యకు ఫోన్ చేసింది. సంధ్య ఆమెను స్వంత చెల్లెలిలా ఆప్యాయంగా పలకరించి విశేషాలడిగింది.

ముక్త భానుప్రకాష్ ప్రసక్తి తీసుకుని వచ్చింది.

"వారిగురించి నాకేమీ చెప్పొద్దు. నాకు నచ్చదు...." అందామె.

"నచ్చినా నచ్చక పోయినా నిజం తెలుసుకోవాలి నువ్వు..."

"తామరపువ్వు అందాన్ని చూసేటప్పుడు దానికింద బురదను చూడను. గులాబిని చూసి ఆనందించేటప్పుడు దానిచుట్టూ ఉండే ముళ్ళను గురించి ఆలోచించను. నిజం ఒకోసారి బురదకన్నా అసహ్యంగా ఉంటుంది. ముళ్ళకన్నా తీవ్రంగా బాధి స్తుంది. మూణ్ణాళ్ళ ముచ్చటైన ఈ జీవితంలో సంతోషంగా ఉండడానికది అబద్ధ మైనా సరే - ఆశ్రయించడం తప్పుకాదు. నాకు తెలిసినదబద్ధమైనా అందమైనది. నీకు తెలిసినది నిజమైనా - నాకది వద్దు. ఏమీ చెప్పొద్దు-" అంది సంధ్య.

"కానీ - నువ్వు నన్ను రక్షిస్తానని మాటిచ్చావు...."

"నీవు కోరే రక్షణ నా భర్తనుంచే అయితే అది నీకవసరం లేదు. వారి సంగతి నాకు బాగా తెలుసు. నా ఆలోచనలు తప్పయితే సరే - తప్పక నేను నిన్ను రక్షించగలను. ధైర్యంగా ఉండు. వారినుంచి నీకేప్రమాదమూ ఉండదని నేను హామీ యిస్తున్నాను..."

"థాంక్స్ - అక్కా !" అంది ముక్త అప్రయత్నంగా.

"ఇంతకీ ఏం జరిగింది ?"

ముక్త చెప్పాలనే అనుకుంది. చెప్పలేదు.

విషయం సంధ్యకు తెలిస్తే ఆమె భర్తను నిలదీస్తుంది. అతడు గౌతమ్‌పై అలుగుతాడు.

అలిగితే ఏం జరుగుతుంది ?

సాయంత్రం కొంత అర్థమయింది ముక్తకు.

గౌతమ్ ఇంటికి పెందరాళే వచ్చాడు. వచ్చినవాడు ముభావంగానూ, దిగులు గానూ ఉన్నాడు.

టూర్లో ఉన్న ఉత్సాహమిప్పుడు లేదు.

"అలాగున్నారేం ?" అంది ముక్త.

"జీవన్మరణ సమస్య !"

"ఏమయింది ?"

"కాసేపు నన్ను మాట్లాడించకు..."

అతను చిరాగ్గా ఉన్నాడని గమనించి ఊరుకుంది ముక్త.

కాసేపటికతడు తేరుకున్నాడు.

"దిక్కుమాలిన టూరు - నా కొంపముంచింది..."

"ఏం జరిగింది ?"

"బాస్ నాకు స్వతంత్రంగా పని చెప్పాడనుకున్నాను. కానీ అది నిజం కాదు. ఆయనకూడా నాకు తెలియకుండా వచ్చి గెస్ట్‌హౌస్‌లో ఉన్నాట్ట..."

ముక్త తడబడుతూ - "ఎందుకు ?" అంది. ప్రశ్న వేయగానే అతడేం చెబుతాడోనని ఆమె కంగారు.

విషయమతడికి తెలియనంతవరకూ ఏమైనా ఆలోచించవచ్చు. అతడికి చెప్పాలనికూడా అనుకోవచ్చు. కానీ అతడికి తెలిసిపోతే ... ఆ తర్వాత ...

"బాస్ నన్ను పరీక్షించాలనుకున్నాడు...."

"ఎలా ?"

మళ్ళీ ముక్త గుండెలో భయం, వణుకు...

అయితే అతను చెప్పింది వేరు.

బాస్ తన ఉనికిని గౌతమ్‌కు తెలియనివ్వలేదు. గౌతమ్ ఒక పార్టీతో మాట్లాడేక తనూ వెళ్ళి ఆ పార్టీతో మాట్లాడేడు. గౌతమ్ వ్యవహరించిన తీరును తెలుసుకున్నాడు. పార్టీనే గౌతమ్ గురించిన అభిప్రాయమడిగాడు.

"మీ బాస్ గెస్ట్‌హౌస్‌లో ఉంటే నాక్కనబడాలిగా...." అంది ముక్త. దీనికతడి బదులేమిటోనని ఆమె భయంగానూ, ఆత్రుతగానూ ఎదురు చూస్తోంది.

"నీకెందుక్కనబడతాడు ? నీకక్కనబడితే నాకు చెబుతావు. అప్పుడు తన రహస్యం బైటపడి పోతుంది...."

ముక్త తేలికగా నిట్టూర్చింది.

కానీ గౌతమ్ కంగారు పోలేదు.

"పార్టీ నామీద సదభిప్రాయాన్ని వెలిబుచ్చలేదుట. ఇలాంటి మనిషిని పంపిస్తే మీ కంపెనీ దెబ్బతింటుంది- అన్నాట్టాయన. ఈ రోజు బాస్ నామీద మండిపడ్డాడు...." అన్నాడతను.

"మండిపడితే రాజీనామా చేయాల్సింది-" అంది ముక్త.

"ఓ క్షణంలో నాకూ అలాగే అనిపించింది. ఎందుకో బాస్ ఈరోజు నామీద ఉగ్రరూపం చూపించాడు. గతంలో మెచ్చుకున్న వర్కునుకూడా ఈరోజు తప్పపట్టాడు. నాకు బొత్తిగా ఏమీ రాదన్నాడు. నాకు ప్రాముఖ్యతనిచ్చి తప్పు చేశానన్నాడు..."

"ఈ ఉద్యోగం వద్దండి - రాజీనామా చేసేయండి..." అంది ముక్త.

"నేను చెప్పేది పూర్తిగా విను..." అన్నాడు గౌతమ్.

"ఇంకా ఏం వినాలి ?" అంది ముక్త.

"వినాలిమరి -" అంటూ మొదలు పెట్టాడు గౌతమ్.

బాస్ గౌతమ్ మీద చాలా ఆశలు పెట్టుకున్నాడు. ఊళ్ళో అతడికో పెద్ద బంగళా తీసుకోవాలనుకుంటున్నాడు. కంపెనీ తరఫునించి కారివ్వాలనుకుంటున్నాడు. కారు గురించి ఆర్డరు కూడా వెళ్ళి పోయింది. బంగళా విషయం మాటల్లో ఉంది. బాస్ అంబిటియాలో నాలుగున్నాయి. వాటిలో ఒకటి కంపెనీ లీజుకు తీసుకుంటుంది.

"బాస్ నాకు అయిదురోజులు టైమిచ్చాడు ..." అన్నాడు గౌతమ్.

"దేనికి ?"

"టూర్లో జరిగిందానికి - నా ప్రగతికీ కనెక్షనుంది ..." అన్నాడు గౌతమ్.

ఉలిక్కి పడింది ముక్త. - "అలాగని మీబాస్ అన్నాడా?"

"తెలుస్తూనే ఉందిగా ... పైగా ఆయనంటాడు - టూర్లో ఏం జరిగిందో నీ భార్యతో క్షుణ్ణంగా చర్చించు. ఆమె కూడా చదువుకున్నదే కదా ! ఒకసారి ఆడాళ్ళకుండే వ్యవహారజ్ఞానం మగాళ్ళ కుండదు. నువ్వు చెప్పిందంతావిని ఆమె నీకు సాయపడే సలహా లివ్వగలదు - అన్నాడు -"

"నేను మీ కెలాసాయపడగలను ?"

"మొత్తం వ్యవహారమంతా చెబుతాను. నేనేం చేశానో చెబుతాను నా వల్ల లోపమెక్కడ జరిగిందో నువ్వు నాకు చెప్పాలి. అందుకు బాస్ నాకు అయిదురోజులు టైమిచ్చాడు ..."

"అయిదురోజులంటే ... ?"

"వచ్చే మంగళవారం ..."

ఉలిక్కిపడింది ముక్త. అంటే భానుప్రకాష్ రంగంలోకి దిగేడన్నమాట !

"ఇలా షరతులు పెట్టేచోట మీ రెందుకు పని చేయాలి ? నా మాటవిని మరో ఉద్యోగానికి ప్రయత్నించండి ..."

"ఇంతకంటే మంచి ఉద్యోగం దొరకదు ముక్తా !" అన్నాడు గౌతమ్ విచారంగా.

"సమర్థతంటూ ఉంటే ఎందుకు దొరకదు ?"

"మన దేశంలో సమర్థతకు విలువేముంది ? సమర్థతకే విలువిస్తే ఈ కంపెనీలో నాకుద్యోగం దొరికేదో లేదో...రికమెండేషన్‌మీద నేనిది సంపాదించుకున్నాను"

"పోనీలెండి - మనకు కారూ, బంగళాలూ వద్దు ..." అందిముక్త.

"అసలు విషయం నీకు తెలియడంలేదు..."

"ఏమిటది ?" అంది ముక్త. అసలు విషయం ముక్తకు తెలుసు. అది భర్తకు తెలుసునో తెలియదో ఆమెకు తెలియదు.

"మా ఆఫీసులో బాలచంద్రరావు నీకు తెలుసుగదా !"

"ఎవరూ ?" అంది ముక్త.

ఇప్పుడామెకతడి మాటలు కోపం తెప్పించడంలేదు.

"రమంటే నాకు మోజు లేదు. వచ్చిన అవకాశాన్నుపయోగించుకున్నాను. నువ్వంటే నాకాకర్షణ ఉంది. అవకాశాన్ని సుప్పుపయోగించుకో..."

ముక్త అతడి మాటలు వింటోంది. తనేం చెప్పడం లేదు.

"ఈరోజంతా బాగా ఆలోచించుకో. ద్రౌపతికి అయిదుగురు భర్తలు. ఆమె పతివ్రత. అహల్యను భర్తకాక ఇంద్రుడు కూడా అనుభవించాడు. ఆమె పతివ్రత. శ్రీకృష్ణుడిని ప్రేమించింది రాధ. ఆమె ప్రేమ కథలకు ఆదర్శం. శీలం, పవిత్రత కవుల కలాల్లో ఎలాంటి మలుపులైనా తిరిగి ఎలాంటి అర్థాలైనా సంతరించుకుంటాయి నువ్వు తప్పు చేయడంలేదు. వచ్చిన అవకాశాన్నుపయోగించుకుంటున్నావు. నేనో విలనైతే నువ్వు పతివ్రతవు. భర్తకోసం శీలాన్నే త్యాగంచేయనున్న మహాపతివ్రతవు. తప్పు నీ ఆలోచనలో ఉంది తప్ప – చేతలలో లేదు. నామాట విను. నీభర్తను నిరుత్సాహపరచకు. రేపటి కన్ని ఏర్పాట్లూ జరుగుతున్నాయి. మనం తప్పక కలుసు కుంటాం...."

ముక్త ఫోన్ పెట్టేసింది.

వెంటనే మళ్ళీ ఫోన్ రింగయింది.

ముక్త ఫోన్ తీయలేదు.

ఫోన్ ఆగకుండా రింగవుతూనే ఉంది.

చివరకు ముక్త విసుగ్గా ఫోన్ తీసి – "హలో !" అందామె.

"ముక్త – నువ్వేనా – నేను గౌతమ్‌ని...."

ముక్త తృళ్ళి పడింది – "హలో – మీరా !" అందామె.

"అవును – ఎన్ని సార్లు ఫోన్ చేసినా ఎంగేజ్ రింగిస్తోంది. చివరికి లైన్ దొరికితే నువ్వొపట్టాన ఫోన్ తీయలేదు...."

"ఏమిటి విశేషం ?"

"విశేషమే – ఈరోజు నాకు మళ్ళీ టూరుంది, సామాను సర్దిఉంచు. కార్లో వస్తాను...సరిగ్గా నాలుగింటికి..."

"నేను రాలేనండీ –" అంది ముక్త అప్రయత్నంగా.

"నువ్వు కాదు. ఈసారి నేనొక్కణ్ణే. ఇదినాకు పరీక్ష సమయం. రెండు పార్టీలతో డీల్ చేయాలి. రేపుసాయంత్రం ఆరింటికి సరాసరి ఆఫీసులో నన్ను కలుసు కుంటాడుబాస్ ... ఈ సారి బాగాడీల్ చేయగలననే అనుకుంటున్నాను ..."

"అంటే ఊరికెడుతున్నారన్నమాట"....

"ఊఁ నీకేమనిపిస్తోంది ? అంతాబాగా జరుగుతుందంటావా ?"

"నేనేం చెప్పగలను ?"

"చెప్పగలవు. నువ్వు నా అదృష్ట దేవతవు ...."

అతడలాగనగానే – "అందమైన భార్యలు – భర్తల ప్రగతి సోపానాలు –"

అన్న భానుప్రకాష్‌మాట ముక్త చెవుల్లో గింగురు మంది.

"చెప్పు – ముక్తా !

"అన్నీ మీకేతెలుసు. మీకంటే నాకేమీ ఎక్కువ తెలియదు ..."

"అలాకాదు. అంతా నేనకున్నట్టే జరుగుతుందని చెప్పు ..."

"సరే – అంతా మీరనుకుంటున్నట్టే జరుగుతుంది ..." అనేసి – తానెవరికో అమ్ముడు పోయినట్లు ఫీలయింది ముక్త.

"థాంక్స్ – ముక్తా ! కార్లో వస్తాను. ఎంత సేపుండను ...."

"సరే – ..."

ఫోన్ పెట్టేశాడు గౌతమ్.

ఆ తర్వాత అతడికారు సరిగ్గా టైముకి వచ్చింది. గౌతమ్ లోపలకు వచ్చాడు.

అతడు టెన్షన్లో ఉన్నాడని గ్రహించింది ముక్త.

"అలాగున్నారేం – ఫ్రీగా ఉండండి ...." అందామె.

"బాలచంద్రరావు వచ్చేశాడు. చాలా హుషారుగా ఉన్నాడు బాస్‌కూడా అతణ్ణి అందరి ఎదుటా మెచ్చుకున్నాడు ...."

"అయితే ?"

"ఈ మిషన్లో నేను ఫెయిలయితే – రేపట్నించి అతడే నాకుబాస్ –" దిగులుగా అన్నాడు గౌతమ్.

"అలా దిగాలు పడకండి – బాలచంద్రరావు మీకు జూనియర్‌గానే ఉంటాడు. అతడికి ప్రమోషన్ వచ్చినా – మీరతడికంటే పైనే ఉంటారు...."

"ఎలా చెప్పగలవు ?"

"ఈ విషయం నేను మీ అదృష్ట దేవతగా చెబుతున్నాను..."

"నిజంగా –" అన్నాడు గౌతమ్.

అప్పుడతడి ముఖంలో పసిబాలుడి అమాయకత్వం, ఆత్రుతతో కూడిన సంతోషం కనబడింది ముక్తకు.

"ఊఁ" అందామె.

గౌతమ్ తృప్తిగా వెళ్ళిపోయాడు.

కారు కనుమరుగయ్యేదాకా చూసి తలుపులేసుకుంది ముక్త. ఆమె సరాసరి పడక గదిలోకి వెళ్ళి మంచంమీద పడుకుంది.

ఆమె మెదడునిండా ఆలోచనలు...

తనేంచేయాలో నిర్ణయించుకుందామె....

తన నిర్ణయం తప్పుకాదని ఆమె మనసును సరిపెడుతోంది.

సంప్రదాయం ఓ పట్టాన అందుకంగీకరించడంలేదు.

మనసు ద్వైదీభావంలో ఊగిసలాడుతోంది.

ఏం చేయాలన్నది కాదామె సందేహం.

తను చేస్తున్నది తప్పా, కాదా ? - అదీ ఆమె సందేహం.

తప్పు చేశాక తన మానసిక స్థితి ఎలాగుంటుందో తెలియదామెకు. కానీ ఆమె ఆలోచనల్లోకి భానుప్రకాష్ వస్తున్నాడు. భర్త స్థానంలో అతడినూహించుకుంటే జుగుప్సాకరంగా ఉందామెకు.

అజంతా ఇంటర్నేషనల్ గురించి విందామె.

రేపు భానుప్రకాష్ ఇల్లొక అజంతా ఇంటర్నేషనల్.

అక్కడ తనకుతానే వెడుతుంది - భర్త ప్రమేయం లేకుండా!

కానీ - నిజానికిందులో అతడి ప్రమేయం లేదా ? తెరమరుగున ఉండి అతడు నిర్వహిస్తున్న పాత్ర ఏమిటి ?

అతడికి తెలియకుండానే భానుప్రకాష్ ఈ ఏర్పాట్లన్నీ చేయగల్గుతున్నాడా ?

అప్పుడో విచిత్రమైన ఆలోచన కలిగింది ముక్తలో.

భానుప్రకాష్, గౌతమ్ స్నేహితులు. స్నేహితుడిద్వారా గౌతమ్ తన శీలాన్ని పరీక్షిస్తున్నాడు.

రేపు భానుప్రకాషింట్లో గౌతమ్‌కూడా ఉంటాడు.

అప్పుడు....?

అక్కడ గౌతమ్ ఉంటాడని ఆమె మనసొప్పుకోవడంలేదు. కానీ భానుప్రకాషింటికి వెళ్ళడానికామె మనసు పూర్తిగా సిద్ధపడుతోంది.

15

మంగళవారం మధ్యాహ్నం మూడుగంటలు.

ముక్త భానుప్రకాషింట్లో అడుగు పెట్టింది.

ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. కానీ ఆమె అడుగు పెట్టిన కొద్దిక్షణాల్లోనే ఎక్కణ్ణించో భానుప్రకాష్ ఆమె ముందు ప్రత్యక్ష మయ్యాడు.

"నీ పాదాలు చప్పుడు చేయడంలేదు. కానీ నీ తనువు పరిమళాన్ని నేనెంత దూరాన్నుంచైనా గుర్తు పట్టగలను..." అన్నాడు భానుప్రకాష్.

ముక్త ముక్తసరిగా నవ్వి - ఊపిరి విడిచింది.

"లోపలకురా -" అన్నాడతడు.

ఆమె అతడిననుసరించింది.

అతడు సరాసరి ఆమెను పడక గదిలోనికి తీసుకుని వెళ్ళాడు.

గదిలో డబల్‌కాట్ !... మంచంనిండా పరిచిన మల్లెలు గుబాళిస్తున్నాయి.

ఆమె అతడివంక చూసింది.

అతడి ముఖంలో ఉత్సాహముంది.

ఆమె నిట్టూర్చి - "నేను వస్తాననుకున్నావా ?" అంది.

"ఊఁ"

"నీ దృష్టిలో నేను చౌకబారు దాన్ని. కదూ ?"

"కాదు -"

"మరి నేను వస్తానని ఎందుకనుకున్నావు ?"

"నాకు నా అదృష్టం మీద నమ్మకం ..."

ముక్త మాట్లాడలేదు.

"నీకు తెలియను. నువ్వు నాకొక అపూర్వ వరానివి ..."

"కానీ నువ్వేనాకు వరమిస్తున్నావు"

"నీకు వరమివ్వగలగడం నా అదృష్టం ..."

మంచానికి కాస్త దూరంగా కుర్చీలో కూర్చుందామె.

"అలా కూర్చో -" అంటూ మంచం చూపించాడతడు.

"అప్పుడే కాదు -" అందామె.

"ఎప్పుడైనా ఫరవాలేదు - అసలంటూ ఉంటే ...!"

"నేనంటే నీ కెందుకింత ఆకర్షణ ?"

"నువ్వెందుకింత ఆకర్షణీయంగా ఉన్నావని అడిగితే ఏం చెబుతావు ?"

"నాకేం తెలుసు ?"

"నావిషయమూ అంతే !"

ఇద్దరూ కాసేపు మాట్లాడలేదు.

"నీకు నేనంటేకాదు - ఆడవాళ్ళంటే ఆకర్షణ ! అందుకే నా తెలివిని మెచ్చుకుని నా తెలివిని ప్రోత్సహించావు ..."

భానుప్రకాష్ ముఖం గంభీరంగా అయిపోయింది - "ఇప్పుడలాంటి కబుర్లు వద్దు. సరదాగా మాట్లాడు కుందాం !

"సంధ్య ఏం చేస్తోంది ?"

"నిద్రపోతుంది. లేవడానికి కనీసమింకో మూడు గంటలు పడుతుంది -"

"ఇంట్లో ఎవరున్నారు ?"

"పని వాళ్ళుకూడాలేరు. సంధ్య కాక మనమిద్దర మే ..."

"జరిగింది సంధ్యకు తెలిస్తే ...."

"సంధ్యకు తెలియకూడనిది జరుగుతుందా ?"

"నేను వచ్చానుగా -" అంది ముక్త ఆమె కళ్ళలో నీళ్ళున్నాయి.

భానుప్రకాష్ ముఖం గంభీరంగా అయిపోయింది - "నేను ముందే చెప్పాను నువ్వు మనస్ఫూర్తిగా ఇక్కడికి రావాలని !"

"మనస్ఫూర్తిగానే వచ్చాను...."

"మరి కనులలో నీళ్ళు..."

ముక్త కొంగుతో కన్నీళ్ళు తుడుచుకుని - "ఇవి ఆనంద బాష్పాలు, నాకు ప్రమోషన్ వస్తుందని !" అంది.

"ముక్తా ! బాగా ఆలోచించుకో...నేను కసాయివాడినికాను. నీకిష్టం

నిన్ను సమీపించను. నీ భర్తకు ప్రమోషన్ కావాలి. నీకు వైభవం కావాలి. అందు కోసం నీకై నీవే నాదగ్గరకు వచ్చావు. నేను నీభర్తకే అపకారమూ చేయను అతడెప్పటిలాగే ఉంటాడు. అతడి ఉన్నతిని కోరుకుంటేతప్ప నీకిక్కడ నాతో అవసరం లేదు. ఉన్నదానికి మించిన ఆశ నిన్ను నా వైపు నడిపిస్తోంది. ఈ అభిప్రాయంతో నాకు చేరువైతేనే నాకు తృప్తి .." అన్నాడు భానుప్రకాష్.

"ఎందుకిప్పుడివన్నీ ?" అంది ముక్త.

" నా సంస్కారాన్నర్థం చేసుకో. నీతో ఏకాంతం లభించింది గెస్ట్‌హౌస్‌లో. అది నేనుపయోగించుకోలేదు. నీ అసహాయతనుపయోగించుకోవడం నా అభిమతం కాదు. నాకు నీ తనువు కాదు. నువ్వు కావాలి. నిండు మనసుతో నువ్వు నన్నాదరించాలి. అందుకే నేను నీకు టైమిచ్చాను. నీఅంతట నీవే నా యింటికి రావాలన్నాను. ఇప్పుడుకూడా చెబుతున్నాను ... విను ... నీకు నీభర్త ప్రగతి అవసరం లేదనుకుంటే వెంటనే తిరిగి వెళ్ళిపో. బాలచంద్రరావు అతడికి బాస్ కావచ్చు. కానీ నీభర్త జీతం తగ్గదు. ఆఫీసులో నేనల్లరి పెట్టడం, అవమానించడం జరగదు. ఆలోచించుకో! నీ నిర్ణయంమీద నీ భవిష్యత్తాధారపడి ఉంది. భవిష్యత్తును ప్రకాశవంతంగా చేసుకోవాలనుకుంటేనే యిక్కడుండు ... లేకుంటే ..."

ఆలోచిస్తోంది ముక్త.

కారు, బంగళా...

"నా అదృష్టదేవతవు నువ్వు..." అని పొగుడుతున్న గౌతమ్.

"నేను నా యిష్టంమీదనే వచ్చాను. నాభర్తకు ప్రమోషన్,వైభవం.– అన్నీ కావాలి ..."

భానుప్రకాష్ తను వెళ్ళి మంచంమీద కూర్చున్నాడు.

"ఇలా వచ్చి కూర్చో !" అన్నాడతను.

ముక్త తటపటాయిస్తూనే వెళ్ళి మంచంమీద అతడికికాస్త దూరంగా కూర్చుంది.

"నాకు నువ్వంటే గౌరవం నీ పొందు నా అదృష్టమన్న భావం ... ఇవన్నీ మరోసారి నిన్ను కోరవచ్చు. ఇదీ రోజుతో ఆగకపోవచ్చు ..."

"ఒక సారికే తప్పు ... ఆ తర్వాతెన్నిసార్లు జరిగినా ఆ తప్పు కొత్తది కాదు. పాతదే అవుతుంది ...."

"బాలా తెలుసుకున్నావు ..."

"నీ పరిచయం నా ఆలోచనల స్వరూపాన్ని మార్చేసింది. జీవితంలో పైకి రావడమే నా ఆశయం ..."

"చాలా సంతోషం ... అయితే ఇక తప్పు చేస్తానన్న భావం విడిచిపెట్టు..." అన్నాడు భానుప్రకాష్.

"అదెప్పుడో వదిలి పెట్టేశాను. కాబట్టే ఇక్కడకు రాగలిగాను."

"సరే - నాకానమ్మకం కలగాలికదా ! నేను నిన్ను తాకబోయే ముందు నాలో ధైర్యం కలగాలంటే - కాసేపు - నువ్వీ మంచంమీద పడుకో ... ఈగది ఈమంచం అంతానీదే నన్నట్లు ఫ్రీగా ...."

అతడి నోటిమాట పూర్తి కాగానే ముక్త పక్కకు జరిగింది. కాసేపామె ఇబ్బందిగా ఫీలయింది.

కాసేపు భానుప్రకాష్ కూడా మంచం మీదనే కూర్చున్నాడు. తర్వాత తనూ పడుకున్నాడు.

ఒకే మంచంమీద - ఒకరికొకరు అభిముఖంగా అతడు - ఆమె !

ఇద్దరూ వివాహితులే ....కానీ...

అతడామెకు భర్తకాదు. ఆమె అతడికి భార్యకాదు.

ఇద్దరూ ఒకరినొకరు చూసుకుంటున్నారు.

సంప్రదాయంలో పుట్టి పెరిగిన ముక్త - సంప్రదాయాన్నికాదని - భర్తకు బదులు పరాయి పురుషుడి పొందుకోరుతుంది.

ఇద్దరూ ఒకరినొకరు చూసుకొంటున్నారు.

మెత్తటి పరుపులు...విరిసిన మల్లెలు...

అతడు...ఆమె ...

ఇప్పుడామె తప్పును గురించి ఆలోచించడంలేదు. ఆమె కళ్ళు భానుప్రకాష్‌లో పురుషుణ్ణి చూస్తున్నాయి.

ఆమె శరీరంలో సంచలనం ప్రారంభమయింది.

స్త్రీకి పురుషుణ్ణి చూస్తే కలిగే సంచలనమది !

కొద్ది క్షణాల క్రితం వరకు ఉన్న ద్వైదీభావాలామెలో లేవు.

అతడు తనచేతినామె నడుం మీద వేశాడు.

ఆమె అతడికి దగ్గరగా జరిగింది.

అతడు ఆమెకు దగ్గరగా జరిగాడు.

కౌగిలి...ఉక్కుసంకెలలా యిద్దర్నీ బిగించింది...

అతడి వీపు పడక గది గుమ్మానికభిముఖంగా ఉంది. ఆమె ముఖానికతడి ముఖం అడ్డు.

వెచ్చని ఊపిరి...

ఇద్దరూ కుడా గుమ్మంవద్దనిలబడిన సంధ్యను చూడ్డం లేదు.

సంధ్య ఆదృశ్యాన్నే చూస్తూ గుమ్మం దగ్గర నిలబడిపోయింది. ఆమె నిశ్చేష్టురాలయిందేమో !

కుసుమకోమలమైన ఆమె చేతులతణ్ణి తనలోకలుపుకోవాలన్న కోర్కెబలంతో వీపును హత్తుకుంటే -....

"ఎవరూ ?" అంది సంధ్య.

జంట ఉలిక్కిపడి విడిపోయింది. అయిష్టంగానే ఇద్దరూ లేచికూర్చున్నారు.

ఇద్దరూ సంధ్యను చూశారు.

భానుప్రకాష్ మంచం దిగి తప్పుచేసిన వాడిలా తలవంచు కున్నాడు.

చెదిరిన పైటను సవరించుకుంది ముక్త.

సంధ్య వారిని సమీపించి –"ఏమిటిది ?" అంది. ముక్తను పరీక్షగా చూస్తూ– "నువ్విలాంటి దానివను కోలేదు...," అంది

ముక్త మాట్లాడ లేదు.

"నీకేమయింది ? ఒళ్ళు కొవ్వెక్కిందా ? డబ్బు కావాల్సొచ్చిందా ?" అంది సంధ్య.

"మీవారినడుగు..."

"వారిసంగతినాకు తెలుసు. నీకైనువ్వు వారిని వలలో వేసుకో వాలను కోకపోతే – ఇలా మాయింటికే రావుగదా...."

ముక్త కేమనాలో తెలియాలేదు.

తనిలాపట్టుబడి సంజాయిషీ యిచ్చుకోవాల్సొంటుందని ఆమె ఊహించుకోలేదు. అతడు తన్ను మోసగించాడనీ– ప్రోత్సహించాడనీ ఎలా ఋజువు చేయగలదు. తనే వాళ్ళింటికి వచ్చి అతడి పడగ్గదిలో....

జరిగింది తల్చుకుంటుంటే జుగుప్సతో ఆమె శరీరం వణికిపోతోంది. ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఎందుకీ కల్ల బొల్లి ఏడ్పులు....నాకాపురంలో నిప్పులు పోయాలని చూశావు కదూ ;" అంది సంధ్య.

ముక్త మంచందిగి నిలబడింది.

"ముందు చీర సరిచేసుకో –" అంది సంధ్య.

ముక్త చీరసరిచేసుకోలేదు. ఆమె ముఖం రెండు చేతులతోటి కప్పుకుని వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

"ఏడుపుతో నీ తప్పును కప్పిపుచ్చుకోలేవు..." అంది సంధ్య.

ముక్త తప్పును కప్పిపుచ్చుకోవాలని ఏడ్వడం లేదు. బాధ గొంతులోంచి ఏడుపు రూపంలో బైట పడుతోంది.

హఠాత్తుగా తనలో బలహీనత ప్రవేశించి తనతణ్ణి కోరిందని ఆమెకర్థమయింది. తానలా ఎలా మారిపోయిందో తెలియక తన్నుతానే అసహ్యించుకుంటూ బాధపడుతోందామె.

కాసేపటికామె ఏడుపు ఆగింది.

"అక్కా ! నావల్ల తప్పు జరిగింది కానీ తప్పు నాదికాదు. ఈ విషయం మీ వారినే అడుగు...." అంది ముక్త.

"మావారు నీయింట్లో పట్టుబడితే అది వారితప్పు. నువ్వు మాయింట్లో పట్టు

బడితే అది నీతప్పే అవుతుంది..."

"నన్ను క్షమించక్కా !"

"నీవంటివారిని క్షమించడం నాకలవాటే–కానీ నిన్ను నీవు క్షమించుకోగలవో లేదో ఆలోచించుకో...."

ముక్త మాట్లాడలేదు.

"అసహాయతతో తప్పుచేసిన పావనిని నువ్వు క్షమించలేవు. బలహీనతతో తప్పుచేసిన నిన్ను క్షమించుకోగలవా ?"

చెప్పున కొట్టినట్లయింది ముక్తకు.

"ఆడతనం పశుతనం – రెండూ కలిస్తే మగాడికి భరించలేనంత ఆకర్షణ. ఆ ఆకర్షణను విచ్చల విడిగా కొనసాగనిస్తే – ఈ సమాజం క్రమశిక్షణను కోల్పోయి ఆటవిక సామ్రాజ్యంగా మారిపోతోంది. స్త్రీ పురుష సంబంధాన్ని క్రమబద్ధం చేయడానికి పెళ్ళి అనే సంప్రదాయం ఏర్పడింది. ఆ పెళ్ళి పవిత్రమైనది. స్త్రీ పురుష సంబంధాన్ని కేవలం ఒక జంటకే పరిమితం చేస్తూ నియమాలేర్పరచింది. మన సంప్రదాయంలో పెళ్ళికాని ఆడపిల్ల కొందరికే ఆడపశువు – పెళ్ళయిన ఆడపిల్ల – అందరికీ ఆడపశువు. ఆడతనాన్ని పశుతనాన్ని కలిపి ఆడపశువు అనే పదం తయారు కావడం మన సంప్రదాయంలోని ప్రత్యేక విశేషం. పెళ్ళయిన ఆడది – ఇతర స్త్రీలందర్నీ ఆడపశువులుగా భావించి సానుభూతితో అర్థం చేసుకోవాలి. భర్త తప్ప తక్కిన పురుషులందరికీ ఆడపశువు కావాలి. ఇదీ మన సంప్రదాయం చెబుతుంది. స్వార్థపరులు మనచుట్టూ వలలు పన్నుతూండే ఈ సమాజంలో, స్వార్థం మనసు దేనికైనా ప్రోత్సహించే ఈ వాతావరణంలో – సంప్రదాయాన్ని పాటించడమెంతో కష్టమైన విశేషం. అది గ్రహించి సంప్రదాయం పాటించలేక పోయిన సాటివారిని సానుభూతితో అర్థం చేసుకోవాలి. సంప్రదాయం పాటించడానికి మనం కఠోర ప్రయత్నాలు చేయాలి. మన స్నేహం ఎప్పటిలాగే కొనసాగుతుంది. పావని నాదరించినట్లే నేను నిన్నూ ఆదరిస్తాను. నీ తప్పుకితరులను తప్పు పట్టకు. జరిగింది మర్చిపోయి ఇకముందిలాంటిది జరక్కుండా జాగ్రత్తపడు. ఈ ఒక్కరోజులో నీవు పాపాత్మురాలివి కాలేవు. ఈ రోజుకు ముందు నీవు పుణ్యాత్మురాలివీ కావు. అది గుర్తుంచుకుని మసల గలిగితే చాలు. ఇక నీవు వెళ్ళొచ్చు..."

ముక్త చీర సవరించుకుంది, నిండుగా పైట కప్పుకుంది. భారంగా అడుగులు వేస్తూ అక్కణ్ణించి వెళ్ళిపోయింది.

కార్లో లిఫ్టిస్తానని భానుప్రకాష్ అనలేదు.

కావాలని ముక్త అడగలేదు.

ఆమె వెళ్ళిపోగానే సంధ్య భర్త పాదాలకు వంగి నమస్కరించింది. ఆతడామెను లేవదీస్తూ – "ఏమిటిది ?" అన్నాడు.

"మీవంటి మహాత్ముడి పాదాలకు వంగి నమస్కరించడానికి ముక్త వెళ్ళేవరకూ

ఆగాల్సొచ్చిందని బాధగా ఉంది-" అంది సంధ్య.

"నేను మహాత్ముడిని కాదు -", అన్నాడు భానుప్రకాష్.

"ముక్తకు నీతులు చెప్పే అర్హత నాకు లేదని తెలుసు. మిమ్మల్నామె తప్పు పడుతూంటే నిజం చెప్పకపోవడం తప్పనీ నాకు తెలుసు. కానీ మీ మాట పాటించాను. అందుకే కసీసం పాదాభివందనం..."

"భార్యాభర్తలమధ్య పాదాభివందనాలు సంప్రదాయంకావచ్చు. కానీ నాకవి నచ్చవు. నేను సంప్రదాయానికి వ్యతిరేకిని..."

"ఆ విషయం నాకు తెలుసు..." అంది సంధ్య. ఇప్పటికీ ఆమె మరచిపోలేని నిజం కళ్ళముందు కదలాడుతూనే ఉంది.

* * * *

ఎంబియ్యే చదువుతూ వాళ్ళింట్లో అద్దెకుండే వాడు భానుప్రకాష్. అతడు వారికి బాగా దూరపు బంధువు. తన మానాన తనుమసిలేవాడు తప్ప సంధ్యవంక కన్నెత్తి కూడా చూసేవాడు కాదు.

సంధ్యకో బావ ఉన్నాడు. అతడికి చదువురాలేదు, వృత్తి పనులు నేర్చుకుందుకిండస్ట్రియల్ ట్రయినింగ్ ఇన్‌స్టిట్యూట్ వెళ్ళివస్తూండేవాడు. గొప్ప ఇండస్ట్రియలిస్టు కావాలన్నదతడి కల. జీవితంలో అతడు పైకి రాలేడన్నది తలిదండ్రులకూ కూడా తెలిసిన నిజం. అతడు సంధ్యను ప్రేమిస్తున్నాననేవాడు. ఏకాంతంలో ఆమెకు ప్రేమ కబుర్లు చెప్పేవాడు. ఆకబుర్లలో తననో సినిమా హీరోలా అభివర్ణించుకునేవాడు.

సంధ్య మనసు పరిపక్వత చెందలేదు. ఆమె అతడి మాటలు నమ్మింది. అతడి పట్లజాలితో తనూ ప్రేమిస్తూన్నాననే అనుకుంది.

వారి చనువునింట్లో ఎవరూ అనుమానించే వారు కాదు. అయింట్లో వారికేకాంత మసాధ్యమూ కాదు.

ఆఏకాంతన్ని సంధ్యను వశపర్చుకొనేందుకుపయోగించుకున్నాడతడు.

ఆ లేత వయసులో సంధ్య అతడి మాటలు నచ్చేవి.

చూసే సినిమాలు, చదివే నవలలు - ఆమె కతడిలో హీరోని చూపించేవి.

అతడే తన భర్త అవుతాడనుకుందామె.

కానీ ఆమె సంప్రదాయాన్ని నమ్మింది. అందుకే అతణ్ణి తనకు దూరంగానే ఉంచేది.

బావ ఆమెనెన్నోవిధాల ప్రోత్సహించి విఫలుడయ్యాడు.

"ముందు మన పెళ్ళికావాలి -" అందామె అతడితో.

"మీ వాళ్ళకు నువ్వు చెప్పు..." అన్నాడతడు.

సంధ్య యింట్లో చెప్పాలనే అనుకుంది. కానీ అతడి గురించి అంతా పనికి రానివాడని అనుకుంటూంటే చెప్పలేకపోయింది.

"నువ్వేచెప్పు -" అంది సంధ్య.

"చెబుతాను -" అన్నాడతడు.

రోజులు గడుస్తున్నా చెప్పేధైర్యమతడికి రాలేదు.

"మన పెళ్ళి జరగాలంటే నాకు ధైర్యం కావాలి. నా ధైర్యం నీమీద ఆధారపడి ఉంది. నువ్వు నిజంగా నన్ను ప్రేమిస్తున్నావని నాకు తెలిస్తే ధైర్యం వస్తుంది-" అన్నాడతడు.

"నేను నిజంగా నిన్ను ప్రేమిస్తున్నాను...." అంది సంధ్య.

"అంటే చాలదు. ఋజువుండాలి, ఋజువుంటేనే ధైర్యం..."

"భగవంతుడు స్త్రీని ప్రేమమయిని చేశాడు. సృష్టిలో స్త్రీ స్వార్థపరురాలే కావచ్చు. కానీ ఆమె స్వార్థం తనగురించి కాదు. తనవారి గురించి...."

స్త్రీ తనకంటె ఎక్కువగా తనవారిని ప్రేమిస్తుంది.

బావ తనవాడనే సంధ్య అనుకుంది. ఋజువుకోసం ఆమె అతడికి లొంగిపోయింది. ఒక కన్నెపిల్ల లేత హృదయపు బలహీనతనామె బావ అందుకున్నాడు.

అయినా అతడికి ధైర్యం చాలలేదు.

ఇంకా ధైర్యం కావాలన్నాడతడు.

మొదటిసారి ఉన్న ప్రతిఘటన భావం కూడా లేదు సంధ్యలో రెండోసారి. అయితే ఈసారి దొంగలు పట్టుబడిపోయారు.

"ఎన్నాళ్ళనుంచి జరుగుతోందిది!" అంటూ తల్లి సంధ్యనూ, తండ్రి సంధ్య బావనూ నిలదీశారు.

సంధ్య హడిలిపోయింది.

సంధ్య బావ యింట్లోంచి పారిపోయాడు.

ఇంట్లో సంధ్య పెళ్ళిగురించి హడావుడి ప్రారంభమైంది.

సంప్రదాయాన్ని నమ్మిన సంధ్యకు తనపెళ్ళి బావతో జరగాలని ఉంది. కాని "ఆ భ్రష్టుడితో దీని పెళ్ళి చేయను-" అన్నాడు తండ్రి.

సంధ్య మనసు వికలమై పోయింది.

ఒకరోజామె ఆత్మహత్య చేసుకోబోయింది దొడ్లో బావిలో దూకి....

ఆ దృశ్యం భానుప్రకాష్ కంటబడింది. అతడామెను రక్షించాడు. ఆ విషయం ఎవరికీ తెలియదు.

భానుప్రకాష్‌కు చూచాయిగా ఇంట్లో జరిగింది తెలుసు. అతడు సంధ్యను నిలదీసి అడిగి నిజం తెలుసుకున్నాడు.

సంధ్య తను బ్రతకనని ఏడ్చింది. అతడామెను మందలించి - "నువ్వతణ్ణి ప్రేమిస్తున్నావా?" అనడిగాడు.

"నన్నతడు ప్రేమిస్తున్నాడు -" అని చెప్పింది సంధ్య.

పారిపోయిన ఆమె బావను భానుప్రకాష్ కలుసుకొని సంధ్యను పెళ్ళి చేసుకోమని చెప్పాడు.

"దాని శీలం మంచిది కాదు -" అన్నాడు సంధ్య బావ - ఆమెను పెద్దలకు తెలియకుండా పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేక.

భానుప్రకాష్ సంధ్యకీవిషయం చెప్పి -"అతడు నిన్ను ప్రేమించడం లేదు జరిగింది మర్చిపో -" అన్నాడు.

"జరిగింది మర్చిపోలేను. వేరే వ్యక్తిని వివాహమాడి అతడి జీవితన్ని నరకం చేయలేను -" అంది సంధ్య.

"మన సంప్రదాయం ఆడదాన్ని అన్నింటికీ దోషిని చేస్తుంది. జరిగిందానికి దోషం నీతోపాటు నీబావకు సమంగా అంటుతుంది. నేనీ సంప్రదాయానికి వ్యతిరేకిని ఒక చిన్న పొరపాటు వల్ల కోల్పోయే పవిత్రత పవిత్రత అనిపించుకోదు. నేను నిను పెళ్ళి చేసుకుంటాను. జాలితో కాదు - ప్రేమతో! అందువల్ల లాభమేమిటంటే - నీ కథ పూర్తిగా నాకు తెలుసు కాబట్టి ముందు నీ బావ కూడా నిన్ను బ్లాక్ మెయిల్ చేయ లేడు...."

సంధ్య ఈపెళ్ళికి అన్యమనస్కంగా ఒప్పుకుంది. ఆమె తలిదండ్రులు మహదానందంతో అంగీకరించారు.

పెళ్ళైనా సంధ్య మామూలు మనిషి కాలేక పోయింది.

"నా ప్రవర్తనలో ఏదో లోపముంది. నేను ఖులటను. బావ నన్ను ప్రోత్సహించినా - అందుకు నాసహకారము ఉంది -" అనేదామె తరుచుగా.

"పరిస్థితులు తోడైతే పతివ్రతలు కూడా తప్పు చేస్తారు..." అనేవాడు, భానుప్రకాష్ ఆమెతో.

సంధ్య నమ్మాలనే అనుకుంది.

మన చుట్టూ సమాజం, అందులో ముఖ్యంగా ఆడవాళ్ళు - ఆమెకు తప్పు చేసిందన్న భావాన్ని కలిగిస్తూండేవారు. పాపనిపంటి స్త్రీలనందరూ, ముఖ్యంగా స్త్రీలు విరసిస్తూంటే ఆ నిరసన నామె తనకే అన్వయించుకుంటోంది.

"మీరు పవిత్రులైన మరో యువతిని పెళ్ళాడండి. నేను అనుమతినిస్తాను. మీ సంతానానికి తల్లినయ్యే అర్హత నాకులేదు-" అందామె భర్తతో.

"పురుషస్పర్శ నెరుగని నీవు, లేతవయసులో - ఒకస్వార్థపరుడి ప్రోత్సాహంతో - అతడికి దగ్గరై తప్పు చేశానుకుంటున్నావు, అదేతప్పు - కేవలం డబ్బు కోసం, పదవికోసం - వివాహితురాలైన ఆడది - తన యిష్టంమీదనే చేయగలదని నేను ఋజువు చేస్తాను. అప్పుడైనా నువ్వు నీ - గిల్టీ కాన్షస్ వదిలి పెట్టాలి ..." అన్నాడు భానుప్రకాష్.

ఆ ఎన్నికను కూడా అతడు భార్యకే వదిలి పెట్టాడు.

ఆమె ముక్తనెన్నుకుంది. ముక్త చేత భర్త తప్పుచేయించ గలిగితే - తన తప్పు సాధారణమైనదే అనిపించుకుంటుందని ఆమె ఒప్పుకుంది.

భానుప్రకాష్ తన ప్రయత్నాలు ప్రారంభించాడు.

* * * *

"ముక్త నాకు నీ అంతదగ్గరగానూ వచ్చింది. కాని నిజం చెబుతున్నాను. నేను నీ మీద ప్రేమతో నటిస్తున్నాను తప్ప - ఆమెపై నాకెప్పుడూ కూడా దురూహ కలుగ లేదు. అదీ నా గొప్పతనం .... ముక్త నాకు - ఎప్పటికీ ఆడపడుచే!" అన్నాడు భానుప్రకాష్.

"మిమ్మల్ని నేనెప్పుడూ నమ్ముతాను ..." అంది సంధ్య.

సంధ్య భానుప్రకాష్‌ని నమ్మింది. కానీ మగాళ్ళందరూ భానుప్రకాష్‌లు కారు.

ఆడ పడుచు పదాలనుండి ఆడపడుచన్న పవిత్ర పదాన్ని సృష్టించిన మన సంప్రదాయాన్ని పాటించలేక పోయిన ఆడపడుచుల పట్ల సానుభూతిని జతపరచ మన్న విన్నపమూ పురుషులందరూ భానుప్రకాష్‌లు కాదన్న హెచ్చరికా - ముఖ్యంగా, ఆడపడుచులందరికీ ఈకథద్వారా అందితే - ఈ రచన ప్రయోజనం నెరవేరినట్లే!

(అయిపోయింది)



పెంపుడు కుక్క

రక్తాలు గింజుకుంటోంది -...

ప్రాణం కన్నా మానం విలువైనదని భావించే, ఓ తెలుగింటి ఆడపడుచు నాలుగు జతల చేతుల మధ్య పెనుగులాడుతోంది.

ఆ నాలుగు జతల చేతులు ఆమె ప్రయత్నాన్ని పడనివ్వడం లేదు.

ఆమె ఏడుస్తోంది -....

ప్రాధేయ పడుతోంది.... దణ్ణం పెడ్తోంది...

'ఉహూ...'

ఆ చేతులు వినిపించుకోవడం లేదు. తమ పని తాము చేసుకు పోతూనే ఉన్నాయి.


ఆమె గాజులు పగిలాయి -

ఒంటి మీద బట్టలు చిరిగాయి -

ఒంట్లో ఓపిక క్రమంగా సన్నగిల్లింది -

జరుగుతున్నదాన్ని పూర్తిగా ప్రతిఘటించకుండానే ఆమె సొమ్మసిల్లి పడిపోయింది.

వెల్లంకి సతీష్



దాంతో ఆ చేతులు విజృంభించాయి. ఒకరి తర్వాత ఒకరిగా, ఆ చేతుల యజమానులు ఆమెను ఆక్రమించుకోసాగారు.

దూరంగా ... సాయంత్రపు వెలుగు నెమ్మదిగా కరిగిపోసాగింది, ఆమె శీలంలా సిగ్గుతో కుంచించుకు పోయినట్లు, ఆ దృశ్యం చూడలేక నెమ్మదిగా కృంగిపోయాడు పడమటి సూర్యుడు.

కానీ ఆ గదిలో మాత్రం నవ్వులు ప్రతిధ్వనిస్తున్నాయి... వాళ్ళ విజయానికి గుర్తుగా, వాళ్ళ ఆనందానికి దూరంగా, నిస్తేజంగా పడి ఉంది రత్తాలు శరీరం చలనం లేకుండా.

రత్తాలు... మరణించింది.

* * *

"పిలిచావా దొరా?" చేతులు కట్టుకుంటూ అడిగాడు రంగడు.

"ఆఁ!" ముక్తసరిగా జవాబిస్తూ, కాలుస్తున్న చుట్ట పొగలోంచి రంగడ్ని చూశాడు భుజంగరావు.

రంగడు ఆ ఇంటి ఆస్థాన నౌకరు. దూరంగా విసిరేసినట్టుండే వాడి పాక, చిన్నపిల్లలు కట్టుకునే ఇసుక గూడు లాగుంది.

భుజంగరావు కార్య నిర్వాహణలో, ప్రాణాలను సైతం పణంగా పెట్టగలిగేంత విశ్వాసం ఉన్న నమ్మినబంటు వాడు.

భుజంగరావు!

సార్థక నామధేయుడే -

ఎప్పుడూ - నల్లత్రాచులా ఖరీదైన బట్టల మధ్య నిగనిగలాడుతుంటాడు. ఆయన జీవితాన్ని పంచుకోడానికి వచ్చిన భార్య, ఆయన క్రూరత్వాన్ని, దుర్మార్గాన్ని పంచుకోలేక కొద్ది కాలంలోనే దేవుణ్ణి చేరుకుంది.

పట్నంలోని రాజకీయనాయకులు కొందరితో భుజంగరావుకి సన్నిహిత సంబంధాలున్నాయి. రాబోయే పంచాయితీ ఎన్నికల గురించి చర్చించడానికి, పట్నం నుంచి కొంతమంది రాజకీయ ప్రముఖుల్ని, పల్లెకు ఆహ్వానించాడు ఆ ఊరికి మకుటంలేని ప్రెసిడెంటుగా ఉండాలని ఆయన అభిలాష.

"నువ్వోకసారి పట్నం వెళ్ళి రావాల్రా!"

ఆజ్ఞాపిస్తున్నట్టుగా ఉంది భుజంగరావు కంఠం.

"చిత్తం దొరా!"

"లాయర్ హరిహరరావుగారిని నువ్వెరుగుదువుగా! ఆయన్ని రేపు మన ఇంటికి తీసుకురావాలి!"

హరిహరరావుగారు ఆయన ప్రాణ స్నేహితుడు. భుజంగరావు దుర్మార్గానికి దేవుడు శిక్షిస్తే... హరిహరరావు కూడా సగం అనుభవించాల్సి ఉంటుంది.

"అట్టాగే దొరా! ఇయ్యాలే బండి కడతా!" వెను దిరిగాడు రంగడు.

"జాగ్రత్తగా వెళ్ళిరా!" వాడి క్షేమం పట్ల శ్రద్ధున్నవాడిలా అన్నాడు భుజంగరావు.

రంగడు నెమ్మదిగా అడుగులేస్తూ తన పాక వైపు వెళ్ళిపోయాడు.

* * *

తుఫాను ముంచుకొచ్చినట్లు, వచ్చి ఆ ఇంటిముందాగింది ఓ తెల్లటి కారు, దాంట్లోంచి, కాళ్ళు బయట పెట్టారు తెల్ల దుస్తులు ధరించినవారు.

"రండి! రండి!" సాదరంగా ఆహ్వానిస్తూ ముందుకు వెళ్ళాడు భుజంగరావు.

పరస్పర యోగక్షేమాలనంతరం, వాళ్ళంతా విశాలమైన హాలులో సమావేశమయ్యారు.

గ్లాసులు ఖాళీ అవుతున్నాయి.

చర్చలు ముగింపు దశలోకి వచ్చాయి. వాళ్ళంతా, ఏకగ్రీవంగా ఒక ఒప్పందానికి వచ్చినట్టు తలలూపారు.

వాళ్లు నలుగురూ లేచి నిలబడ్డారు. ఇంతలో... ఓ దృశ్యం వారినాకర్షించింది. దూరంగా- రంగడి భార్య రత్తాలు స్నానంచేసి, తడి ఒంటిపై బట్టలు చుట్టుకుని పాకలోకి వెళ్తోంది.

అరక్షణం! వాళ్ళదృష్టి ఆమె కండ పట్టిన ఒంపులమీదున్నాయి. నలుగురూ ఓ నిశ్చయానికొచ్చినట్టు, తడారిపోయిన పెదాలను నాలుకలతో తడుపుకున్నారు -

ఫలితం...

* * *

రత్తాలు గింజుకుంటోంది...

ప్రాణంకన్నా మానం విలువైనదని భావించే, ఓ తెలుగింటి ఆడబడుచు నాలుగు జతల చేతులమధ్య పెనుగులాడుతోంది.

* * *

రంగడు పట్నం చేరుకునే సరికి, హరిహరరావుగారు అప్పటికే ఎవరితోనో కలిసి పల్లెకు బయల్దేరారని తెల్సింది. వెంటనే రంగడు, పట్నంలో తన భార్యకు గాజులు కొని, పల్లె ముఖం పట్టాడు.

అప్పుడే రాత్రి మూడు ఝాములు గడిచి పోయాయి.

రంగడు పల్లె ప్రవేశించాడు.

పట్నంనుంచి తను రత్తాలుకు తెస్తున్న గాజులను చూపించి, తర్వాత దొరగారికి విషయము చెబుదామని పాకలోకి వెళ్ళాడు.

వెళ్ళినవాడువెళ్ళినట్టే ఉండిపోయాడు. ఎదురుగా - అతని రాకకోసమే ఎదురు చూస్తున్నట్లు, నిట్టాడుకు వ్రేలాడుతోంది రత్తాలు శవం మెడలో త్రాడుతో.

క్షణంసేపు జరిగిందేమిటో అర్థం కాలేదు వాడికి. అర్థం అయ్యేసరికి వాడు దుఃఖంతో రోదిస్తూ ఉండిపోయాడు. రత్తాలు అపని ఎందుకు చేసిందో ఊహించలేక పోతున్నాడు. వాడు వాడి రోదనతో శృతికలుపుదామని కాబోలు, గుంజకు కట్టబడి ఉన్న వాడి పెంపుడుకుక్క- అదే పనిగా మొరుగుతోంది.

భుజంగరావు రాత్రి కావలాకు వాడికి సహాయంగా ఇచ్చిందది.

రంగడు జరిగిందేమిటో ఊహించసాగాడు మూగగా రోదిస్తూ....

అంతలో - వాడికి గుర్తుకొచ్చింది—

ఒకరోజున తాను పాకలో లేననుకుని, దొర దొడ్లో స్నానం చేస్తున్న రత్తాలు మీద పడటం- ఇంతలో తనటు రావడంతో ఏమీ జరగనట్టు దొర తప్పుకోటం - రత్తాలు తనకు విషయం చెప్పి ఏడ్వడం ఒక్కొక్కటిగా కళ్ళముందు కొచ్చాయి.

రంగడికి దాంతో జరిగిందేమిటో వాడికి బోధ పడింది. వాడి ఆలోచన నిజమేనని దూరంగా హాల్లోంచి వినపడుతున్న నవ్వులు ధృవపరిచాయి. ఏమీ చేయలేని అశక్తితో చేతులు రుద్దుకుంటూ ఉండిపోయాడు రంగడు.

తానెదుటపడి జరిగింది ప్రశ్నిస్తే

తనను చంపడానికికూడా వెనుకాడరువాళ్లు. ఏమి చెయ్యాలో పాలుపోడంలేదు అతనికి.

ఉక్రోషం పట్టలేక, అదేపనిగా మొరుగుతున్న కుక్కని బలంగా, కాలితో డొక్కలో ఓ తన్ను తన్నాడు. కసికొద్దీ అలా తంతూనే ఉన్నాడు. అతని మూగరోదనకు కుక్క మరణవేదన తోడయ్యింది.

అది పెంపుడుకుక్క!

దానికి రోజూ ఆహారం వేసేది రంగడే ఆ విశ్వాసంతోనే అంతసేపు భరించింది. రెచ్చిపోతున్న యజమానిని చూసి, ఇక భరించలేక పోయిందది.

అదేపనిగా తంతున్న రంగడి కాలిని దొరక బుచ్చుకుని, ఒక్కసారిగా బలంగా కరిచింది.

అదిరిపాటుతో ఏడుపొచ్చినంత పనయ్యింది రంగడికి. కాలిమీద చర్మం ఊడివచ్చింది. పిచ్చికోపంతో దాన్ని పీక నొక్కి చంపబోయాడు.

వాడికున్నట్టుండి మెరుపులాంటి ఆలోచన వచ్చింది. కసితో మీదపడి చంపబోయిన యజమాని ఆ ప్రయత్నాన్ని ఎందుకు విరమించుకున్నాడో అర్థంకాలేదా పెంపుడు కుక్కకి.

రంగడి కళ్ళు ఎరుపెక్కాయి. తన కర్తవ్యమేమిటో బోధపడింది. విసురుగా లేచి చూరులోనున్న గొడ్డలిని అందుకున్నాడు. రెట్టించిన బలంతో ఆ ఇంటివైపు అడుగులు వేసాడు.


* * *

"అమ్మా!" అనే హృదయ విదారకమైన కేకలతో ఆ గది ప్రతిధ్వనించింది. ఎర్రటి రక్తం, వాళ్ళు తాగి వదిలేసిన ఎర్రటి మద్యంతో కలిసి ఏరులై పారింది.

ఆ శవాల మధ్య నిస్తేజంగా రక్తపు మరకలతో నిలబడి ఉన్నాడు రంగడు.

అప్పుడే తూర్పున తొలి రేఖలు విచ్చుకుంటున్నాయి. దూరంగా కోడి కూసింది. అప్పటికి రంగడు ఆ పల్లె వొదిలి క్రొత్త జీవితం కోసం తన భార్య శవంతో బండిలో వెళ్ళిపోతున్నాడు సుదూరంగా. తనకు జీవిత సత్యాన్ని నేర్పిన పెంపుడు కుక్కను తన కూడా తీసుకెళ్ళడం మరచిపోలేదు.

తూర్పు కొండల మధ్య నుంచి ఎర్రగా పైకి వచ్చాడు క్రొత్త రోజుకు స్వాగతమిస్తూ సూర్యుడు ....




ప్రకృతి ఫలరసం-
తాజా సోమరసం
SOMA
FRUIT PUNC
Net contents : 200
SERVE CHILLED
SHAKE WELL
BEFORE OPENING
SOMA
GUAVA
Net contents 200 ml
SERVE CHILLED
SOMA
సోమా
మాంగో • గోవా
ఫ్రూట్ పంచ్
Kiron/kfp/87